
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 18 సంచిక: 68
శుక్రవారం 30-5-2025
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'తెలుగువారి గుండెచప్పుడు వినగలిగే ఆత్మీయుడిగా ఉంటే చాలు... నా జన్మ ధన్యమైనట్టే'



ఐపీఎల్ ఫైనల్లో బెంగళూరు
క్వాలిఫయర్–1లో పంజాబ్ కింగ్స్‌పై 8 వికెట్లతో ఆర్‌సీబీ విజయం -15లో



వృద్ధిలో మనమే టాప్
పటిష్టంగా స్థూల ఆర్థిక మూలాలు.. ఆర్‌బీఐ వార్షిక నివేదిక వెల్లడి -15లో



ఆపరేషన్ సిందూర్ ఆగదు
ఉగ్రవాదులకు, కుట్రదారులకు గుణపాఠం నేర్పడానికి ప్రారంభించిన ఆపరేషన్ సిందూర్ ఆగదని మోదీ తేల్చిచెప్పారు.
వివరాలు 6లో ▸



పీఓకే ప్రజలు మనవాళ్లే..!
పాక్ ఆక్రమిత కశ్మీర్ ప్రజలు ముమ్మాటికీ మన సొంత కుటుంబసభ్యులేనని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ వ్యాఖ్యానించారు.
వివరాలు 6లో ▸



రెప్పపాటులో గ్రామం సమాధి
ఆల్ప్స్ పర్వత సానువుల్లోని ఓ కుగ్రామం భూస్థాపితమైంది. స్విట్జర్లాండ్‌లోని బ్లాటెన్ గ్రామంపై హిమానీనదం విరుచుకుపడింది.
వివరాలు 6లో ▸



అస్తమించిన సాహిత్యశిఖరం
ఆధునిక ఆఫ్రికన్ సాహిత్యంపై చెరగని ముద్ర వేసిన కెన్యా దిగ్గజ నవలా రచయిత ప్రొఫెసర్ గూగీ వా థియోంగో తుదిశ్వాస విడిచారు.
వివరాలు 6లో ▸

భారతీయుల ఆత్మగౌరవం
ట్రంప్‌కు తాకట్టా?

యుద్ధాన్ని అర్థాంతరంగా ఎందుకు ఆపేశారు? ప్రధాని మోదీపై సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజం

- రఫేల్ విమానాలు ఎన్ని నేలకూలాయో చెప్పాలి?
- యుద్ధ విరమణతో సైనికుల ఆత్మస్థైర్యం, ప్రజల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీశారు
- ఇది దేశ భద్రతకు సంబంధించిన అంశం.. మీ సొంత వ్యవహారం కాదు
- యుద్ధంపై ఉపన్యాసాలు కాదు.. ప్రధాని దేశ ప్రజలకు సమాధానం చెప్పాలి
- మోదీకి వీరతిలకం దిద్దితే యుద్ధంలో వెనుకడుగు వేశారు
- పాకిస్తాన్‌కు గుణపాఠం చెప్పడానికి సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలి
- జైహింద్ యాత్ర అనంతరం బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగం


బాచుపల్లిలో నిర్వహించిన జైహింద్ యాత్రలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం, శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్సీ విజయశాంతి తదితరులు

సాక్షి, హైదరాబాద్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరింపులతో ప్రధాని మోదీ పాకిస్తాన్‌తో యుద్ధం విరమించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. భారత సైనికుల ఆత్మస్థైర్యాన్ని, దేశ ప్రజల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీశారని మండిపడ్డారు. 'అమెరికా ఒత్తిడికి తలొగ్గి యుద్ధాన్ని అర్థాంతరంగా ఆపేస్తారా? భారతీయుల ఆత్మగౌరవాన్ని ట్రంప్ దగ్గర తాకట్టు పెడతారా? యుద్ధం అంటే ధైర్యం, వెన్నెముక, యుద్ధతంత్రం ఉండాలని ప్రగల్భాలు పలికిన ప్రధాని మోదీ నాలుగు రోజుల యుద్ధం తర్వాత అర్థాంతరంగా ఎందుకు ఆపేశారు? పాకిస్తాన్‌తో యుద్ధంలో రఫేల్ విమానాలు ఎన్ని నేలకూలాయో లెక్క చెప్పాలి' అని డిమాండ్ చేశారు. ఏఐసీసీ పిలుపు మేరకు టీపీసీసీ ఆధ్వర్యంలో గురువారం బాచుపల్లి వీఎన్ఆర్ జ్యోతి ఇంజనీరింగ్ కాలేజీ నుంచి కేజీఆర్ కన్వెన్షన్ వరకూ జైహింద్ యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. కాంగ్రెస్ హయాంలోని యుద్ధ విమానాలే పాకిస్తాన్‌తో యుద్ధంలో దేశ ఆత్మ గౌరవాన్ని కాపాడాయని, మోదీ కొనుగోలు చేసిన
మిగతా 12వ పేజీలో ▶

కాంగ్రెస్ మునిగే నావ
నేనెందుకు చేరతా



- ఆ పార్టీతో సంప్రదింపులనే ప్రచారం శుద్ధ అబద్ధం
- నా తండ్రి నుంచి నన్ను విడదీసేందుకు కుట్రలు
- పార్టీకి, కుటుంబానికి దూరం చేసేందుకు ప్రయత్నాలు
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఘాటు వ్యాఖ్యలు

మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్

- నన్ను పార్టీ నుంచి బయటకు పంపితే ఎవరికి లాభం?
- నా లేఖను ఎవరో కుట్రపూరితంగా లీక్ చేశారు
- నేను మా నాన్నకు లేఖ రాస్తే మీకు నొప్పేంది?.. పెయిడ్ ఆర్టిస్టులతో సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయిస్తున్నారు
- నేను అసలే మంచిదాన్ని కాదు..నోరు విప్పితే తట్టుకోలేరు
- కేసీఆర్‌కు నోటీసులపై పార్టీ కార్యాచరణ ఎందుకు చేపట్టడం లేదు?
- అమెరికాలో పార్టీ రజతోత్సవాలు నిర్వహిస్తే ఏం లాభం?
- పార్టీని బీజేపీలో విలీనం చేసేందుకు 101% ప్రయత్నాలు జరిగాయి
- నేను జైల్లో ఉన్నప్పుడే ఈ ప్రతిపాదనను వ్యతిరేకించా..అప్పట్నుంచే ఇలా..
- కేసీఆర్ బలమైన నాయకుడు.. ఆయనే మళ్లీ ముఖ్యమంత్రి అవుతారు

3లో

న్యూస్‌రీల్

కామర్సే మన 'దోస్త్'

డిగ్రీలో కామర్స్ కోర్సుల్లో చేరేందుకే ఎక్కువ మంది విద్యార్థులు ఆసక్తి చూపారు. ఆ తర్వాత ఫిజికల్ సైన్స్, లైఫ్‌సైన్స్ కోర్సులను ఎంచుకున్నారు. డిగ్రీ ఆన్‌లైన్ సేవలు, తెలంగాణ (దోస్త్) ద్వారా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు గురువారం సీట్లు కేటాయించారు.
- వివరాలు 2లో▶

తరలిపోనున్న అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ!

దశాబ్దాలుగా జూబ్లీహిల్స్‌లో ప్రధాన కార్యాలయం ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ ఏపీకి తరలిపోనుందా? తెలంగాణ ప్రభుత్వం మౌనముద్ర చూస్తుంటే అవుననే అభిప్రాయం వ్యక్తమవుతోంది.
- వివరాలు 2లో▶

అంగన్‌వాడీల రిటైర్మెంట్ ప్యాకేజీకి ఓకే

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క శుభవార్త ప్రకటించారు. వారి పదవీ విరమణ ప్యాకేజీకి ఆర్థిక శాఖ ఆమోదం లభించిందని గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు.
- వివరాలు 2లో▶

ప్రైవేటు జేబుల్లోకి రాయితీ

రాయితీ ధరలకు సరఫరా చేస్తేనే రాష్ట్రాలు ఎలక్ట్రిక్ బస్సులను కొంటాయనే ఆలోచనతో కేంద్రం పీఎం ఈ–డ్రైవ్ పథకాన్ని ప్రవేశపెట్టింది. అయితే ఈ రాయితీ ప్రైవేటు సంస్థల జేబుల్లోకి చేరుతుండటంతో, ఆర్టీసీకి ప్రయోజనం చేకూరకుండా పోతోంది.
- వివరాలు 12లో▶


నివేదా థామస్


నాగ్ అశ్విన్


కల్కి (ఉత్తమ చిత్రం)



- ఉత్తమ నటి నివేదా థామస్.. ఉత్తమ దర్శకుడు నాగ్‌అశ్విన్
- ఉత్తమ చిత్రాలుగా కల్కి, పొట్టేల్, లక్కీ భాస్కర్
- లక్కీభాస్కర్, కల్కికి 4 చొప్పున అవార్డులు
- జూన్ 14న ఘనంగా అవార్డుల ప్రదాన కార్యక్రమం

ఉత్తమ నటుడు అల్లు అర్జున్
గద్దర్ ఫిల్మ్ అవార్డులను ప్రకటించిన జ్యూరీ

సాక్షి, హైదరాబాద్: పుష్ప–2 సినిమాలో నటనకుగాను అల్లు అర్జున్ ఉత్తమ నటుడిగా గద్దర్ అవార్డుకు ఎంపికయ్యారు. ఉత్తమ నటి అవార్డును నివేదా థామస్ (35 చిన్న కథ కాదు) గెలుచుకున్నారు. ప్రజా వాగ్గేయకారుడు, ఉద్యమకారుడు గద్దర్ పేరుపై ఏర్పాటుచేసిన సినిమా అవార్డులను తొలిసారి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజుతో కలసి గద్దర్ అవార్డుల జ్యూరీ చైర్‌పర్సన్, నటి జయసుధ గురువారం అవార్డుల వివరాలను ప్రకటించారు. మొదటి ఉత్తమ చిత్రంగా కల్కి 2898ఏడీ, రెండో ఉత్తమ చిత్రంగా పొట్టేల్, మూడో ఉత్తమ చిత్రంగా లక్కీ భాస్కర్ అవార్డులు
మిగతా 3వ పేజీలో ▶

మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి. పక్కన మంత్రులు పొంగులేటి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల


దేశంలోకెల్లా 'ఇంటి'కి రూ.5 లక్షల ఘనత మాదే

- అనర్హులకు ఇళ్లు మంజూరైతే గెజిటెడ్ అధికారులపై చర్యలు
- ఖమ్మం జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల పథకంపై సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి
- పాల్గొన్న మంత్రులు కోమటిరెడ్డి, పొంగులేటి, తుమ్మల

ఖమ్మం సహకారనగర్: దేశంలో ఎక్కడా లేనివిధంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ. 5 లక్షలు ఇస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేనని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ఖమ్మం కలెక్టరేట్‌లో ప్రభుత్వ పథకాలపై గురువారం డిప్యూటీ సీఎం, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు సమీక్షించారు. ఉమ్మడి జిల్లాస్థాయి సమీక్షలో ధాన్యం కొనుగోళ్లు, ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి, వర్షాకాల ఆరోగ్య కార్యాచరణ, వ్యవసాయ
మిగతా 5వ పేజీలో ▶


ఎగువన కృష్ణా బేసిన్‌లోని నదీ పరీవాహక ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలతో 18 ఏళ్ల తరువాత తొలిసారిగా మే నెలలో జూరాల ప్రాజెక్టు పరవళ్లు తొక్కింది. భారీగా వరద నీరు చేరడంతో గురువారం ప్రాజెక్టు 12 గేట్లను ఎత్తి నీటిని దిగువన శ్రీశైలం ప్రాజెక్టులోకి విడుదల చేశారు. - వివరాలు 12లో▶



డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌లకు బ్రేక్
- అదనపు టారిఫ్‌లను నిలిపివేస్తూ అమెరికా ఫెడరల్ కోర్టు సంచలన తీర్పు
- పైకోర్టులో తీర్పును సవాల్ చేసిన ట్రంప్ సర్కార్

6లో

ఫ్లాష్.. ఫ్లాష్.. ఫ్లాష్..

అప్పీల్స్ కోర్టులో ట్రంప్‌కు ఊరట
వాషింగ్టన్: ప్రపంచదేశాలపై అధిక టారిఫ్‌ల విధింపుపై అప్పీల్స్ కోర్టులో అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ఊరట లభించింది. టారిఫ్‌ల భారం మోపడం కుదరదంటూ ఫెడరల్ కోర్టు ఇచ్చిన తీర్పును ట్రంప్ సర్కార్ వెంటనే అప్పీల్స్ కోర్టులో సవాల్ చేసింది. దీనిపై విచారించిన అప్పీల్స్ కోర్టు.. ఎమర్జెన్సీ అధికారాల చట్టం మేరకు ప్రస్తుతానికి ట్రంప్ అధిక టారిఫ్‌లను కొనసాగించవచ్చంటూ పేర్కొంది. ఆ మేరకు టారిఫ్‌లను వసూలు చేసుకునేందుకు అనుమతించింది. ఫెడరల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను తాత్కాలికంగా నిలుపుదల చేసింది.

ఇదండీ జగత్


మా ఊరికి రోడ్లు, కరెంటు, స్కూలు, ఆసుపత్రులు లేవని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోనిది నువ్వే కదా!

'ఫీజు'లకు మోక్షం ఎప్పుడు?

ఎల్బీనగర్‌కు చెందిన బి. మనస్విని గండిపేటలోని ఓ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ ఫైనలియర్ పూర్తి చేసింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం కింద అర్హత సాధించిన ఆమె ఏటా దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇప్పటివరకు పైసా విడుదల కాలేదు. కన్వీనర్ కోటాలో సీటు పొందిన కూతురి కోసం తల్లిదండ్రులు నాలుగేళ్లపాటు ట్యూషన్ ఫీజు కోసం అప్పు చేసి రూ. 6 లక్షల వరకు చెల్లించారు. ఇప్పుడు ఆ అప్పుపై వారు వడ్డీ చెల్లించాల్సిన పరిస్థితి వచ్చింది.

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరుకు చెందిన ఎం.కీర్తి బాచుపల్లిలోని ఓ ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ (థర్డ్ ఇయర్ పూర్తి చేసింది) చదువుతోంది. ఆమెకు మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ అందలేదు. ఫీజు కోసం తొలి ఏడాది కాలేజీ యాజమాన్యం ఒత్తిడి చేయనప్పటికీ రెండు, మూడో సంవత్సరంలో ఫీజుల కోసం యాజమాన్యం ఒత్తిడి చేసింది. ఫీజు కడితేనే పరీక్షలకు అనుమతిస్తామని చెప్పడంతో ఇప్పటివరకు రూ. 4.5 లక్షలు చెల్లించింది. వచ్చే నెలాఖరులోగా ఫైనలియర్ ఫీజు రూ. లక్షన్నర కట్టాలని యాజమాన్యం స్పష్టం చేయడంతో డబ్బు కోసం ఆమె కుటుంబం అప్పు కోసం ప్రయత్నిస్తోంది.

రాష్ట్రంలో పేరుకుపోయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు
- రెండేళ్లలో సుమారు రూ. 4,900 కోట్లు పెండింగ్
- ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు జారీ చేస్తున్న కాలేజీ యాజమాన్యాలు.. గత్యంతరం లేక అప్పులు చేసి ఫీజులు కడుతున్న తల్లిదండ్రులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాలేజీ విద్యార్థులకు అమలు చేస్తున్న ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాల బకాయిలు భారీగా పేరుకుపోయాయి. గత రెండేళ్లలో సుమారు రూ. 4,900 కోట్ల మేర బకాయిలు ఉన్నట్లు సంక్షేమ శాఖల గణాంకాలు చెబుతున్నాయి. అలాగే అంతకు ముందు బకాయిలు
మిగతా 2వ పేజీలో ▶

క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా మల్లు రవి

ప్రత్యేక ఆహ్వానితులుగా రాష్ట్ర మంత్రులు
కొత్త వర్కింగ్ ప్రెసిడెంట్లను ప్రకటించకుండానే బాధ్యతలు!
మొత్తం 70 మందితో పీసీసీ కమిటీలు ప్రకటించిన ఏఐసీసీ


మల్లు రవి

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధిష్టానం పలు పీసీసీ కమిటీలను నియమించింది. మొత్తం 70 మంది సభ్యులతో కూడిన కమిటీలను ఏఐసీసీ ప్రకటించింది. ఈ మేరకు ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర మంత్రులకు ప్రత్యేక ఆహ్వానితులుగా అవకాశం కల్పించారు. అత్యధికంగా 22 మందితో రాజకీయ వ్యవహారాల కమిటీని ఏర్పాటు చేశారు. అలాగే 15 మందితో సలహా కమిటీ, ఏడుగురితో డీలిమిటేషన్ కమిటీ, 16 మందితో సంవిధాన్ బచావో ప్రోగ్రాం కమిటీ, ఆరుగురితో క్రమశిక్షణ చర్యల కమిటీని నియమించారు. ఎక్స్ అఫీషియో సభ్యులుగా తెలంగాణకు చెందిన ఏఐసీసీ కార్యదర్శులు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు, అన్ని ఫ్రంటల్ ఆర్గనైజేషన్ల బాధ్యులకు
మిగతా 3వ పేజీలో ▶

పోరు లాభం

'యుద్ధం అంటే క్రూరత్వమే'.. 'యుద్ధం గురించి చెప్పడానికి ఒక్కటంటే ఒక్క మంచి విషయమూ లేదు'.. 'పోరు నష్టం'.. ఇలా యుద్ధాల గురించి అందరూ చెడుగా చెప్పినవాళ్లే. కానీ, ప్రస్తుతం కొన్ని దేశాల మధ్య జరిగే యుద్ధాలు.. మరికొన్ని దేశాలకు గొప్ప ఆదాయ వనరులు.
2011-2024 మధ్య ప్రపంచ దేశాల ఆయుధ వ్యాపారం గణనీయంగా పెరిగినట్లు వెల్లడించిన స్వీడన్‌కు చెందిన 'సిప్రి' (స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్) తాజా నివేదికే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం.
శతఘ్నిలా గర్జిస్తున్న ప్రపంచ ఆయుధాల మార్కెట్‌లో భారతదేశం స్వదేశీ రక్షణ రంగాన్ని బలోపేతం చేసుకుంటూనే, అతిపెద్ద ఆయుధాల దిగుమతిదారుగా అవతరించింది.

సాక్షి, స్పెషల్ డెస్క్

- గణనీయంగా పెరిగిన ఆయుధ వ్యాపారం
- అమెరికా, చైనాలదే ఆధిపత్యం
- పదేళ్లలో 34 రెట్లు పెరిగిన మన రక్షణ ఎగుమతులు
- అతిపెద్ద ఆయుధాల దిగుమతిదారుగా భారత్
- స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ నివేదిక

2000–2010తో పోలిస్తే 2011– 2024 మధ్య ప్రపంచ దేశాల ఆయుధ వ్యాపారం గణనీయంగా పెరిగినట్లు స్వీడన్‌కు చెందిన 'సిప్రి' నివేదిక వెల్లడించింది. ప్రపంచ ఆయుధ మార్కెట్‌లో ప్రస్తుతం అమెరికా ఆధిపత్యం చెలాయిస్తూ ఉంది. అమెరికా తర్వాతి స్థానం చైనాది. 2023లో అమెరికా తన ఆయుధ వ్యాపారంలో గడించిన ఆదాయం, చైనా ఆదాయం కంటే మూడు రెట్లు ఎక్కువగా 316.75 బిలియన్ డాలర్లుగా నమోదైంది. అదే సమయంలో చైనా ఒక ప్రధాన సైనిక శక్తిగా ఉన్నప్పటికీ తన ఆయుధ దిగుమతులను 47 శాతం తగ్గించుకుంది. ఆ మేరకు రక్షణ రంగంలో స్వావలంబన, దేశీయ సామర్థ్యాల వృద్ధికి చైనా ప్రయత్నిస్తోంది.



'తీవ్రాతి తీవ్రంగా' ఆయుధ వ్యాపారం

ప్రపంచ దేశాల ఆయుధాల వ్యాపారంలో ఈ స్థాయి పెరుగుదలకు చైనా ఆయుధాల తయారీలోని విజృంభణే కారణం అని రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ వినోద్ జి. ఖండారేను ఉటంకిస్తూ 'సిప్రి' పేర్కొంది. ఆ విజృంభణ.. ఆయుధాల కోసం గతంలో అమెరికా మీద ఆధారపడిన దేశాలకు ప్రత్యామ్నాయాన్ని అందించింది. ఆగ్నేయాసియాలో చైనా ఆయుధ అమ్మకాలను పెంచింది. ఆ విధంగా యూరోపియన్ ఆయుధ ఉత్పత్తిదారుల మార్కెట్ వాటాను తగ్గించింది.

దిగుమతుల్లో భారత్ ముందంజ

భారత్ ప్రస్తుతం ప్రపంచంలో అతిపెద్ద ఆయుధ దిగుమతిదారుగా ఉన్నట్లు సిప్రి పేర్కొంది. గత దశాబ్ద కాలంలో భారత్ దిగుమతులు 104 శాతం పెరిగాయి. మనదేశం రష్యా నుంచి ఎస్–400 క్షిపణి వ్యవస్థను, ఫ్రాన్స్ నుంచి రాఫెల్ యుద్ధ విమానాలను, అమెరికా నుంచి చినూక్ హెలికాప్టర్‌లను కొనుగోలు చేస్తోంది. దిగుమతులతో పాటు, దేశీయంగా ఎయిర్‌బస్–టాటా వెంచర్‌లు రక్షణ ఆయుధాలను ఉత్పత్తి చేస్తున్నాయి. క్షిపణులు, ఫిరంగులు, మందుగుండు సామగ్రి, ట్యాంకులు, విమానాలు, యుద్ధ నౌకల ఉత్పత్తితో స్వావలంబనపైన కూడా భారత్ దృష్టి సారించింది.

సొంతంగా ఉత్పాదన

ప్రపంచ దేశాలతో పోలిస్తే దక్షిణాసియాలో ఆయుధ దిగుమతులు గణనీయంగా పెరిగాయి. భారత్, పాక్‌లు ప్రముఖ కొనుగోలుదారులుగా ఉన్నాయి. పాకిస్తాన్ దిగుమతులు 74 శాతం వరకు ఉన్నాయి. బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్ కూడా ఈ పదేళ్లలో ఆయుధ వ్యాపారంలో అధిక శాతం పెరుగుదలను నమోదు చేశాయి. మొత్తం మీద దక్షిణాసియా ఆయుధ సముపార్జన కేవలం సాంకేతిక పరిజ్ఞానాన్ని దిగుమతి చేసుకోవడానికే పరిమితం కాకుండా భాగస్వామ్యంతో ఆయుధ ఉత్పత్తి చేపట్టడం వరకు అభివృద్ధి చెందుతోంది.

పశ్చిమాసియా.. అతిపెద్ద దిగుమతిదారు

ప్రాంతీయ సంఘర్షణలు తీవ్రతరం కావడం, సైనిక సామర్థ్యాల ఆధునీకరణ ప్రయత్నాల ద్వారా 164 శాతం పెరుగుదలతో పశ్చిమాసియా ప్రపంచంలోనే అతిపెద్ద ఆయుధాల దిగుమతిదారుగా అవతరించింది. కాగా ఆఫ్రికా దిగుమతులు 100 శాతం పెరిగి, రెట్టింపు అయ్యాయి. ఆసియా, ఓషియానియా 52 శాతం పెరుగుదలతో ప్రముఖ దిగుమతిదారులుగా తమ హోదాను నిలుపుకొంటూ వస్తున్నాయి. యునైటెడ్ కింగ్‌డమ్, నార్వే, పోలండ్, నెదర్లాండ్స్ సహా అన్ని దేశాల ఆయుధ దిగుమతుల్లో గణనీయమైన పెరుగుదల నమోదైంది.

ఆయుధాల దిగుమతి (మిలియన్లు) : ఏ దేశం ఎన్ని?

దేశం	2000లో	ప్రపంచంలో వాటా శాతం	2024లో	ప్రపంచంలో వాటా శాతం	పెరుగుదల శాతం (2000-24) మొత్తం
ఇండియా	987	5.1	1,168	4.4	18.3
చైనా	2,472	12.77	72	0.25	-97.1
సౌదీ అరేబియా	105	0.54	1,111	3.84	958
దక్షిణ కొరియా	1,399	7.23	1,009	3.49	-27.9
ఆస్ట్రేలియా	326	1.68	983	3.4	201.5
యు.ఎ.ఇ.	246	1.27	932	3.22	278.9
పాకిస్తాన్	175	0.9	982	3.39	461.1



బిజినెస్ పెంచిన ఉక్రెయిన్

ఐరోపా దేశాల ఆయుధ దిగుమతులు 29 శాతం పెరిగాయి. ఈ పెరుగుదలకు ప్రధానంగా ఉక్రెయిన్ యుద్ధం కారణమైంది. ఐరోపా దేశాల్లో 2023లో ఆయుధాల ఎగుమతుల్లో బ్రిటన్ 47.68 బిలియన్ డాలర్ల ఆదాయంతో ముందుంది. ఆ తరవాతి స్థానాల్లో ఫ్రాన్స్, ఇటలీ, జర్మనీ ఉన్నాయి. ఉక్రెయిన్ యుద్ధం నాటో దేశాలను తమ రక్షణ బడ్జెట్‌లను విస్తరించడానికి, ఆయుధాగారాలను బలోపేతం చేసుకోవడానికి దోహదపడింది. అంతర్జాతీయ ఆంక్షలను ఎదుర్కొంటున్నప్పటికీ, రష్యా 25.5 బిలియన్ డాలర్ల ఆయుధ ఆదాయాన్ని పొందగలిగింది. పశ్చిమాసియాలో ఇజ్రాయెల్ (13.60 బిలియన్ డాలర్లు)తోపాటు, తుర్కియే కూడా నాలుగు రాళ్లు వెనకేసుకుంది.

'మేకిన్ ఇండియా ఊపు'

మిలిటరీ కోసం అత్యధిక వ్యయం చేస్తున్న మొదటి దేశం అమెరికా కాగా, రెండోది చైనా. మనదేశం 5వ స్థానంలో ఉంది. ప్రపంచంలోని ప్రముఖ ఆయుధ ఉత్పత్తిదారుల కంటే భారత్ ఇప్పటికీ వెనుకబడి ఉన్నప్పటికీ 'మేక్ ఇన్ ఇండియా' ఊపుతో హిందుస్తాన్ ఏరోనాటిక్స్, భారత్ ఎలక్ట్రానిక్స్, మజగావ్ డాక్ షిప్ బిల్డర్స్ వంటి రక్షణ ఆయుధాల తయారీ సంస్థలు ప్రపంచ ర్యాంకింగ్స్‌లో పైకి ఎగబాకాయి. ఎల్‌అండ్‌టీ, టాటా, భారత్ ఫోర్జ్ తమ వంతు సహకారం అందిస్తున్నాయి. బ్రహ్మోస్ క్షిపణులను సైతం భారత్ ఎగుమతి చేయడం ప్రారంభించింది.

మన ఎగుమతులు రూ.23,622 కోట్లు

దిగుమతుల్లోనే కాదు, ఎగుమతుల్లోనూ భారత్ గణనీయమైన అభివృద్ధిని సాధించింది. భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాజా ప్రకటన ప్రకారం భారతదేశ రక్షణ ఎగుమతులు 2013–14లో రూ.686 కోట్ల నుంచి 2024–25 నాటికి రూ.23,622 కోట్లకు పెరిగాయి. అంటే 34 రెట్ల పెరుగుదల! మనదేశం.. అమెరికా, ఫ్రాన్స్, ఆర్మేనియా సహా 100కు పైగా దేశాలకు రక్షణ ఆయుధాలను ఎగుమతి చేస్తోంది. 2029 నాటికి రూ.50,000 కోట్ల విలువైన ఎగుమతుల్ని భారత్ లక్ష్యంగా చేసుకుంది.

క్లుప్తంగా...

డిగ్రీలో 142 క్రెడిట్స్

వీసీల సమావేశంలో ఖరారు

సాక్షి, హైదరాబాద్: డిగ్రీ కోర్సుల్లో ఈ విద్యా సంవత్సరం (2025–26) నుంచి 142 క్రెడిట్స్‌ను అందుబాటులోకి తేవాలని ఉన్నత విద్యా మండలి నిర్ణయించింది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ సూచనల మేరకు ఈ మార్పులు చేశారు. దీనివల్ల విద్యార్థులకు కొంత భాగం తగ్గుతుందని సమాచారం. మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి నేతృత్వంలో గురువారం వైస్ చాన్స్‌లర్ల సమావేశం జరిగింది. ఇందులో ప్రధానంగా క్రెడిట్స్ ఖరారుపైనే చర్చించారు. మూడేళ్ల డిగ్రీ కోర్సులో గతంలో 150 క్రెడిట్స్ ఉండేవి. యూజీసీ వీటిని 124కు తగ్గించాలని సూచించింది. దీంతో వీటిని 130కి తగ్గించారు. లాంగ్వేజీని మొదటి ఏడాదికే పరిమితం చేశారు. ఈ నిర్ణయంపై లాంగ్వేజ్ అధ్యాపకుల నుంచి నిరసన వచ్చిన నేపథ్యంలో రెండేళ్ల డిగ్రీ కోర్సులోనూ లాంగ్వేజీను అమలు చేయాలని నిర్ణయించారు. వీటిని కలుపుకొని 142 క్రెడిట్స్‌ను ఫైనల్ చేశారు.

బీసీ గురుకుల డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాల జాబితా విడుదల

సాక్షి, హైదరాబాద్: మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ పరిధిలోని గురుకుల డిగ్రీ కళాశాలల్లో.. మొదటి సంవత్సరం ప్రవేశాలకు అర్హత సాధించిన విద్యార్థుల జాబితాను సొసైటీ కార్యదర్శి బి.సైదులు గురువారం విడుదల చేశారు. ఈ జాబితాను బీసీ గురుకుల సొసైటీ వెబ్‌సైట్ https://tgrdccet.cgg.gov.in/TGRDCWEB/ లేదా https://mjptbcwreis.telangana.gov.inలో అందుబాటులో ఉంచామని తెలిపారు. సీటు పొందిన విద్యార్థులు మే 30వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ కల్లా తమకు కేటాయించిన కళాశాలల్లో ధ్రువపత్రాలు సమర్పించి సీటు కన్ఫర్మ్ చేసుకోవాలని సూచించారు. నిర్ణీత గడువులోగా కాలేజీలో రిపోర్టు చేయకుంటే సీటు రద్దవుతుందని స్పష్టంచేశారు. ప్రస్తుతం మొదటి జాబితాను మాత్రమే విడుదల చేశామని, జూన్ 6 తర్వాత రెండో జాబితా విడుదల చేయనున్నట్లు వివరించారు. మరింత సమాచారం కోసం 040–23328266 నంబర్‌కు ఫోన్ చేయాలని లేదా mjptbcwreis14@gmail.com ఐడీకి ఈమెయిల్‌లో సంప్రదించాలని కోరారు.

ఐఎస్‌బీకి రూ.100 కోట్ల గ్రాంటు

మోతీలాల్ ఓస్వాల్ నుంచి నిధులు



రూ.100 కోట్ల చెక్కుతో ఇరు సంస్థల ప్రతినిధులు

రాయదుర్గం: దేశంలో నంబర్‌వన్ బిజినెస్ స్కూల్‌గా గుర్తింపు పొందిన గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)కు భారీ గ్రాంటు దక్కింది. ఐఎస్‌బీ హైదరాబాద్ క్యాంపస్‌లో నెలకొల్పే ఎగ్జిక్యూటివ్ సెంటర్‌కు మోతీలాల్ ఓస్వాల్ ఫౌండేషన్ నుంచి రూ.100 కోట్లు లభిస్తుంది. అందువల్ల దీన్ని మోతీలాల్ ఓస్వాల్ ఎగ్జిక్యూటివ్ సెంటర్‌గా పిలుస్తారు. ఈ మేరకు ఇరు సంస్థల మధ్య గురువారం ఒప్పందం కుదిరింది. రెండు సంస్థల ప్రతినిధులు ఒప్పందపత్రాలను మార్చుకున్నారు. ఈ నిధులు ప్రపంచస్థాయి ఎగ్జిక్యూటివ్ విద్యను అందించే సంస్థగా ఐఎస్‌బీ నిరంతర వృద్ధికి దోహదపడతాయని ప్రతినిధులు చెప్పారు. కార్యక్రమంలో మోతీలాల్ ఓస్వాల్ ఫౌండేషన్ చైర్మన్ మోతీలాల్ ఓస్వాల్, ఫౌండేషన్ ట్రస్టీ రామ్‌దియో అగర్వాల్, ఐఎస్‌బీ డీన్ ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల పాల్గొన్నారు.

కామర్సే మన దోస్త్

డిగ్రీలో కామర్స్ వైపే విద్యార్థుల మొగ్గు

- ఆర్ట్స్ కోర్సులకు స్పందన అంతంత మాత్రమే
- దోస్త్ తొలి దశ సీట్ల కేటాయింపు..
- వివిధ విభాగాల్లో 60,436 మందికి సీట్లు
- సీట్ల భర్తీలో నిజాం కాలేజీకి మొదటి స్థానం
- 74 కాలేజీల్లో సీట్ల కేటాయింపు సున్నా
- నేటి నుంచి రెండో దశ దోస్త్ ప్రక్రియ



పి. వసంత్‌కుమార్



ఆకునూరి మీనాక్షి



పెన్మత్స తేజస్విని



ఎం.అంకిత

సాక్షి, హైదరాబాద్: డిగ్రీలో కామర్స్ కోర్సులో చేరేందుకే ఎక్కువ మంది విద్యార్థులు ఆసక్తి చూపారు. ఆ తర్వాత ఫిజికల్ సైన్స్, లైఫ్ సైన్స్ కోర్సులను ఎంచుకున్నారు. ఆర్ట్స్ గ్రూపులో చేరేందుకు విద్యార్థులు పెద్దగా ముందుకు రాలేదు. డిగ్రీ ఆన్‌లైన్ సేవలు, తెలంగాణ (దోస్త్) ద్వారా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు గురువారం సీట్లు కేటాయించారు. ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి ఈ వివరాలను వెల్లడించారు. రాష్ట్రంలో దోస్త్ పరిధిలో మొత్తం 805 డిగ్రీ కాలేజీలున్నాయి. వీటిల్లో మొత్తం 457 కోర్సులకు సంబంధించి 3,71,096 సీట్లు అందుబాటులో ఉన్నాయి. తొలి దశలో 89,572 మంది దోస్త్‌కు రిజిస్ట్రేషన్ చేసుకోగా, 65,191 మంది 3,34,960 వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డి పేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీ సహా మొత్తం 74 కాలేజీల్లో సీట్ల కోసం ఒక్కరు కూడా ఆప్షన్లు ఇవ్వలేదు. మెరిట్ ప్రకారం వచ్చిన ఆప్షన్లకు అనుగుణంగా మొదటి దశలో 60,436 సీట్లు కేటాయించారు.



టాపర్ల జాబితా విడుదల చేస్తున్న బాలకిష్టారెడ్డి తదితరులు

తెలుగు మీడియంలో 1,552 మందే..

డిగ్రీ కోర్సుల్లో సీట్ల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నవారితో పాటు సీట్లు పొందిన టాప్ ర్యాంకర్లలో ఎక్కువ మంది బాలికలే ఉన్నారు. ఇంగ్లిష్ మీడియంలో 58,575 మందికి సీట్లు కేటాయిస్తే, తెలుగు మీడియం విద్యార్థులు 1,552 మంది మాత్రమే ఉన్నారు. ఉర్దూమీడియం విద్యార్థుల సంఖ్య 309. సీట్లు పొందిన విద్యార్థులు జూన్ 6వ తేదీలోగా కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి తెలిపారు. రెండో దశ దోస్త్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ శుక్రవారం నుంచి మొదలు పెడుతున్నామని, సీట్ల కేటాయింపు జూన్ 13న ఉంటుందని చెప్పారు. మీడియా సమావేశంలో మండలి వైస్ చైర్మన్లు ప్రొఫెసర్ ఎస్కే మహమూద్, ప్రొఫెసర్ ఈ పురుషోత్తం, కార్యదర్శి శ్రీరామ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

తొలి దశలో కోర్సుల వారీగా కేటాయించిన సీట్లు

కోర్సు	సీట్లు
ఆర్ట్స్	5,986
కామర్స్	21,758
లైఫ్ సైన్సెస్	11,005
ఫిజికల్ సైన్సెస్	15,249
ఇతర కోర్సులు	6,438
మొత్తం	60,436

దోస్త్ సీట్లు పొందిన టాపర్స్

విభాగం	పేరు	దోస్త్ ర్యాంకు	ఇంటర్‌లో మార్కులశాతం
కామర్స్	పల్లెపంగు వసంత్‌కుమార్	1	99.60
ఫిజికల్ సైన్స్	పెన్మత్స తేజస్విని	4	99.50
లైఫ్ సైన్సెస్	ఆకునూరి మీనాక్షి	2	99.50
ఆర్ట్స్	ఎం.అంకిత	56	99.20

దోస్త్ సీట్ల భర్తీలో టాప్ టెన్ కాలేజీలు | మేనేజ్‌మెంట్‌వారీగా సీట్ల కేటాయింపు
సాక్షి ప్లస్ ఈ పేపర్‌లో

అంగన్‌వాడీల రిటైర్మెంట్ ప్యాకేజీకి ఓకే

- పెండింగ్‌లో ఉన్న ఫైలుకు ఆమోదం తెలిపిన రాష్ట్ర ఆర్థిక శాఖ
- ఇకపై టీచర్ రిటైరైతే రూ. 2 లక్షలు, హెల్పర్‌కు రూ. లక్ష
- అతిత్వరలో ఉత్తర్వులు జారీ చేస్తామని మంత్రి సీతక్క ప్రకటన



సాక్షి, హైదరాబాద్: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క శుభవార్త ప్రకటించారు. వారి పదవీ విరమణ ప్యాకేజీకి ఆర్థిక శాఖ ఆమోదం లభించిందని గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అతిత్వరలో ఉత్తర్వులు జారీ చేస్తామన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు గత ప్రభుత్వం రిటైర్మెంట్ ప్యాకేజీ ఖరారు చేసింది. టీచర్‌కు రూ. లక్ష, హెల్పర్‌కు రూ. 50 వేల చొప్పున నిర్ణయిస్తూ ఉత్తర్వులిచ్చింది. ఈ నిర్ణయంపై అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. సమ్మె సమయంలో జరిపిన చర్చల్లో ప్యాకేజీని టీచర్‌కు రూ. 2 లక్షలు, హెల్పర్‌కు రూ. లక్ష చొప్పున హామీ ఇచ్చి తీరా ఉత్తర్వుల సమయంలో సగానికి తగ్గించడంపై వారు భగ్గుమన్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ప్యాకేజీని మార్పు చేస్తామని వారికి హామీ ఇచ్చింది. ఈ మేరకు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ప్రతిపాదనలు రూపొందించి ఆర్థిక శాఖ ఆమోదం కోసం పంపింది. దాదాపు ఏడాది పాటు అక్కడ పెండింగ్‌లో ఉన్న ఫైలుకు తాజాగా మోక్షం కలిగింది.

చదువుతోనే ఆడపిల్లల అభివృద్ధి

ఇందిరమ్మ అమృత పథకం ప్రారంభోత్సవంలో మంత్రి సీతక్క



మిల్లెట్స్ కిట్లను ఆవిష్కరిస్తున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు, అధికారులు

చుంచుపల్లి: చదువు కుంటేనే ఆడపిల్లలు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించగలరని రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క అన్నారు. ఆడపిల్లలకు శక్తినిద్దాం.. ఆరోగ్య తెలంగాణ సాధిద్దాం అనే నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ఇందిరమ్మ అమృత పథకాన్ని గురువారం ఆమె కొత్తగూడెం క్లబ్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కౌమార దశలోని బాలికల్లో రక్తహీనత సమస్యను అధిగమించేందుకు ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా భద్రాద్రి కొత్తగూడెం, ఆసిఫాబాద్, భూపాలపల్లి జిల్లాల్లో ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. ఈ పథకం ద్వారా మూడు జిల్లాల్లోని 50,269 మంది బాలికలకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆడపిల్లలకు పౌష్టికాహారం అందక అనేక రకాల జబ్బులు వస్తున్నాయని అన్నారు. 14 – 18 ఏళ్ల లోపు బాలికలకు ఈ పథకం ద్వారా మిల్లెట్స్‌తో కూడిన చిక్కీలను నెలకు రెండు ప్యాకెట్లు అందిస్తామని తెలిపారు. తద్వారా ఆడపిల్లలు నెలసరి సమయంలో వచ్చే సమస్యలు, రక్తహీనతను తగ్గించే అవకాశం ఉంటుందన్నారు. మిషన్ వాత్సల్య పథకం కింద తల్లిదండ్రులు లేని పిల్లలకు ప్రభుత్వం నెలకు రూ.4 వేలు అందజేస్తుందని వెల్లడించారు. ఈ పథకం కింద భద్రాద్రి జిల్లాకు మంజూరైన రూ.74.64 లక్షల చెక్కును పిల్లలకు మంత్రి అందజేశారు. కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అనితా రామచంద్రన్, డైరెక్టర్ కాంతి వెస్లీ, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, భద్రాచలం, ఇల్లెందు, పినపాక, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, ఐటీడీఏ పీఓ రాహుల్ పాల్గొన్నారు.

తరలిపోనున్న అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ!

- ప్రధాన కార్యాలయాన్ని ఏలూరులో ఏర్పాటు చేస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు
- వర్సిటీ చట్ట సవరణలకు కొనసాగింపుగానేనని వెల్లడి
- తెలంగాణ ప్రభుత్వంతో సంప్రదించకుండానే ఏకపక్షంగా మార్పు

సాక్షి, హైదరాబాద్: దశాబ్దాలుగా జూబ్లీహిల్స్‌లో ప్రధాన కార్యాలయం ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆంధ్రప్రదేశ్‌కు తరలిపోనుందా? తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మౌనముద్ర చూస్తుంటే అవుననే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వర్సిటీ ప్రధాన కార్యాలయాన్ని ఏలూరు సమీపంలోకి మారుస్తూ ఏపీ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఓపెన్ వర్సిటీని ఏర్పాటు చేస్తూ యూనివర్సిటీ చట్టం 1982 సెక్షన్ 3, సబ్ సెక్షన్ 4ను ఉదహరిస్తూ ఏపీ ప్రభుత్వ ఉన్నత విద్య కార్యదర్శి కోన శశిధర్ ఈ ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ పునర్విభజన చట్టం–2014 ప్రకారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీని 10వ షెడ్యూల్‌లో చేర్చారు. విభజన చట్టం అమల్లోకి వచ్చిన పదేళ్లలోగా రెండు రాష్ట్రాలు సామరస్యంగా ఓపెన్ వర్సిటీని, పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీ ఆస్తులు, అప్పులు విభజించుకోవాలని సూచించింది. పదేళ్ల వరకు ఇరు రాష్ట్రాలకు ఓపెన్ వర్సిటీ సేవలు అందించాలని విభజన చట్టంలో ఉంది. పునర్విభజన చట్టం అమల్లోకి వచ్చి పదేళ్లు పూర్తవడంతో తెలంగాణలో ఉన్న ఓపెన్ వర్సిటీ ఏపీలోని స్టడీ సెంటర్లకు సేవలు నిలిపేసింది. కేవలం తెలంగాణలో సేవలను కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ ప్రధాన కార్యాలయాన్ని ఏలూరు సమీపంలో ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులివ్వడం, ఏపీలోని అన్ని స్టడీ సెంటర్లకు ప్రధాన కార్యాలయం ఇదేనని పేర్కొంది. ఉత్తర్వుల కాపీని ఓపెన్ వర్సిటీ వీసీకి, రిజిస్ట్రార్‌కు పంపడంతోపాటు యూజీసీ కార్యదర్శికి కూడా పంపించింది. ప్రధాన కార్యాలయాన్ని తరలించే అంశంపై తెలంగాణ ప్రభుత్వంతో చర్చలు జరపకుండానే ఏపీ ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడమే కాక ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం.

ఏపీ తీరుపై ఓపెన్ వర్సిటీ వర్గాల మండిపాటు

ఒక రాష్ట్రంలో యూనివర్సిటీ ప్రధాన కార్యాలయం ఉండగా దాన్ని మరోచోటకు ఎలా మారుస్తారని యూనివర్సిటీ వర్గాలు మండిపడుతున్నాయి. ఈ ఉత్తర్వులను చూసిన వర్సిటీ యాజమాన్యం ఆశ్చర్యపోయింది. తమకు కనీసం సమాచారం.. లేకుండా ఏ విధంగా ఉత్తర్వులు జారీ చేస్తారని యూనివర్సిటీ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి పరిధిలోనే ఉన్న విద్యాశాఖ ఈ అంశంపై ఇప్పటివరకు స్పందించకపోవడం గమనార్హం.

బొగ్గు ఉత్పత్తిలో నాణ్యత ప్రమాణాలు పెరగాలి

ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించాలి: కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: బొగ్గు ఉత్పత్తిలో నాణ్యత ప్రమాణాలను పెంచాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. అలాగే కార్మికుల జీతాలు, సంక్షేమ కార్యక్రమాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా బొగ్గు ఉత్పత్తి వ్యయాన్ని గణనీయంగా తగ్గించాలని సూచించారు. బొగ్గు ఉత్పత్తి వ్యయం తగ్గింపు, నాణ్యత, సరఫరా తదితర అంశాల్లో సవాళ్ల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై గురువారం కేంద్ర బొగ్గు, గనుల శాఖ కోలిండియా సహా సింగరేణిపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించింది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన ఈ సమావేశంలో మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఉత్పత్తి వ్యయం తగ్గింపునకు సింగరేణి అధికారులు, బొగ్గు మంత్రిత్వ శాఖ నిపుణులతో కమిటీని ఏర్పాటు చేయాలన్నారు.

విశ్వసనీయ సంస్థకు నైతికతే పునాది

కోల్‌ఇండియాలో జనరల్ వీపీ మాలిక్ ప్రసంగం

సాక్షి, హైదరాబాద్: బలమైన సంస్థలకు నైతికతే పునాది అని మాజీ సైన్యాధ్యక్షుడు జనరల్ వీపీ మాలిక్ అన్నారు. జార్ఖండ్‌లోని రాంచీలో ఉన్న సెంట్రల్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (సీసీఎల్) కార్పొరేట్ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. 'అనిశ్చిత సమయాల్లో గౌరవంగా నాయకత్వం వహించడం: కార్గిల్ యుద్ధంలో నైతికత పాత్ర'పై తన అనుభవాలు పంచుకున్నారు. కోల్ ఇండియా సంస్థకు – సైన్యం విధులకు ఉన్న వృత్తిపరమైన సమాంతరాలను ఆయన ప్రస్తావిస్తూ బలమైన, నమ్మదగిన సంస్థకు విశ్వసనీయతే పునాది అని స్పష్టం చేశారు. 'ఆపరేషన్ సిందూర్' గతంలో నిర్వహించిన ఆపరేషన్‌లకు భిన్నమైనదని ఆయన పేర్కొన్నారు. కాగా, కోల్ ఇండియా స్వర్ణోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి సెంట్రల్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ సీఎండీ ఎన్కే సింగ్, సీనియర్ అధికారులు, అనుబంధ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు.

'ఫీజు'లకు మోక్షం ఎప్పుడు?

▶ మొదటి పేజీ తరువాయి

సుమారు మరో రూ. 2 వేల కోట్లు ఉన్నాయి. బకాయిల్లో కొన్నింటికి టోకెన్లు జారీ అవగా మరికొన్ని మంజూరు దశలోనే ఉండిపోయాయి.

పరిశీలనకే పరిమితం...

ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం కింద వస్తున్న దరఖాస్తులు పరిశీలనకే పరిమితమవుతున్నాయి. ఏటా సగటున 12.5 లక్షల మంది విద్యార్థులు ఈ పథకాల కింద దరఖాస్తు చేసుకుంటున్నారు. ఏటా దాదాపు ఆరు నెలలపాటు దరఖాస్తుల సమర్పణ ప్రక్రియ సాగుతుంది. ఆన్‌లైన్‌లో వస్తున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి అర్హతలను నిర్ధారించి మంజూరు చేయడం వరకే సంక్షేమ శాఖలు పరిమితమవుతున్నాయి. ఆ తర్వాత ట్రెజరీలకు బిల్లులు పంపుతుండగా ఆర్థిక శాఖ వద్ద ఈ ఫైళ్లు పెండింగ్‌లో ఉంటున్నాయి.

ఖజానా విభాగంలో రూ. 1,150 కోట్ల బిల్లులు..

సంక్షేమ శాఖ అధికారులు దరఖాస్తులను పరిశీలించి వాటిని బిల్లుల రూపంలో ఖజానా శాఖకు పంపుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే బీఆర్వో (బడ్జెట్ రిలీజ్ ఆర్డర్)లకు అనుగుణంగా ఆర్థిక శాఖ ఆయా బిల్లులను పాస్ చేస్తుంది. ఈ నేపథ్యంలో రూ. 1,150 కోట్ల విలువైన బిల్లులకు ఖజానా విభాగంలో టోకెన్లు జారీ అయ్యాయి. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే వాటికి మోక్షం కలుగుతుంది. అయితే ప్రస్తుతం టోకెన్ల రూపంలో పెండింగ్‌లో ఉన్న బకాయిలన్నీ 2021–22, 2022–23 విద్యాసంవత్సరానికి సంబంధించినవే కావడం గమనార్హం. మరోవైపు సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంపై కళాశాలల యాజమాన్యాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వం నిధులు విడుదల చేశాక వాటిని తిరిగి చెల్లిస్తామని విద్యార్థుల తల్లిదండ్రులకు చెబుతూ ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడే ప్రయత్నం చేస్తున్నాయి.

2023-24 నుంచి ఫీజు బకాయిలు ఇలా.. (రూ. కోట్లలో)

కేటగిరీ	2023-24	2024-25
ఎస్సీ	375.33	376.55
ఎస్టీ	245.54	248.21
బీసీ	1,125.12	1,145.55
ఈబీసీ	345.23	350.54
మైనారిటీ	362.26	368.55
మొత్తం	2,453.48	2,489.4

'ఫీజు' దరఖాస్తు గడువు నెల పొడిగింపు

- 2024–25 ఉపకార దరఖాస్తులకు జూన్ 30 వరకు అవకాశం
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం పోస్టుమెట్రిక్ విద్యార్థుల ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలకు దరఖాస్తు గడువును పొడిగించింది. తొలుత నిర్ణయించిన ప్రకారం ఈనెల 31వ తేదీతో దరఖాస్తు గడువు ముగుస్తుండగా.. ప్రభుత్వం మరో నెల రోజులు అవకాశం కల్పించింది. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకారవేతన పథకాలకు జూన్ 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే వీలు కల్పిస్తూ ఎస్సీ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. 2024–25 విద్యా సంవత్సరంలో ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలకు గతేడాది సెప్టెంబర్ 1వ తేదీనుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. మొత్తం 11,88,120 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటారని అధికారులు అంచనా వేశారు. ఇందులో ఇప్పటివరకు 10,75,041 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇంకా 1,13,079 మంది దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. విద్యార్థులు, విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ప్రభుత్వం గడువు తేదీని నెలరోజులు పొడిగించింది. గడువు తేదీ పొడిగింపు నేపథ్యంలో కాలేజీ యాజమాన్యాలు, సంక్షేమ శాఖల అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం పలు సూచనలు చేసింది. తాజాగా నిర్దేశించిన గడువు లోపల ప్రతి విద్యార్థి దరఖాస్తు చేసుకునేలా చర్యలు చేపట్టాలని, ఈ దిశలో కాలేజీ యాజమాన్యాలు చొరవ తీసుకోవాలని సూచించింది. గడువు పొడిగింపుపై విస్తృత ప్రచారం కల్పించాలని సంక్షేమ శాఖలను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది.



న్యాయ వ్యవస్థలో విశిష్ట సేవలు అందించినందుకు గురువారం అగర్తలాలో జరిగిన కార్యక్రమంలో మహారాజా బీర్ బిక్రం వర్సిటీ చాన్స్‌లర్, ఆ రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్న త్రిపుర హైకోర్టు జడ్జి జస్టిస్ అమర్నాథ్‌గౌడ్

క్లుప్తంగా...

బీజేపీ, బీఆర్‌ఎస్ ముసుగు తొలగిపోయింది

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- కవిత ప్రశ్నలకు కేసీఆర్, కేటీఆర్ సమాధానం చెప్పాలి



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలతో బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల మధ్య చీకటి ఒప్పందం ముసుగు తొలగిపోయిందని, కేసీఆర్ అసలు రంగు బయటపడిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్‌ఎస్ ఏకమై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దొంగ దెబ్బతీయడానికి ప్రయత్నాలు చేస్తున్నాయని తాము మొదటి నుంచీ చెబుతున్న మాట నిజమైందన్నారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఎప్పటి నుంచో చెబుతున్నారని గుర్తు చేశారు. కవిత మాటలపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించాలని, బీజేపీతో డీల్‌పైన బీఆర్‌ఎస్ పార్టీ తన కార్యకర్తలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రెండు పార్టీలు లోపాయికారీ ఒప్పందం చేసుకున్నప్పటికీ తెలంగాణ ప్రజలు తమ వైపు స్పష్టమైన తీర్పు ఇచ్చారని అన్నారు. కాగా, పార్టీ పేరు మార్చుకున్నప్పుడే తెలంగాణ ప్రజలతో బీఆర్‌ఎస్‌కు పేగు బంధం తెగిపోయిందన్నారు. కవిత ప్రశ్నలకు కేసీఆర్, కేటీఆర్ సమాధానం ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు.

కవిత వ్యాఖ్యలు నిజమేనని నమ్ముతున్నా

- భారీ ప్యాకేజీ దొరికితే మావాళ్లు కూడా బీఆర్‌ఎస్‌తో కలుస్తారు
- బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలు నిజమేనని తాను నమ్ముతున్నట్లు బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. భారీ ప్యాకేజీ దొరికితే తమ పార్టీ వాళ్లు కూడా బీఆర్‌ఎస్‌తో కలసిపోతారని గురువారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు ఎక్కడినుంచి పోటీ చేయాలనే విషయాన్ని బీఆర్‌ఎస్ ఖరారు చేస్తుందన్నారు. గతంలోనూ ఇదే జరగడంతో బీజేపీ తీవ్రంగా నష్టపోయిందన్నారు. వాస్తవానికి రాష్ట్రంలో ఇప్పటికే బీజేపీ అధికారంలోకి రావాల్సి ఉండేదన్నారు. ప్రతి ఎన్నికల్లో కుమ్మక్కు కావడంతో పార్టీకి ఈ పరిస్థితి దాపురించిందన్నారు. ఇలాంటి వాస్తవాలను పార్టీ నాయకులు బయటపెడితే సస్పెండ్ అవుతారని, అందుకే అందరూ నోరుమూసుకుని కూర్చుంటారన్నారు.

కవిత ఆవేదన ఈ రోజే తెలిసింది

మాజీ ఎంపీ వినోద్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: రాజకీయాల్లో ప్రకంపనలు సహజమని, గతంలో అనేక పార్టీల్లో ఇలాంటి పరిస్థితులు చూశామని బీఆర్‌ఎస్ మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్ అన్నారు. గురువారం తెలంగాణ భవన్‌లో వినోద్‌కుమార్ మీడియాతో చిట్‌చాట్ చేశారు. ఈ తరహా పరిస్థితులు ఎదుర్కోవడంలో తమ పార్టీ మొదటిది కాదని, చివరిది కూడా కాబోదని అన్నారు. గతంలో డీఎంకే పార్టీలో కరుణానిధి, అళగిరి, కనిమొళి నడుమ సాగిన కుటుంబ రాజకీయాలు చూశామన్నారు. ఎమ్మెల్సీ కవితలో ఇంత ఆవేదన ఉందనే విషయం ఈ రోజే తెలిసిందని, త్వరలో పార్టీలో సమస్యలు కచ్చితంగా సద్దుమణుగుతాయని తెలిపారు. ఉద్యమ సమయంలో బీఆర్‌ఎస్ పార్టీ బీజేపీతోపాటు టీడీపీ, కాంగ్రెస్, వామపక్ష పార్టీలతోనూ పనిచేసిందని, బీజేపీతో కలిసి పనిచేయాలనుకుంటే గతంలోనే పొత్తు కుదుర్చుకునేవారమన్నారు. కవితను కలిసి మాట్లాడేందుకు ప్రయత్నం చేస్తానని వినోద్‌కుమార్ చెప్పారు. చిట్‌చాట్‌లో చేసిన వ్యాఖ్యలపై కవితకు షోకాజ్ నోటీసు ఎలా ఇస్తామని ఎదురు ప్రశ్నించారు.

జూన్ 1న బీసీల రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలు, దేశ వ్యాప్తంగా సమగ్ర కులగణన, భవిష్యత్తు బీసీ ఉద్యమ కార్యాచరణపై చర్చించడానికి జూన్ 1న బీసీల రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. సమావేశాన్ని బంజారాహిల్స్‌లోని కళింగభవన్‌లో ఏర్పాటు చేయనున్నామని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి రాష్ట్రంలోని 33 జిల్లాల నుండి బీసీ సంక్షేమ సంఘం, అనుబంధ సంఘాల బాధ్యులు, బీసీ సంఘాల ప్రతినిధులు, నియోజకవర్గ నేతలు హాజరుకానున్నారని వెల్లడించారు.



ఎమ్మెల్యే మల్లారెడ్డితో కలిసి పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ కవిత

పులిబిడ్డ ఎక్కడికీ పోదు

- మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి వ్యాఖ్యలు
- సేవాలాల్ ఆలయంలో పూజలకు హాజరైన ఎమ్మెల్సీ కవిత

మేడ్చల్: గుండ్లపోచంపల్లి హనుమాన్ గడ్డ సమీపంలో గల సేవాలాల్ తండాలోని సేవాలాల్ ఆలయంలో వార్షికోత్సవ పూజలకు బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత హాజరయ్యారు. గురువారం మధ్యాహ్నం తన నియోజకవర్గంలోని ఆలయానికి విచ్చేసిన కవితకు పార్టీ ఎమ్మెల్యే మల్లారెడ్డి అనుచరులతో కలిసి స్వాగతం పలికారు. ఉదయం కవిత కార్యక్రమం ఖరారు కాగానే ఎమ్మెల్యే కార్యాలయం నుంచి పార్టీ కేడర్‌కు సందేశాలు వెళ్లినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో గుండ్లపోచంపల్లికి చేరుకున్నారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి అరగంట ముందే అక్కడికి చేరుకుని ఏర్పాట్లు పర్యవేక్షించారు. గిరిజన సంప్రదాయ బద్ధంగా డప్పులు, బ్యాండు మేళాలతో, బోనాలతో స్వాగత ఏర్పాట్లు చేశారు. అందరికీ గులాబీ రంగు పగిడీలు ఏర్పాటు చేయించారు. అరగంట సేపు ఆలయం వద్ద ఉన్న కవిత.. ఇటీవలి పరిణామాలపై ఏమీ మాట్లాడకుండానే వెళ్లిపోయారు. మీడియా మాట్లాడించే ప్రయత్నం చేసినా చిరునవ్వుతో దాట వేశారు. అనంతరం మల్లారెడ్డి మాట్లాడుతూ.. కవిత పులిబిడ్డ అని, పుట్టిన బిడ్డ పులివద్దనే ఉంటుందని, ఎక్కడికీ పోదని అన్నారు. కవిత ఎట్టి పరిస్థితుల్లోనూ బీఆర్‌ఎస్‌ను వీడి వెళ్లరని, ఎవరూ ఎలాంటి ఆశలు పెట్టుకోవద్దంటూ తనదైన శైలిలో వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ మునిగే నావ నేనెందుకు చేరతా

ఆ పార్టీతో సంప్రదింపులు ప్రచారం శుద్ధ అబద్ధం : కవిత

సాక్షి, హైదరాబాద్: 'కాంగ్రెస్ మునిగి పోయే పడవ. ఆ పార్టీలో నేనెందుకు చేరతా?. చేరితే ఏంటి లాభం? నేను కాంగ్రెస్ పార్టీతో సంప్రదింపులు జరిపినట్లు జరుగుతున్న ప్రచారం శుద్ధ అబద్ధం. నేను కేసీఆర్‌కు రాసిన లేఖను కుట్రపూరితంగా లీక్ చేశారు. 2013 తర్వాత నేను కాంగ్రెస్ నేతలు ఎవరితోనూ మాట్లాడలేదు. రెండు జాతీయ పార్టీలు.. కాంగ్రెస్, బీజేపీతో తెలంగాణకు నష్టమే. అయినా బీఆర్‌ఎస్‌ను కొందరు నేతలు బీజేపీకి అంటగట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీని బీజేపీలో విలీనం చేసేందుకు 101 శాతం ప్రయత్నాలు జరిగాయి. నేను మద్యం కేసులో జైల్లో ఉన్నప్పుడే ఈ ప్రతిపాదనను నా వద్దకు తీసుకు వస్తే వ్యతిరేకించా. బీఆర్‌ఎస్ స్వతంత్రంగా ఉండాలన్నదే నా అభిమతం. తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దు, ఆరు నెలలు కాదు.. ఏడాదైనా జైల్లో ఉంటా.. పార్టీని బీజేపీలో విలీనం చేయొద్దని కోరా. అప్పటినుంచే నా తండ్రి కేసీఆర్ నుంచి నన్ను విడదీసే కుట్రలు, పార్టీకి, కుటుంబానికి దూరం చేయాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి. నన్ను పార్టీ నుంచి బయటకు పంపితే జరిగే లాభం ఎవరికి?' అని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ అధినేత, తన తండ్రి కేసీఆర్‌కు ఆమె రాసిన లేఖ బయటకు రావడం, ఆ నేపథ్యంలో కేసీఆర్ చుట్టూ దెయ్యాలు ఉన్నాయంటూ వ్యాఖ్యానించడం, తదితర పరిణామాల నేపథ్యంలో..కవిత గురువారం తన నివాసంలో మీడియాతో ఇష్టాగోష్టి నిర్వహించారు. పార్టీ పనితీరు, నేతల వ్యవహారశైలి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, అన్న కేటీఆర్ పేరు ప్రస్తావించకుండా ఆయనపై.. ఘాటు వ్యాఖ్యలు చేశారు. పూర్తి వివరాలు కవిత మాటల్లోనే..

పార్టీని కేసీఆర్ కాపాడుకోవాలి..

కేసీఆర్‌కు 25 ఏళ్లుగా వందల లేఖలు రాస్తున్నా. అందులో తప్పేముంది. సాధారణంగా లేఖను చదివిన కేసీఆర్ చింపేస్తారు. నా కర్మ బాగా లేకో మరొకటో తెలియదు. కానీ ఎవరో కుట్ర పూరితంగా లేఖను బయటకు లీక్ చేశారు. లీకు వీరులను బయట పెట్టి చర్యలు తీసుకోవాలని కోరుతుంటే గ్రీకు వీరుల్లా ప్రవర్తిస్తున్నారు. నేను మా నాన్నకు లేఖ రాస్తే మీకు నొప్పేంది? నాపై ప్రతాపం చూపడం మానుకుని కాంగ్రెస్, బీజేపీపై చూపండి. నేను అసలే మంచిదాన్ని కాదు.. నోరు విప్పితే తట్టుకోలేరు. లేఖలో నేను సూచించిన అంశాల్లో ఒక్కటైనా తప్పుందా? కోవర్టులే పార్టీకి నష్టం చేస్తున్నారు. గతంలో పార్టీలో ఉన్న పెద్ద నాయకులు ఇప్పుడు రేవంత్ దగ్గర ఉన్నారు. నాతో ఉన్న నాయకులు ఎవరూ కాంగ్రెస్‌లో చేరలేదు. నేను ఎన్నడూ పదవులు అడగలేదు. ఆత్మాభిమానం మాత్రమే కోరుకుంటా. నోటితో నవ్వుతూ నొసటితో వెక్కిరించను. నక్కి కుట్ల రాజకీయాలు, వెన్నుపోటు రాజకీయాలు చేయకుండా ఏ అంశంపైనైనా నేరుగా మాట్లాడతా. నేను బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకం కాదు. కొత్త పార్టీ అవసరం లేదు. ఉన్న పార్టీని బాగా చూసుకుంటే చాలు. పార్టీని కేసీఆర్ కాపాడుకోవాలి.

వారిద్దరూ ఎవరికి దగ్గరో అందరికీ తెలుసు

రాజ్యసభ ఎంపీ దామోదర్‌రావు, గండ్ర మోహన్‌రావును నా వద్దకు ఎవరు పంపారో తెలియదు. కానీ వారిద్దరూ ఎవరికి దగ్గరో అందరికీ తెలుసు. వారు నాతో చర్చించింది ఒకటి.. బయటకు లీక్ చేసింది మరొకటి. ఇతర నేతల విషయాల్లో స్పందిస్తున్న పార్టీ నాయకత్వం.. నేను పార్టీ ఎమ్మెల్సీని అయినా నాపై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై ఎందుకు స్పందించడం లేదు? లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ఓటమికి నేను కారణమైతే నాపై, లేదంటే అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలి. పెయిడ్ ఆర్టిస్టులతో నాపై తప్పుడు ప్రచారం చేయిస్తూ సోషల్ మీడియాలో మహాభారతం కేరక్టర్లు వేస్తున్నారు. ఇంటి ఆడబిడ్డ గురించి ఎలా పడితే అలా మాట్లాడిస్తే అది మంచిదేనా? లీకు వీరులను కట్టడి చేయకుండా పెయిడ్ ఆర్టికల్స్ రాయిస్తే భయపడేది లేదు. 2006లో తెలంగాణ జాగృతి స్థాపించింది మొదలుకుని ఎనిమిదేళ్లు కేసీఆర్ నీడలో సైనికురాలిగా పనిచేశా. కడుపులో బిడ్డను పెట్టుకుని ఉద్యమంలో నా శక్తి మేరకు పనిచేశా.

కేసీఆర్ వారించడంతోనే రాజీనామాపై వెనక్కి

ఢిల్లీ మద్యం కేసులో కేసు నమోదు చేస్తే ఎమ్మెల్సీకి, పార్టీ పదవికి రాజీనామా చేస్తానని కేసీఆర్‌కు చెప్పా. కానీ కుట్రతో బీజేపీ కేసులు పెట్టిందని కేసీఆర్ వారించడంతోనే పదవిలో కొనసాగుతున్నా. 2019లో లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీగా పోటీచేస్తే సొంత పార్టీ వారే కుట్రపూరితంగా ఓడించారు. ఎమ్మెల్యేలు నా గెలుపు కోసం పనిచేయలేదు. అయితే అదే నిజామాబాద్ జిల్లాలో నాకు ప్రొటోకాల్ ఉండాలనే ఉద్దేశంతో కేసీఆర్ నాకు మండలి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చారు.

అసెంబ్లీ ఎన్నికల్లో ఒకరినొకరు ఓడించుకున్నారు

మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రి పదవుల కోసం పోటీ పడి ఒకరినొకరు ఓడించుకున్నారు. కాళేశ్వరం లాంటి పెద్ద ప్రాజెక్టును నిర్మించిన కేసీఆర్‌కు నోటీసులు ఇస్తే బీఆర్‌ఎస్ ఏం కార్యాచరణ తీసుకుంది? నేతలు ఎవరూ ఎందుకు స్పందించలేదు? క్షేత్రస్థాయిలో ఉద్యమ కార్యాచరణ ఎందుకు చేపట్టడం లేదు? నోటీసులపై కార్యాచరణ చేపట్టకుండా అమెరికాలో పార్టీ రజతోత్సవ వేడుకలు నిర్వహిస్తే ఏం లాభం? నన్ను రేవంత్‌రెడ్డి కోవర్టు అనడం ఎంత వరకు కరెక్ట్?

జాగృతిని విస్తృతం చేస్తా.. మరో 30 ఏళ్లు రాజకీయాల్లో ఉంటా

నేను మరో 30 ఏళ్లు రాజకీయాల్లో ఉంటా. పార్టీ చేయని పనులు సగం మేర నేనే చేస్తున్నా. ఉద్యమ సంస్థగా ఏర్పడిన తెలంగాణ జాగృతి పది విభాగాలతో బలంగా ఉంది. దీనిని మరింత విస్తరించడంతో పాటు కార్యాలయాన్ని అశోక్‌నగర్ నుంచి బంజారాహిల్స్‌కు మారుస్తాం. త్వరలో అన్ని నియోజకవర్గాల్లో పర్యటించడంతో పాటు నీటిపారుదల, బీసీలకు సంబంధించిన అంశాలపై రౌండ్ టేబుల్ సమావేశాలతో స్పీడ్ పెంచుతాం. సింగరేణిని అమ్మే కుట్రలపై, కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడంపై బీఆర్‌ఎస్ కార్యాచరణ చేపట్టాలి. లేనిపక్షంలో తెలంగాణ జాగృతి తరఫున కార్యాచరణ ప్రకటిస్తాం.

ట్విట్టర్ మెసేజ్‌లు సరిపోతాయా?

పార్టీ నేతల కాలేజీలపైకి బుల్డోజర్లు పోతుంటే ఎందుకు అడ్డుకోవడం లేదు? వారు పార్టీ తరఫున పోటీ చేయడమే తప్పా? తెలంగాణ సోయిలో పరిపాలన జరగడం లేదని బీఆర్‌ఎస్ నాయకులు గళం ఎత్తి పోరాడకుంటే పార్టీ ఎలా ముందుకు పోతుంది? మీడియా సెల్ పెట్టుకుని దాడులు చేస్తూ క్షేత్రస్థాయిలో ఉద్యమాలు చేయకుండా ట్విట్టర్‌లో మెసేజ్‌లు పెడితే సరిపోతాయా? నీటిపారుదల అంశంపై ప్రభుత్వం చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి. ట్వీట్లకు పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ఉద్యమం చేయాలి.

బీఆర్‌ఎస్‌లో ఒకేఒక్క లీడర్ కేసీఆర్

కేసీఆర్ కృషితోనే వరంగల్ సభ విజయవంతం అయింది. కొందరు నేతలు కేసీఆర్ నీడలోనే బతుకుతున్నామనే విషయాన్ని గుర్తించి, కేసీఆర్‌ను తామే మోస్తున్నామనే భ్రమ నుంచి బయటకు రావాలి. నా కుటుంబాన్ని వదిలి నేను ఎందుకు వెళ్తాను? నేను ఎవరి నాయకత్వం కిందా పని చేయను. బీఆర్‌ఎస్‌లో ఒకే ఒక్క లీడర్ కేసీఆర్. ఆయన బలమైన నాయకుడు. ఆయన నాయకత్వంలో మాత్రమే పనిచేస్తా. ఆయనే మళ్లీ ముఖ్యమంత్రి అవుతారు. కేటీఆర్‌కు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గౌరవం ఇస్తా.

చంద్రబాబు ఏం చేసినా కేంద్రం అడ్డుకోవడం లేదు

ఏపీ సీఎం చంద్రబాబు ఏం చేసినా కేంద్ర ప్రభుత్వం అడ్డుకోవటం లేదు. ఏపీ చేపట్టనున్న బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణకు తీరని నష్టం జరుగుతుంది. ప్రజాభవన్‌లో రేవంత్‌తో మీటింగ్ తర్వాతే చంద్రబాబు బనకచర్లపై ప్రకటన చేశారు. గోదావరి జలాల్లో తెలంగాణకు వాటా లేకుండా చేయాలనే కుట్రలో భాగంగానే 200 టీఎంసీల ప్రాజెక్టును తెరమీదకు తెచ్చారు.

ఎంఐఎంతో మన వైఖరి ఏంటి?

- ఎన్నికల్లో ప్రాణాలకు తెగించి మేం వారితో కొట్లాడాలి.. ఎన్నికలయ్యాక ఆ పార్టీతో దోస్తానా ఎందుకు?
- జిల్లా మంత్రి పట్టించుకోరు.. సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వరు
- మీనాక్షి నటరాజన్‌కు హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యేల మొర
- మంత్రుల నియోజకవర్గాలకు ఎక్కువ నిధులు తీసుకెళ్తున్నారని పాలమూరు ఎమ్మెల్యేల ఫిర్యాదు



సాక్షి, హైదరాబాద్: ఎంఐఎం విషయంలో పార్టీ వైఖరేంటో స్పష్టం చేయాలని హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి చెందిన పార్టీ నేతలు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను కోరారు. ఎన్నికల సమయంలో తాము ఎంఐఎంతో ప్రాణాలకు తెగించి కొట్లాడతామని, ఎన్నికలయ్యాక కాంగ్రెస్ ముఖ్యనేతలు ఆ పార్టీతో దోస్తానా చేస్తారని, ఇలాగైతే హైదరాబాదులో పార్టీ ఎలా అభివృద్ధి అవుతుందని వారు ప్రశ్నించారు. ఎంఐఎం విషయంలో ఒక వైఖరి తీసుకుని ముందుకెళ్తే తాము కూడా రాజకీయంగా ఏం చేయాలనేది నిర్ణయించుకుంటామని స్పష్టం చేశారు. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు, పోటీ చేసిన అభ్యర్థులతో భేటీ అవుతున్న మీనాక్షి నటరాజన్ రెండో రోజు గురువారం మహబూబ్‌నగర్, చేవెళ్ల, హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని నేతలతో ముఖాముఖి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ నేతలు ఎంఐఎం అంశాన్ని ఆమె వద్ద ప్రస్తావించినట్టు తెలిసింది.

జిల్లాలో పార్టీకి పెద్దదిక్కు లేదు.

'హైదరాబాద్ జిల్లాలో పార్టీకి పెద్దదిక్కు లేదు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా ఇంతవరకు హైదరాబాద్ జిల్లాకు చెందిన ఒక నాయకుడికి కూడా నామినేటెడ్ పదవి ఇవ్వలేదు. ఎంఐఎంతో కొట్లాడినప్పుడు మా మీద కేసులు పెట్టారు. ఆ కేసులు ఎత్తేయాలని కోరినా పట్టించుకునే నాథుడు లేడు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి మమ్మల్ని కలవరు. సీఎం అపాయింట్‌మెంట్ అడిగితే ఇవ్వరు' అని మీనాక్షి నటరాజన్ వద్ద హైదరాబాద్ నేతలు మొరపెట్టుకున్నట్టు తెలిసింది. వారి విజ్ఞాపనలు విన్న మీనాక్షి అన్ని అంశాలు పార్టీతో మాట్లాడతానని, హైదరాబాద్ జిల్లాలో పార్టీ అభివృద్ధిపై ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకుని ముందుకెళ్దామని చెప్పినట్లు తెలిసింది. చేవెళ్ల, మహబూబ్‌గర్ లోక్‌సభ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన నేతలు కూడా మీనాక్షితో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధత గురించి వారితో మాట్లాడినట్టు తెలిసింది. పాలమూరు లోక్‌సభ నియోజకవర్గానికి చెందిన పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడుతూ మంత్రులు తమ నియోజకవర్గాలకు అధిక నిధులు తీసుకెళ్తున్నారని, దీనివల్ల తమకు నష్టం జరుగుతోందని, మంత్రులతో సమానంగా పార్టీ ఎమ్మెల్యేలు ఉన్నచోట్ల కూడా నిధులిచ్చేలా చూడాలని మీనాక్షిని కోరినట్లు తెలిసింది.

దెయ్యాలకు నాయకత్వం వహించిన కేసీఆర్ దేవుడెట్లా అయ్యాడు?: జూపల్లి



మంజూరు పత్రం అందజేస్తున్న మంత్రి జూపల్లి

బాన్సువాడ/కామారెడ్డి టౌన్: దెయ్యాలను పెంచి పోషించిన బీఆర్‌ఎస్ అధినేత దేవుడెట్లా అవుతాడని, దెయ్యాలకు నాయకత్వం వహించినప్పుడు దెయ్యాల నాయకుడే అవుతాడని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం కామారెడ్డి జిల్లా బాన్సువాడలోని వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి నివాసంలో బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాలకు చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. అనంతరం కామారెడ్డిలో నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. గత ఉమ్మడి రాష్ట్రంలో పాలకులు రూ.65 వేల కోట్లు అప్పులు చేస్తే.. నెలకు అప్పటి ప్రభుత్వాలు రూ.600 కోట్ల వడ్డీలు కట్టేవన్నారు. తెలంగాణ ఏర్పడ్డాక పదేళ్లలో కేసీఆర్ రూ.8 లక్షల కోట్ల అప్పు చేయడంతో నెలకు రూ.6,500 కోట్ల వడ్డీని తమ ప్రభుత్వం కట్టాల్సివస్తోందని చెప్పారు. మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో ఆర్టీసీ హైర్ బస్సుల అద్దె చెల్లిస్తున్నామని, పెట్రోల్ బంకులను, సోలార్ పవర్ యూనిట్లను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పిల్లలు మత్తు పదార్థాల వైపు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తగా చూసుకోవాలని మంత్రి సూచించారు.

ఉత్తమ నటుడు అల్లు అర్జున్

▶ మొదటి పేజీ తరువాయి

గెలుచుకున్నాయి. మొత్తం 11 కేటగిరీల్లో 1,248 నామినేషన్లు వచ్చినట్లు జయసుధ తెలిపారు. దాదాపు 14 ఏళ్ల తర్వాత తెలుగు సినిమా అవార్డులను ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. వచ్చేనెల 14వ తేదీన విజేతలకు గద్దర్ అవార్డులను ప్రదానం చేయనున్నారు.

రెండు చిత్రాలకు నాలుగేసి అవార్డులు

గద్దర్ అవార్డుల్లో కల్కి 2898ఏడీ, లక్కీ భాస్కర్ సినిమాలు నాలుగు కేటగిరీల్లో అవార్డులు గెలుచుకున్నాయి. ఉత్తమ చిత్రం, ఉత్తమ స్క్రీన్‌ప్లే, ఉత్తమ ఎడిటింగ్, స్పెషల్‌జ్యూరీ అవార్డులు లక్కీ భాస్కర్ చిత్రానికి దక్కాయి. ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ ఆర్ట్ డైరెక్టర్, ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్ కేటగిరీల్లో కల్కి అవార్డులు గెలుచుకుంది. రజాకార్ సినిమా చారిత్రక విభాగంలో ఫీచర్ హెరిటేజ్ చిత్రం అవార్డుతోపాటు ఉత్తమ సంగీత దర్శకుడు, ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్ విభాగంలో అవార్డులు దక్కించుకుంది. అన్ని కేటగిరీల్లోనూ 2024కు సంబంధించి గద్దర్ సినిమా అవార్డులను ప్రకటించారు. 14 ఏళ్ల తర్వాత ప్రభుత్వం సినిమా అవార్డులు ఇవ్వబోతోందని దిల్ రాజు తెలిపారు. ఎలాంటి ఒత్తిళ్లు, ప్రలోభాలు లేకుండా స్వేచ్ఛగా ఎంపిక జరిగిందని చెప్పారు. పారదర్శకంగా స్క్రీనింగ్ చేసి బెస్ట్ ఆఫ్ బెస్ట్‌ను ఎంపిక చేసినట్లు జయసుధ వివరించారు. 2014, జూన్ నుంచి 2023, డిసెంబర్ వరకు విడుదలైన ఉత్తమ చిత్రాలకు త్వరలో అవార్డులు ఇవ్వనున్నట్లు చెప్పారు. అవార్డులు ఇవ్వడం సంతోషంగా ఉందంటూ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



అవార్డులకు ఎంపికైన వారి జాబితాను జ్యూరీ సభ్యులతో కలిసి మీడియాకు చూపుతున్న జయసుధ, దిల్‌రాజు

చిత్రాల విభాగంలో అవార్డులు

మొదటి ఉత్తమ మొదటి చిత్రం: కల్కి
రెండో ఉత్తమ చిత్రం: పొట్టేల్
ఉత్తమ మూడవ చిత్రం: లక్కీ భాస్కర్
జాతీయ సమైక్యత, మత సామరస్యం, అణగారిన వర్గాల అభ్యున్నతిపై బెస్ట్ ఫీచర్ ఫిల్మ్: కమిటీ కుర్రోళ్లు
ఉత్తమ బాలల చిత్రం: 35 చిన్న కథ కాదు
ఉత్తమ తొలి చిత్ర దర్శకుడు: యదువంశీ (కమిటీ కుర్రోళ్లు)
ఉత్తమ వినోదాత్మక చిత్రం: ఆయ్
చారిత్రక విభాగంలో ఫీచర్ హెరిటేజ్ చిత్రం: రజాకార్

వ్యక్తిగత విభాగంలో అవార్డులు

ఉత్తమ నటుడు: అల్లు అర్జున్ (పుష్ప 2)

స్పెషల్ జ్యూరీ అవార్డులు

దుల్కర్ సల్మాన్ (లక్కీ భాస్కర్), అనన్య నాగళ్ల (పొట్టేల్), సుజిత్, సందీప్ (కేఏ), ప్రశాంత్‌రెడ్డి, రాజేశ్ (రాజు యాదవ్), స్పెషల్ మెన్షన్: ఫరియా అబ్దుల్లా (మత్తు వదలరా–2), తెలుగు సినిమాలపై ఉత్తమ పుస్తకం: మన సినిమా ఫస్ట్ రీల్ (రెంటాల జయదేవ)

ఉత్తమ నటి: నివేదా థామస్ (35 చిన్న కథ కాదు)
ఉత్తమ దర్శకుడు: నాగ్ అశ్విన్ (కల్కి)
ఉత్తమ సహాయ నటుడు: ఎస్‌జే సూర్య (సరిపోదా శనివారం)
ఉత్తమ సహాయ నటి: శరణ్యా ప్రదీప్ (అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్)
ఉత్తమ సంగీత దర్శకుడు: భీమ్స్ (రజాకార్)
ఉత్తమ నేపథ్య గాయకుడు: సిద్ శ్రీరామ్ (ఊరి పేరు భైరవకోన–నిజమే నే చెబుతున్నా..)
ఉత్తమ నేపథ్య గాయని: శ్రేయా ఘోషల్ (పుష్ప 2– సూసేటి అగ్గిరవ్వ)
ఉత్తమ హాస్యనటులు: సత్య, వెన్నెల కిశోర్ (మత్తు వదలరా–2)
ఉత్తమ బాలనటులు: మాస్టర్ అరుణ్ దేవ్ పోతుల (35 ఇది చిన్న కథ కాదు), బేబీ హారిక (మెర్సీ కిల్లింగ్)
ఉత్తమ కథా రచయిత: శివ పాలడుగు (మ్యూజిక్ షాప్ మూర్తి)
ఉత్తమ స్క్రీన్ ప్లే రచయిత: వెంకి అట్లూరి (లక్కీ భాస్కర్)
ఉత్తమ గేయ రచయిత: చంద్రబోస్ (రాజు యాదవ్)
ఉత్తమ సినిమాటోగ్రాఫర్: విశ్వనాథ్ రెడ్డి (గామి)
ఉత్తమ ఎడిటర్: నవీన్ నూలి (లక్కీ భాస్కర్)
ఉత్తమ ఆడియోగ్రాఫర్: అరవింద్ మేనన్ (గామి)
ఉత్తమ కొరియోగ్రాఫర్: గణేశ్ ఆచార్య (దేవర)
ఉత్తమ ఆర్ట్ డైరెక్టర్: నితిన్ జిహానీ చౌదరీ (కల్కి)
ఉత్తమ యాక్షన్ కొరియోగ్రాఫర్: కె. చంద్రశేఖర్ రాథోడ్ (గ్యాంగ్‌స్టర్)
ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్: నల్ల శ్రీను (రజాకార్)
ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్: అర్చనా రావు, అజయ్ కుమార్ (కల్కి)

మంత్రివర్గంలో మాకే స్థానం లేదా?

- అధిష్టానానికి తెలంగాణ కాంగ్రెస్ మాదిగ ఎమ్మెల్యేల ప్రశ్న
- నికార్సయిన మాదిగకే కేబినెట్‌లో చోటు కల్పించాలని డిమాండ్
- అధిష్టానాన్ని కలిసేందుకు ఢిల్లీ వచ్చిన నలుగురు ఎమ్మెల్యేలు



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు

సాక్షి, న్యూఢిల్లీ: 'మంత్రివర్గంలో మాకే స్థానం లేదా?'అని కాంగ్రెస్ అధిష్టానాన్ని ఆ పార్టీకి చెందిన తెలంగాణ మాదిగ సామాజికవర్గ ఎమ్మెల్యేలు ప్రశ్నించారు. త్వరలో జరగబోయే రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో నికార్సయిన మాదిగకే స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్‌ను అధిష్టానం పెద్దలకు వివరించేందుకే ఢిల్లీకి వచ్చినట్లు ఎమ్మెల్యేలు అడ్లూరి లక్ష్మణ్, మందుల సామెల్, కవ్వంపల్లి సత్యనారాయణ, లక్ష్మీకాంతరావు గురువారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు. అడగనిదే అమ్మ అయినా పెట్టదని.. అందుకే మంత్రి పదవులపై అధిష్టానాన్ని అడగాలని తమ సామాజికవర్గం ప్రశ్నిస్తోందన్నారు. తాజా గణాంకాల ప్రకారం రాష్ట్రంలో 60 లక్షల మందికిపైగా మాదిగలం ఉన్నామని... మంత్రివర్గంలో తమ ప్రాతినిధ్యం కూడా ఉండాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ స్పష్టం చేశారు. పార్టీ రాష్ట్ర నాయకత్వం సూచన మేరకే అధిష్టానం పెద్దలను కలవడానికి ఢిల్లీ వచ్చినట్లు మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ వివరించారు. ఆరు కేబినెట్ బెర్తుల్లో ఒకటి మరో మాల సామాజిక వర్గానికి ఇచ్చినా అభ్యంతరం లేదని.. కానీ మాదిగ సామాజిక వర్గానికీ స్థానం కల్పించాలని కోరుతున్నామని.. తాము ఎవరికీ వ్యతిరేకం కాదన్నారు. మాదిగకు మంత్రివర్గంలో చోటు కల్పిస్తే మాదిగ సమాజాన్ని గుర్తించి, గౌరవించినట్లు అవుతుందని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు వ్యాఖ్యానించారు.

క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా మల్లు రవి

▶ మొదటి పేజీ తరువాయి

అవకాశం కల్పించారు. క్రమశిక్షణ చర్యల కమిటీని నాగర్‌కర్నూలు ఎంపీ మల్లు రవి చైర్మన్‌గా, ఎ. శ్యామ్ మోహన్ వైస్ చైర్మన్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలు వెంటనే అమల్లోకి వస్తాయని వేణుగోపాల్ పేర్కొన్నారు. కొత్తగా వర్కింగ్ ప్రెసిడెంట్లను నియమించకుండానే పార్టీ అధిష్టానం వారికి బాధ్యతలు మాత్రం అప్పగించడం గమనార్హం.

రాజకీయ వ్యవహారాల కమిటీ..: మీనాక్షీ నటరాజన్, బి. మహేశ్‌కుమార్‌గౌడ్, ఎ. రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క మల్లు, ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, చల్లా వంశీచంద్‌రెడ్డి, జి.రేణుకాచౌదరి, పోరిక బలరాంనాయక్, డి. శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, డి.అనసూయ (సీతక్క), మొహమ్మద్ అలీ షబ్బీర్, మహ్మద్ అజహరుద్దీన్, ఆది శ్రీనివాస్, వి. శ్రీహరి ముదిరాజ్, బీర్ల ఇల్లయ్య, పి. సుదర్శన్‌రెడ్డి, కె. ప్రేమ్‌సాగర్‌రావు, జెట్టి కుసుమ్‌కుమార్, ఈరవత్రి అనిల్‌కుమార్

ఎక్స్ అఫీషియో సభ్యులు వీరే..: తెలంగాణకు అనుబంధంగా ఉన్న ఏఐసీసీ కార్యదర్శులు, తెలంగాణకు చెందిన ఏఐసీసీ కార్యదర్శులు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు, ఫ్రంటల్ ఆర్గనైజేషన్ల ప్రధాన బాధ్యులు.

ప్రత్యేక ఆహ్వానితులు...: రాష్ట్ర కేబినెట్ మంత్రులు

సలహా కమిటీ..: మీనాక్షీ నటరాజన్, ఎ.రేవంత్‌రెడ్డి, బి. మహేశ్‌కుమార్‌గౌడ్, వి.హనుమంతరావు, కె. జానారెడ్డి, కె. కేశవరావు, మధుయాష్కీగౌడ్, జి. చిన్నారెడ్డి, జె. గీతారెడ్డి, ఎం. అంజన్‌కుమార్ యాదవ్, టి. జయప్రకాశ్‌రెడ్డి, జాఫర్ జావేద్, టి. జీవన్‌రెడ్డి, సిరిసిల్ల రాజయ్య, ఎస్. రాములు నాయక్.

డీలిమిటేషన్ కమిటీ..: చల్లా వంశీచంద్‌రెడ్డి, గద్వాల విజయలక్ష్మి, ఆది శ్రీనివాస్, కవ్వంపల్లి సత్యనారాయణ, డా. శ్రావణ్ కుమార్‌రెడ్డి, పవన్ మల్లాది, డి. వెంకట్‌రమణ

సంవిధాన్ బచావో ప్రోగ్రామ్ కమిటీ..: పి వినయ్‌కుమార్, అద్దంకి దయాకర్, కె. శంకరయ్య, ఎన్. బాలు నాయక్, అరకాల నర్సారెడ్డి, ఆత్రం సుగుణ, రాచమల్ల సిద్ధేశ్వరుడు, సంతోష్ కోల్కొండ, పులి అనిల్‌కుమార్, జూలూరి ధనలక్ష్మి, మజీద్‌ఖాన్, డా. జి. రాములు, అర్జున్‌రావు, సారి, కొల్లం వల్లభరెడ్డి, వేణ్మం శ్రీకాంత్‌రెడ్డి.

క్రమశిక్షణా చర్య కమిటీ...: మల్లు రవి, ఎంపీ (చైర్మన్), ఎ. శ్యామ్‌మోహన్ (వైస్ చైర్మన్), ఎం. నిరంజన్‌రెడ్డి, బి. కమలాకర్‌రావు, జాఫర్ జాయెద్, జీ.వి. రామకృష్ణ.

సాక్షి

శుక్రవారం, 30 మే 2025

స్వీయ విధ్వంసక విధానాలు

మొన్న జనవరి నుంచీ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పాలన చూస్తున్నవారికి రేపో మాపో ఆయన మహాద్భుతమైన నిర్ణయాలు తీసుకుంటారన్న భ్రమలు తొలగిపోయి చాన్నాళ్లయి వుంటుంది. నిన్న మొన్నటి నిర్ణయాల కన్నా ఆయన తాజాగా ప్రకటించిన విధానం ఎంత అధ్వాన్నంగా వున్నదో బేరీజు వేసుకోవటమే ఇప్పుడు మిగిలింది. విద్యార్థుల్నీ, వృత్తిగత నిపుణుల్నీ భయాందోళనల్లో పడేసే బుధవారం నాటి నిర్ణయం ఈ కోవలోనిదే. చదువుల నిమిత్తం జారీచేసే వీసాలకు సంబంధించిన ఇంటర్వ్యూలను తాత్కాలికంగా నిలిపేస్తూ అమెరికా ప్రభుత్వం తీసుకున్న ఆ నిర్ణయం మన దేశం నుంచి వెళ్లదల్చుకున్న లక్షలమంది విద్యార్థుల్ని అయోమయంలోకి నెట్టింది. ఇందులో బిజినెస్ స్కూళ్లలో చదవదల్చుకుని, చేస్తున్న ఉద్యోగాలకు రాజీనామా చేసి ఎదురుచూస్తున్నవారు కూడా వున్నారు. ఇప్పటికే వీసా ఇంటర్వ్యూలకు తేదీలు ఖరారైనవారి పరిస్థితి కొంత మేలు. అక్కడ చదువుకునే యోగంవుందో లేదో ఫలానా తేదీకల్లా తెలిసిపోతుందన్న ఆశయినా వారికుంటుంది. కానీ ఇంటర్వ్యూ కోసం ఎదురుచూస్తున్నవారికి తిరిగి ఆ ప్రక్రియ ఎప్పుడు మొదలవుతుందో... వుంటుందో, వుండదో తెలియదు. ఎంపిక ప్రక్రియకు అనుసరించబోయే నిబంధనలు అన్ని రకాల వారినీ కలవరపరుస్తున్నాయి.

విద్యార్థి వీసాలూ, ఎక్స్చేంజ్ విజిటర్ వీసాల ఇంటర్వ్యూలూ మళ్లీ చెప్పేవరకూ నిలిపేయాలని అమెరికా విదేశాంగ శాఖ తన దౌత్య కార్యాలయాలకూ, కాన్సుల్ కార్యాలయాలకూ ఆదేశాలిచ్చిందన్న కథనాలు గుప్పుమనడంతో అందరూ ఆందోళన పడుతున్నారు. దీనిపై విదేశాంగ శాఖ అరకొర వివరణ ఇచ్చింది. వీసా దరఖాస్తుల స్వీకరణ ఆగదట. వాటి ఇంటర్వ్యూలు ఎప్పుడుంటాయో మాత్రం చెప్పలేదు. క్రమబద్ధంగా సాగే ఇంటర్వ్యూలను ఆపేసి దరఖాస్తుల స్వీకరణ కొనసాగిస్తుంటే అవి ఓ కొలిక్కి వచ్చేందుకు ఎంతకాలం పడుతుంది? ఈ జాప్యం వల్ల యువత విద్యాసంవత్సరం నష్టపోయే ప్రమాదం లేదా? అమెరికాలో మాత్రమే చదవాలనుకున్నవారి సంగతలా వుంచి, అక్కడికెళ్లే అవకాశం రానట్టయితే వేరే దేశంలో ప్రయత్నించాలనుకునేవారి గతేమిటి? అమెరికా సంగతి తేలేసరికి వేరేచోట గడువు ముగిసిపోయే ప్రమాదం లేదా! కుప్పలు తెప్పలుగా వచ్చిపడిన దరఖాస్తులను తాజా నిబంధనలకు అనుగుణంగా జల్లెడ పట్టడానికి ఇప్పుడున్న సిబ్బంది సరిపోతారా? పోనీ అందుకోసం భారీయెత్తున సిబ్బందిని మోహరిస్తారా? వీటికి జవాబు లేదు.


సరిగ్గా వీసా ఇంటర్వ్యూలు నిలిపేయటానికి ముందురోజు అమెరికా ప్రభుత్వం భారతీయ విద్యార్థులకు చేసిన హెచ్చరిక గమనిస్తే అక్కడి వాతావరణం ఏమంత మెరుగ్గా లేదని తెలుస్తుంది. ఇప్పటికే అమెరికాలోని విద్యాసంస్థల్లో చదివేవారు తరగతులు ఎగ్గొట్టినా, మధ్యలో విరమించుకున్నా, ఎంపిక చేసుకున్న ప్రోగ్రాంను చెప్పాపెట్టకుండా వదిలేసినా భవిష్యత్తులో వీసాలకు అర్హత కోల్పోతారన్నది దాని సారాంశం. వేరే దేశానికి పోయినప్పుడు అక్కడి నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాల్సిందే. ఉల్లంఘనలను ఎవరూ సమర్థించరు. అత్యధికులు చదువుల కోసం బ్యాంకు రుణాలు తీసుకుని అక్కడికి వెళ్తారు. మనుగడకు అవసరమైన డబ్బు సంపాదనపై దృష్టి పెడతారు. ఇది నిబంధనలకు విరుద్ధమే కావొచ్చు... కానీ అలాంటి తప్పులకు సైతం 'పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం' మాదిరి ఏకంగా దేశం నుంచి పంపేయటం ఎంతవరకూ సబబు?

దరఖాస్తుదారుల రాజకీయ అభిప్రాయాలేమిటో తెలుసుకునేందుకు వారి సోషల్ మీడియా ఖాతాలు తనిఖీ చేస్తారన్న వార్త చాలామందిని కలవరపరుస్తోంది. ఇన్ని శతాబ్దాల చరిత్రలో విద్యార్థులకుండే రాజకీయాభిప్రాయాల వల్ల అమెరికా నష్టపోయింది లేదు. ఆ యూనివర్సిటీల్లో చదువుకున్న మన ప్రముఖుల్లో మన్మోహన్ సింగ్, సుబ్రహ్మణ్యస్వామి, కపిల్ సిబల్, శశిథరూర్, చిదంబరం, రాహుల్‌గాంధీ, జ్యోతిరాదిత్య సింధియా, మహువా మొయిత్రా, సల్మాన్ ఖుర్షీద్, అఖిలేశ్ యాదవ్, జైరాం రమేష్ తదితరులున్నారు. అనేకమంది పేరెన్నికగన్న పారిశ్రామికవేత్తలు, సాఫ్ట్‌వేర్ రంగ నిపుణులు అక్కడ చదివి అక్కడే సంస్థలు స్థాపించి లక్షలమందికి ఉపాధి కల్పించారు. వారి వల్ల అమెరికా బాగుపడిందేగానీ చెడిందెక్కడ? ఈ చరిత్ర ట్రంప్‌కు తెలిసేదెలా? చెప్పేదెవరు?

చదువులకైనా, ఉద్యోగాలకైనా అమెరికా వైపు చూడటానికి కారణం అక్కడి స్వేచ్ఛాయుత, వైవిధ్యభరిత సంస్కృతి. ప్రామాణిక విద్య లభించటం, విభిన్నంగా ఆలోచించటానికీ, మెరుగైన ప్రాపంచిక దృక్పథం ఏర్పర్చుకోవటానికీ అవకాశం ఉండటం. పర్యవసానంగా ఎక్కువ లాభపడింది అమెరికాయే. ప్రచ్ఛన్నయుద్ధ కాలంలో ఆనాటి సోవియెట్‌పై కావొచ్చు, అనంతరకాలంలో చైనాపై కావొచ్చు మేధారంగంలో పైచేయి సాధించేందుకు ఇవన్నీ తోడ్పడ్డాయి. దేశ ఆర్థిక పురోగతిలో చదువుల కోసం వెళ్లినవారి పాత్ర కీలకం. ఫార్చ్యూన్ 500 కంపెనీల్లో వలస ప్రజలూ లేదా వారి సంతతి నెలకొల్పిన సంస్థల వాటా గణనీయం. ఈ సంస్థలు దేశ ఆర్థిక వ్యవస్థకు ఏటా వందల కోట్ల డాలర్లు ఆర్జించి పెడుతున్నాయి. వీటన్నిటినీ విస్మరించి ట్రంప్ ప్రతిదాన్నీ తలకిందులుగా చూస్తున్నారు. తన ప్రియమైన ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా విశ్వవిద్యాలయాల్లో సాగిన నిరసనోద్యమాలు ఆయనకు ఆగ్రహం తెప్పించినట్టున్నాయి. తప్పుడు నిర్ణయాల వల్ల అంతిమంగా నష్టపోయేది అమెరికాయే. ఇకపై యువత యూరప్ వైపు దృష్టి సారిస్తారు. ఫలితంగా అమెరికా విశ్వవిద్యాలయాల ఆర్జన పడిపోతుంది. ఆ దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుంది. ఊపిరాడనీయని అక్కడి వాతావరణం చివరకు అందరూ ఆ దేశం నుంచి నిష్క్రమించటానికే దారితీస్తుంది.

ఏఐకి విరుగుడు సహజ మేధ

విశ్లేషణ



గోపాలకృష్ణ గాంధీ

మీ వంటింట్లోని పళ్లేలు, గిన్నెలు వాడి వాడి మొహం మొత్తాయా? లేదు కదా! అవి మీకు వారసత్వంగా వచ్చాయి. వాటి మీద ఇప్పటికీ మీ పూర్వీకుల పేర్లు ఉండొచ్చు. ఆ పేర్లు చూసినప్పుడల్లా వారిని స్మరించుకుంటాం. ఆ పాత్రల్లో మన ఆహారపు అలవాట్లు ప్రతిఫలిస్తుంటాయి. ఆ పళ్లేలలో కొన్ని తరాల వారు భోజనాలు చేశారు.

ఇత్తడి గ్లాసులు, రాగి పాత్రలు, గరిటెలు, మసిబారిన కళాయిలు, పెనాలు, పింగాణీ పాత్రలు, పలురకాల చాకులు, కొబ్బరి కోరే పరికరాలు, కాఫీ గింజల మరలు, మజ్జిగ చిలికే కవ్వాలు... వీటిని మీరు ఆప్యాయంగా చూడండి. అంతేకానీ పాత ఇనుప సామాను కింద తీసేయకండి. ఇవన్నీ ఇప్పుడు అంతరించిపోతున్న జీవజాలం కోవలోకి చేరుతున్నాయి. ఆధునికమైన విద్యుత్ పరికరాలు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు వచ్చాయి. తరతరాల స్మృతులను మన ముందు నిలిపే మన సాంప్రదాయిక వంటిల్లు మీద ఇవి దాడి చేస్తున్నాయి.


పాతవైనా పారేసుకోలేనివి!

అలాగే, జీర్ణావస్థకు చేరిన పాత కాటన్ చీరలు, పట్టు చీరలు, ధోతీలు, కుర్తాలు, పైజామాలు, చిల్లులు పడిన స్వెట్టర్లు, మఫ్లర్లు, గ్లవ్స్... వీటిని కూడా పారేయకండి. అన్నీ కాకపోయినా కొన్నింటినైనా దాచుకోండి. అవి పాతబడ్డాయే కానీ చచ్చిపోలేదు. వాటిని మళ్లీ బాగు చేసుకోవచ్చు. దర్జీ ఎక్కడైనా దొరుకుతాడేమో వెతకండి.

వాచీలు, టైమ్ పీస్‌లు, గోడ గడియారాలను కాలం కాటేసింది. వీటిని మెయిన్‌టెయిన్ చేయడం కష్టం. ఎందుకంటే రిపేరు వస్తే స్పేర్ పార్టులు దొరకవు. కంటికి దుర్భిణి పెట్టుకుని పెద్ద పళ్ల చక్రాల్లోపల ఉండే చిన్న చిన్నపళ్ల చక్రాలకు మరమ్మతులు చేసే ఈ రిపేరువాలాలు కాలానికి చలనం తెప్పిస్తారు. గడియారాల పాలిట వీరు కంటి ఆపరేషన్లు చేసే వైద్యుల్లాంటి వారు. వీరి నైపుణ్యం గొప్పగా ఉంటుంది. పాత వాచీలు రిపేర్ చేసే ఇలాంటి వారూ ఇప్పుడు కనుమరుగవుతున్నారు.

పాతకాలపు గడియారాలకు బదులుగా డిజిటల్ 'హారర్స్' వచ్చాయి. ఇవి 8 అనే ఒక్క డిజిటల్ అంకెను రకరకాలుగా మార్చి టైమ్‌ను మన మొహాన కొడతాయి. గంటలకు నిమిషాలకు, నిమిషాలకు సెకన్లకు మధ్య ఒక కోలన్ పెట్టి కాలాన్ని ప్రదర్శిస్తాయి. క్షణం క్షణం మారే ఈ అంకెలు 'మన టైం దగ్గరపడుతోంద'ని చెబుతున్నట్లుగా అనిపిస్తుంది.

ఇక పుస్తకాలు. పాతబడిన కొద్దీ వాటికి విలువ ఎక్కువ. కారణం – అవి గొప్ప రచయితలవి కావడం మాత్రమే కాదు, వాటిలోని అక్షరాలు చదివిన కళ్లు, వాటి పేజీలు తిప్పిన వేళ్లు ఇప్పుడు లేవు. అసంఖ్యాకులైన వాటి పాఠకులు తమ గుండెల్లో ఆనందానుభూతిని పదిలపరుచుకుని మరో ప్రపంచానికి వెళ్లిపోయారు. ఈ పుస్తకాలు రద్దీవాలాల చేతికి వెళ్తే రీసైకిల్ అవుతాయి. శాశ్వతంగా అదృశ్యమవుతాయి. అదృష్టం బావుంటే, కొన్ని సెకండ్ హ్యాండ్ బుక్ షాపులకు చేరతాయి. అక్కడ మాత్రం మీ లాంటి పుస్తక ప్రేమికులు వాటి విలువ గుర్తిస్తారు. అరుదైన పుస్తకాలతో వారు తమ బుక్ షెల్ఫ్‌లను నింపేస్తారు.



సంగీతానిదీ ఇదే పరిస్థితి. స్లో మూవింగ్ రికార్డులు పోయి ఎల్పీలు వచ్చాయి. వాటి స్థానంలో క్యాసెట్లు, క్యాసెట్లు పోయి సీడీలు ప్రత్యక్షమయ్యాయి. ఇప్పుడు ఇవేవీ అక్కర్లేదు. ల్యాప్ టాప్, మొబైల్, లేదంటే బ్లూటూత్ సాధనాలు ఉంటే చాలు. అయితే మీరు పాత పాటల షాపులకు వెళ్లి చూడండి. నిజమైన బీథోవెన్, బాక్, నిజమైన అమిర్ ఖాన్, రవిశంకర్, బేగమ్ అఖ్తర్, ఎంఎస్ సుబ్బులక్ష్మి పాటలు, సంగీతం మీకక్కడ దొరుకుతాయి. అందుకే ఈ ఓల్డ్ మ్యూజిక్ స్టోర్స్ అమూల్యమైనవి. మార్కెట్లో బీథోవెన్ లాంటి లేదా అంతకంటే చక్కగా వినిపించే మ్యూజిక్ దొరకవచ్చు. కానీ అది ఒరిజినల్ కాదు. అలాగే, ఎంఎస్ సంగీతం లభిస్తుంది. కానీ అది నైటింగేల్ ఆఫ్ ఇండియాది కాదు కదా!

అసలైనది వదులుకోవద్దు!

ఈ రియల్, ఒరిజినల్, ట్రూ స్టఫ్‌కు ఇప్పుడు ఇంట్లో చోటెక్కడుందని మీరు అడగొచ్చు. ఒకప్పుడు మనం అనేక గదుల ఇళ్లలో ఉండేవాళ్లం. క్రమంగా చిన్న కుటుంబాలుగా మారుతూ డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్స్‌కు పరిమితం అవుతున్నాం. నిత్యావసరాలకు అవసరమయ్యే సాధారణ ఉపకరణాలు, ఫర్నిచర్‌కే జాగా లేనప్పుడు, లవ్లీగా ఉన్నాయని చెప్పి ఈ పాత వస్తువులను ఎక్కడ దాచుకోవాలి? ఈ ప్రశ్నలో ఔచిత్యం లేకపోలేదు.

ఇక్కడ మీకొక విషయం స్పష్టం చేస్తాను. ఏది 'రియల్' అనేది చెప్పడానికే ఇవన్నీ ప్రస్తావించి కొంత ఆలంకారికంగా చెప్పాను. దీనికి ఇంకొక పదం ఉంది. రియల్‌కు బదులు ఆర్గానిక్ అనవచ్చు. ఆర్గానిక్ అనగానే రసాయనాలు వాడకుండా పండించే పళ్లు, కూరగాయలు, తృణధాన్యాలు అనుకుంటారు. నేను వాడుతున్నది ఆ అర్థంలో కాదు. ఏఐ (కృత్రిమ మేధ) యుగంలో ఆర్గానిక్ అంటే ఏమిటనే దాని గురించి మాట్లాడుతున్నాను. ఏదైతే ఒకరి అంతరాత్మకు వాస్తవం అనిపిస్తుందో అదే ఈ సందర్భంలో ఆర్గానిక్ అవుతుంది.

ఈ ఏఐ కాలంలో... ఆర్గానిక్, వాస్తవ, యథార్థ అంశాలే మన ఎంపిక కావాలి. ఏఐతో ఔషధ, విద్యా రంగాల్లో అద్భుత ప్రయోజనాలు ఉన్న మాట నిజమే. అయినా ఏఐ కావాలా, ఏఐ వద్దా అనేది మనం ఎంచుకోవలసి ఉంటుంది. అయితే, అతి తొందర్లోనే ఈ చర్చ కేవలం ఒక విద్యావిషయికమైందిగా మిగిలిపోతుంది. బదులుగా, ఈ ఏఐ కావాలా, ఆ ఏఐ కావాలా అనేదే తేల్చుకోవలసి ఉంటుంది.

ఏఐని కొత్త దేవుడు అనుకోనవసరం లేదు; అలాగే అపరిమిత జ్ఞానం కోసం దయ్యానికి ఆత్మను అమ్ముకోవాలేమోనన్న భీతి కూడా అనవసరం. ఏఐని ఎక్కడ ఉంచాలో అక్కడే ఉంచాలి. మనకు ఏం కావాలో నిర్ణయించే అధికారం ఏఐకి అప్పగించకూడదు. ఏఐ విషయంలో మన నిర్ణయాలు మనమే తీసుకోవాలి. ఆర్గానిక్ వెర్సస్ ఆర్టిఫిషియల్ అనే చర్చ అంతా, మనం ఏఐకి బాస్ గానే కానీ బానిసగా ఉండకూడదన్న అంశం మీదే! ఏఐ మనకు ఏం అందిస్తుందనేదే తప్ప మనం ఏఐకి ఏం సమర్పించుకుంటామన్నది ప్రశ్న కారాదు.

యుద్ధంలో ఏఐ సునాయాసంగా మూకుమ్మడి విధ్వంసం సృష్టించగలదు. ఈ ప్రళయాన్ని ఎంచుకునే స్వేచ్ఛను మనం ఏఐకి ఇస్తామా? లేదా ఇలాంటి సామూహిక ఆత్మహత్యా సదృశ నిర్ణయం తీసుకోకుండా అడ్డుకునే ఛాయిస్ మన ఆర్గానిక్ మేధకే ఉంటుందా? ఇదే ప్రధానం.

ఆర్టిఫిషియల్‌గా ఉండటం మేధ. ఆర్గానిక్‌గా ఉండటం విజ్ఞత. మనం ఆహారం తినాలి గానీ ఆహారం లాంటిది కాదన్న, అసలైన పానీయాన్నే డ్రింక్ చేయాలి గానీ నురగను కాదన్న వివేచన కలిగి ఉండటమే ఆర్గానిక్ ఇంటెలిజెన్స్.

కృత్రిమ మేధ యుగంలో సహజ మేధతో ఉండటమంటే... మనం చూడని, మనకు తెలియని, మనం ఎంతమాత్రం అదుపు చేయలేని యంత్రం ముందు మోకరిల్లి, అది చెప్పినట్లు ఆడటం కాదు; మనం ఏం చేయాలో ఎంచుకునే అధికారం మనకు ఉండి తీరాలి!

వ్యాసకర్త పశ్చిమ బెంగాల్ మాజీ గవర్నర్, ఆధునిక భారత చరిత్ర విద్యార్థి ('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

- ఇప్పటి ఏఐ రోజుల్లో మనం సహజ మేధతో వ్యవహరించాలి. అంటే ఆధునికంగా ఉండాలి కానీ యంత్రం చెప్పినట్లు ఆడకూడదు.
- ఆర్టిఫిషియల్‌గా ఉండటం మేధ. ఆర్గానిక్‌గా ఉండటం విజ్ఞత! మనం ఆహారం తినాలి గానీ ఆహారం లాంటిది కాదన్న, అసలైన పానీయాన్నే తాగాలి గానీ నురగను కాదన్న వివేచన కలిగి ఉండాలి. అదే ఆర్గానిక్ ఇంటెలిజెన్స్.
- ఏఐని కొత్త దేవుడిలా పూజించాల్సిన అవసరం లేదు. అలాగని దయ్యంలానూ చూడకూడదు. దాన్ని ఎక్కడ ఉంచాలో అక్కడ ఉంచాలి.

సోషల్ మీడియా

నోబెల్ రావాల్సింది!



కెన్యా ప్రసిద్ధ రచయిత గుగి వా థియాంగో చనిపోయారు. ఆయన చాలా కాలంగా అనారోగ్యంగా ఉన్నారు. అయినా దిగ్భ్రాంతి కలిగింది. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి. ఎలాంటి రచయిత! నోబెల్ బహుమానానికి అర్హులు. పోలే సనా(స్వాహిలీ భాషలో 'ఐ యామ్ సారీ').

- ఫియమ్మెతా రోక్కో, ఇంటర్నేషనల్ బుకర్ ప్రైజ్ నిర్వాహకురాలు

వదిలేద్దాం!



నేననుకోవడం కమల్ హాసన్ ఉద్దేశం కన్నడం, తమిళం, తెలుగు, మలయాళం అన్నీ ద్రావిడ భాషలు అని! మనం భాషా వారసత్వాన్నీ, సామ్యాన్నీ పంచుకున్నాం. నిషేధం అంటే మరీ ఎక్కువ కాదా? తప్పటడుగును క్షమించేయొచ్చు!

- రమ్య (దివ్య స్పందన), నటి – మాజీ ఎంపీ

యుద్ధమే లాభమా?



స్టాక్ ధరలను శాంతి పెంచదు; బాంబులు, ఫైటర్ జెట్స్ పెంచుతాయి. ఇటీవలి ఇండియా, పాక్ ఉద్రిక్తతలు రఫేల్ వర్సెస్ జె–10సిల మధ్య తీవ్ర చర్చకు దారితీశాయి. చూస్తుంటే ప్రపంచ ఆయుధ పరిశ్రమకు ఈ ఘర్షణలు మంచి లాభసాటి వ్యాపార సరుకుగా మారినట్టున్నాయి.

- కైలాశ్ సత్యార్థి, నోబెల్ గ్రహీత

ఫోన్ చాలదా?



పదేళ్లుగా ప్రధాని ఎలా ప్రపంచ నాయకులతో సంబంధాలు పెంచుకున్నారో వినుగొచ్చేలా చెప్పారు. అలాంటప్పుడు ఇండియా వైఖరిని వెల్లడించేందుకు ప్రతిపక్ష ప్రతినిధులను ఎందుకు పంపడం? ఫోన్‌లో మాట్లాడితే పోతుందిగా! దేశాధినేతలు ఎటూ ఈ ప్రతినిధి బృందాన్ని కలవరు!

- ఎం.కె. వేణు, సంపాదకుడు

ఎక్కడున్నాం?



ఇది 2025. అయినా ఇంకా మనం పాకిస్తాన్‌లో బాల్య వివాహాలు సరైనవేనా అని చర్చించుకుంటున్నాం. ఎంత సిగ్గుచేటు!

- నిదా కిర్మానీ, పాక్ సోషియాలజిస్ట్

ఇన్ బాక్స్

పెరిగిన ఇమేజ్!

హైదరాబాద్ ప్రపంచ సుందరి పోటీలకు వేదికగా మారడంతో తెలంగాణ ఇమేజ్ ప్రపంచ వ్యాప్తంగా పెరిగిపోయింది. ఏప్రిల్ నెలలో పెట్టుబడులను ఆకర్షించేందుకు అంతర్జాతీయ స్థాయిలో 'భారత్ సమ్మిట్'ను రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాదులో ఘనంగా నిర్వహించింది. దాదాపు వంద



దేశాల నుంచి 400 మంది పైగా ప్రతినిధులు హాజరయ్యారు. తెలంగాణను ప్రత్యక్షంగా చూసిన వీరు ఇక్కడ పెట్టుబడులు పెట్టే అవకాశం ఉంది. ఇప్పుడు 'మిస్ వరల్డ్' పోటీలో పాల్గొంటున్న సుందరీమణులు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకునేందుకు 'తెలంగాణ జరూర్ ఆనా' అనే నినాదంతో నిర్వహించిన ప్రపంచ సుందరీమణుల పర్యటన కార్యక్రమం మనరాష్ట్రం ఓ పెద్ద ప్రపంచ పర్యాటక కేంద్రంగా అవతరించేందుకు వీలు కలిగించింది. ప్రపంచవ్యాప్తంగా 150 దేశాల్లో సుందరీమణుల ఆట పాటలు, పర్యటన విశేషాల ప్రత్యక్ష ప్రసారం... ఆ యా దేశాల పర్యాటకులను ఆకట్టుకునే అవకాశం ఉంది. మిస్ వరల్డ్ పోటీలు రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాలను హైలైట్ చేయడమే కాక స్థానిక ఉత్పత్తులకు మంచి ప్రచారం కలిగించాయి. స్పెయిన్‌కు చెందిన కీమో ఫార్మా వంటి అంతర్జాతీయ సంస్థలు హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలను విస్తరించేందుకు ఆసక్తి చూపడం ఈ సందర్భంగా గమనార్హం. పోటీల సందర్భంగా తెలంగాణ చేనేత వస్త్రాలు, హస్తకళలకు సంబంధించిన ఉత్పత్తుల వాడకం... స్థానిక పరిశ్రమలకు అంతర్జాతీయ మార్కెట్‌ను ఏర్పరచడానికి దోహదం చేస్తుంది.

- జి. లక్ష్మణ్ కుమార్ ׀ సమాచార–పౌర సంబంధాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, కరీంనగర్

'అభివృద్ధి' అంటే అడవుల నరికివేతా?

అభిప్రాయం



ఎన్. వేణుగోపాల్

ఈ వారం అన్ని ప్రధాన స్రవంతి వార్తా పత్రికలూ, ఛానళ్లూ మావోయిస్టు పార్టీ కార్యదర్శి ఎన్‌కౌంటర్ వార్తతో, అనుబంధ వార్తలతో, వ్యాఖ్యా, విశ్లేషణా వ్యాసాలతో నిండిపోయాయి. సామాజిక మాధ్యమాలైతే చెప్పనక్కరలేదు. ఒక సుప్రసిద్ధ ప్రధాన స్రవంతి ఇంగ్లిష్ దినపత్రిక ఆ వార్తను మొదటి పేజీలో ప్రముఖంగా ప్రచురిస్తూ, ఉద్దేశపూర్వకంగానో, అనుద్దేశపూర్వకంగానో ఆ మూడు కాలమ్‌ల వార్తకు పక్కనే మరొక రెండు కాలమ్‌ల వార్త కూడా వేసి... చాలా పెద్దవయ్యాయి గనుక రెండు వార్తలనూ రెండో పేజీలో కూడా పక్కపక్కనే కొనసాగించింది. ఆ రెండు వార్తల మధ్య కార్యకారణ సంబంధం ఉండడం ఆ పత్రిక చెప్పకుండానే చెప్పిన రహస్యం. ఆదివాసుల, మావోయిస్టుల వ్యతిరేకత వల్ల పద్దెనిమిదేళ్లుగా ఆగిపోతున్న ఆ 'అభివృద్ధి' పథకాన్ని కొనసాగించడం గురించి వార్తా, మావోయిస్టు ప్రధాన కార్యదర్శిని చంపివేసిన వార్తా పక్కపక్కనే కలిసి రావడం ఒక తలకిందుల కవితాన్యాయం.

మహారాష్ట్ర లోని మావోయిస్టు ప్రభావిత గడ్చిరోలి జిల్లాలో ఇనుప ఖనిజం శుద్ధి కర్మాగారానికి కేంద్ర ప్రభుత్వ పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ మే 12న అనుమతి ఇచ్చిందనేది ఆ వార్త. ఒకవైపు 'ఆపరేషన్ కగార్' పేరిట ఎడాపెడా ఎన్‌కౌంటర్లు జరుపుతూ ఆదివాసులను భయోత్పాతంలో ముంచుతున్న సందర్భంలోనే ఈ అనుమతి వచ్చిందని ప్రత్యేకంగా గుర్తించాలి. కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వడానికి ముందు మహారాష్ట్ర మంత్రివర్గం గడ్చిరోలీ జిల్లా గనుల తవ్వకపు ప్రాధికార సంస్థను ఏర్పాటు చేసి, కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు కూడా చేసిందని కూడా ఆ వార్తలోనే ఉంది.

మావోయిస్టు నిర్మూలన, ఆదివాసుల తరలింపు అనే ప్రణాళిక దండకారణ్యంలోని ఖనిజ వనరులను కార్పొరేట్లకు అప్పగించడానికే అనే ఆరోపణను నిజం చేస్తూ, ఈ శుద్ధి కర్మాగారం కోసం భారత ప్రభుత్వం 'లాయిడ్ మెటల్స్ అండ్ ఎనర్జీ లిమిటెడ్' అనే బహుళజాతి కార్పొరేట్ సంస్థకు 2,324 ఎకరాల అడవిని ధారాదత్తం చేసింది. ఈ 'అభివృద్ధి' కింద ఒక లక్షా ఇరవై మూడు వేల చెట్లను నరికి వేయడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

నిజానికి ఈ కంపెనీకి ఇక్కడ 2007లోనే ఇరవై సంవత్సరాల లీజు కింద వెయ్యి ఎకరాలు ఇచ్చారు. తర్వాత ఆ లీజు వ్యవధిని మరొక ముప్పై సంవత్సరాలు పెంచారు. అంటే ఆ కంపెనీ ఇక్కడి ఖనిజ వనరులను 2057 వరకూ తవ్వుకుపోవచ్చు. అయితే ఆ ప్రాంతంలో ఆదివాసులు తమ 'జల్, జంగల్, జమీన్'లను కార్పొరేట్లకు ఇవ్వడానికి అంగీకరించబోమని, అలా ఇవ్వడం రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్‌లో, '1996 పంచాయత్ ఎక్స్‌టెన్షన్ టు షెడ్యూల్డ్ ఏరియాస్ చట్టం'లో, '2006 అటవీ హక్కుల చట్టం'లో ఉన్న నిబంధనలకు వ్యతిరేకమని పోరాటం ప్రారంభించారు. ఆ పోరాటానికి మావోయిస్టులు



అండగా నిలిచారు. ఆ కారణం వల్లనో, మరే కారణం వల్లనో లాయిడ్ స్టీల్ కంపెనీ 2016 దాకా తవ్వకాలు ప్రారంభించలేకపోయింది. 2016లో తవ్వకాలు ప్రారంభించినప్పటికీ, ఆదివాసుల, మావోయిస్టుల వ్యతిరేకత మరింత క్రియాశీలంగా మారి 2016 డిసెంబర్‌లో సుర్జాఘర్ గనుల దగ్గర లాయిడ్ కంపెనీకి చెందిన ట్రక్కులను, ఎర్త్ మూవర్లను తగులబెట్టడంతో గనుల తవ్వకం ఆగిపోయింది.

ఇప్పుడు ఆ ఆగిపోయిన గనుల తవ్వకానికి, అదనంగా అక్కడే ఒక శుద్ధి కర్మాగారం పెట్టుకోవడానికి అనుమతు లిచ్చారన్నమాట. ఆ వార్త కూడా సరిగ్గా మావోయిస్టు కార్యదర్శి చనిపోయిన రోజు ప్రకటించారన్నమాట. ఇప్పుడు ఇస్తున్న అనుమతులకు కాగితం మీద కొన్ని షరతులు ఉన్నమాట నిజమే. ఇక్కడ ఒక లక్షా ఇరవై మూడు వేల చెట్లను నరికినందుకు, 2,400 ఎకరాల అడవిని నాశనం చేసినందుకు, అక్కడి నుంచి వెయ్యి కి.మీ. అవతల అరేబియా సముద్ర తీరంలో చిప్లున్, రత్నగిరి ప్రాంతాల్లో సమానమైన విస్తీర్ణంలో మొక్కలు నాటాలని ఒక షరతు ఉంది. ఇటువంటి అడవిని నరికే అనుమతులు పొందిన వారందరికీ అటువంటి షరతులు ఉండడమూ, వాటిని తుంగలో తొక్కి, భయంకరమైన ఉల్లంఘనలను ఆమోదించడమూ దశాబ్దాలుగా యథావిధిగా జరిగిపోతూనే ఉన్నాయి.

ఇలా అడవిని పందారం చెయ్యడం ఆదివాసుల హక్కులకు మాత్రమే కాదు... దేశ సంపదకు, ప్రజల ఆరోగ్యానికి, భద్రతకు, పర్యావరణానికి, భవిష్యత్తుకు తీవ్ర ప్రమాదకరం. ఈ గడ్చిరోలి అడవి మహారాష్ట్రలోకి విస్తరించిన దండకారణ్యంలో భాగం. దండకారణ్యం దేశానికే ఊపిరితిత్తుల వంటిది. అక్కడ ఆ సువిశాలమైన, దట్టమైన అరణ్యాలు ఉండడం వల్లనే దేశంలో జీవవైవిధ్యం మిగిలి ఉంది. అక్కడ పుట్టిన అనేక నదులు దేశంలో, కనీసం మధ్య భారతంలో భూగర్భ జలాలను రక్షిస్తున్నాయి. ఆ అడవి సువిశాల ప్రాంతాలకు ప్రాణవాయువును అందిస్తున్నది. పర్యావరణ రీత్యా ఇంత సుసంపన్నమైన ఈ అడవిలో దాదాపు ముప్పై ఖనిజాలు కోట్లాది టన్నులు నిక్షిప్తమై ఉన్నాయి. ఆ ఖనిజ నిలువలు దేశ సంపద. దాన్ని పొదుపుగా వాడుకుని, భవిష్యత్తరాలకు అందించడం ఈ తరం బాధ్యత. ఐదేళ్ల కోసం అధికారం పొందినవారు యాభై ఏళ్ల భవిష్యత్తును కార్పొరేట్ లాభాపేక్షకు, ఆశ్రితులకు రాసి ఇస్తున్నారు. ఆ సంపద కొల్లగొట్టడానికి అక్కడి నుంచి ఆదివాసులను ఖాళీ చేయించదలచారు. ఆదివాసులకు మద్దతుగా ఉన్న ఉద్యమకారులను నిర్మూలించదలచారు. ఆదివాసుల మీద ప్రభుత్వాలు, కార్పొరేట్లు, మైదాన ప్రాంతవాసులు దాడి చేసి జాతులకు జాతులనే అంతరింపజేసిన చరిత్ర ప్రపంచ వ్యాప్తంగా ఉంది గనుకనే, భారత రాజ్యాంగం ఐదవ, ఆరవ షెడ్యూళ్లలో ఆ ప్రాంతాలకు, ఆ ప్రాంతాలలోని ఆదివాసులకు ప్రత్యేక రక్షణలు కల్పించింది. 'పేసా చట్టం –1996'లో, 'ఎఫ్‌ఆర్ఏ చట్టం –2006'లో ఆ రక్షణలను విస్తరించింది. ఇప్పుడు జరుగుతున్న ఈ అడవుల పందారం ఆ చట్టాలన్నిటి ఉల్లంఘన.

ఇది కేవలం మావోయిస్టుల సమస్యో, ఆదివాసుల సమస్యో కాదు. ఇది ఈ దేశంలో ప్రతి ఒక్కరి సమస్య. ఈ దేశాన్ని ప్రేమించేవారందరి సమస్య.

వ్యాసకర్త 'వీక్షణం' ఎడిటర్

రెండో భగవద్గీత



శ్రీకృష్ణుడు, అర్జునునికి చేసిన రెండవ ప్రబోధం 'అనుగీత.' దీనిని భగవద్గీత సారాంశంగా చెప్పవచ్చు. కురు–పాండవ యుద్ధం తర్వాత ధర్మరాజు రాజ్యపాలన చేస్తూ ఉంటాడు. కృష్ణార్జునులు ఇంద్రప్రస్థపురంలో ఉంటూ నదులు, అడవులు, కొండలలో విహరిస్తూ కబుర్లు చెప్పుకునేవారు. ఒక రోజు కృష్ణునితో అర్జునుడు 'యుద్ధానికి పూనుకున్నప్పుడు నా మనసు కలతచెంది, నేను కుంగిపోయినప్పుడు నువ్వు తత్త్వ బోధకాలైన మహా వాక్యాలను నా మీద కరుణతో బోధించి యుద్ధానికి సిద్ధం చేశావు. అప్పుడు ఆ మాటల సారాంశాన్ని మనసులో పదిలపరుచుకోలేకపోయాను. మరోసారి ఆ తత్త్వోపదేశాన్ని అనుగ్రహించ'మని ప్రార్థించాడు.

యుద్ధ ప్రారంభంలో చెప్పినదే 'భగవద్గీత'. మానవులు పూర్తిగా లౌకిక ప్రపంచంలో మునిగి, సంసార తాపత్రయం నుండి బయటపడలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నప్పుడు అందులో నుంచి బయటపడి తరించటానికి భగవద్గీత 18 మెట్లు చూపిస్తుంది. ఒక్కొక్క మెట్టు అంటే ఒక్కొక్క అధ్యాయం. ఇవి దైవానికి దగ్గర చేస్తాయి. బ్రహ్మ విద్యను తెలిపే గీతా శ్లోకాలను యథాతథంగా పునరుక్తం చేయటం సాధ్యం కాదని తెలిపి, కృష్ణుడు వేరే పద్ధతిలో కొన్ని పాత్రల పరంగా ప్రతిపాదించాడు.

ఇందులో 'బ్రాహ్మణ గీత'లో బ్రాహ్మణుడు, అతని భార్య సంభాషణ ద్వారా బ్రహ్మ విద్యా ప్రబోధకాలైన అంశాలను తెలిపాడు. 'అధ్వర్యు– యతి సంవాదం'లో యజ్ఞాలలో కెల్లా తపోయజ్ఞమే శ్రేష్ఠమని చెప్పాడు. గురు శిష్య సంవాద రూపంలో సత్వ గుణ సహాయంతో రజ స్తమో గుణాలను జయించి, ఈశ్వర సాక్షాత్కారాన్ని పొంది, సత్వాన్ని కూడ విడిచిపెట్టాలని చెప్పాడు. అశ్వమేధ పర్వంలో బోధించిన ఈ 'అనుగీత' గీతా తాత్పర్యమే! ఇది అర్జునునిలో ఆధ్యాత్మిక పరిణామాన్ని కలిగించటానికి ఉద్దేశించినది. ఇది చదివితే, మననం చేస్తే సకల మానవాళిలో ఆధ్యాత్మిక భావ వికాసం పెంపొందుతుంది.

- డా॥ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** శు.చవితి రా.1.28 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** పునర్వసు రా.1.39 వరకు, తదుపరి పుష్యమి, **వర్జ్యం:** ప.1.58 నుండి 3.32 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.05 నుండి 8.56 వరకు, తదుపరి ప.12.21 నుండి 1.12 వరకు, **అమృత ఘడియలు:** రా.11.26 నుండి 1.02 వరకు ; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 5.29, **సూర్యాస్తమయం:** 6.26.

వీడియో కాన్ఫరెన్స్‌లు పనిలేక కాదు..!

- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ఇంత జాప్యమా?
- ఎమ్మెల్యేలతో ఎందుకు సమన్వయం చేసుకోవడం లేదు?
- కలెక్టర్లపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం
- జూన్ 6లోపు లబ్ధిదారుల జాబితా సిద్ధం కావాలని ఆదేశం
- హనుమకొండలో ఉమ్మడి వరంగల్ జిల్లాపై సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి. చిత్రంలో మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్

సాక్షి ప్రతినిధి, వరంగల్: ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారుల ఎంపికలో తీవ్ర జాప్యం జరుగుతుండటంపై రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎమ్మెల్యేలతో ఎందుకు సమన్వయం చేసుకోలేకపోతున్నారని జిల్లాల కలెక్టర్లను నిలదీశారు. అటవీ శాఖ మంత్రి కొండా సురేఖతో కలసి హనుమకొండ కలెక్టరేట్‌లో గురువారం ఆయన ఉమ్మడి వరంగల్ జిల్లాలో ధాన్యం సేకరణ, వ్యవసాయం, వర్షాకాలం ముందస్తు ప్రణాళిక, ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల నిర్వహణపై కలెక్టర్లు, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జూన్ 6 లోపు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తిచేసి ప్రొసీడింగ్స్ ఇవ్వాలని కలెక్టర్లను ఆదేశించారు. 'ముఖ్యమంత్రి, మంత్రులంతా రెగ్యులర్‌గా వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించటం వేరే పనిలేక కాదు. ఇందిరమ్మ ఇళ్లపై ఇప్పటివరకు కనీసం 50 శాతం కూడా లబ్ధిదారుల లిస్ట్ ప్రకటించకపోవడం బాధాకరం. బెనిఫిషరీ లిస్ట్ ఫ్రేమ్ కట్టుకోవడానికి కాదు. లబ్ధిదారుల ఎంపికలో ఎందుకు జాప్యం చేస్తున్నారు? ఒక్కో కలెక్టర్ పరిధిలో ఇద్దరు, ముగ్గురికి మించి ఎమ్మెల్యేలు లేరు. వారితో ఎందుకు సమన్వయం చేసుకోలేకపోతున్నారు? ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ లబ్ధిదారులకు ఇవ్వకుండా మీ దగ్గర పెట్టుకోవడం సరికాదు' అని ఆగ్రహం వ్యక్తంచేశారు.

నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్

వానాకాలం సీజన్ ఆరంభమైన నేపథ్యంలో నకిలీ విత్తనాలు, ఎరువుల విక్రయాన్ని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని పొంగులేటి ఆదేశించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మేవారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 85 శాతం ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. భూముల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి సాదా బైనామా విషయం కోర్టులో ఉందని, కోర్టులకు సెలవులు పూర్తికాగానే ఈ అంశంపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. గ్రామ పాలనాధికారుల పరీక్షలో అర్హత సాధించినవారిని జూన్ 2 నుంచి ఉద్యోగాల్లోకి తీసుకుంటామని వెల్లడించారు. సమావేశంలో ప్రభుత్వ విప్ రామచంద్రు నాయక్, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు మామిడాల యశస్వినిరెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, దొంతి మాధవరెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్‌రెడ్డి, ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు పాల్గొన్నారు.

కాళేశ్వరం నుంచి చుక్కనీరు రాకున్నా...

వరి సాగులో రాష్ట్రం టాప్

- 60 లక్షల ఎకరాలలో 130 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండింది
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కాళేశ్వరం లేకున్నా.. వరి సాగులో దేశంలోనే తెలంగాణ నంబర్ వన్‌గా నిలిచిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం కరీంనగర్ కలెక్టరేట్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా సమీక్షా సమావేశం సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ పండని విధంగా అత్యధికంగా దేశ చరిత్రలోనే తెలంగాణ వరి సాగులో నంబర్‌వన్‌గా నిలిచింది. కాళేశ్వరం సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీ నుంచి చుక్కనీరు రాకున్నా అధికారుల సహకారం, ప్రభుత్వ పకడ్బందీ చర్యల వల్ల అత్యధికంగా వరి సాగైంది. ఈ ఏడాది 28 మే నాటికి యాసంగి పంట కొనుగోలు కోసం రైతులకు దాదాపు రూ.13 వేల కోట్లు చెల్లించాం. గత ప్రభుత్వ హయాంలో ఇదే సమయం 2023 సంవత్సరానికి కేవలం రూ.3,500 కోట్లు మాత్రమే చెల్లించింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో రైతులకు రూ.2,782 కోట్లు చెల్లిస్తే.. 2023లో బీఆర్ఎస్ ప్రభుత్వం .. కేవలం రూ.500 కోట్లు చెల్లించింది' అని చెప్పారు. యాసంగి సీజన్‌లో తెలంగాణ రాష్ట్రంలో 60 లక్షల ఎకరాల్లో 130 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండగా.. భారతదేశంలో ఎక్కడా కూడా ఇంత పెద్దఎత్తున ధాన్యం సాగు జరగలేదని ఉత్తమ్ పేర్కొన్నారు. మేడిగడ్డ ప్రాజెక్టు అంశంలో జ్యుడీషియల్ కమిషన్‌కు నాయకులు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు ఎం.సంజయ్ కుమార్, మేడిపల్లి సత్యం, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.

స్వదేశానికి రండి

ప్రభాకర్‌రావుకు సుప్రీంకోర్టు ఆదేశం

- భారత్‌కు వచ్చిన 3 రోజుల్లోగా విచారణకు హాజరవ్వాలని వెల్లడి
- ఎస్ఐబీ మాజీ చీఫ్ పాస్‌పోర్టు పునరుద్ధరించాలని సిట్‌కు సూచన
- తదుపరి విచారణ వరకు ఆయన్ను అరెస్టు చేయొద్దన్న ధర్మాసనం
- ఆయనను పారిపోయిన వ్యక్తిగా పరిగణించలేమని స్పష్టీకరణ
- ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తదుపరి విచారణ ఆగస్టు 5కు వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో గత ప్రభుత్వ హయాంలో రాజకీయ నాయకులు, హైకోర్టు న్యాయమూర్తుల ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావును భారతదేశానికి తిరిగి రావాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ప్రభాకర్‌రావుపై ఎటువంటి బలవంతపు చర్యలు తీసుకోకూడదని దర్యాప్తు బృందానికి సూచించింది. పాస్‌పోర్టు రద్దు కారణంగా ప్రభాకర్‌రావు స్వదేశానికి తిరిగి రాలేని పరిస్థితుల్లో ఆయనను పారిపోయిన వ్యక్తిగా పరిగణించలేరని స్పష్టం చేసింది. పాస్‌పోర్టు లేదా ప్రయాణ పత్రం అందిన 3 రోజుల్లోపు దేశానికి తిరిగి వస్తాననే హామీ పత్రం ఇవ్వాలని ప్రభాకర్‌రావుకు సూచించింది. ఈ ఆదేశాలను అడ్వాంటేజ్‌గా తీసుకోవద్దని తెలిపింది. తదుపరి విచారణను ఆగస్టు 5కు వాయిదా వేసింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ ప్రభాకర్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. ఆయన తరఫున సీనియర్ న్యాయవాది దామా శేషాద్రినాయుడు వాదించారు.

పాస్‌పోర్టు పునరుద్ధరిస్తే వస్తారు

ముప్పై సంవత్సరాల పాటు ప్రభుత్వ అధికారిగా సేవలందించిన ప్రభాకర్‌రావుపై తప్పుడు కేసులు పెట్టారని శేషాద్రినాయుడు చెప్పారు. ఎఫ్ఐఆర్ సమయంలో ఆయన అమెరికా వెళ్లారని, దీంతో ఆయన్ను పరారీలో ఉన్న నిందితుడిగా ప్రకటించి పాస్‌పోర్టును రద్దు చేశారని తెలిపారు. ఆయన అమెరికా నుంచి తిరిగి వచ్చేందుకు అవకాశం లేకుండా పాస్‌పోర్టును రద్దు చేశారని తెలిపారు. పాస్‌పోర్టు పునరుద్ధరిస్తే భారత్‌కు తిరిగి వస్తారని, విచారణకు సహకరిస్తారని హామీ ఇచ్చారు. ఈ కేసులో ఇప్పటికే పలువురికి బెయిల్ ఇచ్చారన్నారు.

మధ్యంతర రక్షణ ఇవ్వొద్దు : తెలంగాణ ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం చాలా తీవ్రమైనదని, ప్రభాకర్‌రావుకు ఎటువంటి మధ్యంతర రక్షణ ఇవ్వరాదని అన్నారు. ఆయన పరారీలో ఉన్నందున ముందస్తు బెయిల్‌ను రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకిస్తోందని చెప్పారు. ప్రభాకర్‌రావు పరారీలో ఉన్నట్లుగా ప్రకటిస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ముందస్తు బెయిల్ కాకుండా రెగ్యులర్ బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించగా.. పిటిషనర్ తిరిగి వస్తే ఆయనను అరెస్టు చేయబోమని ప్రకటన చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందా అని జస్టిస్ నాగరత్న ప్రశ్నించారు. లేదని, ప్రభాకర్‌రావును అరెస్టు చేయాలని అనుకుంటున్నట్లు తుషార్ మెహతా చెప్పారు. కేసు దర్యాప్తు అధికారి తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా కూడా ప్రభాకర్‌రావుకు ముందస్తు బెయిల్‌ను వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలో జస్టిస్ నాగరత్న జోక్యం చేసుకున్నారు. 'ఆయన భారత్‌కు తిరిగి రాలేని పరిస్థితుల్లో ప్రభాకర్‌రావు చట్టానికి దూరంగా ఉన్నట్టు మీరు చెప్పలేరు. ఆయన పారిపోయిన వ్యక్తి కాదు' అని అన్నారు. వాదనల అనంతరం ప్రభాకర్‌రావు స్వదేశానికి తిరిగి వచ్చేందుకు వీలుగా ఆయన పాస్‌పోర్టును పునరుద్ధరించాలని ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణ వరకు ఆయనను అరెస్టు చేయరాదని ప్రత్యేక దర్యాప్తు బృందానికి తెలిపింది. దేశానికి వచ్చిన మూడు రోజుల వ్యవధిలోనే దర్యాప్తు అధికారి ముందు హాజరు కావాలని ప్రభాకర్‌రావుకు స్పష్టం చేసింది.

.. రూ.5 లక్షల ఘనత మాదే

▶ మొదటి పేజీ తరువాయి

అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకానికి రూ. 22,500కోట్లు మంజూరు చేశామని.. ఏకకాలంలో 3,500 ఇళ్లు మంజూరు చేశామన్నారు. లబ్ధిదారుల ఎంపికలో అనర్హులు ఉన్నట్లు తేలితే బాధ్యులైన గెజిటెడ్ అధికారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వానాకాలం సీజన్ వచ్చినందున నకిలీ విత్తనాలు మార్కెట్‌లోకి రాకుండా చర్యలు చేపట్టడంతోపాటు ఎప్పటికప్పుడు రైతులకు అవగాహన కల్పించాలని భట్టి సూచించారు. సాదాబైనామా దరఖాస్తుల్లో కొన్ని ప్రభుత్వ భూములకు సంబంధించి ఉన్న వాటిని తక్షణమే తిరస్కరించాలన్నారు. కోర్టు స్టే తొలగిన వెంటనే అర్హత ఉన్న సాదా బైనామా దరఖాస్తులను పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. వచ్చే నెల 3 నుంచి 20 వరకు అన్ని రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు టోకెన్ ద్వారా ఉచితంగా ఇసుక సరఫరా చేయాలని చెప్పారు. ఈ సమీక్షలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్లు ముజమ్మిల్‌ఖాన్, జితేష్ వి.పాటిల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపికలో ఎమ్మెల్యేలకు ప్రాధాన్యత తగ్గించాలి: కూనంనేని

ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో ఎమ్మెల్యేలకు ప్రాధాన్యత తగ్గించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సూచించారు. తద్వారా అర్హులెవరికీ అన్యాయం జరగదన్నారు. అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తూనే ఇందిరమ్మ కమిటీలు, అధికారుల పనితీరు పారదర్శకంగా ఉండేలా చూడాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు.

యూట్యూబర్ బయ్యా సన్నీ అరెస్టు కలకలం

- స్వస్థలం సూర్యాపేట జిల్లా నూతనకల్‌లో చర్చ
- ఇటీవలే పాకిస్తాన్ నుంచి నూతనకల్ వచ్చిన సన్నీ



సూర్యాపేటటౌన్, నూతనకల్: యూట్యూబ్ వ్లాగర్, బైక్ రైడర్ బయ్యా సన్నీయాదవ్‌ను నేషనల్ ఇన్వెస్టిగేటింగ్ ఏజెన్సీ (ఎన్ఐఏ) అరెస్టు చేసినట్లు జరుగుతున్న ప్రచారంతో ఆయన స్వస్థలం సూర్యాపేట జిల్లా నూతనకల్‌లో కలకలం సృష్టించింది. సన్నీయాదవ్ ఇటీవల పాకిస్తాన్‌లో పర్యటించి.. తన యూట్యూబ్ చానల్‌లో ఆ పర్యటనకు సంబంధించిన బైక్ రైడింగ్ వీడియోలను పోస్ట్ చేశాడు. ఆ వీడియోలపై ఇటీవల ఓ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో చెన్నైలో సన్నీయాదవ్‌ను ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకొని ఢిల్లీకి తరలించినట్లు ప్రచారం జరుగుతోంది. పాకిస్తాన్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ కొంతమంది భారత సోషల్‌మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను తన వేగులుగా మార్చుకోవటంతో వారిని భారత దర్యాప్తు సంస్థలు ఇటీవల అరెస్టు చేశాయి. ఈ కోణంలోనే సన్నీయాదవ్‌ను కూడా ప్రశ్నిస్తున్నట్లు చెబుతున్నారు. బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసినందుకు ఆయనపై మార్చి 22న నూతనకల్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో అతడికి బెయిల్ లభించింది. కొద్దిరోజుల క్రితం నూతనకల్ వచ్చి.. ఇటీవల తన స్నేహితుడిని కలిసేందుకు చెన్నై వెళ్లాడు. అక్కడే ఎన్ఐఏ అతడిని అదుపులోకి తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే, ఈ విషయం తమకు తెలియదని సన్నీ కుటుంబసభ్యులు తెలిపారు.

మూగజీవాల మృత్యుఘోష

- విద్యుదాఘాతంతో 11 పశువుల మృతి



చిన్న ముప్పారంలో మృత్యువాత పడిన పాడి గేదెలు

నెల్లికుదురు/చిట్యాల: వేర్వేరు జిల్లాల్లో విద్యుదాఘాతంతో 11 పశువులు మృతి చెందాయి. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం చిన్నముప్పారం గ్రామానికి చెందిన కాలేరు దేవేందర్‌కు చెందిన 2, కాలేరు చిన్న దేవేందర్‌ది 1, కాలేరు భాస్కర్‌ది 1, కాలేరు రాజశేఖర్‌ది 1, కాలేరు శివాజీది 1, కాలేరు రాజుది 1, కాలేరు రమేశ్‌ది ఒక గేదె.. మొత్తం 8 గేదెలను ఉదయం పాలు తీసి మేత కోసం వదిలిపెట్టారు. గ్రామ పరిధిలో వ్యవసాయ భూముల్లో మేత మేస్తూ వెళ్తున్న గేదెలు.. అంతకు ముందే గాలివానకు తెగి పడిన విద్యుత్ తీగలను తాకాయి. దీంతో విద్యుదాఘాతానికి గురై మొత్తం 8 పాడి గేదెలు మృతి చెందాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం గిద్దెముత్తారం గ్రామంలో గురువారం పంచిక కొంరయ్యకు చెందిన పాడిగేదె మేతకు వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్ తీగ తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.50 వేలుంటుందని రైతు కొంరయ్య తెలిపాడు. కుమ్మరిపల్లి గ్రామంలో బిక్కనూరి సుదర్శన్‌కు చెందిన ఒక ఆవు, ఒక ఎద్దు గ్రామ శివారులో మేత కోసం వెళ్లి విద్యుదాఘాతంతో చనిపోయాయి. వాటి విలువ సుమారు రూ.1.2 లక్షల వరకు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

నీటిగుంతలో పడి ఇద్దరు చిన్నారుల మృతి

- కాళ్లు కడుక్కునేందుకు వెళ్లి జారిపడి దుర్మరణం
- వికారాబాద్ జిల్లా దోమ మండలం గుండాలలో విషాదం



శివతేజ్, మహేశ్

దోమ: ఆడుకునేందుకు వెళ్లిన ఇద్దరు చిన్నారులు నీటి గుంతలో పడి మృతిచెందారు. వికారాబాద్ జిల్లా దోమ మండలం గుండాలలో గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గొల్ల ఈశ్వప్ప, అనిత దంపతుల చిన్న కుమారుడు మహేశ్ (11), వెంకటయ్య, పద్మమ్మ దంపతుల ఏకైక కుమారుడు శివతేజ్ (11) స్నేహితులు. వీరిద్దరూ స్థానిక పాఠశాలలో ఐదో తరగతి పూర్తిచేశారు. శివతేజ్ బంధువైన నారాయణపేట జిల్లా గుండుమాల్‌కు చెందిన గోవర్ధన్ (10) ఇటీవల గుండాలకు వచ్చాడు. గురువారం ఈ ముగ్గురు కలిసి ఆడుకునేందుకు బయటకు వెళ్లారు. ఆడుకుంటుండగా కాళ్లకు బురద అంటుకోవటంతో కడుక్కునేందుకు సమీపంలోని వ్యవసాయ పొలంలో ఉన్న నీటి గుంత వద్దకు వెళ్లారు. కడుక్కుంటుండగా కాలుజారి శివతేజ్ గుంతలో పడిపోయాడు. స్నేహితుడిని కాపాడే క్రమంలో మహేశ్ సైతం గుంతలో పడ్డాడు. దీంతో భయపడిన గోవర్ధన్ గ్రామస్తులకు విషయం చెప్పాడు. వారు వచ్చేసరికి ఇద్దరు చిన్నారులు నీట మునిగి చనిపోయారు. తమ కుమారుల మరణంతో వారి తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. ఈ ఘటనతో గుండాలలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ట్రంప్ టారిఫ్‌లకు బ్రేక్

అదనపు టారిఫ్‌లను నిలుపుదలచేస్తూ అమెరికా ఫెడరల్ కోర్టు సంచలన తీర్పు

- అంతర్జాతీయ వాణిజ్య వ్యవహారాల కోర్టులో ట్రంప్‌కు భారీ ఎదురుదెబ్బ
- హద్దు మీరి అధికారాలను వాడారని ట్రంప్‌ను తిట్టిపోసిన న్యాయస్థానం
- ట్రంప్ వాణిజ్యయుద్ధంలో కీలక మలుపు
- చైనా, మెక్సికో, కెనడా, భారత్‌లకు భారీ ఊరట దక్కే అవకాశం
- హైకోర్టులో తీర్పును సవాల్‌చేసిన ట్రంప్ సర్కార్

వాషింగ్టన్: సర్వంసహాధిపత్యం కోసం ప్రపంచదేశాలపై టారిఫ్‌ల కొరడాను ఝుళిపిస్తున్న అగ్రరాజ్యాధినేత ట్రంప్‌కు అమెరికా ఫెడరల్ కోర్టు పగ్గాలువేసింది. యుద్ధంలాంటి అసాధారణ పరిస్థితులులేకపోయినా ఇష్టారీతిగా ప్రపంచదేశాలపై అధిక టారిఫ్‌ల భారం మోపడం చట్టప్రకారం కుదరని న్యూయార్క్ కేంద్రంగా పనిచేసే మన్‌హాట్టన్ 'యూఎస్ కోర్ట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రేడ్' స్పష్టం చేసింది. ట్రంప్ వివిధ దేశాలపై అధిక టారిఫ్‌లు విధిస్తూ తీసుకున్న నిర్ణయాలను నిలుపుదలచేస్తూ జడ్జీలు తిమోథీ రెయిఫ్, జేన్ రెస్తానీ, గ్యారీ కట్జ్‌మన్‌ల ధర్మాసనం బుధవారం రాత్రి సంచలనాత్మక తీర్పును వెలువరించింది. విమోచనం దినం అంటూ దేశ చట్టాలను ట్రంప్ తన పరిధిదాటి ప్రయోగించారని న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. 10 రోజుల్లోపు తీర్పులోని అంశాలను సంపూర్ణంగా అమలుచేయాలని ట్రంప్ యంత్రాంగానికి న్యాయస్థానం సూచించింది. దీంతో చైనాపై 30 శాతం అదనపు టారిఫ్, మెక్సికో, కెనడాలపై 25 శాతం టారిఫ్ అమలు నిలిచిపోనుంది. అయితే వాణిజ్య విస్తరణ చట్టంలోని సెక్షన్ 232 ప్రకారం కార్లు, ఆటోరంగ విడిభాగాలు, స్టీల్, అల్యూమినియం తదితరాలపై విధించిన 25 శాతం టారిఫ్ మాత్రం కొనసాగనుంది.

కోర్టు తీర్పులో ఏముంది?

''1977నాటి అంతర్జాతీయ అత్యయిక ఆర్థిక అధికారాల (ఐఈఈపీఏ) చట్టం ప్రకారం తనకు దఖలుపడిన అధికారాలను మించి మరీ అధ్యక్షుడు ట్రంప్ ప్రపంచదేశాలపై అధిక టారిఫ్‌లను విధిస్తూ నిర్ణయాలు తీసుకున్నారు. జాతీయ భద్రతకు ముప్పు వంటి అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే అత్యయిక అధికారాలను ప్రయోగించాలి. వాస్తవానికి అత్యయిక అధికారాలను టారిఫ్‌ల కోసం ఉపయోగించకూడదు. వాణిజ్యలోటు అనేది ఏరకంగానూ అత్యయిక స్థితి అనిపించుకోదు. ప్రపంచదేశాల మాదిరిగానే అమెరికా సైతం గత 49 సంవత్సరాలుగా వరసగా వాణిజ్యలోటును చవిచూస్తోంది. హఠాత్తుగా వాణిజ్యలోటును సాకుగా చూపి అత్యయిక అధికారాలను ఇలా టారిఫ్‌ల విధింపు కోసం దుర్వినియోగం చేయకూడదు. అత్యయిక అధికారాలను అధ్యక్షుడు ఏకపక్షంగా తీసుకోకూడదు. అపరిమితంగా టారిఫ్‌ల విధింపు


ట్రంప్

అధికారాన్ని ప్రదర్శించి అధ్యక్షుడు రాజ్యాంగంలోని ఇతర ప్రధానాంగాల అధికారాన్ని ఉద్దేశపూర్వకంగా లాక్కున్నారు. ఇది రాజ్యాంగవిరుద్ధం. అధ్యక్షుడి ధోరణి మేం ఏమాత్రం అనుమతించబోం. ఆర్థిక సంక్షోభాలొచ్చినా అధ్యక్షుడు రాజ్యాంగానికి లోబడే నిర్ణయాలు తీసుకోవాలి. ఏప్రిల్ రెండో తేదీన అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయాలను నిలుపుదలచేస్తున్నాం'' అని న్యాయమూర్తులు స్పష్టంచేశారు.

ప్రభుత్వ వాదనలు బుట్టదాఖలు

విదేశాలకు తరలిపోయిన ఫ్యాక్టరీలు, కంపెనీల్లో ఉద్యోగాలను తిరిగి అమెరికాకు రప్పించేందుకే టారిఫ్‌ల అస్త్రాన్ని వాడుకున్నట్లు పదేపదే ట్రంప్ యంత్రాంగం చేసిన వాదనను కోర్టు పరిగణనలోకి తీసుకోలేదు. దేశ వాణిజ్యలోటు జాతీయ అత్యయిక స్థితిగా తయారవడంతో అమెరికాకు అనుకూలంగా వాణిజ్య నిర్ణయాలు తీసుకునేలా ఆయా దేశాలను భయపెట్టేందుకు, ఒప్పించేందుకు టారిఫ్‌ల ఆయుధాన్ని ఉపయోగించామని ప్రభుత్వంచేసిన వాదనను న్యాయస్థానం పట్టించుకోలేదు. 1971లోనూ నాటి అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ ఇలా టారిఫ్‌లపై అత్యయిక అధికారాలను ఉపయోగించారు. ఈ అధికారాలను సవాల్‌చేసే అధికారం కోర్టులకు లేదని, కేవలం పార్లమెంట్ మాత్రమే ప్రశ్నించగలదని ట్రంప్ సర్కార్ చేసిన వాదనను కోర్టు తిరస్కరించింది. తీర్పు తర్వాత వైట్‌హౌస్ అధికార ప్రతినిధి కుశ్ దేశాయ్ మాట్లాడారు. ''వాణిజ్యలోటు వంటి ఎమర్జెన్సీ పరిస్థితిని ఎలా చక్కబెట్టాలో నిర్ణయించాల్సింది ఇలాంటి జడ్జీలుకాదు. అదనపు పన్నులు విధించేందుకు ప్రభుత్వం తనకున్న ఏ ఒక్క అవకాశాన్నీ వదులుకోదు. ఎలాగైనా పన్నులు కొనసాగేలా చేసి దేశ వాణిజ్యలోటును తగ్గిస్తాం. మళ్లీ అమెరికాను గొప్పదానిలా మారుస్తాం'' అని అన్నారు. అయితే కోర్టు తీర్పును గౌరవించి ట్రంప్ ప్రభుత్వం ఈ కొత్త టారిఫ్‌ల అమలును నిలుపుదల చేస్తుందా లేదా అనేది తేలాల్సి ఉంది. తీర్పును వెనువెంటనే ప్రభుత్వం వాషింగ్టన్ డీసీలోని 'యూఎస్ కోర్ట్ ఆఫ్ అప్పీల్స్ ఫర్ ది ఫెడరల్ సర్క్యూట్' కోర్టులో సవాల్‌చేసింది. బుధవారం తీర్పు చెప్పిన జడ్జీ తిమోథీని ట్రంప్, జడ్జీ రెస్తానీని నాటి అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్, జడ్జీ గ్యారీని నాటి అధ్యక్షుడు బరాక్ ఒబామా నియమించారు.

ప్రభుత్వం ఇప్పుడేం చేయొచ్చు?

తీర్పు అమలుకు కోర్టు 10 రోజుల గడువు ఇచ్చినందున ఈలోపు హైకోర్టులో కేసు వాదనకు వచ్చేలాచేసి తీర్పు అమలుకాకుండా నిలుపుదల కోరొచ్చు. లేదంటే ఇప్పటికే అదనంగా వసూలుచేసిన టారిఫ్‌లను అమెరికా తిరిగి ఆయా దేశాలకు వడ్డీ కలిపిమరీ ఇచ్చేయాల్సి ఉంటుంది. తీర్పులో ట్రంప్ ప్రభుత్వానికి ఒక వెసులుబాటు ఇచ్చింది. నిజంగానే దేశం అత్యంత క్లిష్టమైన వాణిజ్యలోటును ఎదుర్కొంటుంటే 1974నాటి వాణిజ్యచట్టంలోని సెక్షన్ 122 ప్రకారం అధ్యక్షుడు తనకు దఖలు పడిన అసాధారణ అధికారాలతో విదేశాలపై 15 శాతం వరకు అదనపు టారిఫ్‌లు విధంచవచ్చు. అయితే అవి తాత్కాలికమే. గరిష్ఠంగా 150 రోజులపాటు మాత్రమే ఈ అదనపు టారిఫ్‌లు అమలవుతాయి. 1977నాటి అంతర్జాతీయ అత్యయిక ఆర్థిక అధికారాల చట్టం పాచిక పారని కారణంగా ఈసారి వాణిజ్య చట్టం,1974 సెక్షన్ కింద టారిఫ్‌లు విధించాలని ట్రంప్ కొత్త ఎత్తుగడ వేయనున్నట్లు తెలుస్తోంది.

సుప్రీంలో కొత్తగా ముగ్గురు జడ్జీలు

న్యూఢిల్లీ: అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో గురువారం కొత్తగా ముగ్గురు న్యాయమూర్తులు నియమితులయ్యారు. సుప్రీం కొలీజియం సోమవారం సిఫారసు చేసిన కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ఎన్‌వీ అంజరియా, గౌహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ విజయ్ బిష్ణోయ్, బాంబే హైకోర్టు జస్టిస్ ఏఎస్ చందూర్కర్ వీరిలో ఉన్నారు. ఈ విషయాన్ని న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మెఘ్వాల్ గురువారం 'ఎక్స్'లో ప్రకటించారు. భారత రాజ్యాంగాన్ని అనుసరించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో సంప్రదించిన మీదట ఈ నియామకాలు చేపట్టారని ఆయన పేర్కొన్నారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ హృషికేశ్ రాయ్‌లు ఇటీవల పదవీ విరమణ చేయడంతో ఈ నియామకాలు జరిగినట్లు మంత్రి వివరించారు. తాజాగా నియమితులైన ముగ్గురు జడ్జీలు ప్రమాణం శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. దీంతో, సుప్రీంకోర్టులో మంజూరైన మొత్తం 34 మందీ ఉన్నట్లు లెక్క. అయితే, ఇది స్వల్ప కాలం మాత్రమే. జూన్ 9వ తేదీన జస్టిస్ బేలా ఎం త్రివేదీ పదవీ విరమణ చేయనుండటమే ఇందుకు కారణం.

దోస్తానా ముగిసింది!



మస్క్

- డోజ్ నుంచి వైదొలిగిన మస్క్
- పదవీ విరమణకు రెండు రోజుల ముందే రాజీనామా
- టెస్లా, స్పేస్‌ఎక్స్‌లపైనే దృష్టి పెడతానని వెల్లడించిన మస్క్
- ట్రంప్‌తో సంబంధాలు దెబ్బతినడమే ప్రధాన కారణం

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్‌ల స్నేహానికి ఎండ్ కార్డ్ పడిందా? అవుననే అనిపిస్తోంది. 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' నినాదంతో 300 మిలియన్‌డాలర్లకు పైగా నిధులు సమకూర్చి ట్రంప్‌ను రెండోసారి అధికారంలోకి తీసుకొచ్చిన మస్క్.. ప్రభుత్వ బాధ్యతల నుంచి వైదొలిగారు. అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియెన్సీ (డోజ్) నుంచి ఆయన తప్పుకున్నారు. ప్రభుత్వంలో తన షెడ్యూల్ ముగిసిందని ప్రకటించారు. వృథా ఖర్చులను తగ్గించే అవకాశం ఇచ్చినందుకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు మస్క్ కృతజ్ఞతలు తెలిపారు. ఇకపై తన దృష్టి అంతా టెస్లా, స్పేస్‌ఎక్స్‌లపైనే కేంద్రీకరిస్తానని మస్క్ స్పష్టం చేశారు. అయితే.. సమాఖ్య ప్రభుత్వాన్ని ప్రక్షాళన చేయడానికి, పునర్నిర్మించడానికి డోజ్ చేస్తున్న ప్రయత్నాలు కొనసాగుతాయని వైట్ హౌస్ పేర్కొంది. ప్రత్యేక ప్రభుత్వ ఉద్యోగిగా ఆయన 130 రోజుల పదవీకాలం మే 30వ తేదీతో ముగియనుండగా.. ముందుగానే ఆయన రాజీనామా చేశారు. ట్రంప్‌తో సంబంధాలు దెబ్బతినడమే దీనికి కారణమని తెలుస్తోంది.

'ప్రత్యేక వ్యక్తి, సూపర్ జీనియస్, ఫస్ట్ ఫ్రెండ్, దేశభక్తుడు'... డోజ్ బాధ్యతలు చేపట్టక ముందునుంచే మస్క్‌ను ప్రశంసించడానికి ట్రంప్ ఉపయోగించిన పదాలివి. అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన దగ్గర నుంచి ఫిబ్రవరి వరకు అవకాశం దొరికిన ప్రతిచోటా మస్క్‌ను పొగడ్తలతో ముంచెత్తిన ట్రంప్.. మార్చినుంచి కొంత తగ్గించారు. వివాదాస్పద నిర్ణయాలతో వరసబెట్టి కార్యనిర్వాహక ఉత్తర్వులిస్తున్న డొనాల్డ్ ట్రంప్‌కు కుడిభుజంగా ఉండి.. వేలమంది కేంద్ర ప్రభుత్వోద్యోగులను మస్క్ సాగనంపడం, వేలకోట్ల విలువైన ప్రభుత్వ ఒప్పందాలు, కాంట్రాక్టులను రద్దుచేయడం తెలిసిందే. ఇక్కడివరకూ బాగానే ఉన్నా.. ఇటీవలి వైట్‌హౌస్ కార్యకలాపాలు మస్క్, ట్రంప్‌ల మధ్య చీలికలు తెచ్చాయి. అందులో ప్రధానమైనది దేశీయ విధాన బిల్లు. ట్రంప్ కొనియాడిన ఈ బిల్లును మస్క్ బహిరంగంగా విమర్శించారు. ట్రిలియన్ డాలర్ల పన్ను మినహాయింపులవల్ల ప్రభుత్వ ఖర్చులు పెరుగుతాయని మస్క్ తెలిపారు. నిధులు తగ్గించే డోజ్ పనికి ఇది విరుద్ధంగా ఉందని వ్యాఖ్యానించారు.

వ్యాపార ప్రయోజనాలకు దెబ్బ..

అయితే బిల్లు మస్క్ వ్యాపార ప్రయోజనాలపై ప్రత్యక్ష ప్రభావం చూపడమే ప్రధాన కారణం. మస్క్ సంస్థ టెస్లా ఎలక్ట్రిక్ వాహనాలకు 7,500 డాలర్ల పన్ను మినహాయింపును తొలగిస్తుంది. అంతేకాదు.. అదనంగా ప్రతిపాదించిన వార్షిక ఈవీ రిజిస్ట్రేషన్ రుసుము అతని ఎలక్ట్రిక్ కార్ల కంపెనీపై మరింత ప్రభావం చూపే అవకాశం ఉంది. మస్క్ అమెరికా ప్రభుత్వంలోని డోజ్ సారథ్య బాధ్యతలు తీసుకున్న తరువాత.. ఉద్యోగాల నుంచి తొలగింపు, నిధుల కోతలపై ఆగ్రహంతో ఉద్యోగులతో పాటు పలువురు టెస్లా బహిష్కరణకు పిలుపునివ్వడం తెలిసిందే. డోజ్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు జరిగాయి. అనేకచోట్ల వాహనాలు, ఛార్జింగ్ స్టేషన్ల విధ్వంసం జరిగింది. దీంతో 2025 మొదటి త్రైమాసికంలో టెస్లా అమ్మకాలు 13% తగ్గాయి. దీంతో మొదటి త్రైమాసిక లాభాలు 71% తగ్గాయి.

కేబినెట్‌తో ఉద్రిక్తతలు..

నిజానికి ట్రంప్ కేబినెట్‌కు మస్క్ మధ్య ఉద్రిక్తతలు చాలా కాలంగా కొనసాగుతున్నాయి. మార్చిలో లక్షలాది మంది ఫెడరల్ ఉద్యోగులకు మస్క్ ఇమెయిల్ పంపడాన్ని ఎఫ్‌బీఐ, స్టేట్ డిపార్ట్‌మెంట్, పెంటగాన్ విభేదించాయి. మస్క్ తన అధికారాన్ని అతిక్రమిస్తున్నారని, ఇమెయిల్‌కు సమాధానం ఇవ్వవద్దని తమ ఉద్యోగులకు సూచించాయి. ఆ తరువాత విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో, మస్క్‌ల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ ఘటనలతో ట్రంప్, మస్క్ మధ్య అంతరం పెరిగింది. ఈ సంక్షోభం ఉన్నప్పటికీ ఫెడరల్ ఖర్చులను 2 ట్రిలియన్ డాలర్ల నుంచి 150 బిలియన్లకు తగ్గించారు. ట్రంప్ నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకున్నాకే డోజ్ సారథ్యం నుంచి నిష్క్రమించబోతున్నానని మస్క్ చెప్పుకొచ్చినా.. ప్రభుత్వంలో ఎదురైనా చేదు అనుభవాలు మస్క్‌ను ఇబ్బంది పెట్టాయి.

మేల్కొనేలోపే మెరుపుదాడి చేసింది

భారతదాడి వివరాలను వెల్లడించిన పాక్ ప్రధాని

లాచిన్(అజర్‌బైజాన్): భారత్ ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా చేసిన వైమానిక దాడులకు దీటుగా స్పందించేలోపే భారత్ మళ్లీ క్షిపణులతో విరుచుకుపడుతుందని తాము ఊహించలేదని పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఒప్పుకున్నారు. అజర్‌బైజాన్ దేశంలో పర్యటిస్తున్న షెహబాజ్ గురువారం లాచిన్ సిటీలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొని ఆపరేషన్ సిందూర్ సంగతులను అందరితో పంచుకున్నారు. ''ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత్ చేసిన దాడులకు స్పందనగా ప్రతీకార దాడులతో తెగబడాలని నిర్ణయించాం. మే 9వ తేదీ అర్ధరాత్రి దాటాక ఇందుకు ప్రణాళిక సిద్ధంచేశాం. తెల్లవారుజామున 4.30 గంటలకు ఫజర్ ప్రార్థనల తర్వాత దాడి చేయాలని భావించాం. కానీ ఆలోపే భారత్ బ్రహ్మోస్ క్షిపణుల వర్షం కురిపించింది. వేర్వేరు ప్రావిన్సుల్లోని వైమానిక స్థావరాలపై క్షిపణిదాడులు జరిగాయి. రావల్పిండిలోని ఎయిర్‌పోర్ట్ సైతం దాడులకు ధ్వంసమైంది'' అని షెహబాజ్ చెప్పారు. పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ ఎదుటే ఈ దాడుల అంశాన్ని షెహబాజ్ ప్రస్తావించడం గమనార్హం. రావల్పిండిలోని నూర్‌ఖాన్ వైమానిక స్థావరం మీదా భారత్ క్షిపణులను ప్రయోగించింది. ఈ స్థావరం పాకిస్తాన్ ఆర్మీ ప్రధాన కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉంటుంది. ఇక్కడ అత్యంత అధునాతన లాక్‌హీడ్ సీ-130 హెర్క్యులస్, ల్యూషిన్ ||-78 ఇంధనం నింపే విమానాలు ఉన్నాయి.

ఆపరేషన్ సిందూర్ ఆగదు

- ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టీకరణ
- ఉగ్రవాదులకు, కుట్రదారులకు గుణపాఠం నేర్పడం ఖాయం
- ముష్కర మూకలను కోలుకోలేని రీతిలో దెబ్బకొడతామని హెచ్చరిక

గాంగ్‌టక్/అలీపూర్‌ద్వార్: ఉగ్రవాదులకు, వారి వెనుక ఉన్న అసలైన కుట్రదారులకు తగిన గుణపాఠం నేర్పడానికి ప్రారంభించిన ఆపరేషన్ సిందూర్ ఆగదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోసారి తేల్చిచెప్పారు. ముష్కర మూకలను కోలుకోలేని రీతిలో దెబ్బకొట్టడం ఖాయమని అన్నారు. భారత్‌కు వ్యతిరేకంగా ఉగ్రవాదాన్ని ఎగదోస్తే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని తీవ్రంగా హెచ్చరించారు. ప్రధాని మోదీ గురువారం సిక్కిం రాష్ట్ర 50వ అవతరణ దినోత్సవంలో వర్చువల్‌గా పాల్గొన్నారు. అనంతరం పశ్చిమ బెంగాల్, బిహార్‌లో పర్యటించారు. పలు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రారంభించారు. మరికొన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో గత నెలలో జరిగిన ఉగ్రదాడి భారతీయ ఆత్మ, ఐక్యత, మానవత్వంపై జరిగిన దాడిగా ప్రధాని అభివర్ణించారు. ఈ దాడి పట్ల నిర్ణయాత్మకంగా స్పందించామని, ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదులకు తగిన రీతిలో గట్టిగా బుద్ధి చెప్పామని అన్నారు. పాకిస్తాన్ భూభాగంలో ముష్కరుల స్థావరాలు, మౌలిక సదుపాయాలు, వైమానిక కేంద్రాలను ధ్వంసం చేశామని చెప్పారు. ఉగ్రవాదంపై పోరాటంలో మనదేశం మొత్తం ఐక్యంగా ఉందని పునరుద్ఘాటించారు. దేశంలో మతపరంగా ప్రజల మధ్య చిచ్చు పెట్టాలన్న లక్ష్యంతోనే పహల్గాంలో కుట్రపూరితంగా పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేశారని ప్రధాని ఆరోపించారు. మన ఆడబిడ్డల సిందూరాన్ని తుడిచేస్తే చివరకు ఏం జరుగుతుందో చేసి చూపించామని స్పష్టంచేశారు. సిక్కిం రాష్ట్రం భారత్‌కు గర్వకారణమని అన్నారు. ఇక్కడి ప్రజలు ప్రజాస్వామ్యం పట్ల సంపూర్ణ విశ్వాసం చూపుతున్నారని ప్రశంసించారు. ప్రతికూల వాతావరణం కారణంగా ఈ వేడుకలకు తాను స్వయంగా హాజరు కాలేకపోవడం బాధగా ఉందన్నారు. సిక్కిం రాష్ట్రం ఏర్పాటై 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉగ్రవాదాన్ని సహించే ప్రసక్తే లేదు

ఉగ్రవాద ఉత్పత్తి కర్మాగారంగా మారిన పాకిస్తాన్ భూభాగంలోకి మూడుసార్లు ప్రవేశించి దాడులు చేశామని ప్రధాని మోదీ చెప్పారు. పశ్చిమ బెంగాల్‌లోని అలీపూర్‌ద్వార్ జిల్లాలో రూ.1,010 కోట్ల విలువైన సిటీ గ్యాస్ పంపిణీ ప్రాజెక్టుకు ఆయన పునాదిరాయి వేశారు. ఈ సందర్భంగా బహిరంగ సభలో ప్రసంగించారు. ఆపరేషన్ సిందూర్‌ను ప్రస్తావించారు. బెంగాలీ సంస్కృతికి సిందూర్‌తో భావోద్వేగ అనుబంధం ఉందన్నారు. దుర్గా పూజ సమయంలో ఇక్కడి మహిళలు 'సిందూర్ ఖేలా' వేడుక నిర్వహించుకుంటారని తెలిపారు.



బెంగాల్‌లో రాక్షస పాలన

పశ్చిమ బెంగాల్‌లో అరాచక పాలన సాగుతోందని ప్రధాని నరేంద్ర మోదీ నిప్పులు చెరిగారు. తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో హింస, అవినీతి పెచ్చుమీరిపోయాయని మండిపడ్డారు. రాష్ట్రంలో రాక్షస ప్రభుత్వం రాజ్యమేలుతోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. అసలు ఇక్కడ చట్టబద్ధమైన పాలన ఉందా? అని ప్రశ్నించారు. బెంగాల్ ప్రజలు సంక్షోభాల్లో చిక్కుకున్నారని, యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తంచేశారు. తృణమూల్ కాంగ్రెస్‌కు బెంగాల్ అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి లేదని విమర్శించారు. బెంగాల్‌లో కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలు కాకుండా మమతా బెనర్జీ సర్కారు అడ్డంకులు సృష్టిస్తోందని ఆరోపించారు.

పాట్నాలో మోదీ భారీ రోడ్ షో

బెంగాల్ పర్యటన అనంతరం ప్రధాని మోదీ బిహార్ రాజధాని పాట్నాకు చేరుకున్నారు. పాట్నా ఎయిర్‌పోర్టులో నూతన టెర్మినల్ భవనాన్ని ప్రారంభించారు. అలాగే కొత్త సివిల్ ఎన్‌క్లేవ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గురువారం సాయంత్రం పాట్నాలో భారీ రోడ్‌షోలో మోదీ పాల్గొన్నారు. ఎయిర్‌పోర్టు సమీపంలోని అరణ్య భవన్ నుంచి బీర్‌చంద్ పటేల్ మార్గ్‌లోని రాష్ట్ర బీజేపీ కార్యాలయం దాకా ఈ రోడ్‌షో జరిగింది. శుక్రవారం బిహార్, ఉత్తరప్రదేశ్‌లో పలు కార్యక్రమాల్లో ప్రధానమంత్రి పాల్గొంటారు.

పీవోకే ప్రజలు మన కుటుంబసభ్యులే

భారత్‌లో వాళ్లు విలీనమయ్యే రోజు వస్తుంది • రక్షణ మంత్రి రాజ్‌నాథ్



న్యూఢిల్లీ: పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే) ప్రజలు ముమ్మాటికీ మన సొంత కుటుంబసభ్యులేనని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు. స్వచ్ఛందంగా భారతదేశ ప్రధాన స్రవంతిలోకి పీవోకే ప్రజలు వచ్చేరోజు ఒకటి వస్తుందని ఆయన అన్నారు. గురువారం ఢిల్లీలో భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) వాణిజ్య సదస్సులో రాజ్‌నాథ్ పాల్గొని ప్రసంగించారు. '' ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ నినాదానికి మనం కట్టుబడే ఉంటాం. భౌగోళికంగా, రాజకీయంగా మన నుంచి దూరంగా(పీవోకేలో) జీవిస్తున్న మన సోదరులంతా ఏదో ఒక రోజు మళ్లీ భారతదేశ ప్రధాన ప్రసంతిలో కలిసి నడుస్తారు. వాళ్ల మనోవాణి నాకు వినిపిస్తోంది. అందుకే పీవోకేలోని వాళ్లంతా మన సొంత కుటుంబసభ్యులేనని నేను గట్టిగా విశ్వసిస్తా. ఏదో కొద్దిమంది తప్పుడు మార్గంలో పయనిస్తున్నారుగానీ అక్కడి వాళ్లలో చాలా మందికి భారత్‌తో దృఢసంబంధాలు పెనవేసుకున్నాయి. భారత్‌తో పీవోకే విలీనం అనేది దేశ సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక శ్రేయస్సుకు సంబంధించిన కీలకాంశం'' అని అన్నారు. ''ఉగ్రవాదాన్ని పెంచిపోషించడానికి పెద్దగా ఖర్చుకాదు. కానీ ఉగ్రవాదం తాలూకు పెను విపరిణామాలకు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. పాక్ ఇప్పుడిదే మూల్యం చెల్లించుకుంటోంది. భారతదేశ శ్రేయస్సు, భద్రతకు మేకిన్ ఇండియా విధానం ఎంతో ముఖ్యమైనదని ఆపరేషన్ సిందూర్‌తో స్పష్టమైంది. శత్రుదేశాల గగనతల రక్షణ కవచాలను చీల్చుకుంటూ ముందుకెళ్లగలమని ఆపరషన్ సిందూర్‌తో భారత్ నిరూపించింది. పదేళ్ల క్రితం రూ.1,000 కోట్లున్న రక్షణ రంగ ఉత్పత్తుల ఎగుమతి ఇప్పుడు రూ.23,500 కోట్లకు పెరిగింది. యుద్ధవిమానాలు, క్షిపణి వ్యవస్థలనేకాదు కొత్తతరం యుద్ధసాంకేతికతలనూ భారత్ అభివృద్ధిచేస్తోంది. అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్(అమ్కా) ఎగ్జిక్యూషన్ మోడల్‌కు ఇటీవలే ఆమోదముద్ర వేశాం. తొలుత ఐదు నమూనాలను తయారుచేసి తర్వాత పూర్తిస్థాయి ఉత్పత్తిని మొదలెడతాం'' అని మంత్రి చెప్పారు.



స్విస్ గ్రామం సమాధి


గ్రామంపై విరుచుకుపడిన హిమానీనదం

జెనీవా: ఆల్ప్స్ పర్వతశిఖర సానువుల్లోని ఓ అందమైన కుగ్రామం రెప్పపాటులో భూస్థాపితమైంది. స్విట్జర్లాండ్‌లోని లోట్స్‌చెంటర్ లోయ ప్రాంతంలోని బ్లాటెన్ గ్రామంపై హిమానీనదం విరుచుకుపడింది. భారీస్థాయిలో మట్టిదిబ్బలు ఒక్కసారిగా పడటంతో కేవలం 40 సెకన్లలో దాదాపు గ్రామం మొత్తం మట్టిలో కలిసిపోయింది. బిర్క్ గ్లేసియర్‌లో కదలికలను ముందే కనిపెట్టిన స్థానిక యంత్రాంగం కొద్దిరోజుల ముందే గ్రామంలోని దాదాపు 300 మంది స్థానికులను ఖాళీ చేయించారు. దీంతో ప్రాణనష్టం తప్పింది. అయితే 64 ఏళ్ల ఒక వృద్ధుని ఒకరి జాడ తెలీడంలేదని వార్తలొచ్చాయి. హిమచరియలు ఇంకా పడుతున్నాయని వాలేయిస్ కంటోన్మెంట్ పోలీస్ అధికారి చెప్పారు. పర్వతం పైనుంచి జారి కిందకొచ్చిన మట్టిపెళ్లలతో కిందనున్న లోన్జా నదిలో పెద్ద అలజడి చెలరేగింది. దీంతో దిగువ ప్రాంతాలను నదీజలాలు ముంచెత్తనున్నాయి. శుక్రవారం ఈ ప్రాంతంలో స్విట్జర్లాండ్ అధ్యక్షుడు కరెన్ కెల్లర్ సూటర్ పర్యటించనున్నారు.

అస్తమించిన సాహిత్యశిఖరం

ఆరు దశాబ్దాలపాటు ఆఫ్రికన్ సాహిత్యసీమను ఏలిన గూగీ వా థియాంగో

నైరోబీ: ఆధునిక ఆఫ్రికన్ సాహిత్యంపై చెరగని ముద్రవేసిన కెన్యా దిగ్గజ నవలా రచయిత, ఆరు దశాబ్దాలపాటు ఎన్నో రచనలు చేసిన ప్రముఖ సాహితీవేత్త ప్రొఫెసర్ గూగీ వా థియాంగో బుధవారం అమెరికాలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు 87 సంవత్సరాలు. వలసరాజ్యం నుంచి తన కెన్యా దేశం ప్రజాస్వామ్య దేశంగా ఎదిగే క్రమంలో జరిగిన పరిణామాలను ఆయన తన రచనల్లో అక్షరబద్ధంచేశారు. జైలు జీవితం, ప్రవాస జీవితం, తీవ్ర అనారోగ్యం ఇవేవీ ఆయన రచనను అడ్డుకోలేపోయాయి. ఎన్నోసార్లు సాహిత్య నోబెల్ ఆయనను వరించబోయి కొద్దిలో తప్పిపోయిందనేది ప్రపంచవ్యాప్తంగా సాహితీవేత్తల అభిప్రాయం. ఎంతో సరళంగా, మనసుకు హత్తుకునేలా నవలలు, నాటకాలు, చిన్న కథలు, వ్యాసాలు రాశారు. సాహిత్యం మొదలు సామాజిక విమర్శ, చిన్నారుల రచనల దాకా అన్ని రకాల సాహిత్య ప్రయోగాల్లో ఆయనకు అద్భుతమైన ప్రవేశం ఉంది. స్వదేశం కెన్యాలో ఏ గ్రంథాలయంలో చూసినా ఆయన రచనల పుస్తకాల కోసం ప్రత్యేకంగా అరలు ఉంటాయి. '' కెన్యా రాజధాని నైరోబీలో 30 సంవత్సరాలకుపైగా బుక్‌స్టోర్ నిర్వహిస్తున్నా. గూగీ రచనలు అలా ఆపకుండా చదవాలనిపిస్తుంది'' అని నూరియా బుక్‌స్టోర్ ప్రొప్రైటర్ బెన్నెట్ ఎంబాటా చెప్పారు. 'కెన్యా అక్షరమాలలో సమున్నత శిఖరం గూగీ. కెన్యాలో సామాజిక న్యాయం, అధికార దుర్వినియోగంపై గూగీ ధైర్యంగా పదునైన రచనాస్త్రాలు సంధించారు. ఆఫ్రికా సాహిత్య దీపస్తంభం ఆరిపోయింది'' అని కెన్యా అధ్యక్షుడు విలియం రూటో గురువారం గూగీకి ఘన నివాళులర్పించారు. బ్రిటిష్ వలసరాజ్యంగా ఉన్నప్పుడు కెన్యాలోని కమిరిథులో 1938 జనవరి ఐదున జేమ్స్ గూగీ జన్మించారు. తొలుత అందరూ ఆఫ్రికన్లలాగే ఇంగ్లిష్‌పై మక్కువతో ఆంగ్లంలో తొలి నవల 'వీప్ నాట్, చైల్డ్' రాశారు. ఇది 1964 మేలో ప్రచురితమైంది. తూర్పు ఆఫ్రికా రచయిత రాసిన పుస్తకం ప్రచురితంకావడం అదే తొలిసారి. తర్వాత ఆయన స్థానిక 'గికుయూ' భాషలో



మాత్రమే రాయడం మొదలెట్టారు. ప్రభుత్వ విధానాలను ఎండగట్టినందుకు కొంతకాలం జైలుజీవితం అనుభవించారు. అప్పుడు కూడా ఆయన రచనను వదిలిపెట్టలేదు. తొలి ఆధునిక గికుయూ నవల ' డెవిల్ ఆన్ ది క్రాస్'ను జైళ్లో ఖైదీలకు ఇచ్చే టాయిలెట్ పేపర్‌లతో రాశారు. జైలు నుంచి విడుదలయ్యాక సైతం కుటుంబాన్ని నియంత ప్రభుత్వం హింసించడంతో వేధింపులు తట్టుకోలేక ప్రవాసజీవితం గడిపారు. జర్మనీలో బేరూత్ వర్సిటీలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. బ్రిటన్‌లో కొన్నాళ్లు ఉండి చివరకు కాలిఫోర్నియా వర్సిటీలో బోధిస్తూ అక్కడే స్థిరపడ్డారు. 22 ఏళ్ల తర్వాత 2004లో సొంత దేశానికి వస్తే కెన్యన్లు అపూర్వస్వాగతం పలికారు. కానీ మాజీ అధికారపార్టీ పెద్దలకు ఇది ఇష్టం లేదని కొందరి అభిప్రాయం. ఈ మాటలను నిజంచేస్తూ గూగీ ఉంటున్న అపార్ట్‌మెంట్‌లోకి నలుగురు చొరబడి ఆయనను దారుణంగా కొట్టారు. భార్యను రేప్ చేశారు. తర్వాత ఆయన దాదాపు కెన్యాకు రాలేదు. ఈయనకు 1995లోనే ప్రోస్టేట్ క్యాన్సర్ సోకినా ఎలాగోలా కోలుకున్నారు. 2019లో మూడుసార్లు గుండెకు బైపాస్ సర్జరీ జరిగింది. తర్వాత మూత్రపిండ వైఫల్యం బాధించడం మొదలెట్టింది. అనారోగ్యంతో అమెరికాలోని జార్జియా రాష్ట్రంలోని బెడ్‌ఫోర్డ్ సిటీలో కన్నుమూశారు.

సెక్యూరిటీ డ్రిల్స్ రేపటికి వాయిదా

న్యూఢిల్లీ: అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం ఉండే సరిహద్దు రాష్ట్రాల్లో సన్నద్ధతను పెంచేందుకు ఈ శనివారం సెక్యూరిటీ డ్రిల్స్ చేపట్టనున్నట్లు కేంద్రం తెలిపింది. గుజరాత్, పంజాబ్, రాజస్తాన్, హరియాణా, జమ్మూకశ్మీర్‌లలో ముందుగా ప్రకటించినట్లు వాస్తవానికి గురవారమే ఈ డ్రిల్స్ చేపట్టాల్సి ఉంది. అయితే, పరిపాలనా సంబంధ కారణాలతో శనివారం సాయంత్రానికి వాయిదా వేసినట్లు వివరించింది. ఇందులో భాగంగా కంట్రోల్ రూంల పనితీరు, వైమానిక దాడుల హెచ్చరికలు, ఫైర్‌సేఫ్టీ వంటి పౌర రక్షణ సేవల సన్నద్ధతను పరీక్షించనున్నారు. వైమానిక దాడుల నుంచి ఎలా రక్షించుకోవాలో పౌరులకు చూపుతారు. పాకిస్తాన్‌తో సరిహద్దులున్న రాష్ట్రాల్లో ఇకపై ప్రతినెలా ఈ డ్రిల్స్‌ను చేపడతామని తెలిపింది. ఈ సమయంలో పౌరులు అప్రమత్తంగా ఉండాలని, అధికారులిచ్చే సూచనలను పాటించాలని కోరింది. గుజరాత్‌లోని అన్ని జిల్లాల్లోని డ్రిల్ ఉంటాయని, సివిల్ డిఫెన్స్ వలంటీర్లుగా పౌరులు నమోదు చేయించుకోవచ్చని కేంద్రం పేర్కొంది. ఇటీవలి ఆపరేషన్ సిందూర్ సమయంలో పంజాబ్‌లోని అన్ని జిల్లాల పరిధిలో, రాజస్తాన్‌లోని సరిహద్దు జిల్లాల్లో హై అలెర్ట్ అమల్లో ఉంది. ఈ సమయంలో అన్ని విద్యా సంస్థలను మూసివేస్తారు. ఇతర బహిరంగ కార్యక్రమాలు సైతం రద్దవుతాయి.

సాక్షి
హైదరాబాద్

శుక్రవారం । 30 । మే । 2025



వ్యాధుల నియంత్రణకు యాక్షన్ ప్లాన్
సీజనల్ వ్యాధుల నియంత్రణకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసినట్లు హైదరాబాద్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటి తెలిపారు. ఇందుకోసం శాఖాపరమైన ఏర్పాట్లు చేశామన్నారు. -10లో



విశ్వ వేదికపై.. నాటు పాట..
మిస్ వరల్డ్ పోటీల నేపథ్యంలో తెలుగు సినీ గీతాలు వైరల్ మారుతున్నాయి. ముఖ్యంగా 'రానూ బొంబైకి రానూ' పాటతో పాటు ఇతర గేయాలకు విపరీతమైన క్రేజ్ పెరిగింది. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
31.0/23.0

వాతావరణం
నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఓ మోస్తరు వర్షం పడవచ్చు. గరిష్టంగా 31, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

జైహింద్ సక్సెస్!





టీపీసీసీ ఆధ్వర్యంలో గురువారం బాచుపల్లి వీఎన్ఆర్ జ్యోతి ఇంజినీరింగ్ కళాశాల నుంచి కేజీఆర్ కన్వెన్షన్ వరకు జైహింద్ యాత్ర సాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. మాజీ ఎమ్మెల్యేలు కూన శ్రీశైలం గౌడ్, మైనంపల్లి హన్మంతరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలను హనుమంత్ రెడ్డి, నర్సారెడ్డి భూపతిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు. - సాక్షి, సిటీబ్యూరో

సైబర్ బాధితులకు మరింత ఊరట

నగరంలో జోనల్ సైబర్ సెల్స్ ప్రారంభం

- మొత్తం ఏడింటిని ఏర్పాటు చేసిన కొత్వాల్
- రూ.లక్ష లోపు కోల్పోయిన కేసుల దర్యాప్తు

సాక్షి, సిటీబ్యూరో: సైబర్ బాధితులకు మరింత ఊరట ఇచ్చేలా పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. నగరంలోని ప్రతి జోన్‌కూ ఒక జోనల్ సైబర్ సెల్ (జెడ్‌సీసీ) ఏర్పాటు చేశారు. గురువారం బషీర్‌బాగ్‌లోని పాత కమిషనరేట్‌లో మోడల్ సైబర్ సెల్‌ను కొత్వాల్ సీవీ ఆనంద్ నేరుగా, జోన్లలో ఏర్పాటు చేసిన ఏడింటిని వర్చువల్‌గా ప్రారంభించారు. రూ.లక్ష లోపు మొత్తంతో ముడిపడి ఉన్న కేసుల దర్యాప్తు జెడ్‌సీసీ పర్యవేక్షణలో జరగనుంది. వీటి పనితీరుకు సంబంధించి ప్రత్యేకంగా స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ సైతం రూపొందించారు.

సైబర్ ఠాణాపై పని భారం..

నానాటికీ పెరిగిపోతూ దర్యాప్తు అధికారులకు సవాల్ విసురుతున్న సైబర్ నేరాలు పోలీసులకు పెద్ద తలనొప్పిగా మారాయి. ఆర్థికాంశాలతో ముడిపడి ఉన్న కేసుల్లో నిందితులుగా బయటి రాష్ట్రాలకు చెందిన వాళ్లే ఎక్కువగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో సైబర్ క్రైమ్ ఠాణాకు చెందిన ఓ బృందం అనునిత్యం బయటి రాష్ట్రాల్లో ఉంటోంది. ఎన్ని వ్యయప్రయాసలకోర్చినా పాత్రధారులు, దళారులు తప్ప సూత్రధారులు చిక్కట్లేదు. ఈ కారణంగానే ఇటీవల సైబర్ క్రైమ్ పోలీసులు బాధితులు కోల్పోయిన నగదు ఫ్రీజ్ చేయడానికి, రీఫండ్ చేయించడానికి ప్రాధాన్యమిస్తున్నారు. ఈ నేపథ్యంలో సైబర్ క్రైమ్ ఠాణా తీవ్ర పని ఒత్తిడి ఎదుర్కొంటోంది.

రూ.25 వేల నుంచి రూ.లక్ష వరకు..

సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్‌పై పని భారం తగ్గించడానికి రూ.లక్ష కంటే తక్కువ మొత్తంతో ముడిపడి ఉన్న కేసుల్ని స్థానిక పోలీసు స్టేషన్లలో నమోదు చేసేలా ఆదేశాలు జారీ చేశారు. ఇలాంటి కేసులు నమోదు అవుతున్నా... ఆ అధికారులకు ఉండే దైనందిన విధులు, బందోబస్తు డ్యూటీల కారణంగా దర్యాప్తు పూర్తి స్థాయిలో జరగట్లేదు. మరోపక్క అక్కడి అధికారులకు ఈ కేసుల్ని దర్యాప్తు చేసే పరిజ్ఞానం, తీరుతెన్నులపై అవగాహన ఉండట్లేదు. ఫలితంగా బాధితులు నష్టపోతున్నారు. ఈ పరిణామాలను పరిగణనలోకి తీసుకున్న నగర కొత్వాల్ సీవీ ఆనంద్ జెడ్‌సీసీలను ఏర్పాటు చేశారు. జోనల్ డీసీపీల నేతృత్వంలో పని చేసే వీటిలో విధులు నిర్వర్తించే వారికి నెల రోజుల పాటు శిక్షణ కూడా ఇచ్చారు. ఈ జెడ్‌సీసీలు రూ.25 వేల కంటే తక్కువ మొత్తంతో ముడిపడి ఉన్న నేరాల్లో నగదు ఫ్రీజ్ అయి ఉంటే రిఫండ్ చేయిస్తారు. రూ.25 వేల నుంచి రూ.లక్ష మధ్య మొత్తంతో ముడిపడిన వాటిపై స్థానిక ఠాణాలో కేసు నమోదు చేయిస్తారు. రూ.లక్ష కంటే ఎక్కువ మొత్తంతో ముడిపడి ఉన్న వాటిని సైబర్ క్రైమ్ ఠాణాకు పంపిస్తారు. జెడ్‌సీసీలు స్థానిక పోలీసుస్టేషన్లలో నమోదయ్యే సైబర్ నేరాలను దర్యాప్తు చేస్తారు. ఇతర రాష్ట్రాల్లో ఉన్న నిందితులను పట్టుకోవడంలో సహకరిస్తారు. సోషల్ మీడియా వేధింపులు కేసుల్లో నిందితులు అపరిచితులైతే సైబర్ ఠాణాలో కేసు నమోదు చేయిస్తారు.



భవిష్యత్‌లో ఠాణాలుగా మారుస్తాం

నగరంలో సైబర్ నేరాలు పదేళ్లల్లో పది రెట్లు పెరిగాయి. 2015లో 351 కేసులు నమోదు కాగా.. గత ఏడాది ఆ సంఖ్య 3111కు చేరింది. సైబర్ క్రైమ్ ఠాణాలో 147 పోస్టులు ఉండగా.. 120 మందే అందుబాటులో ఉన్నారు. ఈ నేపథ్యంలోనే జెడ్‌సీసీలు ఏర్పాటు చేశాం. రెండుమూడేళ్ల పాటు వీటి పనితీరును అధ్యయనం చేసి, ఆపై ఠాణాలుగా మారుస్తాం. కేసుల నమోదు, దర్యాప్తులతో పాటు ఫ్రీజ్ అయిన మొత్తం రిఫండ్ ప్రక్రియ సులభతరం కానున్నాయి.
– సీవీ ఆనంద్, నగర కొత్వాల్

వాతావరణ మార్పులపై సత్వర సమాచారం

- జంక్షన్లలోని వీఎంఎస్ బోర్డుల్లో ప్రదర్శన
- ఐసీసీసీ– ఐఎండీ సమన్వయంతో చర్యలు



సాక్షి, సిటీబ్యూరో: వర్షాలతో పాటు ఇతర వాతావరణ అంశాలపై నగరవాసులకు ఎప్పటికప్పుడు సమాచారం లభించనుంది. ఈ కోణంలో తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (టీజీఐసీసీసీ)– భారత వాతావరణ శాఖ (ఐఎండీ) సన్నాహాలు చేస్తున్నాయి. దీనికి సంబంధించిన కీలక సమావేశంలో గురువారం బంజారాహిల్స్‌లోని ఐసీసీసీలో జరిగింది. డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డితో పాటు ఐఎండీ అధిపతి డాక్టర్ కె.నాగరత్న తమ బృందాలతో పాల్గొన్నారు. వాతావరణ శాఖ వద్ద ఉండే సమాచారాన్ని ఐసీసీసీతో అనుసంధానించడంపై ప్రధానంగా చర్చించారు. ప్రధానంగా వర్షంతో పాటు ఇతర కీలక వాతావరణ అంశాలపై నగర వాసులకు వీలున్నంత త్వరగా, ఎప్పటికప్పుడు అప్‌డేట్స్ ఇవ్వాలని ఇరు విభాగాలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి. ప్రస్తుతం వాతావరణ శాఖ ఇస్తున్న అంచనాలపైనా చర్చించారు. ఐఎండీ నుంచి వచ్చే డేటాను ఐసీసీసీ నుంచి జంక్షన్లు, పబ్లిక్ స్థలాల్లో ఉన్న పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్ (పీఏఎస్), వేరియబుల్ మెసేజ్ డిస్‌ప్లే బోర్డుల (వీఎంఎస్) ద్వారా విస్తృతంగా ప్రచారం చేయనున్నారు. నైరుతి రుతుపవనాల ప్రభావం ఎలా ఉండబోతోంది? చలి, వేడిగాలులు ఎంత తరచుగా వస్తున్నాయి? వంటి కీలకమైన అంశాలను ముందస్తుగా ప్రచారం చేసి నగర వాసికి అప్రమత్తం చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఇలా చేయడం వల్ల వాహనచోదకులు, నగరవాసులకు ఇబ్బందులు తప్పించడంతో పాటు రహదారుల్లో రద్దీ, ట్రాఫిక్ జామ్స్‌ను నిరోధించవచ్చని అధికారులు చెబుతున్నారు.

'డెయిరీఫామ్ ఎలివేటెడ్'కు టెండర్లు ఖరారు

- పనులను దక్కించుకున్న ఎంవీఆర్ ఇన్‌ఫ్రా
- 36 నెలల్లో ప్రాజెక్టు పూర్తి చేసేలా కార్యాచరణ

సాక్షి, సిటీబ్యూరో: ప్యారడైజ్ నుంచి డెయిరీ ఫామ్ వరకు నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్ టెండర్లు ఖరారయ్యాయి. ఈ ప్రాజెక్టును దక్కించుకొనేందుకు పలు నిర్మాణ సంస్థలు పోటీ పడగా చివరకు ఎంవీఆర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ సంస్థకు అవకాశం లభించింది. నిర్మాణ సంస్థల సామర్థ్యం, గతంలో చేపట్టి విజయవంతంగా పూర్తిచేసిన ప్రాజెక్టులు, ఆర్థిక అంచనాలు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని ఎంవీఆర్ ఇన్‌ఫ్రాకు పనులు అప్పగించినట్లు హెచ్ఎండీఏ అధికారులు తెలిపారు. 36 నెలల్లో ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని నిర్దేశించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం టెండర్ల కేటాయింపు కూడా పూర్తి కావడంతో త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ప్యారడైజ్ నుంచి మేడ్చల్ రూట్‌లో డెయిరీఫామ్ వరకు 5.4 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మించనున్నారు. సికింద్రాబాద్, తాడ్‌బండ్, బోయిన్‌పల్లి మీదుగా డెయిరీఫామ్ వరకు నిర్మించనున్న ఈ ఎలివేటెడ్ కారిడార్ అంచనా వ్యయం రూ.652 కోట్లు. ఈ ప్రాజెక్టు వల్ల నగరానికి ఉత్తరం వైపు వాహనాల రాకపోకలు సులభతరం కానున్నాయి.

శామీర్‌పేట్ రూట్‌కు త్వరలో టెండర్లు..

సికింద్రాబాద్ నుంచి శామీర్‌పేట్ ఔటర్‌రింగ్ ఔటర్‌రింగ్ రోడ్డు వరకు నిర్మించనున్న 18.10 కి.మీ.ఎలివేటెడ్ కారిడార్ కోసం త్వరలో టెండర్ నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు హెచ్ఎండీఏ అధికారులు తెలిపారు. ఈ రూట్‌లో రక్షణశాఖ నుంచి సేకరించవలసిన భూములపైన తాజాగా పరస్పర ఒప్పందం కుదిరినట్లు తెలిపారు.

ఇంకుడు గుంత.. తీరును చింత!

భూగర్భ జలాల పెంపునకు ప్రత్యేక కార్యాచరణ

'మూడు వందల చదరపు గజాలకుపైగా ఉన్న ప్రతీ ఇంటి ప్రాంగణంలో ఇంకుడు గుంత నిర్మించుకోవాలి. భూగర్భ జలాల పెంపు కోసం ఇంకుడు గుంత తప్పనిసరి. లేనిపక్షంలో ప్రత్యేక కార్యాచరణకు దిగుతాం'
– ఇటీవల హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ వ్యాఖ్య

- ఇంటి ఆవరణలో ఇంకుడు గుంత లేకుంటే బ్లాక్ లిస్ట్‌లో నల్లా కనెక్షన్
- ఇప్పటికే 16 వేల గృహ సముదాయాలకు నోటీసులు జారీ
- ప్రస్తుత వర్షాకాలంలో 90 రోజుల స్పెషల్ డ్రైవ్
- కీలక నిర్ణయం తీసుకున్న జలమండలి

జలమండలి పరిధిలో ఇంకుడు గుంతలు ఇలా..
ఇప్పటి వరకు సర్వే చేసిన భవనాల సంఖ్య : 40,206
ఇంకుడు గుంతలున్న భవనాలు : 22,813
ఇంకుడు గుంతలు లేనివి : 17,393
నోటీసులు అందుకున్నవి : 16,066

భూగర్భ జలాలను పెంచేందుకే..



భూగర్భ జలాల పెంపు కోసమే ప్రతి ఇంటా ఇంకుడు గుంత తప్పనిసరి చేశాం. 90 రోజుల వర్షాకాల కార్యాచరణలో ప్రత్యేకంగా ఇంకుడు గుంతల నిర్మాణాలపై దృష్టి సారించాం. ప్రజలకు అవగాహన కల్పిస్తాం. ప్రోత్సహిస్తాం. కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తాం. ఇంకుడు గుంతల నిర్మాణాలపై నిర్లక్ష్యం వహిస్తే మాత్రం చివరకు కఠిన నిర్ణయాలు అమలు చేస్తాం.
– అశోక్ రెడ్డి, జలమండలి ఎండీ



సాక్షి, సిటీబ్యూరో:

సీవరేజీ ఓవర్‌ఫ్లో కట్టడి, మోటార్ ఫ్రీ వాటర్ సరఫరా స్పెషల్ డ్రైవ్‌లతో సత్ఫలితాలు సాధిస్తున్న జలమండలి.. తాజాగా భూగర్భ జలాల పెంపు కోసం 90 రోజుల వర్షాకాల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా 'ప్రతి ఇంటా ఇంకుడు గుంత' నిర్మించుకునే విధంగా స్పెషల్ డ్రైవ్‌కు సిద్ధమైంది. నలుదిశలా అత్యంత వేగంగా విస్తరిస్తున్న మహానగరం పూర్తిగా కాంక్రీట్ జంగిల్‌గా మారుతుండటంతో వర్షం చినుకు భూమిలో ఇంకే పరిస్థితి లేక భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. సిటీజనులకు తాగునీరే కాదు.. నిత్యావసరాలకు వినియోగించే నీళ్లకు కూడా కష్టాలు తప్పడం లేదు. దీంతో వాటర్ ట్యాంకర్ల సరఫరా జలమండలికి తలకు మించిన భారంగా పరిణమించింది. పెరుగుతున్న జనావాసాలకు తగ్గట్లు ప్రధాన జలాశయాల నుంచి నీటి కేటాయింపు లేకున్నా.. తరలిస్తున్న నీటినే సర్దుబాటు చేస్తూ వస్తున్న జలమండలి ఇక ప్రతి ఇంటా ఇంకుడు గుంతల నిర్మాణాలతో భూగర్భ జలాలను పెంపొందించే దిశగా ప్రయత్నాలను ముమ్మరం చేసింది.

ఇకనుంచి తప్పనిసరి..

మహా నగర పరిధిలో భూగర్భ జలాల పెంపొందించేందుకు జలమండలి కసరత్తు ప్రారంభించింది. సుమారు 300 చదరపు గజాలు, అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో భవన సముదాయాలకు ఇంకుడు గుంత తప్పనిసరి చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే వరల్డ్ వాటర్ డే సందర్భంగా ఇంకుడు గుంతల సర్వే కోసం ప్రత్యేకంగా ఒక అప్లికేషన్ రూపొందించి అందుబాటులోకి తీసుకొచ్చింది. గృహ సముదాయాల క్యాన్ నంబర్ల ఆధారంగా ఇంకుడు గుంతలపై సర్వే నిర్వహించింది. వాల్టా చట్టం ప్రకారం.. 300 చదరపు గజాలు.. అంతకంటే ఎక్కువ విస్తీరణంలోని గృహ సముదాయాల్లో ఇంకుడు గుంతల నిర్మాణం చేపటాల్సిందే. మరోవైపు జలమండలి నల్లా కనెక్షన్ల అనుమతి పత్రంలో సైతం ఇంకుడు గుంతల ఏర్పాటు షరతు ఉంటుంది. భవన నిర్మాణ సమయంలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకున్నా.. వాటిపై నిర్లక్ష్యం, కాలక్రమేణా వాటిని పునరుద్ధరించకపోవడంతో భూగర్భ జలాల అడుగంటే పరిస్థితి నెలకొనడం అనివార్యంగా తయారైంది. మరికొన్ని గృహ సముదాయాల్లో అసలు ఇంకుడు గుంతల నిర్మాణమే చేపట్టని పరిస్థితి కూడా లేకపోలేదు.

కనిపించని ఆసక్తి

రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పథకంలో భాగంగా 'ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత' అనే పేరుతో అవగాహన కల్పించినా.. నివాస సముదాయాలు పెద్దగా ఆసక్తి కనబర్చలేదు. చివరకు ఇంకుడు గుంతలు లేని గృహ సముదాయాలకు గడువు విధించి నోటీసులు జారీ చేయగా.. అందులో కొందరే స్పందించగా.. మిగతావారి నుంచి స్పందన లేకుండా పోయింది. నోటీసు అందినా ఇంకుడు గుంతను నిర్మించుకోని భవన యజమానులు ట్యాంకర్ బుకింగ్ చేస్తే రెట్టింపు చార్జీ విధించాలని భావించినా.. వేసవి కాలంలో నీటి అత్యవసరం దృష్ట్యా మానవతా దృక్పథంతో జలమండలి వెనుకడుగు వేసింది. ప్రతి వేసవిలో సుమారు 42 వేలపైగా గృహ సముదాయాల నుంచే అత్యధికంగా ట్యాంకర్లు బుకింగ్ జరుగుతున్నట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. వర్షాకాలంలో మాత్రం ప్రతి ఇంటా ఇంకుడు గుంత నిర్మాణాలపై అవసరమైతే కఠిన నిర్ణయాలు సైతం అమలు చేసేందుకు జలమండలి సిద్ధమవుతోంది.

నగరంలో శిథిలావస్థకు చేరిన గృహాలు 428

ప్రమాదాలు జరిగితే అధికారులదే బాధ్యత

- జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్

లక్డీకాపూల్: గ్రేటర్‌లోని శిథిలావస్థలో ఉన్న గృహాలను గుర్తించిన నేపథ్యంలో ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం శిథిలావస్థలో ఉన్న గృహాలు, సెల్లార్ నిర్మాణాలపై జోనల్ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. వర్షాలు ముందుగానే కురుస్తాయని వాతావరణ శాఖ సూచించిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న గృహాల్లో నివసించే కుటుంబాలకు అవగాహన కల్పించి సురక్షిత ప్రాంతాలకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రేటర్‌లో ఇప్పటి వరకు శిథిలావస్థకు చేరిన 428 కట్టడాలను గుర్తించినట్లు ఆయన తెలిపారు. వీటిలో 131 గృహాలకు మరమ్మతులకు అవకాశం ఉందని, మిగతా 297 నిర్మాణాలకు నోటీసులు జారీ చేయాలన్నారు. ఈ నెల 30వ తేదీ నుంచి వర్షాకాలం ముగిసే వరకు జీహెచ్‌ఎంసీ పరిధిలో కొత్త సెల్లార్ల నిర్మాణాలకు అనుమతి ఇవ్వకూడదని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే నిర్మించిన సెల్లార్ల విషయంలో రిటైనింగ్ వాల్ నిర్మాణం, బారికేడ్లు నిబంధనల ప్రకారం ఉండేలా జాగ్రత్త తీసుకునేలా, సెల్లార్‌లో నీరు నిలవకుండా యజమానులకు నోటీసులు జారీ చేయాలన్నారు.

యూపీ నుంచి నగరానికి అక్రమ ఆయుధాలు

ఇద్దరు అంతర్రాష్ట్ర నేరగాళ్ల అరెస్టు

- 5 నాటు తుపాకులు, 18 రౌండ్ల బుల్లెట్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన రాచకొండ సీపీ సుధీర్ బాబు



పోలీసులు అరెస్టు చేసిన నిందితులు



సమావేశంలో మాట్లాడుతున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు



స్వాధీనం చేసుకున్న తుపాకులు, బుల్లెట్లు

నాగోలు: ఉత్తరప్రదేశ్ నుంచి నగరానికి అక్రమంగా తుపాకులు (తపంచాలు) తీసుకువచ్చి విక్రయించే ప్రయత్నం చేసిన ఇద్దరు అంతర్రాష్ట్ర నేరగాళ్లను మహేశ్వరం జోన్ ఎస్‌ఓటీ పోలీసులు, బాలాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. 5 నాటు తుపాకులు, 18 రౌండ్ల బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. గురువారం ఎల్బీనగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు వివరాలు వెల్లడించారు. ఉత్తరప్రదేశ్‌లోని రాంపూర్ నగరం జీనా ఇనాయత్ ఖాన్ కాలనీకి చెందిన మహ్మద్ జీషన్ అలియాస్ జీఖాన్ (28) 2016లో తన తల్లిదండ్రులు, సోదరితో కలిసి హైదరాబాద్‌కు వలస వచ్చి సంతోష్‌నగర్ రక్షాపురంలో నివాసం ఉంటున్నాడు. మహ్మద్ జీషన్ 2019లో సంతోష్‌నగర్‌లో హెయిర్ సెలూన్ షాప్‌ను ఏర్పాటు చేశాడు. దీంతోపాటు నగరంలోని రక్షాపురం, గోల్కొండ, బాలాపూర్‌లో మరో మూడు హెయిర్ సెలూన్ షాపులను నడుపుతున్నాడు. సొంత గ్రామస్తుడైన తన స్నేహితుడు మహ్మద్ అమీర్ (24)ను నగరానికి తీసుకువచ్చి బాలాపూర్ ఎక్స్ రోడ్స్‌లోని జీషన్ హెయిర్ సెలూన్ షాప్‌లో పనిలో పెట్టాడు. మహ్మద్ జీషన్ మద్యం, విలాసవంతమైన జీవితానికి బానిసయ్యాడు. హెయిర్ సెలూన్‌తో వచ్చే సంపాదన విలాసాలకు సరిపోకపోవడంతో సులభంగా డబ్బు సంపాదించాలనుకున్నాడు. తక్కువ ధరకు దేశీయ ఆయుధాలను కొనుగోలు చేసి నగరంలో అవసరమైన వ్యక్తులకు అధిక ధరకు విక్రయించాలని పథకం వేశాడు. ఈ విషయాన్ని మహ్మద్ అమీర్‌కు తెలియజేయడంతో ఇందుకు అతను కూడా అంగీకరించాడు. జీషన్ ఉత్తర ప్రదేశ్‌లోని స్వగ్రామానికి చెందిన తన స్నేహితుడు అర్షి ఖాన్‌ను సంప్రదించాడు, అతను యూపీలోని రాంపూర్ ప్రాంతంలో అక్రమ తుపాకుల తయారీదారులతో సంబంధాలు కలిగి ఉన్నాడు. వారి ప్రణాళిక ప్రకారం కొన్ని రోజుల క్రితం వారు రాంపూర్ నగరానికి చెందిన అర్షి ఖాన్ నుంచి 5 రకాల తపంచాలను తకువ ధరకు కొనుగోలు చేశారు. హైదరాబాద్ నగరంలోని సంఘ వ్యతిరేక శక్తులకు తమ పరిచయాల ద్వారా ఒక్కటి రూ. 2 లక్షలకు విక్రయించడానికి తమ వద్ద ఉంచుకున్నారు. ఈ మేరకు గురువారం ఉదయం జీషన్, అమీర్‌లు బాలాపూర్ సెలూన్‌లో తుపాకులు ఉంచడానికి వెళుతుండగా.. విశ్వసనీయ సమాచారం అందుకున్న మహేశ్వరం ఎస్‌ఓటీ టీమ్, బాలాపూర్ పోలీసులతో కలిసి బాలాపూర్ పరిధిలోని రాయల్ కాలనీ వద్ద నిందితులను అడ్డగించి వారి వద్ద నుంచి 5 దేశీయ తపంచాలు, 18 రౌండ్ల బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో మహేశ్వరం డీసీపీ సునీతా రెడ్డి, అడిషనల్ డీసీపీ మహ్మద్ షాకిర్ హుస్సేన్, ఏసీపీ జానకిరెడ్డి పాల్గొన్నారు.

ఉస్మానియా ఆస్పత్రిలో కరోనా ఐసోలేషన్ వార్డు



ఐసోలేషన్ వార్డు

అఫ్జల్‌గంజ్: కరోనా మళ్లీ విజృంభిస్తోందని వదంతుల నేపథ్యంలో నగరంలోని ఉస్మానియా ఆస్పత్రిలో ప్రత్యేక ఐసోలేషన్ వార్డును ఏర్పాటు చేశామని, ఎలాంటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ సహాయ్ తెలిపారు. కరోనా రోగులకు అవసరమైన వైద్య సేవలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. అవసరమైన మాస్కులు, పీపీఈ కిట్లు, వెంటిలేటర్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేసేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. విధి నిర్వహణలో సిబ్బంది, వైద్యులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు కరోనా పట్ల ఆందోళన చెందకుండా జాగ్రత్తలు పాటించాలని రాకేష్ సహాయ్ సూచించారు.

బెదిరిస్తున్న యువకుడిపై ఫిర్యాదు

ఫిలింనగర్: నన్ను కాదంటే నువ్వు పెళ్లి ఎలా చేసుకుంటావో చూస్తానంటూ బెదిరించిన మాజీ ప్రియుడిపై ఓ యువతి ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళితే..షేక్‌పేట ఓయూ కాలనీలో నివసించే ప్రముఖ డిజైనర్ (26) ఓ బొటిక్ నడుపుతున్నది. ఆమెకు 2024లో అభిలాష్ అనే యువకుడితో పరిచయం ఏర్పడి ప్రేమకు దారితీసింది. అయితే ఇద్దరూ కొన్ని కారణాల వల్ల విడిపోయారు. అప్పటి నుంచి నిందితుడు అభిలాష్ ఆమెను బ్లాక్‌మెయిల్ చేయసాగాడు. ఆమె ఫొటోలను స్నేహితులకు పంపుతూ ప్రతిష్టను దిగజార్చసాగాడు. ఆమె ఫ్లాట్ వద్ద అనుమానాస్పదంగా తిరగడంతో పాటు జుమాటో డెలివరీ బాయ్‌గా అపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశిస్తూ ఆమె ఫ్లాట్ వద్దకు వచ్చి డెలివరీ ఆర్డర్ తీసుకోవాలంటూ వేధిస్తున్నాడు. ఈ విషయాన్ని ఆమె రెండు రోజుల క్రితం అభిలాష్ సోదరుడి దృష్టికి తీసుకువెళ్లింది. వారు పట్టించుకోలేదు. తనపై ఫిర్యాదు చేస్తావా అంటూ అభిలాష్ మళ్లీ బెదిరింపులు, బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడసాగాడు. నిందితుడి వల్ల తాను బొటిక్ నడపలేకపోతున్నానని, వ్యాపారం దెబ్బతిన్నదని, పూర్తి నష్టాల్లో ఉన్నానని, తన పెళ్లి కూడా ఇతని చేష్టల వల్ల ఇబ్బందులకు గురవుతున్నదని ఆరోపిస్తూ బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు నిందితుడు అభిలాష్‌పై బీఎన్ఎస్ సెక్షన్ 78 (2), 336 (4), 351 (2) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

గస్తీ బృందాలకు కొత్త ట్యాబ్స్



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో గస్తీ విధులు నిర్వర్తించే బ్లూకోల్ట్స్, పెట్రోలింగ్ మొబైల్ బృందాలకు నగర కొత్వాల్ సీవీ ఆనంద్ కొత్త ట్యాబ్‌లు మంజూరు చేశారు. కొన్నేళ్ల క్రితం వీటికి కేటాయించినవి ప్రస్తుతం మరమ్మతులకు లోనవుతుండటంతో కొత్తగా 206 ఖరీదు చేశారు. వీటిని గురువారం కొత్వాల్ సిబ్బందికి అందించారు. అలాగే కొత్తగా ఏర్పాటైన టోలిచౌకి పోలీసుస్టేషన్‌కు అవసరమైన సాంకేతిక ఉపకరణాలను అందించారు.

త్వరితగతిన ఎస్టీపీల పనులు

సాక్షి, సిటీబ్యూరో: ఎస్టీపీల పనుల్లో వేగంపెంచి తుది దశలో ఉన్న వాటిని ప్రారంభానికి సిద్ధం చేయాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ఈడీ మాయాంక్ మిట్టల్‌తో కలిసి అంబర్‌పేట్, అత్తాపూర్ ఎస్టీపీలను సందర్శించారు. తొలుత అంబర్‌పేట్ ఎస్టీపీకి వెళ్లిన ఆయన.. అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. చిన్న చిన్న సివిల్ వర్క్‌లు, గార్డెనింగ్, పెయింటింగ్, అంతర్గత రోడ్ల నిర్మాణంలాంటి పనుల్ని యుద్ధ ప్రాతిపదికన చేపట్టి ఎస్టీపీని ప్రారంభానికి సిద్ధం చేయాలని పేర్కొన్నారు. అనంతరం అత్తాపూర్ ఎస్టీపీని సైతం సందర్శించారు. పనుల పురోగతిని పరిశీలించిన ఎండీ మిగిలిపోయిన పనుల్ని సాధ్యమైనంత తొందరగా పూర్తిచేసి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ టీవీ శ్రీధర్, సీజీఎం సుజాత, ఎస్టీపీ ప్రాజెక్టు అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అడుగు లోతులో.. అక్రమాలు!

ప్రైవేటు కాంట్రాక్టర్లతో ఇంజనీర్ల కుమ్మక్కు

- అంచనాలకు భిన్నంగా యూజీ కేబుల్ పనులు
- తవ్వకాల్లో బయటపడుతున్న లోపాలు
- తరచూ వెలుగు చూస్తున్న షార్ట్ సర్క్యూట్‌లు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: గ్రేటర్‌లో భూగర్భ కేబుళ్ల నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. అంచనాలకు భిన్నంగా పనులు చేయడంతో పాటు ప్రతిపాదిత మార్గానికి భిన్నంగా లైన్లు తవ్వుతుండటం.. నిర్దేశిత ప్రమాణాలకు భిన్నమైన కేబుళ్లు, విద్యుత్ పరికరాలు వాడుతుండడంతో లైన్లు వేసిన కొద్ది రోజులకే దెబ్బతింటున్నాయి. ముఖ్యంగా ఐటీ, అనుబంధ కంపెనీలకు, భారీ గృహ, వాణిజ్య సముదాయాలకు నిలయమైన ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో చేపడుతున్న భూగర్భ కేబుల్ (యూజీ) పనుల నాణ్యతపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రైవేటు కాంట్రాక్టర్లతో ఇంజనీర్లు కుమ్మక్కై.. ఆయా రియల్ ఎస్టేట్ డెవెలపర్స్, వినియోగదారులకు కుచ్చుటోపీ పెడుతున్నారు. వాస్తవ ఖర్చుకు భిన్నంగా అంచనాలు రూపొందించడంతో పాటు అడ్డగోలుగా లైన్లు వేస్తున్నారు. నాసిరకం పనులు చేపడుతుండటంతో వేసిన కొద్ది రోజులకే ఆయా లైన్లలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయాలకు కారణమవుతున్నాయి. ఇప్పటికే కాన్సులేట్ కార్యాలయానికి చేపట్టిన యూజీ కేబుల్ పనులు సహా కొండాపూర్, ఇబ్రహీంబాగ్, గచ్చిబౌలి, రాజేంద్రనగర్, సరూర్‌నగర్, కందుకూరు, బంజారాహిల్స్, కూకట్‌పల్లి, మేడ్చల్, జీడిమెట్ల, హబ్సిగూడ డివిజన్ల పరిధిలో చేపడుతున్న యూజీ కేబుల్ పనులను 'కేబుల్ టెస్టింగ్ వ్యాన్ల ద్వారా తనిఖీ చేపడితే అక్రమాలన్నీ బయటపడే అవకాశం ఉంది.

ఓ డెవలపర్స్‌కు నోటీసులు

పుప్పాల్‌గూడ పరిధిలో నిర్మాణంలో ఉన్న ఓ ప్రైవేటు డెవలపర్స్ సంస్థ రెండేళ్ల క్రితం విద్యుత్ సరఫరా కోసం దరఖాస్తు చేసుకుంది. డిస్కం ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి అంచనాలు రూపొందించారు. సదరు సంస్థకు 9,951 కిలో వాట్స్ సామర్థ్యంతో కూడిన డిమాండ్ అవసరం ఉన్నట్లు గుర్తించారు. సమీపంలోని సబ్‌స్టేషన్ నుంచి భూగర్భ కేబుల్ లైన్ వేసుకోవాల్సిందిగా సూచించి, ఆ మేరకు ఏ సబ్‌స్టేషన్ నుంచి ఏ మార్గంలో లైను వేయాలి? ఎన్ని అడుగుల లోతు తవ్వాలి? ఎంత సామర్థ్యంతో కూడిన కేబుల్ వేయాలి? కేబుల్ రక్షణ కోసం ఎంత పరిమాణంలో ఇసుక పోయాలి? కేబుళ్లపై ఏ సైజులో ఉన్న షాబాద్ బండలు పరచాలి? వంటి అన్ని అంశాలను ఎస్టిమేషన్‌లో పొందుపర్చారు. పనులు దక్కించుకున్న ప్రైవేటు కాంట్రాక్టర్ అంచనాలకు భిన్నంగా కేబుల్ పనులు చేసినట్లు గుర్తించారు. నిజానికి 1.5 మీటర్ల లోతులో వేయాల్సిన కేబుళ్లను భూమిపైనే పరిచారు. కేబుల్ కింది భాగంలో 50 ఎంఎం, పై భాగంలో 250 ఎంఎం మందం ఇసుక పోయాలి. ఆర్వాత కేబుల్‌కు రక్షణగా 40 ఎంఎం షాబాద్ బండలు అమర్చాల్సి ఉంది. కానీ సదరు కాంట్రాక్టర్ పూర్తి నాసిరకంగా పనులు చేపట్టినట్లు గుర్తించారు. అంతేకాదు అధికారులు సూచించిన ప్రాంతంలో కాకుండా మరో ప్రాంతం నుంచి ట్రెంచ్ తవ్వినట్లు నిర్ధారించారు. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన ఈ పనులను నిలిపివేయాల్సిందిగా ఇప్పటికే డిస్కం సదరు డెవెలపర్స్‌కు నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది.



పుప్పాల్‌గూడలోని ఓ బహుళ అంతస్తుల భవనం కోసం భూమిపై నుంచే పరిచిన కేబుళ్లు

ఆ భవనాలకు కుచ్చుటోపీ

భూగర్భ కేబుల్ కాంట్రాక్టర్లు అదే ప్రాంతంలోని ఓ ప్రముఖ ఆస్పత్రి సహా బ్యాంకు, ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలను మోసం చేశారు. ఆర్సీపురం 130 కేవీ సబ్‌స్టేషన్ నుంచి ఓ బ్యాంకు కోసం వేసిన భూగర్భ కేబుల్ లైన్ పనులు అంచనాలకు భిన్నంగా ఉన్నట్లు తెలిసింది. అదే విధంగా ఓ ప్రముఖ బహుళ అంతస్తుల భవనం సహా ఆస్పత్రి లైన్లను కూడా అంచనాలకు భిన్నంగా వేశారు. రెండు సంస్థల నుంచి వేర్వేరు చార్జీలు వసూలు చేసి, సింగిల్ ట్రెంచ్ నుంచే కేబుల్స్ వేశారు. యూజీ కేబుల్ లైన్లపై దరఖాస్తుదారులకు కానీ, డెవెలపర్లకు కానీ సరైన అవగాహన లేకపోవడం కూడా కాంట్రాక్టర్లకు కలిసి వస్తోంది.

ఓయూ డిగ్రీ ఫలితాల్లో బాలికల హవా

- నాలుగు కోర్సుల్లో 70 శాతం ఉత్తీర్ణత
- 75 శాతం బాలికలు... 60 శాతం బాలురు పాస్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ డిగ్రీ ఫలితాలను విడుదల చేశారు. గురువారం సాయంత్రం ప్రకటించిన డిగ్రీ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ కోర్సుల ఫలితాల్లో బాలుర కంటే బాలికలు అధిక శాతం ఉత్తీర్ణత సాధించారు. యూనివర్సిటీ పరిధిలో ఏప్రిల్‌లో జరిగిన బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఎం రెగ్యులర్ కోర్సుల్లో వివిధ సెమిస్టర్ పరీక్షల్లో మొత్తం 70 శాతం ఉత్తీర్ణత సాధించగా అందులో బాలికలు 79 శాతం, బాలురులు 60 శాతం పాసైనట్లు అధికారులు పేర్కొన్నారు. బీఏలో 1874 బాలికలు, 1294 బాలురులు మొత్తం 3168 మంది పాస్‌కాగా, బీకాంలో 14826 బాలికలు, 10312 బాలురులు మొత్తం 25138, బీఎస్సీలో 7468 బాలికలు, 1628 బాలురులు మొత్తం 9096, బీబీఏలో 3247 బాలికలు మొత్తం 6542 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వివిధ డిగ్రీ కోర్సుల చివరి సంవత్సరంలో మొత్తం 43,942 మంది పాసైనట్లు అధికారులు వివరించారు. ఫలితాలను ఉస్మానియా వెబ్‌సైట్లో చూడవచ్చు.

యువ క్రీడాకారుడు సాయివర్ధన్‌కు సత్కారం



సాక్షి, సిటీబ్యూరో: ఒలంపిక్స్‌లో పతాకం సాధించడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, అందుకు పూర్తి సహకారం అందిస్తామని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారుడు జవాజి సాయివర్ధన్‌కు భరోసా ఇచ్చారు. ఈ నెల 4 నుండి 15 వరకు బీహార్ రాష్ట్రంలోని రాజగిరిలో నిర్వహించిన జాతీయస్థాయి ఖేలో ఇండియా యూత్ నేషనల్ గేమ్స్‌లో తెలంగాణ రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహించి వెయిట్ లిఫ్టింగ్ 89 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించిన సాయివర్ధన్ గురువారం కలెక్టర్‌ను ఆయన ఛాంబర్‌లో కలిశారు. బంగారు పతకం సాధించినందుకు సాయి వర్ధన్‌కు అభినందనలు తెలిపి శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి సుధాకర్, అథ్లెట్ కోచ్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రెయిన్‌బో ఆస్పత్రి చైర్మన్ పేరుతో సైబర్ మోసానికి యత్నం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-10లోని రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ చైర్మన్ పేరుతో అదే సంస్థకు చెందిన సీఎఫ్ఓకు రూ.20 లక్షలు పంపాలంటూ వాట్సప్ మెసేజ్ రాగా, ఆయన చాకచక్యంగా వ్యవహరించి సైబర్ మోసానికి కళ్లెం వేశారు. ఈ మేరకు బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే...బంజారాహిల్స్‌లోని రెయిన్‌బో చిల్డ్రన్స్ మెడికేర్ లిమిటెడ్ సీఎఫ్ఓ వికాస్ మహేశ్వరికి ఇటీవల సంస్థ సీఎండీ డాక్టర్ రమేష్ కంచర్ల పేరుతో ఓ వాట్సప్ మెసేజ్ వచ్చింది. తనకు రూ.20 లక్షలు పంపించాలని, ఓ బ్యాంక్ అకౌంట్ ఖాతాను కూడా పంపించాడు. అయితే ఈ బ్యాంక్ అకౌంట్ రాంచీలోని కిషోర్‌గంజ్ బ్యాంక్ నుంచి వచ్చింది. వాట్సప్ నెంబర్ కూడా తన చైర్మన్‌ది కాకపోవడంతో వికాస్ మహేశ్వరి లోతుగా ఆరాతీశాడు. బ్యాంక్ అకౌంట్‌తో పాటు తన చైర్మన్ ఫోన్ నెంబర్ కూడా వేరేగా ఉండటంతో అనుమానం వచ్చి వెంటనే రమేష్ కంచర్లకు ఫోన్ చేసి మీరు డబ్బులు పంపించాలని మెసేజ్ చేశారా? అని అడిగాడు. తాను ఎలాంటి మెసేజ్ చేయలేదని ఆయన చెప్పడంతో ఇది సైబర్ మోసమని గ్రహించిన వికాస్ మహేశ్వరి బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మత్తు మందిచ్చి లైంగిక దాడి.. ఆపై బ్లాక్‌మెయిల్

బంజారాహిల్స్: ఫేస్‌బుక్‌లో పరిచయమైన ఓ యువకుడు లంచ్‌కు తన ఇంటికి వచ్చిన యువతికి మత్తు మందు ఇచ్చి లైంగిక దాడికి పాల్పడిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..బంజారాహిల్స్ రోడ్డునెంబర్-7లో నివసించే మహేంద్రవర్ధన్ అనే యువకుడికి ఫేస్‌బుక్‌లో ఓ యువతి పరిచయమైంది. తాను ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థినని మహేంద్ర ఆమెను పరిచయం చేసుకున్నాడు. 2023 ఆగస్టు 15న ఇద్దరూ కలిసి మహేంద్ర ఇంటికి లంచ్ కోసం వచ్చారు. ఆ సమయంలో ఆమెకు మత్తు మందు ఇవ్వడంతో నిద్రలోకి జారుకుంది. అదే సమయంలో యువతిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. మెళకువ వచ్చి చూసుకునేసరికి బాధితురాలు జరిగిన విషయాన్ని గమనించి షాక్‌కు గురైంది. ఈ విషయంలో మహేంద్రవర్ధన్ కొంతకాలంగా ఆమెను బ్లాక్‌మెయిల్ చేయసాగాడు. దీంతో ఆమె రూ.20 లక్షల వరకు చెల్లించుకుంది. ఫోటోలు బయటపెడతానని, బండారం అందరికీ తెలియజేస్తానని రోజురోజుకు నిందితుడి వేధింపులు పెరిగిపోవడంతో పాటు ఇటీవల రూ. కోటి ఇవ్వాలంటూ డిమాండ్ చేశాడు. దీంతో ఆయనపై చర్యలు తీసుకోవాలంటూ బాధితురాలు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు నిందితుడిపై బీఎన్ఎస్ 64(1), 308 (2), 351 (2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంకా ఎంత మంది అమాయకులను చంపుతారు?

- తెలుగు రాష్ట్రాల్లో ఇంకా ఎంత మంది ఉగ్రవాదులు ఉన్నారో..
- వైరల్ అవుతున్న బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ వ్యాఖ్యలు

సాక్షి, సిటీబ్యూరో: తెలుగు రాష్ట్రాల్లో ఉగ్రవాదులు ఇంకా ఎంత మంది అమాయక, పేద ప్రజలను చంపాలనుకుంటున్నారని ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రశ్నించారు. ఆయన ఉగ్రవాదులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యల వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అందులో ఆయన మాట్లాడుతూ 'పేద ప్రజలను చంపడానికి టిఫిన్ బాక్స్ బాంబులు తయారు చేస్తున్నారు. ఎక్కడెక్కడో బాంబులు పెట్టి పేల్చడానికి కుట్రలు చేస్తున్నారు. వాళ్లకు నేను ఒక్కటే మాట చెప్పాలనుకుంటున్నా. ఇంకా ఎంత మందిని చంపాలనుకుంటున్నారు. గతంలో కూడా లుంబినీ పార్కు, గోకుల్‌చాట్, సాయిబాబా దేవాలయం వద్ద ఎవరిని చంపారు. వారంతా పేద ప్రజలు. బస్టాప్‌లో ఎవరు నిలుచుంటారు. వారంతా పేదలు.. చనిపోయారు. ఇప్పుడు ఇద్దరు దొంగలు దొరికారు. ఎవరు వీరు.. సిరాజ్, సమీర్. ఈ కేసు విచారణ చేస్తున్న పోలీసు అధికారులకు ఒక రిక్వెస్ట్ చేస్తున్నా. గతంలో కూడా బాంబులు పేల్చిన వారి తరపున ఎంఐఎం పార్టీకి చెందిన ఓ న్యాయవాది వాదించారు. ఇప్పుడు ఇద్దరు అరెస్టు అయ్యారు. వీరికి కూడా ఇదే అడ్వకేట్‌ను పెడుతుంది. వాళ్లు బయటకు వస్తారు. మళ్లీ బాంబులు తయారు చేస్తారు. తెలుగు రాష్ట్రాల్లో ఇలాంటి సిరాజ్, సమీర్ లాంటి వారు ఇంకా ఎంత మంది ఉన్నారు. దీనిపై కూడా పోలీసులు పూర్తిగా విచారణ చేయాలి. వీళ్లు ఎవరెవరిని టార్గెట్ చేశారు. కనీసం హిట్ లిస్టులో ఉన్న వారికైనా ఫోన్ చేసి చెప్పండి. ఐఎస్ఐ కుక్కలకు ఒక్కటే చెబుతున్నా. నా ఫ్యామిలీ జోలికి వస్తే మీ ఫ్యామిలీలు కూడా ఉండవు' అని ఆయన పేర్కొన్నారు.

పెళ్లి చేసుకోకపోతే సూసైడ్ చేసుకుంటానంటూ బెదిరింపు

ఫిలింనగర్: తనను పెళ్లి చేసుకోపోతే సూసైడ్ చేసుకుంటానంటూ ఓ యువకుడు బెదిరించడమే కాకుండా ఆమె కళ్లముందే బ్లేడ్‌తో చేతిని కట్ చేసుకుని బ్లాక్‌మెయిల్‌కు పాల్పడిన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..యూసుఫ్‌గూడ ఎల్ఎన్ నగర్‌లో నివసించే యువతి (24) జూబ్లీహిల్స్‌లోని ఓ ఆస్పత్రిలో పని చేస్తోంది. రెండేళ్ల క్రితం జూబ్లీహిల్స్ వెంకటగిరికి చెందిన ఎస్.అరవింద్ అనే దూరపు బంధువుతో పరిచయం ఏర్పడింది. అనంతరం ఇద్దరూ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకోగా..వారి పెద్దలు ఒప్పుకోలేదు. దీంతో రెండు కుటుంబాలు ఒప్పుకోకపోతే తాను పెళ్లి చేసుకోనని యువతి చెప్పింది. ఆగ్రహించిన అరవింద్ గత మూడు నెలలుగా ఆమెను పెళ్లి చేసుకోవాలంటూ మానసిక వేధింపులకు గురిచేస్తున్నాడు. ఆమె తిరస్కరిస్తూ వస్తున్నది. దీంతో ఆమె పనిచేస్తున్న ఆస్పత్రి వద్దకు కూడా రోజూ వెళ్తూ పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేయసాగాడు. బుధవారం రాత్రి ఆమె విధులు ముగించుకుని ఆస్పత్రి పార్కింగ్ స్థలంలోకి వచ్చి స్కూటీ తీసుకుంటుండగా, అక్కడికి వచ్చిన అరవింద్ ఆమెను అడ్డుకున్నాడు. పెళ్లి చేసుకోవాలని మరోసారి ఒత్తిడి చేశాడు. ఆమె కుదరదని చెప్పడంతో జేబులో ఉన్న బ్లేడ్ తీసి చేతిని కోసుకున్నాడు. తనను పెళ్లి చేసుకోకపోతే ఇక్కడే సూసైడ్ చేసుకుంటానంటూ బెదిరించాడు. దీంతో బాధితురాలు అక్కడి నుంచి తప్పించుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిలింనగర్ పోలీసులు నిందితుడిపై బీఎన్ఎస్ సెక్షన్ 78 (2), 351 (2) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేధిస్తున్న వ్యక్తి నుంచి ప్రాణహాని ఉందంటూ ఫిర్యాదు

బంజారాహిల్స్: తన కుమారుడి స్నేహితుడి తండ్రి నుంచి ప్రాణహానితో పాటు మానసిక వేధింపులు ఎక్కువవుతున్నాయని, చర్యలు తీసుకోవాల్సిందిగా బాధితురాలు జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళితే... శ్రీనగర్ కాలనీ సమీపంలోని ప్రగతినగర్‌లో నివసించే డిజైనర్ (39)కి బంజారాహిల్స్‌లో ఓ బొటిక్ ఉంది. ఆమె కుమారుడు జూబ్లీహిల్స్‌లోని ఓ కార్పొరేట్ స్కూల్‌లో చదువుకుంటున్నాడు. కుమారుడి స్నేహితుడు తండ్రి మురళి ఆమె ఫోన్ నెంబర్ తీసుకుని తరచూ ఆమెతో మాట్లాడసాగాడు. ఇది పద్ధతి కాదని పలుమార్లు ఆమె హెచ్చరించి నెంబర్‌ను బ్లాక్ చేసింది. అయితే ఈ నెల 17వ తేదీన బొటిక్ మూసి ఇంటికి వెళ్తుండగా రాత్రి 8.30 గంటల సమయంలో నిందితుడు మురళి ఆమె ఇంటి సమీపంలో వాహనం ఆపి తన నెంబర్‌ను ఎందుకు బ్లాక్ చేశావంటూ నిలదీశాడు. అన్‌బ్లాక్ చేయాలని హెచ్చరించాడు. ఎలాగోలా నిందితుడి నుంచి తప్పించుకుని ఇంటికి వెళ్లిపోయింది. మరుసటి రోజు రాత్రి కూడా మురళి ఆమెను దారికాసి అడ్డుకుని ఆమె హ్యాండ్‌బ్యాగ్‌ను, స్కూటీ తాళం చెవులను తీసుకుని ముందుకు వెళ్లకుండా చేశాడు. బతిమిలాడిన ఆమె తాళం చెవులు తీసుకుని ఇంటికి వెళ్లిపోయింది. ఈ నెల 24 నుంచి 27వ తేదీ మధ్యలో నిందితుడు ఆమెకు వాట్సప్‌లో అసభ్యకర సందేశాలు పంపాడు. ప్రవర్తన నచ్చకపోవడంతో మళ్లీ నెంబర్ బ్లాక్ చేసి విషయం భర్త దృష్టికి తీసుకువెళ్లింది. తనను వేధింపులు, బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వరుస చోరీలకు పాల్పడుతున్న పాత నేరస్తుడి అరెస్టు

రూ.20 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

నాగోలు: వరుస చోరీలకు పాల్పడుతున్న పాత నేరస్తుడిని పహాడీషరీఫ్ పోలీస్‌లు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అతని వద్ద రూ.20 లక్షల విలువైన బంగారు, వెండి అభణాలు, నగదు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గురువారం ఎల్‌బీనగర్ సీపీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లాలోని గజలపేట గ్రామానికి చెందిన అల్లం శివ (27) జీవనోపాధి కోసం నగరానికి వచ్చి అంబర్‌పేట్‌లో నివాసం ఉంటున్నాడు. మద్యం, డ్రగ్స్, బెట్టింగ్‌ల వంటి దుర్వ్యసనాలకు బానిసైన శివ డబ్బు కోసం నేరాలను ప్రారంభించాడు. 2023, 2024లలో అంబర్‌పేట్, వెల్దండ, ఊర్కొండ, మిడ్జిల్, మంచాల్, కల్వకుర్తి పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు దొంగతనాలకు పాల్పడి జైలుకు కూడా వెళ్లాడు. జైలు నుండి విడుదలయ్యాక కూడా తీరు మార్చుకోకుండా పహాడీషరీఫ్, హయత్ నగర్, ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 7 చోట్ల మళ్లీ చోరీలకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తుండగా బుధవారం షాలిబండలో దొంగిలించిన వస్తువులను విక్రయించడానికి ప్రయత్నిస్తుండగా పహాడీషరీఫ్ పోలీసులు పట్టుకున్నారు. అతన్ని విచారణ చేయగా 7 చోట్ల చోరీలు చేసినట్లు ఒప్పుకున్నాడు. దీంతో అతని వద్ద నుండి పోలీసులు 17 తులాల బంగారు ఆభరణాలు, 41 తులాల వెండి ఆభరణాలు, రూ. 50 వేల నగదు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. శివను పహాడీషరీఫ్ డిఐ జితేందర్ రెడ్డి నేతృత్వంలోని క్రైమ్ బృందం పట్టుకున్నట్లు సీపీ తెలిపారు. ఈ సమావేశంలో మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, అడిషనల్ డీసీపీ బి.వి.సత్యనారాయణ, ఏసీపీ జానకిరెడ్డి, పహాడీషరీఫ్ సీఐ గురువారెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి ఆభరణాలు



స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

గోవాలో క్యాసినో సెక్యూరిటీ గార్డు హత్య

స్వల్ప వివాదం నేపథ్యంలో చంపేసిన నగర వాసి

- నిందితుడు మైలార్‌దేవ్‌పల్లి ఠాణా రౌడీషీటర్ అల్తాఫ్
- దబోలిం ఎయిర్‌పోర్టు దారిలో పట్టుకున్న పనాజీ పోలీసులు



సాక్షి, సిటీబ్యూరో: పేకాట కోసం హైదరాబాద్ నుంచి గోవా వెళ్లిన ఓ రౌడీషీటర్ బుధవారం అర్ధరాత్రి రెచ్చిపోయాడు. పనాజీలోని కంపాల్‌లో ఉన్న ఓ క్యాసినోలో వీరంగం సృష్టించాడు. స్వల్ప వివాదం నేపథ్యంలో విచక్షణ కోల్పోయి కత్రతో సెక్యూరిటీ గార్డులపై విరుచుకుపడ్డాడు. ఈ ఉదంతంలో ఓ సెక్యూరిటీ గార్డు చనిపోగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. గోవా నుంచి పారిపోవడానికి దబోలిం విమానాశ్రయానికి వెళ్తుండగా సదరు రౌడీషీటర్‌ను పనాజీ పోలీసులు మార్గమధ్యంలో గురువారం తెల్లవారుజామున అరెస్టు చేశారు. చార్మినార్‌లోని మిశ్రీగంజ్‌కు చెందిన అబ్దుల్ అల్తాఫ్‌కు నేరచరిత్ర ఉంది. ఈ నేపథ్యంలోనే ఇతడిపై సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు రౌడీషీట్ తెరిచారు. పేకాట కోసం తరచు గోవా వెళ్లివచ్చే ఇతగాడు రెండు రోజుల క్రితం అలానే వెళ్లాడు. బుధవారం రాత్రి గోవా రాజధాని పనాజీలోని కంపాల్‌లో ఉన్న క్యాసినో కార్నివాల్ అనే క్యాసినోకు వెళ్లాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత స్వల్ప విషయమై క్యాసినో నిర్వాహకులతో అల్తాఫ్‌కు వివాదం ఏర్పడింది. యాజమాన్యం ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన ఆ క్యాసినో సెక్యూరిటీ గార్డులు అల్తాఫ్‌కు సర్దిచెప్పడంతో పాటు అక్కడ నుంచి పంపించే ప్రయత్నం చేశారు. దీంతో విచక్షణ కోల్పోయిన అల్తాఫ్ క్యాసినోలోని ఇంటర్నల్ స్టెయిర్ కేస్‌కు సంబంధించిన బ్లస్టర్ (పక్కన ఉండే కర్ర) విరగ్గొట్టి, దాన్ని తీసుకుని సెక్యూరిటీ గార్డులపై దాడి చేశాడు. ఈ బ్లస్టర్‌కు కింది భాగంలో ఇనుప తొడుగు ఉండటంతో మధ్యప్రదేశ్ నుంచి వెళ్లి గోవాలో పని చేస్తున్న దీరు శర్మ, సౌత్ గోవాలోని షిరోడాకు చెందిన సత్యం గోవాన్కర్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని సహచర సెక్యూరిటీ గార్డులు బాంబోలింలోని గోవా మెడికల్ కాలేజీ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ దీరు శర్మ చనిపోగా... సత్యం పరిస్థితి విషమంగా ఉంది. అదును చూసుకుని ఆ క్యాసినో నుంచి బయట పడిన అల్తాఫ్ తాను బస చేసిన హోటల్ గదికి వెళ్లాడు. అక్కడ నుంచి తన లగేజీ తీసుకుని నార్త్ గోవాలోని దబోలిం విమానాశ్రయానికి బయలుదేరాడు. విషయం పోలీసుల వద్దకు వెళ్లి, కేసు నమోదయ్యే లోపు హైదరాబాద్ వచ్చి అజ్ఞాతంలోకి వెళ్లిపోవాలని భావించాడు. క్యాసినో కార్నివాల్‌లో జరిగిన ఈ ఘాతుకంపై గురువారం తెల్లవారుజామున 3.10 గంటలకు పనాజీ పోలీసులకు సమాచారం అందింది. తక్షణం అప్రమత్తమైన నార్త్ గోవా ఎస్పీ రాహుల్ గుప్తా నిందితుడిని పట్టుకోవడానికి ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దింపారు. క్యాసినోలోని సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాలతో పాటు సాంకేతిక ఆధారాలను బట్టి నిందితుడు అల్తాఫ్‌గా గుర్తించారు. అతడు విమానాశ్రయానికి వెళ్తున్నాడని తెలుసుకుని మార్గమధ్యంలో అరెస్టు చేశారు. ఈ నేరాన్ని లోతుగా దర్యాప్తు చేస్తున్న గోవా పోలీసులు అల్తాఫ్ అక్కడకు ఎందుకు వచ్చాడు? వివాదానికి కారణం ఏంటి? అనే విషయాలు ఆరా తీస్తున్నారు.

వర్షపు నీటిని ఒడిసి పట్టాలి

వెంగళరావునగర్: ప్రతి వర్షపు చినుకునూ ఒడిసి పట్టి భూగర్భంలోకి పంపాలని.. ఆదిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.వి.రవిశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. వెంగళరావునగర్ కాలనీ పార్కు సమీపంలో ఆయన ఇంకుడు గుంతలను పునరుద్ధరించారు. కాలనీలో ఉన్న యువత సహకారంతో సొంత ఖర్చులతో కాలనీలోని ప్రతి ఇంకుడు గుంతను తిరిగి ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఎవరో వస్తారు, ఏదో చేస్తారని ఎదురు చూడకుండా మనమే నడుం బిగించి ఇంకుడుగుంతలను ఏర్పాటు చేసుకున్నట్టయితే నీటి ఎద్దడి ఉండదన్నారు. నీరు ఉంటేనే మానవునికి మనుగడ ఉంటుందనేది మరచిపోకూడదని చెప్పారు. హైకోర్ట్ న్యాయవాది లక్ష్మీకాంతరావు, ప్రొఫెసర్ టి.వి. రెడ్డి, సాయి, నాగరాజు, భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అనుచరుడి వీరంగంపై విజిలెన్స్ విచారణ

సనత్‌నగర్: జీహెచ్‌ఎంసీ బేగంపేట సర్కిల్ టౌన్‌ప్లానింగ్ సిటీ ప్లానర్ సుష్మితపై ఎమ్మెల్యే దానం నాగేందర్ అనుచరుడు సుదీప్‌పటేల్ వీరంగం సృష్టించిన ఘటనపై విజిలెన్స్ అధికారులు గురువారం విచారణ చేపట్టారు. విజిలెన్స్ డీఎస్పీ, సీఐతో పాటు నలుగురు సభ్యుల బృందం బేగంపేట సర్కిల్ కార్యాలయంలో అధికారులతో మాట్లాడారు. డీసీ డాకూనాయక్‌తో మాట్లాడి వివరాలు సేకరించారు. అలాగే సిబ్బందితో కూడా మాట్లాడి ఘటనపై ఆరా తీశారు. 'సుదీప్‌పటేల్ టౌన్‌ప్లానింగ్ డీసీపీతో అమర్యాదగా మాట్లాడాడని, నీ అంతు చూస్తానని ఆమెను బెదిరించినట్లు' సర్కిల్ కార్యాలయ అధికారులు వారికి చెప్పినట్లు తెలిసింది. భయపెట్టే రీతిలో దురుసుగా వ్యవహరించడంతో పాటు దూషిస్తూ సుదీప్ పటేల్ వీరంగం సృష్టించినట్లు వారికి వాంగ్మూలం ఇచిచనట్లు సమాచారం.

వేడుకగా అహల్యాబాయి హోల్కర్ జయంతి

కాచిగూడ: పుణ్యశ్లోక లోకమాత రాణి అహల్యాబాయి హోల్కర్ త్రిశతాబ్ది జయంతి వేడుకలను గురువారం కాచిగూడలోని బీజేపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ అహల్యాబాయి హోల్కర్ చిత్రపటానికి పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్వయం సహాయక పొదుపు గ్రూపు మహిళలు, బీజేపీ నేతలు కిలారి మనోహర్, అనంతలక్ష్మి, జ్యోతి, లావణ్య, తారా, వాసు, అరవింద్, శాంతాబాయి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సర్కార్ బడుల్లో ఏఐ పాఠాలు!

ఖైరతాబాద్ జోన్‌లో నాలుగు స్కూళ్ల ఎంపిక

- ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభం
- ఆసక్తి చూపుతున్న విద్యార్థులు
- పూర్తయిన ఉపాధ్యాయులకు శిక్షణ



శిక్షణ ఇస్తున్న డిపార్ట్‌మెంటల్ అధికారి



శిక్షణ తీసుకుంటున్న ఉపాధ్యాయులు

బంజారాహిల్స్: ప్రాథమిక స్థాయి పిల్లలకు కృత్రిమ మేధ (ఏఐ) ద్వారా బోధించేందుకు విద్యా శాఖాధికారులు చర్యలు చేపట్టారు. గత ఏడాది మార్చిలో ప్రయోగాత్మకంగా కొన్ని పాఠశాలలను ఎంపిక చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసి ప్రగతి బాట పట్టేందుకు ఏఐ విస్తృతంగా దోహదపడుతుంది. తెలుగు, ఇంగ్లిష్, గణిత చతుర్విధ ప్రక్రియల్లో దీని ద్వారా పట్టు సాధించడానికి అవకాశం ఉంటుంది.

- ఖైరతాబాద్ విద్యాశాఖ జోన్ పరిధిలో నాలుగు ప్రాథమిక పాఠశాలలను ఇందుకోసం ఎంపిక చేసి 2025–26వ విద్యా సంవత్సరం నుంచే ఏఐ బోధనకు శ్రీకారం చుట్టబోతున్నారు.
- బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–7లోని గతి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ఫిలింనగర్‌లోని ఎంఆర్‌సీకాలనీ ప్రైమరీ స్కూల్, రాజ్‌భవన్ ప్రైమరీ స్కూల్, జవహర్‌నగర్ ప్రైమరీ స్కూళ్లను ఏఐ పాఠాల కోసం ఎంపిక చేసి ఆయా పాఠశాలలకు కంప్యూటర్లను కూడా అందజేశారు. ఇటీవలే ఏఐ బోధనకు సంబంధించి నిపుణులైన డిపార్ట్‌మెంటల్ అధికారులు టీచర్లకు శిక్షణ కూడా ఇచ్చారు.
- ఎంపికచేసిన నాలుగు పాఠశాలల్లో ఏఐ బోధన జరగనుంది. 1–5వ తరగతుల వరకు పుస్తకాల్లో 2–3 పేజీల్లో ఏఐ పాఠాలను పొందుపరచనున్నారు. ఇంకా ముద్రణ కాని పాఠ్య పుస్తకాలపై ఏఐకి సంబంధించి అంశాలు పొందుపరుస్తున్నారు.
- ఏఐ ద్వారా గణితం, ఆంగ్లంతో పాటు సామర్థ్యాలను పెంచేలా చూడనున్నారు.

కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా...

- ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ప్రమాణాలు పడిపోకుండా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నిలబెట్టాలని విద్యాశాఖ పక్కా ప్రణాళికలతో ముందుకువచ్చింది. తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల్లో చదివించేందుకు మొగ్గు చూపుతున్న నేపథ్యంలో దీనిని అరికట్టేందుకు ప్రైవేటు పాఠశాలలకు అడ్డుకట్ట వేయడానికి సర్కార్ బడుల్లో కార్పొరేట్‌కు దీటుగా సాంకేతిక పాఠాలనే బోధించేందుకు ఏ–ఎక్సెల్ (అసిస్టెడ్–లాగ్వేజ్ అండ్ మ్యాథ్స్ లెర్నింగ్) విధానాన్ని ప్రవేశపెట్టారు. ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫాంల పంపిణీతో పాటు సాంకేతిక బోధన అందనుండటంతో ఆయా పాఠశాలల్లో ప్రవేశాలు పెరుగుతాయని టీచర్లు భావిస్తున్నారు. ఇందుకోసం ప్రణాళికను రూపొందించి అమలుచేయనున్నారు.
- ఏఐ బోధన ద్వారా సుమారు 2,000 మంది విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోనున్నారు.

అమలు ఇలా...

- ప్రతి విద్యార్థికి కేటాయించిన శాశ్వత గుర్తింపు సంఖ్యతో లాగిన్ కావాలి. ఆహ్లాదకర వాతావరణంలో విద్యార్థులను చదివించడం, రాయించడం నేర్పిస్తారు. తెలుగు, ఇంగ్లిష్, గణితంకు సంబంధించి ఎనిమిది దశల్లో సామర్థ్యాలను కృత్రిమ మేధ అంచనా వేస్తోంది.
- ఒక దశ సంపూర్ణంగా పూర్తయితేనే మరొకటి తెరుచుకుంటుంది.
- వెనుకబడిన విద్యార్థుల్లో గణిత చతుర్విధ ప్రక్రియల సామర్థ్య శాతాన్ని పెంచుతుంది.



ఏఐకి ఎంపికైన ఫిలింనగర్ ఎంఆర్‌సీ కాలనీ ప్రభుత్వ పాఠశాల

కంప్యూటర్ల పంపిణీ...

- ఏఐ పాఠాలకు ఎంపికైన పాఠశాలలకు కంప్యూటర్లను పంపిణీ చేశారు. 6–10వ తరగతి గణిత పుస్తకంలో ఏఐ సిలబస్ ముద్రిస్తున్నారు. అన్ని పాఠశాలల్లో ఇంటర్నెట్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అయితే ఇంకా కొన్ని పాఠశాలల్లో తగినన్ని కంప్యూటర్ లేవని ఉపాధ్యాయులు నివేదికలు ఇవ్వడంతో వచ్చే నెల 6వ తేదీలోపు పూర్తిస్థాయిలో కంప్యూటర్లు ఇవ్వాలని నిర్ణయించారు.

సీసీ రోడ్డు నిర్మించరా?



గుంతలమయమైన టీటీడీ ఆలయం రోడ్డు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ టీటీడీ ఆలయం నుంచి అపోలో ఆస్పత్రి వరకు బీటీ రోడ్డు దెబ్బతిని గుంతలు తేలి వాహనదారులు, స్థానికులు నరకాన్ని చవి చూస్తున్నారు. ఇక్కడ రోడ్డు నిర్మించాలని స్థానికులు పలుమార్లు జీహెచ్‌ఎంసీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ రహదారి గుండా నిత్యం వేలాది మంది అపోలో ఆస్పత్రితో పాటు టీటీడీ టెంపుల్‌కు వస్తుంటారు. రాత్రి వేళల్లో ఈ గుంతల రోడ్డులో పలువురు ద్విచక్ర వాహనదారులు ప్రయాణిస్తూ కిందపడి గాయాలపాలవుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అధికారులు ఇక్కడ సీసీ రోడ్డు నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. టమాటా కిలో రూ. 13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 28, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 38, పందిరి బీర 45, క్యాబేజీ 13, క్యారెట్ 31, దొండ 23, గుండుబీన్స్ 85, గింజ చిక్కుడు 65, గోకరకాయ 35, కీర 23, దోసకాయ 15, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 16, ఆలుగడ్డ 24, చామగడ్డ 35, మొరంగడ్డ 18.

ఎట్టకేలకు అంగీకరించిన కవిత!

ప్రజా సంఘాల జేఏసీ ఛైర్మన్, కాంగ్రెస్ నాయకుడు గజ్జెల కాంతం

పంజగుట్ట: ఇప్పటికైనా ఎమ్మెల్సీ కవిత నీతి, నిజాయతీగా బీజేపీలో బీఆర్‌ఎస్ విలీనం చేస్తున్నారని ఒప్పుకుందని తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ ఛైర్మన్, కాంగ్రెస్ నాయకుడు గజ్జెల కాంతం హర్షం వ్యక్తం చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... యావత్ తెలంగాణ సమాజం ఐక్యమై పోరాడితే వచ్చిన తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావ దినోత్సవాన్ని కేటీఆర్ తెలంగాణలో కాకుండా అమెరికాలో నిర్వహిస్తానని వెళ్లడంతోనే బీఆర్‌ఎస్ పని అయిపోయిందని చెప్పకనే చెప్పాడని పేర్కొన్నారు. కన్న బిడ్డను, సొంత చెల్లిని నడిరోడ్డుపై వేసిన ఘనత కేసీఆర్, కేటీఆర్‌లకే దక్కుతుందన్నారు. తెలంగాణ ఉద్యమకారులను, అమరవీరుల కుటుంబాలను పట్టించుకోలేదని కవిత చెప్పింది వంద శాతం నిజమన్నారు. అవసరం ఉన్నప్పుడు వాడుకుని వదిలెయ్యడం కేటీఆర్, హరీష్‌రావులను వెన్నతో పెట్టిన విద్య అని దుయ్యబట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టు దోపిడీ, హైదరాబాద్‌లో దోచుకున్న భూములు, అనేక స్కాంలలో దోచుకున్న రూ. 3 లక్షల కోట్లపై విచారణ జరగకుండా, కేసులు కాకుండా ఉండేందుకే బీఆర్‌ఎస్‌ను బీజేపీలో విలీనం చేసేందుకు ఒప్పందం కుదిరిందని ఆరోపించారు. ఆ విషయాన్నే ఇప్పుడు కవిత బయటపెట్టిందన్నారు. బీఆర్‌ఎస్ నాయకులను బ్రహ్మదేవుడు కూడా కాపాడలేడని, చేసిన తప్పులకు కచ్చితంగా తిహార్ జైలుకు వెళ్లకతప్పదన్నారు. కవిత ప్రస్తుతం కొత్త పార్టీ పెట్టుకున్నా మున్ముందు కాంగ్రెస్ అనే మహా సముద్రంలో ఆ పార్టీని కలపాల్సిందే అన్నారు.

బీఆర్‌ఎస్ నేత సర్దార్ మృతి: బోరబండలో తీవ్ర ఉద్రిక్తత

- బీఆర్‌ఎస్ నాయకుల నిరసనలు
- భారీగా పోలీసుల మోహరింపు



సర్దార్ (ఫైల్)



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాగంటి

రహమత్‌నగర్: బీఆర్‌ఎస్ మైనారిటీ సెల్ బోరబండ డివిజన్ అధ్యక్షుడు మహ్మద్ సర్దార్ మృతి ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసులు ఎస్‌ఆర్‌టీ నగర్, బాబా నివాసం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వివరాలివీ... ఎస్‌ఆర్‌టీ నగర్‌లో మెడికల్ షాపు నిర్వహించే మహ్మద్ సర్దార్ బీఆర్‌ఎస్ మైనారిటీ సెల్ డివిజన్ అధ్యక్షుడిగా ఉన్నారు. ఎస్‌ఆర్‌టీనగర్‌లో బుధవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో సర్దార్ తన భవనం పై నుంచి పడి కింద పడి మరణించారు. కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ వేధింపుల తాళలేక మనస్తాపానికి గురైన సర్దార్ భవనం పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపిస్తూ ఆస్పత్రి వద్ద ఆందోళన నిర్వహించారు. దీంతో ఎస్‌ఆర్‌టీ నగర్, బాబా నివాసం వద్ద పోలీసు పికెట్‌లను ఏర్పాటు చేశారు. డీసీపీ విజయ్‌కుమార్, ఏసీపీ రాఘవేంద్ర రావులు స్వయంగా మృతుడి నివాసానికి చేరుకుని ఎఫ్‌ఆర్‌ఐ కాపీని కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతుడి తమ్ముడి ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్‌తో పాటు మరి కొందరిపై కేసులు నమోదు చేశామని, విచారణ జరిపించి నిందుతులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు. గురువారం బీఆర్‌ఎస్ హైదాబాద్ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి, అల్లాపూర్ కార్పొరేటర్లు సర్దార్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. యాదగిరినగర్‌లోని ఖబరాస్థాన్‌లో ఆయనకు అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడు సర్దార్‌కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

రోడ్డు మధ్యలో షెడ్డుతో ఇబ్బంది



ఫిలింనగర్ కొత్త చెరువు పక్కన రోడ్డు మధ్యలో నిర్మించిన షెడ్డు

ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని కొత్త చెరువు పక్కన బీజేఆర్‌నగర్ బస్తీని ఆనుకొని కొంత మంది కొన్ని నెలల క్రితం రోడ్డు మధ్యలో షెడ్డును నిర్మించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల కోసమని ఏర్పాటు చేసిన షెడ్డు నవరాత్రులు ముగిసిన తర్వాత కూడా తొలగించకపోవడంతో స్థానికుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీనికి తోడు ఈ షెడ్డు మాటున కొంత మంది డబ్బాలు ఏర్పాటు చేసుకొని ఆక్రమణలకు పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపణలు చేస్తున్నారు. అధికారులు గుర్తించి రోడ్డు మధ్యలో ఉన్న షెడ్డును తొలగించాలని స్థానికుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

'నాలుగో సింహం' ఆవిష్కరణ



సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న కిరణ్‌కుమార్ తదితరులు

హిమాయత్‌నగర్: డాక్టర్ దూత రామకోటేశ్వర రావు సంపాదకత్వంలో వెలువడిన 'నాలుగో సింహం' (ప్రాణ రక్షక కవన సంకలనం) అనే కవితా సంకలనాన్ని పలువురు పోలీస్ అధికారుల సమక్షంలో హైదర్‌గూడలోని కమిషనరేట్ కార్యాలయం ఛాంబర్ వేదికగా ఏసీపీ కె.ఎం.కిరణ్ కుమార్ (ఆర్థిక నేరాల విభాగం) ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ... 54 మంది ప్రముఖ కవులు రచించిన అద్భుత కవితలను కూర్చి ఒక సంకలనంగా తీసుకురావడం గర్వించదగ్గ విషయం అన్నారు. ఇలాంటి మంచి ప్రయత్నాలు పోలీసు వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేస్తాయన్నారు. ఇందుకు కృషి చేసిన డాక్టర్ దూత రామకోటేశ్వర రావు, జె.వి.కుమార్ చేపూరి, కవితలు రాసిన కవులను ఆయన ప్రశంసించారు.

అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం



అపార్ట్‌మెంట్ నాలుగవ అంతస్థు నుంచి మంటలు వస్తున్న దృశ్యం

పంజగుట్ట: వెంకటరమణ కాలనీలో గురువారం రాత్రి అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడం, వారు వెంటనే అక్కడకు చేరుకోవడంతో పెద్దప్రమాదం తప్పింది. వివరాలివీ... వెంకటరమణ కాలనీ నుంచి బంజారాహిల్స్ వెళ్లే మార్గంలో ఉన్న అద్విత నెస్ట్ అపార్ట్‌మెంట్ నాలుగవ అంతస్థులో ఓ డబుల్ బెడ్‌రూంలో మహిళల ఫ్యాషన్ డిజైనింగ్ బట్టలు కుట్టే ఓ బొటిక్ షాప్ ఉంది. షాపు నిర్వాహకులు గురువారం రాత్రి ఏడు గంటల సమయంలో మూసివేసి ఎప్పటిమాదిరిగానే తాళం పక్కన ఫ్లాట్ వారికి ఇచ్చి వెళ్లారు. సుమారు ఎనిమిదిన్నర ప్రాంతంలో సదరు బొటిక్ నుంచి పెద్ద ఎత్తున మంటలు వస్తున్న విషయాన్ని ఎదురుగా ఉండే అపార్ట్‌మెంట్ వారు గుర్తించి సదరు అపార్ట్‌మెంట్ వారిని అప్రమత్తం చేశారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చి బొటిక్ తాళం తెరిచి చూడగా ఏసీ నుండి షాట్ సర్క్యూట్ అయి ఏసీ, బెడ్, టీవీ కాలిపోయాయి. వెంటనే అక్కడకు చేరుకున్న రెండు ఫైర్ ఇంజన్‌లు మంటలను ఆర్పివేశాయి. ఖైరతాబాద్ పోలీసులు అక్కడకు చేరుకుని ఎవరినీ ఆ ప్రాంతానికి రాకుండా చూశారు. ఇంట్లో గ్యాస్ ఉంటే పేలే అవకాశం ఉండటంతో సదరు ఫోర్‌లో ఉన్న వారిని కూడా అప్రమత్తం చేసి బయటకు పంపించారు. బొటిక్ మూసివేసే సమయంలో ఏసీ ఆఫ్ చెయ్యడం మర్చిపోయి ఉండవచ్చని అందుకే షార్ట్ సర్క్యూట్ అయి ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. పెద్ద ప్రమాదం తప్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

అందాల పోటీలను బహిష్కరించాలి



అందాల పోటీలకు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శిస్తున్న దృశ్యం

పంజగుట్ట: రాష్ట్ర ప్రభుత్వం రూ. 200 కోట్లు ఖర్చుపెట్టి నిర్వహిస్తున్న అందాల పోటీలు మహిళల అంగాంగ ప్రదర్శనల వేదికలుగా కొనసాగుతున్నాయని మిస్ వరల్డ్ అందాల పోటీల వ్యతిరేక వేదిక అభివర్ణించింది. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మిస్ వరల్డ్ అందాల పోటీలు, మార్కెట్ రాజకీయాలపై రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. పీవోడబ్ల్యూ సంధ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సామాజిక కార్యకర్తలు దేవి, సజయ, కృష్ణకుమారి, అంబికా, స్వరూప పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ..నిత్యం దేశభక్తి, సంస్కృతి, సాంప్రదాయాలు అని మాట్లాడే బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, భజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్‌లు అందాల పోటీలు వ్యతిరేకించకపోవడం దారుణమన్నారు. ఈ పోటీలు సామ్రాజ్యవాదం, పెట్టుబడి వ్యవస్థకు ప్రతీకలన్నారు. ఇటీవల మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ ఓ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అందాల పోటీల్లో పాల్గొంటున్న వారిని ఎగ్జిబిషన్‌లో బొమ్మలుగా చూశారని ఆరోపణలు చేసిందని గుర్తుచేశారు. తెలంగాణ సంస్కృతీ, సాంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పేందుకు పోటీలు నిర్వహిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా.. కాస్మోటిక్ కంపెనీలకు లాభాలు సంపాదించడమే పోటీల ఉద్దేశమని వారు ఆరోపించారు. మహిళలపై, పిల్లలపై ఎలాంటి అఘాయిత్యాలు జరగని తెలంగాణ సాధించడమే నిజమైన బ్యూటీ అన్నారు. సమావేశంలో వివిధ మహిళా సంఘాల నాయకులు జ్యోతి, హేమలత, శ్రీదేవి, ఎస్.ఎల్.పద్మ, శిరోమణి, అనసూయ, ప్రదీప్, మహేష్, రుక్మిణీరావు, అరుణ, అంబిక పాల్గొన్నారు.

ఫోన్ పే చేస్తానని నగదు తీసుకుని..

ఉడాయించిన అగంతకుడు

అమీర్‌పేట: ఏటీఎం కార్డు పనిచేయడం లేదని చెప్పి ఓ విద్యార్థి నుంచి నగదు తీసుకుని ఫోన్ పే చేయకుండా ఉడాయించిన ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం గోపన్నపల్లికి చెందిన అల్లాడి శివశంకర వరప్రసాద్ ఎస్ఆర్‌నగర్‌లోని లక్ష్య కళాశాలలో సీఏ ఫౌండేషన్ కోర్సు చదువుతున్నాడు. శ్రీ రాజరాజేశ్వరీ బాయ్స్ హాస్టల్‌లో ఉంటున్న ప్రసాద్ స్థానికంగా ఉన్న కెనరా బ్యాంక్ ఏటీఎంకు వెళ్లాడు. ఇంతలో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి తన ఏటీఎం కార్డు పనిచేయడం లేదని, అత్యవసరంగా డబ్బు కావాలని రూ.10 వేలు ఇస్తే ఫోన్ పే చేస్తానని నమ్మించాడు. ఫోన్ పే లావాదేవీ జరిగినట్లు మెసేజ్ చూపించి ప్రసాద్ వద్ద నగదు తీసుకుని వెళ్లిపోయాడు. తర్వాత ఫోన్ పేలో డబ్బుల కోసం చూడగా కనిపించకపోవడంతో మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. డబ్బులు తీసుకున్న వ్యక్తి హెల్మెట్, మాస్కు ధరించి ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి సేవిస్తున్న ఇద్దరిపై కేసు

వెంగళరావునగర్: గంజాయిని సేవిస్తున్న ఇద్దరిపై మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... కార్మికనగర్‌కు చెందిన సతీష్, సోహెయిల్‌లు గురువారం యూసుఫ్‌గూడ బస్తీ సమీపంలో గంజాయి సేవిస్తున్నారు. స్థానికులు ఈ విషయాన్ని మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ బాల్‌రాజ్ సిబ్బందితో వచ్చి వారిని ప్రశ్నించగా, గంజాయి తాగుతున్నట్టుగా అంగీకరించారు. దాంతో పోలీసులు సతీష్, సోహెయిల్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య

ఫిలింనగర్: కుటుంబ సమస్యలతో సతమతమవుతున్న ఓ ఆటోడ్రైవర్ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... ఫిలింనగర్ సమీపంలోని హకీంపేట కుంట బస్తీలో నివసించే సాదిక్ (35) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ భార్యా ముగ్గురు పిల్లలను పోషిస్తున్నాడు. అయితే కొంతకాలంగా ఆర్థిక సమస్యలు, కుటుంబ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఇంట్లో గొడవలు కూడా సాదిక్‌ను ప్రశాంతంగా ఉండనీయడం లేదు. దీంతో బుధవారం ఉదయం పనికి వెళ్తున్నానంటూ ఆటో తీసుకుని ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. రాత్రంతా ఇంటికి తిరిగి రాలేదు. గురువారం ఉదయం ఎమ్మెల్యే కాలనీ లోటస్‌పాండ్ సమీపంలో ఓ చెట్టుకు వేలాడుతూ సాదిక్ మృతదేహం కనిపించింది. అక్కడే ఆటోను పార్కింగ్ చేసి తాడుతో చెట్టుకు ఉరేసుకున్నట్లుగా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిషేధిత వేళల్లో రెడీమిక్స్ వాహనాల రాకపోకలు

కేసులు నమోదు చేసిన పోలీసులు

బంజారాహిల్స్: రద్దీ సమయాల్లో రెడీమిక్స్ వాహన రాకపోకలకు నిషేధం విధిస్తూ నో ఎంట్రీ సమయాలను కేటాయించారు. కొన్ని రెడీమిక్స్ వాహనాలు ఇష్టానుసారంగా నిబంధనలు ఉల్లంఘించి తిరుగుతున్నట్లుగా గుర్తించిన జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు వారిపై చర్యలు తీసుకోవాలంటూ జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలివీ... జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–45లో ట్రాఫిక్ ఎస్ఐ సత్య నరేంద్ర తనిఖీలు నిర్వహిస్తుండగా నిషేధిత వేళల్లో రెండు రెడీమిక్స్ వాహనాలు రావడం గుర్తించారు. ఆ రెండు వాహన యజమానులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రెండు రెడీమిక్స్ వాహనాలను సీజ్ చేశారు. ఆరా తీయగా వీరు గచ్చిబౌలికి చెందిన తాలిబ్ హుస్సేన్, గోలు కుమార్‌సింగ్‌లపై కేసు నమోదు చేసి వాహనాలను సీజ్ చేశారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రి వర్గంలో స్థానం కల్పించాలి



చీరలు, గాజులు ప్రదర్శిస్తున్న లంబాడీ మహిళలు

పంజగుట్ట: మంత్రి వర్గ విస్తరణలో లంబాడీలకు స్థానం కల్పించాలని, లేని పక్షంలో జూన్ 8న రెండు వేల మంది లంబాడీ మహిళలతో గాంధీ భవన్ ఎదుట చీరలు, గాజులతో నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని లంబాడీ హక్కుల పోరాట సమితి వ్యవస్థాపకుడు గణేష్ నాయక్, గిరిజన విద్యార్థి సంఘం కార్య నిర్వాహక అధ్యక్షుడు వెంకట్ బంజారా అన్నారు. ఈ నిరసనతోనైనా లంబాడీ ఎమ్మెల్యే, ఎంపీల్లో స్పందన వచ్చి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తారనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గిరిజన మహిళలతో గాజులు, చీరలు ప్రదర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ .. తెలంగాణలో లంబాడీలు కాంగ్రెస్ వెంట ఉన్నందుకే పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. 22 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ లంబాడీలకు మంత్రివర్గంలో స్థానం కల్పించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో లంబాడీ హక్కుల పోరాట సమితి మహిళా విభాగం నాయకులు పున్ని బాయి, అనితా బాయి, దేవి బాయి, అచ్చి బాయి, వసంత బాయి తదితరులు పాల్గొన్నారు.

జూన్‌లో పీహెచ్‌డీ ఎంట్రన్స్ ఫలితాలు...?

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్‌డీ ఎంట్రన్స్ టెస్ట్–2015 ఫలితాలు జూన్ మొదటి వారంలో విడుదల కానున్నాయి. వీసీ ప్రొ.కుమార్ విదేశీ పర్యటన నేపథ్యంలో ఫలితాల విడుదలను వాయిదా వేసినట్లు సమాచారం.

రేపు ఉచిత వైద్య శిబిరం

సాక్షి, సిటీబ్యూరో: ఇండియన్ డెంటల్ అసోసియేషన్, అపోలో ఆసుపత్రి సంయుక్తాధ్వర్యంలో నారాయణగూడ శ్రీ వెంకటేశ్వరా కాలనీ కమ్యూనిటీ హాల్‌లో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవం సందర్భంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈసీజీ, జీఆర్‌బీఎస్, బీపీ, మౌఖిక కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేపట్టనున్నామని ఆసుపత్రి వర్గాలు ఒక ప్రకటనలో తెలిపారు.

అర్బన్ పార్కుల అభివృద్ధికి చర్యలు

సాక్షి ఎఫెక్ట్...

సాక్షి, సిటీబ్యూరో: నగర శివార్లలో అర్బన్ పార్కుల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని హెచ్‌ఎండీఏ అధికారులు తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డుకు ఇరువైపులా వివిధ ప్రాంతాల్లో అర్బన్ ఫారెస్ట్ పార్కులలో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇటీవల 'సాక్షి' దినపత్రికలో 'పేరుకే పార్కు' అనే శీర్షికన వెలువడిన కథనంపై అధికారులు స్పందించారు. ఈ మేరకు కమ్మదనం, శ్రీనగర్, అంబర్‌పేట్, పల్లెగడప, సిరిగిరిపూర్, నాగారం, తదితర పార్కుల్లో వాకింగ్‌ట్రాక్‌లు, వాష్‌రూమ్‌లు, ప్రవేశద్వారాలు, తదితర సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు.

విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన

సాక్షి, సిటీబ్యూరో: ఉత్తర ప్రదేశ్‌లో విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ ప్రతిపాదనను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ కార్పొరేట్ కార్యాలయం ఎదుట ఇంజినీర్లు ఆందోళన చేపట్టారు. నేషనల్ కో ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ అండ్ ఇంజనీర్స్(ఎన్‌సీసీఓఈఈఈ) పిలుపు మేరకు ఇంజనీర్లు నిరసన ప్రదర్శన నిర్వహించారు. విద్యుత్ సంస్థల ప్రవేటీకరణ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో దేశవ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగులు ఆందోళన బాటపట్టడానికి వెనుకాడబోరని సంఘం చైర్మన్ సాయిబాబా హెచ్చరించారు.

చరిత్రను వక్రీకరించిన సినిమాకు గద్దర్ అవార్డులా?

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: చరిత్రను వక్రీకరించిన రజాకార్ సినిమాకు గద్దర్ అవార్డు ఇవ్వడం విడ్డూరంగా ఉందని తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అన్నారు.గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇది కాంగ్రెస్ పార్టీ లౌకికవాదాన్ని అప్రతిష్టపాలు చేయడమే అన్నారు. ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న తెలంగాణ గద్దర్ అవార్డుల ఈ సినిమాకు ప్రకటించడం కళా హృదయాలను కలచివేసిందన్నారు. 2024 ఉత్తమ మొదటి చిత్రంగా రజాకార్, రెండో చిత్రంగా పొట్టేలు,మూడో చిత్రంగా లక్కీ భాస్కర్‌కు అవార్డులు ఇచ్చారన్నారు. మతోన్మాదాన్ని ప్రేరేపించిన ఇలాంటి సినిమాలకు గద్దర్ పేరుతో అవార్డు ఇవ్వడం ఆయనను అవమానించడమేనన్నారు. తక్షణమే గద్దర్ అవార్డు సెలక్షన్ కమిటీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

నగరంలో నేడు

- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్ కృష్ణా హోటల్‌లో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సూత్రా ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.
- మిస్ వరల్డ్ ప్రారంభ వేడుకల్లో భాగంగా గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జానపద కళాకారుల ప్రదర్శన జరుగుతుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది .
- మాదాపూర్‌లోని శిల్పారామంలో వేసవి సెలవుల సందర్భంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సమ్మర్ ఆర్ట్ క్యాంప్ జరుగుతుంది.
- రవీంద్రభారతిలో సాయంత్రం 6 గంటలకు ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మ్యూజికల్ ప్రోగ్రామ్ జరుగుతుంది.
- బీ9 డ్యాన్స్ అండ్ ఫిట్‌నెస్ స్టూడియో ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు రవీంద్రభారతిలో అవార్డు ప్రదానోత్సవం జరుగుతుంది.
- రసమయి సంస్థ ఆధ్వర్యంలో సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతిలో కల్చరల్ ప్రోగ్రామ్స్ జరుగుతాయి.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు యాక్షన్ ప్లాన్



- కేసులు తగ్గించడానికి అవగాహన కార్యక్రమాలు
- దోమలు, లార్వా నివారణకు ప్రత్యేక కార్యక్రమం
- ఫ్రైడే డ్రై డే పాటించాలి
- 'సాక్షి'తో హైదరాబాద్ డీఎంహెచ్‌ఓ వెంకటి

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. జూన్ నుంచి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. ఈ సమయంలో తాగునీరు, ఆహారం, ఇంటి చుట్టూ ఉండే పరిశర ప్రాంతాలు మన ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తాయి. చిన్నపాటి జాగ్రత్తలతో రోగాలకు దూరంగా ఉండొచ్చని హైదరాబాద్ వైద్యారోగ్యశాఖాధికారి వెంకటి అన్నారు. సీజనల్ వ్యాధుల నివారణకు శాఖాపరమైన ఏర్పాట్లపై ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు...

విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు

జూన్ నుంచి సెప్టెంబరు వరకు డెంగ్యూ, మలేరియా, డయేరియా, విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉంది. ఒక డెంగ్యూ కేసు నమోదైతే సమీప ప్రాంతాల్లోని మొత్తం 50 ఇళ్లలో ఎవరికైనా జ్వరం లక్షణాలు ఉన్నాయా, ఇతర అనారోగ్య కారణాలతో బాధపడుతున్నారా అని ఆరా తీస్తాం. అవసరమైతే రక్త నమూనాలు సేకరించి పరీక్షలు చేయిస్తాం. అవసరమైన చికిత్సలు అందిస్తాం. నీటి నిల్వలు, పారిశుద్ధ్యంపై అవగాహన తదితర అంశాలపై సర్వెలెన్స్ బృందాలు పని చేస్తాయి. బాధితులు ఉంటే వారికి సత్వరం వైద్య సేవలందించేందుకు సమీపంలోని పీహెచ్‌సీ, ఇతర ఆసుపత్రులకు తరలిస్తాం. పరిసర ప్రాంతాల వారికి అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు చేపడతాం.

అందుబాటులో మందులు..

నగరంలో గాంధీ, ఉస్మానియా, ఫీవర్ ఆసుపత్రి, ఒక జిల్లా ఆసుపత్రి, మూడు ఏరియా ఆసుపత్రులు, 161 బస్తీ దవాఖానాలు, 10 క్లస్టర్లు, 91 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో అవసరమైన ఓఆర్‌ఎస్‌లు, ఇతర మందులు, వైద్యులు, మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. లక్షణాలు కనిపిస్తే తక్షణం పరీక్షలు చేయించేందుకు తెలంగాణ డయాగ్నోస్టిక్స్ అందుబాటులో ఉన్నాయి. నేరుగా బాధితుడికే పరీక్షా నివేదికలు సైతం వెళతాయి. ఇవి కాకుండా మరో 265 ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులు ఉన్నాయి. ఇక్కడికి వచ్చే కేసులను ఐహెచ్‌ఐపీ పోర్టల్‌లో నమోదు చేస్తారు. ఆ సమాచారం మాకు వస్తుంది.

కలిసికట్టుగా..

నగర ప్రజల ఆరోగ్యం కోసం వైద్యారోగ్య శాఖతో పాటు జీహెచ్‌ఎంసీ, తాగునీటి సరఫరా శాఖలతో సంయుక్తంగా పనిచేస్తాం. అవసరాలకు అనుగుణంగా ఆయా శాఖలు కలిసి వస్తాయి. తాగునీరు, ఆహారం కలుషితమైతే డయేరియా ప్రబలే ప్రమాదం ఉంది. డయేరియా లక్షణాలు కనిపిస్తే వెంటనే వాటర్ పైపులైన్లు ఎక్కడైనా లీకేజీలు ఉన్నాయా, తీసుకున్న ఆహారం పరిశీలిస్తాం. పైపులైన్ లీకేజీలు ఉంటే హైదరాబాద్ మెట్రో వాటర్ సరఫరా శాఖాధికారులకు సమాచారం ఇస్తాం. దోమల నివారణ, ఇతర కార్యక్రమాల్లో జీహెచ్‌ఎంసీ పాల్గొంటుంది.

ఈ ఏడాది డెంగ్యూ కేసులు ఇలా..		గత ఏడాది సీజన్‌లో నమోదైన డెంగ్యూ కేసులు	
నెల	కేసుల సంఖ్య	నెల	కేసుల సంఖ్య
జనవరి	45	జూన్	86
ఫిబ్రవరి	35	జులై	322
మార్చి	43	ఆగస్టు	774
ఏప్రిల్	28	సెప్టెంబరు	494
మే	28		

దోమలపై యుద్ధం

డెంగ్యూ, మలేరియా, విషజ్వరాలు, ఇతర జ్వరాలు దోమ కాటు వల్లే వస్తాయి. జ్వరం వచ్చిన తర్వాత మందులు వాడటం కంటే దోమల నివారణపై దృష్టిసారించాలని ప్రభుత్వం భావిస్తోంది. ముందస్తుగా లార్వా నివారణ చర్యలు చేపడుతున్నాం. దోమ లైఫ్ సైకిల్‌ను కత్తిరిస్తేనే వాటిని నివారించగలం. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని ప్రజలకు చెబుతున్నాం. జీహెచ్‌ఎంసీ దోమల నివారణకు ఫాగింగ్, ఇతర కార్యక్రమాలను నిర్వహిస్తోంది. జూన్‌లో మలేరియా, జులైలో డెంగ్యూపై అవగాహన కల్పించడానికి మాసోత్సవాలు నిర్వహిస్తాం. ఇంటి నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.

అసమానతలు ఉన్నంత కాలం తిరుగుబాటు తప్పదు

హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్



మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

హిమాయత్‌నగర్: అసమానతలు అణచివేత ఉన్నంత కాలం ప్రజల్లో తిరుగుబాటు తప్పదని, దీనిని ఏ శక్తులు అడ్డుకోలేవని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ అన్నారు. సీజ్‌ఫైర్ ప్రకటిస్తామని చెప్పినా మావోయిస్టులను దుర్మార్గంగా హత్య చేయడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 21కు పూర్తి వ్యతిరేకమన్నారు. గురువారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక(టీఎస్‌డీఎఫ్) ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆపరేషన్ కాగార్‌ను నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ ప్రొఫెసర్ వినాయకరెడ్డి అధ్యక్షతన రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ మావోయిస్టుల మృతదేహాలను కుటుంబ సభ్యులు, బంధువులకు అప్పగించకుండా పోలీసులే ఖననం చేయడం మృతదేహాల వద్ద సంబరాలు చేసుకోవడం దారుణమన్నారు. మార్చి నాటికి మావోయిస్టులు లేని భారత్‌ను నిర్మిస్తామని ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా ప్రకటించారన్నారు. ఆర్థిక అసమానతలు, దోపిడీ, నిరుద్యోగం, రైతుల ఆత్మహత్యలు, మహిళలపై హింస, బాల కార్మిక వ్యవస్థ కొనసాగినంత కాలం ప్రజా ఉద్యమాలు, పోరాటాలు సజీవంగానే ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. మోదీ 11 ఏళ్ల పాలనలో 3.85 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని వీటిని ఎందుకు టార్గెట్‌గా పెట్టుకోలేదని ప్రశ్నించారు. దేశంలో 15 లక్షల మంది బాల కార్మికులు ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వమే ప్రకటించిందని, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలించలేని స్థితిలో మోదీ ప్రభుత్వం ఉందని ఆరోపించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్ మాట్లాడుతూ మావోయిస్టులను ఉగ్రవాదులను కేంద్ర ప్రభుత్వం ఒకే కోణంలో చూడటం సరైంది కాదన్నారు. మావోలుస్టుల మృతదేహాల వద్ద సంబరాలు జరుపుకున్నది సైనికులు కాదని ఆర్‌ఎస్‌ఎస్ ముసుగులో ఉన్న వారని ఆయన ఆరోపించారు. మోదీ, అమిత్ షా నక్సలైట్ల బూడిదను చూసి కూడా భయపడుతున్నారన్నారు. ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా ఏ ఉద్యమం చేపట్టినా సీపీఐ భాగస్వామ్యం అవుతుందని స్పష్టం చేశారు. ప్రొఫెసర్ వినాయకరెడ్డి మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం మారణ హోమం సృష్టిస్తుందని ఆరోపించారు. రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ అమాయక ఆదివాసీలను చంపుతున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా మావోయిస్టు నేత నంబాల కేశవరావు, కెన్యా దేశ కవి గూగిఈ దీయంగ్ మృతికి సంతాపం తెలియజేస్తూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. సదస్సులో విమలక్క, దిడ్డి సుధాకర్, నారాయణరావు, అంబటి నాగయ్య, ప్రసాద్, కృష్ణప్రసాద్, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే అర్చకుల సంక్షేమం



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కొండా సురేఖ, శైలజ రామయ్య చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

సుల్తాన్‌బజార్: కాంగ్రెస్ హయాంలోనే అర్చకుల సంక్షేమం సాధ్యమని ఆలయ అర్చక ఉద్యోగుల జేఏసీ నేతలు అన్నారు. ఈ మేరకు అర్చక వెల్ఫేర్ బోర్డు సమావేశంలో ప్రభుత్వం అర్చక ఉద్యోగుల సంక్షేమం కోసం తీసుకున్న నిర్ణయాలపై హర్షం వ్యక్తం చేస్తూ గురువారం బొగ్గులకుంటలోని దేవాదాయ, ధర్మాదాయ కమిషనరేట్ కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్య చిత్రపటాలకు మంత్రోచ్చారణల మధ్య క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ దేవాదాయ అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ, కన్వీనర్ డీవీఆర్.శర్మ, అధ్యక్షులు కందూరి కృష్ణమాచార్యులు మాట్లాడుతూ..... అర్చక ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం తగిన గ్రాంట్లు ఇవ్వడం దేవాదాయ శాఖ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ రోజన్నారు. ప్రభుత్వ నిర్ణయాలు అర్చకుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్నాయన్నారు. అర్చకులకు పెన్షన్ సౌకర్యం కల్పించడం ఎంతో అభినందనీయమన్నారు. వారికి రూ.5 లక్షల బీమాతో పాటు రూ.4 లక్షల నుంచి రూ.8 లక్షల గ్రాట్యుటీ, రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు పెన్షన్ ఆమోదం తెలపడం స్వాగతిస్తున్నామన్నారు. ఇందుకు కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ, ప్రిన్సిపల్ సెక్రెటరి శైలజ రామయ్యలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పరశురామ్ రవీంద్రచార్యులు, చింతపట్ల బద్రినాథాచార్యులు, అగ్నిహోత్రం చంద్రశేఖర శర్మ, చిన్నం మోహన్, రామ శాస్త్రీ, గట్టు శ్రీనివాసరావు, చిలకమర్తి శివకుమార్, బండారు జగపతి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గోవుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ గళమెత్తాలి



మాట్లాడుతున్న యోగి ప్రభాకర్ స్వామి

పంజగుట్ట: గోవుల సంరక్షణకు గళం ఎత్తని మఠాధిపతులు, హైందవ సంఘాలు, సనాతన సంఘాలను గో ద్రోహులుగా గుర్తిస్తామని హిమాలయ యోగి ప్రభాకర్ స్వామి అన్నారు. గోమాతను కాపాడేందుకు ప్రతి పీఠాధిపతి, హిందూ సంఘాల నాయకులు ఐక్యంగా పోరాడితే తాము ఇక్కడికి రావాల్సిన పరిస్థితి ఉండేది కాదన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివిధ హైందవ, గోరక్షణ సంఘాల నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ .. గోమాతను సంరక్షించే విషయంలో ప్రభుత్వాలు చర్యలు తీసుకోకపోతే పంచభూతాలు సహించవని, వారి ప్రభుత్వానికి తప్పక ఆటకం కలిగిస్తాయన్నారు. ప్రజలు తమకు రక్షణ కల్పిస్తారని, చట్టాలను పకడ్బందీగా అమలు చేస్తారని, భూమిపై ఉన్న ప్రతి ప్రాణికి రక్షణ కల్పిస్తారని ప్రభుత్వాన్ని ఎన్నుకుంటే ప్రభుత్వాలు మాత్రం చట్టాలు అమలు చేయడంలో నిర్లక్ష్యం చూపుతున్నాయన్నారు. గోవులను రక్షించాల్సిన వాటిని రక్షించకుండా, గోరక్షకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. గో హత్యలకు నిరసనగా జూన్ 7న మింట్‌కాంపౌండ్ లోని శ్రీ త్రిశక్తి హనుమాన్ దేవాలయం నుంచి హిమాయత్ నగర్ టీటీడీ దేవస్థానం వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గో భక్తులు సనాతన భక్తులు, గో రక్షకులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జస్మిత్‌పటేల్, వినోద్ కుమార్, తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ ప్రొఫెసర్‌కు అరుదైన అవకాశం



జి.ఎస్.వైతీశ్వరన్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ జి.ఎస్. వైతీశ్వరన్‌కు అరుదైన అవకాశం లభించింది. ప్రతిష్టాత్మకమైన జపాన్ దేశం సుకుబాలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెటీరియల్స్ సైన్స్ (ఎన్‌ఐఎంఎస్)ను పరిశోధన కోసం సందర్శించేందుకు ఎంపికయ్యారు. ప్రొఫెసర్ జీఎస్ వైతీశ్వరన్ 2026 సంవత్సరానికి మెటీరియల్స్ నానో ఆర్కిటెక్టోనిక్స్ పరిశోధనా కేంద్రం(ఎంఏఎన్) పథకం కింద పరిశోధన కోసం ఎంపిక కావడం విశేషం. జనవరి 13 నుంచి ఫిబ్రవరి 20 వరకు ఐదు వారాల పర్యటనకు అవకాశం కల్పించారు. ప్రొఫెసర్ వైతీశ్వరన్ క్వాంటం సాలిడ్ స్టేట్ మెటీరియల్స్‌పై ప్రొఫెసర్ కజునారియమౌరా పరిశోధనా బృందంతో కలిసి పనిచేస్తారు.

5 నుంచి రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ పోటీలు

మలక్‌పేట: రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బ్యాడ్మింటన్ ఆసోసియేషన్ ఆఫ్ తెలంగాణ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ సమన్వయంతో రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్–2025 పోటీలు నిర్వహిస్తున్న అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పుల్లెల గోపీచంద్, ప్రధానకార్యదర్శి కర్రెద్ల శ్రీనివాసరావు తెలిపారు. ఉప్పల్ భగాయత్‌లోని విక్రాంత్ బ్యాడ్మింటన్ అకాడమీ, ఎలైట్ గేమర్స్ గ్యారేజ్‌లో జూన్ 5 నుంచి 8 వరకు ఈ పోటీలు జరుగుతాయన్నారు. పురుషులు, మహిళల విభాగాల్లోలో సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో సత్తా చాటిన వారిని జూనియర్, సబ్‌జూనియర్, జూనియర్, పురుషులు, మహిళలు, మాస్టర్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు జూన్ 2 లోగా పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. సింగిల్స్ పాల్గొనే క్రీడాకారులు రూ.800, డబుల్స్‌లో పాల్గొనే క్రీడాకారులు రూ.1000 ఎంట్రీ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 98480 15443, 77889 93006 సెల్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

క్రమశిక్షణతో కష్టపడితేనే ఉన్నత లక్ష్యాలు

లక్డీకాపూల్ : విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ తమలో ఉన్న ప్రతిభను చాటి చెబుతున్నారని నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప అన్నారు. గురువారం ఆస్పత్రి ప్రాంగణంలో నిమ్స్ పారామెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ 33వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన డైరెక్టర్ చదువుల్లో విశేష ప్రతిభను కనబర్చిన నిమ్స్ ఉద్యోగుల పిల్లలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు సానిక, రూస్కార్, సారిక, వైష్ణవి, అంజిత్‌లను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో పాటు కష్టపడే తత్వాన్ని అలవర్చుకుంటేనే భవిష్యత్తు లక్ష్యాలను ఛేదించగలుగుతారన్నారు. ఇటీవల కాలంలో విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తూ తమకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకుంటున్నారన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

రాజ్‌భవన్ స్కూల్‌లో కలెక్టర్ తనిఖీలు



రాజ్‌భవన్ స్కూల్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

బంజారాహిల్స్: సోమాజిగూడలోని రాజ్‌భవన్ హైస్కూల్‌లో మౌలిక సౌకర్యాలు, ఇతర సదుపాయాల కల్పనపై జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సమీక్షించారు. గురువారం రాజ్‌భవన్ హైస్కూల్‌ను సందర్శించిన ఆయన స్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం గోపాల్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పుష్పలతతో కలిసి స్కూల్ భవనాన్ని పరిశీలించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఇక్కడ చేపట్టాల్సిన మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. ఎంతమంది విద్యార్థులకు ఈ స్కూల్ ప్రాంగణం సరిపోతుంది అన్నదానిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఉన్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు ఉండగా, విద్యార్థుల సంఖ్య పెరిగితే కొత్తగా ఎన్ని తరగతి గదులు నిర్మించాలి, అందుకు తగిన స్థలం ఉందా? లేదా అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. రాజ్‌భవన్ హైస్కూల్‌ను మోడల్ స్కూల్‌గా మార్చే ప్రతిపాదన ఉన్నట్లు సమాచారం. ఇందులో భాగంగానే కలెక్టర్ స్కూల్‌ను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. ఇంకా ఎన్ని తరగతి గదులు నిర్మించేందుకు అవకాశం ఉందో ఆరా తీశారు. ఇదివరకే చుట్టుపక్క ప్రాంతాల నుంచి ఎంతమంది విద్యార్థులు ఇక్కడికి రావచ్చో అన్నదానిపై ఓ సర్వే కూడా నిర్వహించారు. ఇందుకు సంబంధించి ప్రణాళికలు రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

తెలుగు రాష్ట్రాల జల పంపిణీపై కేంద్రం జోక్యం చేసుకోవాలి



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ

కాచిగూడ: ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా ఆంధ్ర పాలకులు యథేచ్ఛగా జల దోపిడీని కొనసాగిస్తున్నారని బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ అన్నారు. గోదావరి జలాలపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ సముద్రంలో కలిసే నీటిని వాడుకుంటున్నామని చెప్పడం దారుణమన్నారు. గురువారం కాచిగూడ అభినందన్ గ్రాండ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల జల పంపిణీపై కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. కృష్ణ, గోదావరి జలాలపై తెలంగాణకు పూర్తి హక్కు ఉందని.. రాష్ట్రంలో 700 కిలోల మీటర్ల మేర గోదావరి పరివాహక ప్రాంతం ఉందన్నారు. బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణ తీవ్రంగా నష్టపోతుందని... దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందో అర్థం కావడం లేదన్నారు. ఏపీ ప్రభుత్వానికి ఎంపీల బలం ఉందని కేంద్ర ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని, దానిని నివారించేందుకు రాష్ట్ర బీజేపీ నాయకత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఏపీ చర్యలను అడ్డుకోవాలని, లేని పక్షంలో తెలంగాణ సమాజం క్షమించదన్నారు. అసమర్థ నాయకత్వం కారణంగానే ఏపీ ముఖ్యమంత్రి మహానాడులో జల దోపిడీపై తన ఆలోచనలను బహిరంగంగా వెల్లడించారన్నారు. గత 11 ఏళ్లుగా ఏపీ జలదోపిడీని కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ఆరోపించారు. ఏపీలో పోలవరానికి రూ. లక్షల కోట్లు నిధులు ఇస్తూ విభజన చట్టంలో ఉన్న ప్రాణహిత – చేవెళ్లకు ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడం దారుణమన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నాగుల శ్రీనివాస్ యాదవ్, పి.సుధాకర్ ముదిరాజ్, వేముల రామకృష్ణ, ఉదయ్ నేత, నందగోపాల్, జోషి, మోతీలాల్, బోయ గోపి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి భూ భారతి అమలు..


- కలెక్టర్లు, అధికారులకు మంత్రి శ్రీధర్ బాబు దిశా నిర్దేశం
- రాజీవ్ యువ వికాసం, ఖరీఫ్ సన్నద్ధత పై సూచనలు..



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్ బాబు

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టాన్ని జూన్ 3 నుంచి అన్ని మండలాల్లో విజయవంతంగా అమలు చేసేలా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కలెక్టర్లకు, అధికారులకు సూచించారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో ఆయన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ప్రభుత్వ చీఫ్ పట్నం మహేందర్ రెడ్డితో కలిసి భూ భారతి, రాజీవ్ యువ వికాసం, ఖరీఫ్ సన్నద్ధత పై అధికారులకు దిశా నిర్దేశం చేయడంతో పాటు ఇందిరమ్మ తదితర పథకాలపై సమీక్ష నిర్వహించారు. యాసంగిలో వరి ధాన్యం సేకరణ, త్వరలో ప్రారంభం కానున్న ఖరీఫ్ సీజన్‌కు సన్నద్ధత తదితర అంశాలపై చర్చించారు. రాజీవ్ యువ వికాసం పై పలువురు శాసన సభ్యులు బ్యాంకర్లు సిబిల్ స్కోర్ పేరుతో ఇబ్బందులు పెడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మంత్రి స్పందిస్తూ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రాజీవ్ వికాస్ పథకాన్ని పకడ్బందీగా అమలయ్యేలా చూస్తామని తెలిపారు. ఈ పథకాన్ని అమలు చేసి నిరుద్యోగ యువతకు బాసటగా నిలవాలని బ్యాంక్ అధికారులకు సూచించారు. రైతులకు సరిపడా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని రైతులకు పంట సాగుపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. రాజీవ్ యువ వికాసంలో ఆయా ప్రాంతాల్లో ప్రాధాన్యత ఉన్న యూనిట్లను ఎంపిక చేసి వారికి సరైన అవకాశం కల్పించాలని కలెక్టర్లకు ఆదేశించారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైతే వాటిని స్వాధీనం చేసుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి ఇందిరమ్మ ఇళ్లపై మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటివరకు 17,440 ఇళ్లకు అలాట్‌మెంట్ ఇవ్వగా అందులో 16,617 ఇళ్లకు మంజూరు ఇవ్వడం జరిగిందన్నారు, 4084 ఇళ్ల గ్రౌండింగ్ ఇప్పటికే పూర్తయిందని వచ్చే వారంలో పదివేల ఇళ్లు ప్రారంభించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, ఆరెకపూడి గాంధీ, కసిరెడ్డి నారాయణరెడ్డి, వీర్లపల్లి శంకర్ మనోహర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, రంగారెడ్డి, వికారాబాద్ మేడ్చల్ జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం తరఫున సురవరం జయంతి వేడుకలు



కార్యక్రమంలో పాల్గొన్న ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, సురవరం కుటుంబ సభ్యులు

గన్‌ఫౌండ్రీ: ప్రస్తుత సమాజం స్వార్థంతో నిండిపోయిందని రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. కలుషిత మైన సమాజాన్ని శుద్ధి చేయాల్సిన బాధ్యత ఈ తరం కవులపైనే ఉందని అభిప్రాయ పడ్డారు. గురువారం రవీంద్రభారతిలో తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో గోల్కొండ సాహితీ కళా సమితి, తెలుగు భాషా చైతన్య సమితి సంయుక్త ఆధ్వర్యంలో సురవరం ప్రతాప్‌రెడ్డి 129వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... సురవరం ప్రతాప్‌రెడ్డి జయంతి ఉత్సవాలను ప్రభుత్వం తరఫున నిర్వహించేందుకు ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. ఉత్తమ పరిశోధకులు, కవులకు సురవరం ప్రతాప్‌రెడ్డి పేరున పురస్కారాలను అందజేసే విషయమై సీఎం దృష్టికి తీసుకెళతానన్నారు. ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ చిన్నారెడ్డి మాట్లాడుతూ..... వనపర్తి పట్టణంలో సురవరం ప్రతాప్‌రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సమాజంలోని లోపాలను ఆయన రచనల్లో ఎత్తి చూపుతూ సమాజాన్ని మార్చే ప్రయత్నం చేశారని, గోల్కొండ పత్రికతో నాటి ప్రభుత్వాల తీరును ఎండగట్టారన్నారు. కార్యక్రమంలో సురవరం కృష్ణవర్ధన్, తెలుగు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ వెలిదండ నిత్యానందరావు, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, సాహిత్య అకాడమీ కార్యదర్శి ఎన్.బాలాచారి, బడేసాబ్, ప్రకాష్‌రెడ్డి, డాక్టర్ రాధ కుసుమ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, శుక్రవారం, 30, మే, 2025



విశ్వ వేదికపై..



మిస్ వరల్డ్ కంటెస్టెంట్, మిస్ జర్మనీ సైతం మరో తెలుగు పాటతో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అందాలొలికే ఈ ముద్దుగుమ్మ క్యూట్ క్యూట్ వాయిస్‌తో బుట్ట బొమ్మా.. బుట్ట బొమ్మా నను చుట్టూకుంటివే అనే అల్లూ అర్జున్ టాప్ హిట్ సాంగ్ పాడి అందరి మనసులూ దోచుకున్నారు. ఈ పాటకు అనుగుణంగా స్టెప్పులేస్తూ చేసిన వీడియో సైతం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. అంతేకాకుండా చుమ్మా కీరా హోయ్ అనే మరో బాలీవుడ్ పాటను సైతం పాడారు.

అందాల బొమ్మ నోట.. బుట్టబొమ్మా పాట..

నాటు పాట..

మిస్ వరల్డ్ నేపథ్యంలో వైరల్‌గా మారిన తెలుగు పాటలు

- రానూ బొంబైకి రానూ పాటకు విపరీతమైన క్రేజ్
- 20 మంది మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు ఈ పాటకు డ్యాన్స్
- బుట్టబొమ్మా, కుర్చీ మడత పెట్టి, తగ్గేదేలే వంటివి సైతం వైరల్

అంతర్జాతీయంగా ప్రపంచ సుందరి పోటీలకున్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఒకప్పుడు మిస్ వరల్డ్‌గా భారతీయులు కిరీటం గెలిస్తే గొప్పగా కీర్తించుకున్నాం.. కానీ గతేడాది 71వ మిస్ వరల్డ్ ముంబైలో, ఈ సారి 72వ మిస్ వరల్డ్ పోటీలు తెలంగాణ (హైదరాబాద్)లో నిర్వహించడంతో ఇండియా విశిష్టత విశ్వవ్యాప్తమైంది. అయితే ఈ సారి నగరంలో జరుగుతున్న పోటీల నేపథ్యంలో హైదరాబాద్‌కు మరోసారి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు రావడంతో పాటు తెలుగు పాటలు సైతం వైరల్‌గా మారాయి. ఏ దేశంలో ఈ పోటీలు జరిగినా ఆ దేశ సంస్కృతి, సంప్రదాయాలకు గుర్తింపు రావడం సహజమే. అయితే వినూత్నంగా ఈ సారి తెలుగు పాటలు వైరల్‌గా మారాయి. దీనికి కారణం.. ఈ సారి మిస్ వరల్డ్ కంటెస్టెంట్‌లు తెలుగు పాటలకు అభిమానులుగా మారడం చెప్పుకోవాల్సిన విషయం.

– సాక్షి, సిటీబ్యూరో



మిస్ వరల్డ్ కంటెస్టెంట్‌లు బసచేస్తున్న ట్రైడెంట్ హోటల్ వేదికగా మిస్ నైజీరియా పాడిన 'రానూ.. బొంబైకి రానూ' అనే పాట సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సాధారణంగా తెలంగాణ ప్రాంతంలో జానపద సాహిత్యంతో రూపొందించిన ప్రైవేట్ సాంగ్ రాను బొంబైకి రాను..!! తెలంగాణతో పాటు దక్షిణాది వరకూ ఫేమస్ కావడం ఓకే.. కానీ ఏకంగా మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్ ఈ పాటను పాడటం, దీనికి స్టెప్పులేయం అందరి దృష్టినీ ఆకర్షించింది. ఈ పాట వైరల్ అవ్వడమో లేదా మిస్ నైజీరియాకు తెగ నచ్చేసిందో తెలియదు కానీ.. మిస్ వరల్డ్ పోటీల్లో ముఖ్యమైన టాలెంట్ రౌండ్‌లోనూ ఈ ముద్దుగుమ్మ ఇదే పాటకు డ్యాన్స్ వేశారు. వినూత్నంగా ఇండో ఆఫ్రికన్ డ్యాన్స్ అంటూ ఈ తెలుగు పాట, తమ దేశానికి చెందిన పాటలతో తన టాలెంట్ రౌండ్‌ను ప్రదర్శించారు. ఐతే ఇదే రౌండ్ చివరలో 20 దేశాలకు చెందిన టాలెంట్ రౌండ్ ఫైనలిస్టులు మళ్లీ ఇదే పాటకు స్టెప్పులేయడం మరోసారి వైరల్‌గా మారింది. ఇందులో మిస్ ఇండియా నందినీ గుప్తా అదిరిపోయే స్టెప్పులేవారు..



మార్ఫా స్పెషల్..

మిస్ వరల్డ్ పోటీల నేపథ్యంలో మిస్ తారలతో నగరంలోని చార్మినార్ పరిసర ప్రాంతాల్లో 'హెరిటేజ్ వాక్' నిర్వహించిన విషయం విధితమే. ఐతే ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రసిద్ధి చెందిన మార్ఫా సంగీతానికి ఈ సుందరీ మణులు డ్యాన్స్ వేసి సందడి చేశారు. ఈ వీడియోలు తమ సోషల్ మీడియా యాప్స్‌లో పోస్ట్ చేయగా ప్రపంచవ్యాప్తంగా తిలకించారు.

కుర్చీ మడత పెట్టి..

అందరూ తెలుగు పాటలతో అదరగొడితే.. మిస్ ఇండియా నందినీ గుప్తా మాత్రం సూపర్ స్టార్ మహేష్‌బాబు 'కుర్చీ మడత పెట్టి...' అనే డైలాగ్ కంపాటతో తన ప్రత్యేకతను చాటుకున్నారు.

ఎలా ఉన్నారూ..??

మరో కార్యక్రమంలో భాగంగా ఈ ముద్దుగుమ్మలంతా తెలంగాణ వారసత్వ వైభవాన్ని, విశిష్టతను తిలకించడానికి వరంగల్ వెళ్లారు. ఈ కార్యక్రమంలో భాగంగా మిస్ కెనడా.. తెలుగులో 'నమస్తే.. ఎలా ఉన్నారు' అని సందడి చేయగా, మిస్ యూఎస్ఏ.. 'అందరూ బాగున్నారా' అంటూ పలకరించారు. మిస్ అర్జెంటీనా ఐతే పాన్ ఇండియా ఫేమస్ తెలుగు డైలాగ్ 'తగ్గేదే లే' అంటూ అలరించారు. ఈ అందాల తారల నోటి వెంట ముచ్చటగొలిపే ఈ మాటలు సైతం యూట్యూబ్‌లో, సోషల్ యాప్స్‌లో చక్కర్లు కొడుతున్నాయి.

బాలీవుడ్ స్వరాలు సైతం..

ఇవే కాకుండా జిలేబి బేబీ, ఓం శాంతి ఓం, ధూమ చాలే వంటి బాలీవుడ్ ఇండియన్ బాలీవుడ్ పాటలతోనూ పలువురు మిస్ వరల్డ్ పోటీదారులు సందడి చేశారు.

తీన్మార్..

నగరంలో గచ్చిబౌలి స్టేడియం వేదికగా ఈ ప్రపంచ సుందరీమణులతో నిర్వహించిన స్పోర్ట్ ఈవెంట్‌లో కూడా తెలుగు పాటలకు, తీన్మార్ బ్యాండ్‌కు ఉత్సాహంగా డ్యాన్సులు చేశారు. హార్ట్ ఆఫ్ గోల్డ్ పేరుతో ట్రైడెంట్ హోటల్లో నిర్వహించిన సేవా కార్యక్రమంలో సైతం అనాథ చిన్నారులను ఉత్సాహపరచడానికి తెలుగు సినిమాకు ఆస్కార్ తీసుకొచ్చిన నాటు నాటు పాటతో పాటు డీజే టిల్లూ, ఇడియట్, అద్దాలా మేడలున్నవే అనే తెలుగు పాటలకు డ్యాన్సులు చేసి మరో సారి తెలుగు సంగీతాన్ని, సాహిత్యాన్ని ఆస్వాదించారు.

ఆవిష్కరణలతోనే అద్భుతాలు..



సాక్షి, సిటీబ్యూరో: వినూత్న ఆలోచనలు, వాటి నుంచి ఉద్భవించే ఆవిష్కరణలతోనే అద్భుతాలు సృష్టించవచ్చని, ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని విద్యావేత్తలు స్పష్టం చేశారు. శామ్‌సంగ్ 'సాల్వ్ ఫర్ టుమారో' సీజన్ 4 పోటీలో భాగంగా హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో 'సాల్వ్ ఫర్ టుమారో' రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన పరిశ్రమ ప్రముఖులు, విద్యావేత్తలు మాట్లాడుతూ క్రియేటివ్ థింకింగ్ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం వందలాదిగా విద్యార్థులు డిజైన్ థింకింగ్ వర్క్‌షాప్‌లో పాల్గొని, ప్రస్తుత సమాజంలోని పలు సమస్యలకు తమదైన శైలిలో సృజనాత్మక పరిష్కారాలను సమర్పించారు.

ఎన్‌జీఓలకు హెచ్‌సీఎల్ ఆర్థిక చేయూత

సాక్షి, సిటీబ్యూరో: వినూత్న గ్రామీణ అభివృద్ధి ప్రాజెక్టులకు నిర్వహించే స్వచ్ఛంద సంస్థలను ప్రోత్సహించేందుకు ప్రముఖ గ్లోబల్ టెక్నాలజీ కంపెనీ హెచ్‌సీఎల్ ఆర్థిక చేయూత అందిస్తోంది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. తమ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా నీటి సంరక్షణ ప్రాధాన్యతలపై పనిచేసే ప్రభుత్వేతర సంస్థలు(ఎన్‌జీఓలు)కు అందించే మద్దతు ఇచ్చే కార్యక్రమం నిర్వహిస్తున్నామని, దీని కోసం ఎన్‌జీఓల ఎంపిక ప్రక్రియ మొదలైందన్నారు. నాలుగేళ్ల ప్రాజెక్టులతో ఎంపికైన సంస్థలకు రూ.5కోట్లు, రెండేళ్ల ప్రాజెక్ట్ ద్వారా ఎంపికైన సంస్థలకు రూ.50లక్షల చొప్పున అందిస్తామన్నారు. అదనపు వివరాలు, దరఖాస్తులను పంపేందుకు ఆసక్తి కలిగిన నగర ఎన్‌జీఓలు వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

కొబ్బరి చిప్పలతో..



- అబ్బురపరుస్తున్న 'కోకోనట్ షెల్ వాటర్ బాటిల్'
- ఎఫ్‌డీడీఐ-హైదరాబాద్ విద్యార్థి అనిరుధ్ ఘనత

రాయదుర్గం: వ్యర్థానికి కూడా అర్థాలు చెప్పవచ్చంటూ ఓ విద్యార్థి తనదైన శైలిలో కొబ్బరి చిప్పలతో 'కోకోనట్ షెల్ వాటర్ బాటిల్' తయారు చేసి తన సత్తాను చాటారు. ఏదైనా వినూత్నంగా వెదురు బొంగు, కొబ్బరి, బనానా ఫైబర్, తాటాకుల సహాయంతో నూతనంగా ప్రజావసరానికి అనుగుణంగా వినియోగించే వాటిని తయారు చేయాలని నిర్ణయించుకున్నాడు. అనుకున్నదే తడవుగా కోకోనట్ షెల్‌తో ఈ వాటర్ బాటిల్ రూపొందించినట్లు విద్యార్థి స్పష్టం చేశారు. రాయదుర్గంలోని ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్-హైదరాబాద్ (ఎఫ్‌డీడీఐ-హైదరాబాద్) బి.డెస్ (లైఫ్ స్టైల్ అండ్ యాక్సెసరీస్ డిజైన్)ఎల్ఎల్‌పీడీ విభాగం కోర్సులో మూడో ఏడాది చదివే మత్తగుంజ అనిరుద్ ప్యాకేజ్ డిజైన్ రూపకల్పనలో భాగంగా ఈ వాటర్ బాటిల్‌ను తయారు చేయడం విశేషం.



సౌండ్ చేస్తున్న రామ్ మిరియాల



సాక్షి, సిటీబ్యూరో: టాలీవుడ్ నేపథ్య గాయకుడు రామ్ మిరియాల మరోసారి సిటీలోని సంగీతాభిమానుల్ని అలరించనున్నారు. నగరంలో సౌండ్స్ ఆఫ్ రామ్ మిరియాల పేరిట లైవ్ కన్సర్ట్ నిర్వహించనున్నారు. తెలుగులో పలు హిట్ గీతాలకు గాత్రాన్ని అందించిన రామ్.. తనదైన శైలిలో తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో వీనులవిందు చేయనున్నారు. కొండాపూర్‌లోని ది హబ్ ఎరీనాలో ఈ నెల 31న ఈ కార్యక్రమం రాత్రి 8గంటలకు ప్రారంభం అవుతుంది.



అలరించిన మహా నృత్యోత్సవం



గన్‌ఫౌండ్రీ : తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీ నాట్య శిల్పి ఆర్ట్స్ అకాడమీ 35వ ఉచిత నాట్య శిక్షణ శిబిరం ముగింపు వేడుకలు రవీంద్ర భారతిలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచిత శిక్షణ పొందిన వంద మంది చిన్నారులు మహా నృత్యోత్సవం పేరిట కూచిపూడి, జానపద, దాండియా నృత్యాలతో అలరించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు మాట్లాడుతూ.. చిన్నారులకు ఉచితంగా శాస్త్రీయ సంగీత కళలపై శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. అంతకు ముందు అకాడమీ వ్యవస్థాపకులు వాసుకి శ్రీనివాస్ దర్శకత్వంలో ప్రదర్శించిన లైట్ ఆఫ్ బుద్ధ నాటకం హైలెట్‌గా నిలిచింది. ఈ కార్యక్రమంలో సంఘ సేవకులు లయన్ సర్దార్ హర్‌బీందర్ సింగ్, సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీ బాల్‌రెడ్డి, అకాడమీ డైరెక్టర్ పుష్పలత పాల్గొన్నారు.





గుర్తుచేస్తున్నాయి

- అబ్బురపరుస్తున్న వన్యప్రాణుల చిత్రాలు
- వన్యప్రాణులను కాపాడాలంటూ సందేశాత్మక థీమ్

సనత్‌నగర్: వన్య ప్రాణులను సంరక్షించుకోవాల్సిన అవసరాన్ని, బాధ్యతలను గుర్తుచేస్తూ బేగంపేట ప్రకాష్‌నగర్ ఫ్లైఓవర్ పిల్లర్స్‌ను వన్య ప్రాణుల చిత్రాలతో ఎంతో అందంగా తీర్చిదిద్దారు. ఆ మార్గంలో వెళ్లే వాహనదారులను వన్య ప్రాణుల బొమ్మలు కట్టిపడేస్తున్నాయి. జీవకళ ఉట్టిపడే రీతిలో చిత్రకారులు గీసిన బొమ్మలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. చిరుతలు, పులులు, ఏనుగులు, ఎగులుబంట్లు, జాతీయ పక్షి నెమళ్లు, జింకలు, సింహాలు.. ఇలా రకరకాల వన్యప్రాణుల చిత్రాలు చూస్తే వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యతను అటుగా వెళ్లే ప్రయాణికులకు గుర్తుచేస్తున్నాయి. భారత జులాజికల్ సర్వే(జెడ్ఎస్ఐ) ప్రకారం దేశంలో మొత్తం 89 వేలకు పైగా జంతు జాతులు ఉన్నాయి. వీటిలో కూడా అనేకం అంతరించిపోయే ప్రమాదాలను ఎదుర్కొంటున్నాయి. అలాంటి వన్య ప్రాణులను సంరక్షించుకోవడం ద్వారా అటవీ సంపదను కాపాడిన వారమవుతామని, దీని ద్వారా పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా ఉంటుందని ప్రభుత్వాలు, ఎన్జీవోలు, పర్యావరణ వేత్తలు నిత్యం పలు రూపాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతూనే వస్తున్నారు. ఈ క్రమంలో జీహెచ్ఎంసీ నగర వ్యాప్తంగా ఉన్న ఫ్లైఓవర్ల సుందరీకరణలో భాగంగా బేగంపేట ప్రకాష్‌నగర్(ఎయిర్‌పోర్ట్ ఎదురుగా) ఫ్లైఓవర్ పిల్లర్స్‌కు వేసిన చిత్రాలను చూస్తే అద్భుతమనిపిస్తోంది. సందేశాత్మక థీమ్‌తో అబ్బురపడేలా వేసిన చిత్రాలు ఒకదానికి మించి మరొకటి ఉంది.



క్లుప్తంగా...

ఎంఎస్‌పీ పెంపుతో రాష్ట్ర రైతాంగానికి లబ్ధి

• కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: పంట దిగుబడులపై కనీస మద్దతు ధర పెంచడం దేశవ్యాప్తంగా రైతాంగానికి శుభపరిణామమని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఎక్స్ వేదికగా హర్షం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో 14 ఖరీఫ్ పంటలకు కనీస మద్దతు ధర పెంచుతూ నిర్ణయం తీసుకోవడాన్ని హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నామన్నారు. రైతన్నల ఉత్పత్తి వ్యయంపై కనీసం 50 శాతం మేర లాభం అందేలా అన్ని పంటల కోసం క్రమం తప్పకుండా కేంద్రం చర్యలు తీసుకుంటోందని వివరించారు. ఈ సందర్భంగా సజ్జలు(63%), మొక్కజొన్న (59%), కంది (59%), మినుములు (53%) వంటి పంటలపై అత్యధిక లాభాన్ని నిర్దేశించిందన్నారు. దశాబ్ద కాలంగా ఎన్‌డీఏ ప్రభుత్వం రైతులకు చెల్లించిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ), యూపీఏ హయాంలో చెల్లించిన ఎంఎస్‌పీతో పోల్చితే మూడు రెట్లు ఎక్కువని తెలిపారు. ఇది రైతుల సంక్షేమంపై మోదీ ప్రభుత్వ నిబద్ధతను ప్రతిబింబిస్తుందన్నారు.

పదినెలల్లో రాష్ట్రాన్ని ముంచిన రేవంత్: ఈటల



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు రాష్ట్రాన్ని పదేళ్లు పాలించి ముంచారని, కానీ ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పది నెలల్లోనే ముంచేశారని మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్ ఎద్దేవా చేశారు. ఆయన గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లకు మరోసారి ఓటు వేయద్దొని ప్రజలు నిర్ణయించుకున్నారని పేర్కొన్నారు. రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందాలంటే బీజేపీతోనే సాధ్యమని ఈటల స్పష్టం చేశారు. గాలి వార్తలపై స్పందించనని, కాళేశ్వరం విషయంలో బీజేపీ పార్లమెంట్ సభ్యునిగా విచారణకు వెళ్తానన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ వెళ్లి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని పొగుడుతారని, గల్లీలో వచ్చి తిడతారని ఈటల వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో గురువారం నిర్వహించిన జైహింద్ ర్యాలీలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సైనికుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని విమర్శించారు.

బీఆర్‌ఎస్ పతనం ఖాయం: ఏలేటి



సాక్షి, హైదరాబాద్: నాలుగు స్తంభాలాటలో బీఆర్‌ఎస్ పార్టీ పతనం ఖాయమని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. కవిత కొంతకాలంగా కేటీఆర్‌పై అసంతృప్తిగా ఉన్నారని పేర్కొన్నారు. పార్టీలో తనకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నిస్తూ లేఖలో పేర్కొన్నారన్నారు. దీంతో కేసీఆర్ సంకటంలో పడ్డారని, క్షేత్రస్థాయిలో పార్టీ కేడర్ కూడా సందిగ్ధంలో ఉందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీలో తనను పూర్తిగా విస్మరిస్తున్నారని కవిత ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. కేటీఆర్ మాదిరిగానే తనను వర్కింగ్ ప్రెసిడెంట్ చేయాలని కవిత కోరుతున్నారన్నారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్ పూర్తిగా పతనమవుతోందని వ్యాఖ్యానించారు. బీఆర్‌ఎస్‌లో మచ్చలేని నేతలంతా.. బీజేపీ వైపే చూస్తున్నారని వెల్లడించారు.

ఐదు డీఏలను విడుదల చేయాలి

తెలంగాణ రిటైర్డ్ గెజిటెడ్ అధికారుల సంఘం


సాక్షి, హైదరాబాద్: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని తెలంగాణ రిటైర్డ్ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోహన్ నారాయణ, నర్సారాజు కోరారు. తెలంగాణ రిటైర్డ్ గెజిటెడ్ అధికారుల సంఘ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. ఉద్యోగులకు ఆరోగ్య పథకం అమలు చేయాలని, పీఆర్సీని వెంటనే ప్రకటించాలని కోరారు.

ఏపీ సచివాలయ స్టాఫ్ కో-ఆపరేటివ్ సొసైటీ కార్యవర్గం ఎన్నిక

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ సచివాలయ స్టాఫ్ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షునిగా రెండ్ల రాజేశం ఎన్నికయ్యారు. ఏపీ సెక్రటేరియల్ కో-ఆపరేటివ్ సొసైటీకి గురువారం జరిగిన ఎన్నికలతో కొత్త కార్యవర్గం ఎంపికైంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలు, రాజ్‌భవన్‌ల ఉద్యోగులు ఓటేశారు. ఎన్నికల్లో మొత్తం 28 మంది పోటీ చేయగా.. 11 మంది ఎన్నికయ్యారు. వీరిలో అధ్యక్షునిగా రాజేశం, ప్రధాన కార్యదర్శిగా టి.స్వరణ్ రాజ్, ఉపాధ్యక్షునిగా టి.జయహరిగౌడ్, కోశాధికారిగా ప్రశాంత్ కుమార్, మేనేజింగ్ కమిటీ సభ్యులుగా కె.స్వామి, ఆర్.శ్రీలక్ష్మి, ఆర్.అనురాధ, ఎం.రవీంద్రకుమార్, ఎస్.అరవింద్ గౌడ్, టి.రాజీవ్ చంద్, దుర్గేందర్ అంగాని ఎన్నికయ్యారు. వీరంతా పదేళ్ల పాటు పదవిలో కొనసాగనున్నారు.

ప్రైవేటు జేబుల్లోకి రూ.500 కోట్ల రాయితీ!





ఎలక్ట్రిక్ బస్సుల సరఫరా, నిర్వహణ కాంట్రాక్టు ప్రైవేటు సంస్థకు అప్పజెబుతున్న కేంద్రం

- 2 వేల బస్సులకు సంబంధించిన రూ.500 కోట్ల సబ్సిడీ ఆ సంస్థకే ఇస్తున్న వైనం
- తామే బస్సులు కొంటాం. తమకే ఆ రాయితీ ఇవ్వాలంటున్న రాష్ట్ర ప్రభుత్వం
- ససేమిరా అంటున్న కేంద్ర ప్రభుత్వం..రాయితీ నష్టం.. ఆర్టీసీలో డ్రైవర్ పోస్టులకూ కోత
- గతంలో 'ఫేమ్'పథకంలో కూడా సబ్సిడీని ప్రైవేటు సంస్థలకే కట్టబెట్టిన మోదీ సర్కారు

సాక్షి, హైదరాబాద్: దేశ వ్యాప్తంగా డీజిల్ బస్సులను తగ్గించటం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించాలన్న సంకల్పంతో రాష్ట్రాలకు ఎలక్ట్రిక్ బస్సులను కేంద్ర ప్రభుత్వం రాయితీ ధరలకు సరఫరా చేస్తోంది. రాయితీ ధరలకు సరఫరా చేస్తేనే రాష్ట్రాలు ఎలక్ట్రిక్ బస్సులను కొంటాయనే ఆలోచనతో కేంద్రం పీఎం ఈ-డ్రైవ్ పథకాన్ని ప్రవేశపెట్టింది. అయితే ఈ రాయితీ ప్రైవేటు సంస్థల జేబుల్లోకి చేరుతుండటంతో, రాష్ట్ర ప్రభుత్వాల అధీనంలోని ఆర్టీసీలకు ప్రయోజనం చేకూరకుండా పోతోంది.

పీఎం ఎలక్ట్రిక్ డ్రైవ్ రివల్యూషన్ ఇన్ వెహికిల్ ఎన్‌హెన్స్‌మెంట్ (పీఎం ఈ డ్రైవ్) పథకం కింద తెలంగాణ ఆర్టీసీకి కేంద్రం తాజాగా 2 వేల ఎలక్ట్రిక్ బస్సులను మంజూరు చేసింది. అయితే ఈ బస్సులను టెండర్ ద్వారా ప్రైవేటు సంస్థకు కేటాయిస్తోంది. దీంతో ఆ సంస్థే బస్సులను తయారు చేసి ఆర్టీసీలో అద్దె ప్రాతిపదికన (గ్రాస్ కాస్ట్ కాంట్రాక్టు) నిర్వహించాల్సి ఉంది. ఇందుకు గాను టెండర్‌లో కోట్ చేసిన ధర ప్రకారం ఆర్టీసీ ప్రతి కి.మీ.కు నిర్ధారిత మొత్తం(రూ.50-రూ.60 మధ్య) చెల్లించాల్సి ఉంటుంది.

> ప్రైవేటు కాంట్రాక్టు సంస్థకే బస్సులు

కాగా కాంట్రాక్టు సంస్థకు కేంద్ర ప్రభుత్వం రూ.500 కోట్ల మొత్తం రాయితీ కల్పించింది. అంటే ఆయా బస్సుల ఖరీదులో ఆ మేరకు సంస్థకు ఆదా అవుతుందన్న మాట. ఈ నేపథ్యంలో బస్సులు తామే కొంటామని, అదే రాయితీని ఆర్టీసీలకు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరితే కేంద్రం ససేమిరా అంటోంది. గతంలో మోదీ ప్రభుత్వం అమలు చేసిన 'ఫేమ్'(ఫాస్టర్ అడాప్షన్ అండ్ మాన్యుఫాక్చరింగ్ ఆఫ్ హైబ్రిడ్ అండ్ ఎలక్ట్రిక్ వెహికల్స్) పథకంలో కూడా రాయితీని ప్రైవేటు సంస్థలకే కట్టబెట్టడం గమనార్హం.

ఒక్కో బస్సుకు సగటున రూ.25 లక్షల సబ్సిడీ

ఆర్టీసీకి సరఫరా చేసే బస్సుల్లో వెయ్యి వరకు 12 మీటర్ల పొడవు ఉండే బస్సులు, మరో వెయ్యి 9 మీటర్ల బస్సులు ఉన్నాయి. వీటిల్లో 100 మాత్రమే ఏసీ బస్సులు కాగా, మిగతావి నాన్ ఏసీ బస్సులు. ఇవన్నీ హైదరాబాద్ నగరంలో తిరుగుతాయి. ఒక్కో బస్సుకు సగటున రూ.25 లక్షల సబ్సిడీని కేంద్రం ప్రకటించింది. ఒక్కో ఎలక్ట్రిక్ బస్సు కొనాలంటే రూ.కోటిన్నర వరకు ఖర్చవుతోంది. అంత మొత్తం భరించటం ఆర్టీసీ, రాష్ట్ర ప్రభుత్వాలకు భారంగా ఉంటోంది. దీంతో రాయితీ మొత్తాన్ని నేరుగా ఆర్టీసీకి ప్రకటిస్తే సొంతంగా కొనే వెసులుబాటు ఉంటుందని, అప్పుడు బస్సులు కూడా ఆర్టీసీ సొంతమవుతాయన్నది రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన.

> అందరూ ప్రైవేటు డ్రైవర్లే..



అద్దె ప్రాతిపదికన ఆర్టీసీలో బస్సులు నిర్వహించే కాంట్రాక్టు సంస్థ, వాటికి డ్రైవర్లను కూడా తానే ఏర్పాటు చేస్తుంది. ఇప్పుడు మంజూరు చేసిన బస్సులు వచ్చే జనవరి నుంచి రెండేళ్ల కాలంలో విడతల వారీగా ఆర్టీసీకి సమకూరుతాయి. ఆ బస్సులు రావటంతోనే, అంతే సంఖ్యలో నగరంలోని డీజిల్ బస్సులను ఇతర ప్రాంతాలకు తరలిస్తారు. 2 వేల బస్సులకు దాదాపు 5 వేల మంది డ్రైవర్లు ఉంటారు. భవిష్యత్తులో ఈ అద్దె ఎలక్ట్రిక్ బస్సులన్నిటికీ ప్రైవేటు డ్రైవర్లే ఉండనున్నందున అంత మేర ఆర్టీసీకి సొంత డ్రైవర్ల అవసరం ఉండదు. ఫలితంగా అన్ని డ్రైవర్ పోస్టులు కోల్పోవాల్సి వస్తుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని, ఆ బస్సులకు ఆర్టీసీ డ్రైవర్లు ఉండేలా నిబంధన మార్చాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనను కూడా కేంద్రం తోసిపుచ్చినట్టు తెలిసింది.

ఆ రాయితీతో వెయ్యి డీజిల్ బస్సుల రిట్రోఫిట్‌కు చాన్స్



ప్రస్తుతం వినియోగంలో ఉన్న డీజిల్ బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా రిట్రోఫిట్ చేసే పరిజ్ఞానం అందుబాటులో ఉంది. ఆ ప్రయోగాన్ని ఆర్టీసీ విజయవంతంగా అమలు చేస్తోంది. ఒక్కో పాత బస్సును కన్వర్ట్ చేసేందుకు రూ.50 లక్షల వరకు ఖర్చవుతుంది. ఇప్పుడు కొత్త ఎలక్ట్రిక్ బస్సులకు కేంద్రం ఇచ్చే సబ్సిడీ మొత్తాన్ని గనుక రాష్ట్రానికి కేటాయిస్తే ఏకంగా 1,000 బస్సులను కన్వర్ట్ చేసే వెసులుబాటు ఉంటుంది. ఈ మేరకు ఆర్టీసీ సమర్పించిన ఈ ప్రతిపాదన కూడా కేంద్రం వద్ద పెండింగులోనే ఉంది.

నందమూరి వంశం లేని మహానాడు

- టీడీపీ కార్యక్రమంలో కనిపించని హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ
- పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ వారసులు లేకుండానే నిర్వహణ!
- లోకేశ్‌ను భవిష్యత్ నాయకుడిగా చిత్రీకరించేందుకు తీవ్ర ప్రయత్నం
- క్రమేపీ నందమూరి వంశస్థులను దూరం చేస్తున్న నారా వారు
- జూనియర్ ఎన్టీయార్‌కు బాలకృష్ణతో అడ్డుకట్ట



మహానాడులో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

సాక్షి ప్రతినిధి, కడప, అమరావతి: టీడీపీ వ్యవస్థాపకుడు దివంగత నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) వారసులు లేకుండానే ఆ పార్టీ మహానాడు నిర్వహించడం చర్చనీయాంశం అవుతోంది. పూజించిన కేడర్ చేతులతోనే ఎన్టీఆర్‌ను చీ కొట్టించి ఆయన నుంచి పార్టీని చేజిక్కించుకున్న చంద్రబాబు 30 ఏళ్ల నుంచి ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నికవుతూ వస్తున్నారు. అలా టీడీపీలో క్రమేపీ నందమూరి వంశానికి ప్రాధాన్యం లేకుండా చేశారు. ఈ విషయం కడప మహానాడు వేదికగా మరోసారి నిరూపితమైంది. మంగళ, బుధ, గురు వారాల్లో నిర్వహించిన మహానాడులో ఎన్టీఆర్ కుటుంబ సభ్యులను పూర్తిగా దూరంపెట్టారు. పదేళ్లుగా ప్రతి మహానాడులో నందమూరి హీరో, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. అయితే, టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక నిర్వహించినసీ తొలి మహానాడులో మాత్రం బాలకృష్ణ అసలు కనిపించలేదు.

నారా లోకేష్ కోసమే...?

మంత్రి నారా లోకేష్‌ను పార్టీలో ప్రమోట్ చేసేందుకు నందమూరి వంశస్థులను సీఎం చంద్రబాబు క్రమేపీ దూరం పెడుతున్నారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. 2009 ఎన్నికల్లో ప్రచార బాధ్యతల్లో చేపట్టి దూసుకెళ్లిన జూనియర్ ఎన్టీయార్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. ఆయనను అలాగే పార్టీలో కొనసాగిస్తే తనయుడు లోకేష్ రాజకీయ భవిష్యత్‌కు ఇబ్బంది అని చంద్రబాబు భావించారు. క్రమేపీ జూనియర్ ఎన్టీఆర్‌ను దూరంపెట్టారని పరిశీలకులు గుర్తుచేస్తున్నారు. ఈ క్రమంలో ఎన్టీఆర్ తనయుడు నందమూరి బాలకృష్ణను ముందుపెట్టి వ్యవహారాన్ని చక్కబెట్టిన వైనాన్ని ప్రస్తావిస్తున్నారు. బాలకృష్ణ అవసరమూ తీరిందనే భావనతో తాజాగా మహానాడులో ఆయన కనిపించకుండా చేశారని బాలకృష్ణ అభిమానులు వాపోతున్నారు. టీడీపీ పూర్తిగా నారా వారిదేనని, ఎన్టీయార్ వంశానిది కాదని కేడర్‌కు చెప్పకనే చెప్పేందుకు నందమూరి వంశస్థులను దూరం పెట్టారని పలువురు భావిస్తుండడం గమనార్హం.

పరనిందలతో ఆత్మానందం

కడపలో మూడు రోజులపాటు జరిగిన మహానాడు ఆసాంతం ఆత్మస్తుతి, పరనిందలతో సాగింది. మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌ను అదే పనిగా దూషించడం, ఆయనపై లేనిపోని నిందలు మోపి సంబరపడడానికే టీడీపీ నేతలు ఎక్కడ లేని ఉత్సాహం చూపారు. చంద్రబాబు, లోకేష్‌ను ఆకాశానికి ఎత్తడం, వైఎస్ జగన్‌ను ఇష్టం వచ్చినట్లు తిట్టడానికే మహానాడు పెట్టుకున్నట్టు ఉందనిపించింది. చేయని పనుల గురించి అభూత కల్పనలతో గొప్పగా చెప్పుకొంటూ చంద్రబాబు ఆయన పరివారం ఆత్మానందం పొందింది. కడప గడ్డపై తొలిసారి మహానాడు నిర్వహించామంటూ ఊదరగొట్టడమే తప్ప కడప ప్రాంతానికి ఇన్నేళ్లలో ఏం చేశారో ఒక్కమాట కూడా చెప్పలేకపోయారు. భవిష్యత్తులోనైనా ఏం చేస్తామో చెప్పే ప్రయత్నం కూడా చేయలేదు. కడపలో మహానాడు నిర్వహణ ద్వారా టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టి లబ్ధి పొందడమే చంద్రబాబు ఎజెండాగా కనిపించింది.

తీర్మానాలు పోయి శాసనాలు వచ్చె..

మాములుగా అయితే మహానాడులో వివిధ అంశాలపై తీర్మానాలు ప్రవేశపెట్టి వాటిపై చర్చించడం ఆనవాయితీ. ఈ మహానాడులో తీర్మానాలు దాదాపు పక్కకుపోయాయి. సూపర్ సిక్స్ హామీల తరహాలో సూపర్ సిక్స్ శాసనాలు అంటూ పాత అంశాలకే కొత్త పేర్లు పెట్టి చంద్రబాబు తన తనయుడు లోకేష్‌తో చెప్పించారు. మూడు రోజులు చర్చంతా ఆ అంశాలపైనే జరిగేలా చూశారు. చంద్రబాబు మాట్లాడిన ప్రతి సందర్భంలోనూ ఈ శాసనాలు లోకేష్ ఆలోచనే అని, వాటిని అందరూ పాటించాలని చెప్పుకొచ్చారు. తద్వారా టీడీపీకి వచ్చే 40 ఏళ్ల వరకు రూట్‌మ్యాప్ రూపొందించినట్లు నమ్మించే ప్రయత్నం చేశారు.

కార్యకర్తలే బలం అన్న రోజే బలవన్మరణ యత్నం

ఆరు శాసనాల్లో గొప్పగా చెప్పినవాటిల్లో కార్యకర్తే అధినేత. కానీ, అదే రోజు కడపలో మహిళా కార్యకర్త తనకు పార్టీలో తీవ్ర అన్యాయం జరుగుతోందని సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నం చేయడం గమనార్హం. కడప ఎమ్మెల్యే మాధవి తమను అణచివేస్తున్నారని ఇబ్బందులు పెడుతున్నారని ఆమె బలవన్మరణానికి సిద్ధమైంది. దీన్నిబట్టి టీడీపీలో కార్యకర్తల పరిస్థితి ఎలా ఉందో ఊహించవచ్చని విశ్లేషకులు పేర్కొంటున్నారు. కార్యకర్తలే నా బలం, బలగం అని చంద్రబాబు గట్టిగా చెప్పుకొన్నా ఆచరణలో అది నిజం కాదని కడప మహిళా కార్యకర్త ఆత్మహత్యాయత్నం తేల్చిచెప్పింది.

తేలిపోయిన తీర్మానాలు.. సీనియర్లకు చెక్

అర్థం పర్థం లేని శాసనాలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చి ఆ తర్వాత పదికి పైగా తీర్మానాలు చేసినా వాటిలో పస లేకుండాపోయింది. వీటిలోనూ వైఎస్ జగన్‌ను తిట్టడం, తమను పొగుడుకోవడమే కనిపించింది. అసత్యాలు, కట్టు కథలు, మాయమాటలతో నేతలంతా ఈ తీర్మానాలపై ప్రసంగాలు చేశారు. చివరగా కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడితో రాజకీయ తీర్మానం చేయించారు. వాస్తవానికి రాజకీయ తీర్మానాన్ని సీనియర్ నేతతో చేయించడం టీడీపీ సంప్రదాయం. గతంలో యనమల రామకృష్ణుడు ప్రతిపాదించేవారు. ఈసారి యనమల వేదిక మీద ఉన్నా.. రామ్మోహన్‌నాయుడుతో తీర్మానం చేయించి సీనియర్ల అవసరం లేదని స్పష్టం చేశారు.

పాత సీసాలో కొత్త సారా 'శాసనాలు'

నిజానికి ఆరు శాసనాల్లో ఏమాత్రం కొత్తదనం లేదు. యువత, మహిళలు, రైతులు, పేదలు, కార్యకర్తలకు మేలు చేయడం, తెలుగు జాతిని గొప్పగా నిలబెట్టడమే ఈ శాసనాలు. ఇవన్నీ 40 ఏళ్లుగా చంద్రబాబు చెబుతున్నవే. వీటన్నింటికీ కలిపి నా తెలుగు కుటుంబం అని పేరు పెట్టారు. వైఎస్సార్‌సీపీ గతంలో నవరత్నాల పేరుతో కొత్త పథకాలు ప్రకటించినట్లుగా ఇందుకు సంబంధించిన లోగోను కూడా రూపొందించడం గమనార్హం. పాత విషయాలనే కొత్త పదాల ద్వారా ఆకర్షణీయంగా చెప్పి దాన్ని లోకేష్ ప్రతిభగా చిత్రీకరించుకోవడం విశేషం. అసలు శాసనాలంటే ఏమిటో తెలుగు తమ్ముళ్లు ఎవరికీ అర్థం కాని బ్రహ్మ పదార్థంగా మారిపోయింది. ఈ శాసనాలే మిటని తమ్ముళ్లు బుర్రగోక్కుంటూ చర్చించుకున్నారు. ఏదో ఒక కొత్త పదం వాడాలి కాబట్టి శాసనాలు అనే పదం వాడినట్లు కనిపిస్తోంది తప్ప.. అందులో కొత్త అర్థం కానీ, కొత్త విషయం కానీ లేదు.



విజయవాడలోని నిర్మలా శిశుభవన్‌లో నిర్వహించిన వైఎస్ రాజారెడ్డి జయంతి కార్యక్రమంలో చిన్నారులతో వైఎస్ జగన్ దంపతులు


నిర్మలా శిశుభవన్‌లో ఘనంగా వైఎస్ రాజారెడ్డి శత జయంతి

నివాళులర్పించిన వైఎస్ జగన్ దంపతులు

సాక్షి, అమరావతి/కృష్ణలంక(విజయవాడ తూర్పు): వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాత వైఎస్ రాజారెడ్డి శత జయంతి వేడుక గురువారం విజయవాడలోని నిర్మలా శిశుభవన్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రాజారెడ్డికి వైఎస్ జగన్, వైఎస్ భారతి దంపతులు ఘన నివాళులర్పించారు. అనంతరం చిన్నారులను వైఎస్ జగన్ ఆప్యాయంగా పలకరించారు. వారి బాగోగుల గురించి అక్కడి సిబ్బందిని ఆరా తీశారు. పిల్లలతో సరదాగా గడిపిన వైఎస్ జగన్.. వారితో కలిసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి సోదరి విమలమ్మ తదితరులు పాల్గొన్నారు. కాగా, నిర్మలా శిశుభవన్‌లో పిల్లలతో ముచ్చటించి.. సరదాగా గడిపి.. వారితో కేక్ కట్ చేయించిన ఫొటోలు, వీడియోలను వైఎస్ జగన్ సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో పోస్టు చేశారు.

ఏడాదిగా సుపరిపాలన

మహానాడు బహిరంగ సభలో సీఎం చంద్రబాబు



సాక్షి, అమరావతి : ఏడాదిలోపే ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో సుపరిపాలన అంటే ఏంటో చూపించామని టీడీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పారు. ఆరు శాసనాలతో నూతనత్వాన్ని తెస్తామని, వీటి ద్వారా తిరుగులేని ఫలితాలు సాధిస్తామని స్పష్టం చేశారు. టీడీపీ సంపద సృష్టించడం తెలిసిన పార్టీ అన్నారు. గురువారం కడపలో మహానాడు ముగింపు సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. బీసీలకు పెద్దపీట వేస్తామని, వడ్డెరలకు మైనింగ్ లీజులు ఇస్తామని పునరుద్ఘాటించారు. రాబోయే మహానాడు కల్లా భూ సమస్యలు పూర్తిగా పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. 2027 డిసెంబర్‌లోగా పోలవరం పూర్తి చేస్తామన్నారు. ఏపీలో ఒక భూతం ఉందని, రావాలంటే భయమేస్తోందని కొందరు పారిశ్రామికవేత్తలు అన్నారని, ఆ భూతాన్ని భూ స్థాపితం చేస్తున్నామని భరోసా ఇచ్చానని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న తలసరి ఆదాయం రూ.2.67 లక్షలను 22 ఏళ్లలో రూ.55 లక్షలు చేసే బాధ్యత తీసుకుంటానని చెప్పారు.

సీమ అభివృద్ధికి ప్రత్యేక బ్లూ ప్రింట్

తన దగ్గర ఉన్న ప్రత్యేక బ్లూ ప్రింట్ ద్వారా రాయలసీమలో రాబోయే రోజుల్లో పేదరికం ఉండదని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. ఆరు నెలల్లో కడప హజ్ హౌస్ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపామన్నారు. కడప స్టీల్ ప్లాంట్ పనులు జూన్ 12 లోగా ప్రారంభిస్తామని చెప్పారు.

భారతీయుల ఆత్మగౌరవం ట్రంప్ దగ్గర తాకట్టా?

▶ మొదటి పేజీ తరువాయి

రఫేల్ విమానాలు మాత్రం యుద్ధంలో నేలకూలాయని ఎద్దేవా చేశారు. యుద్ధం చేయాలనుకున్నప్పుడు అఖిలపక్షాన్ని పిలిచారని.. యుద్ధం ఆపేసినప్పుడు అఖిలపక్షాన్ని ఎందుకు పిలవలేదని ప్రశ్నించారు. యుద్ధంపై ఉపన్యాసాలు చెప్పడం కాదు. దేశ ప్రజలకు మోదీ సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.

ఇందిరను స్ఫూర్తిగా తీసుకోవాలి

పాకిస్తాన్‌తో యుద్ధంలో అపరకాళీ ఇందిరా గాంధీని ప్రధాని మోదీ స్ఫూర్తిగా తీసుకుంటే బాగుండేదని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. గతంలో పాకిస్తాన్‌తో యుద్ధం జరిగినప్పుడు యుద్ధం ఆపాలని ఇందిరా గాంధీని అప్పటి అమెరికా అధ్యక్షుడు బెదిరించారని, కానీ ఆమె అమెరికా బెదిరింపులకు లొంగలేదన్నారు. భారత్ వైపు ఎవరు కన్నెత్తి చూసినా కనుగుడ్లు పీకేస్తామని.. చైనాకు ఇందిరాగాంధీ వార్నింగ్ కూడా ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఆనాడు చైనాపై యుద్ధం ప్రకటించి గట్టిగా బుద్ధి చెప్పిన ఘనత ఇందిరమ్మదన్నారు. భారత ఆర్మీ కల్నల్ సంతోష్‌ను చైనా పొట్టన పెట్టుకుంటే మోదీ కనీసం చైనాకు బుద్ధి చెప్పే ప్రయత్నం కూడా చేయలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. 1971లో భారత్-పాక్ యుద్ధ సమయంలో అమెరికా మధ్యవర్తిత్వం అవసరం లేదని ఇందిరా గాంధీ నిర్మొహమాటంగా చెపారని, యుద్ధంలో ఇందిరమ్మ పాకిస్తాన్‌ను రెండు ముక్కలు చేసి చూపారన్నారు. ఇందిరమ్మ స్ఫూర్తితో పాక్‌ను రెండు ముక్కలు చేయాలని.. తాము మద్దతుగా ఉంటామని చెప్పారు. పాకిస్తాన్‌కు గుణపాఠం చెప్పడానికి సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని రేవంత్ కోరారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను భారత్‌లో కలుపుకొనేందుకు పాక్‌పై యుద్ధం చేయాలని, రాజకీయాలకు అతీతంగా అండగా ఉంటామని చెప్పామన్నారు. భారత్‌పై పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు పేట్రేగిపోతున్నారని, ఉగ్రవాదులను తుదముట్టించే వరకూ సైన్యానికి అండగా ఉంటామని తెలిపారు.



జైహింద్ యాత్ర అనంతరం జరిగిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి అభివాదం. చిత్రంలో మంత్రులు ఉత్తమ్, పొన్నం, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ తదితరులు

రాహుల్ గాంధీపై విమర్శలా?

అమెరికాకు తలొగ్గి యుద్ధం విరమించిన బీజేపీ.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి దుయ్యబట్టారు. భారత్ 1967లో చైనాను, 1971లో పాకిస్తాన్‌ను ఓడించినందుకు కాంగ్రెస్‌ను విమర్శిస్తున్నారా ఎద్దేవాచేశారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది, గాంధీ కుటుంబానిదన్నారు. మోదీకి వీరతిలకం దిద్ది పాకిస్తాన్‌పై యుద్ధం చేయాలని చెబితే.. ఎందుకు వెనుకడుగు వేశారో బీజేపీ నేతలే చెప్పాలన్నారు. ఇది దేశ భద్రతకు సంబంధించిన అంశమని, మీ సొంత వ్యవహారం కాదని ధ్వజమెత్తారు. గుండెల్లో ధైర్యం ఉన్న నాయకుడే యుద్ధాన్ని గెలిపిస్తారన్నారు. భారత సైనికుల ఆత్మస్థైర్యాన్ని బీజేపీ దెబ్బతీస్తే.. వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు కాంగ్రెస్ జైహింద్ యాత్ర చేపట్టిందని చెప్పారు. రాహుల్ గాంధీని దేశానికి ప్రధానిగా చూసే వరకు మనం విశ్రమించొద్దని పార్టీ కార్యకర్తలకు రేవంత్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

సీఎస్‌తో ట్రెయినీ ఐఏఎస్‌ల భేటీ



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావుతో.. 2024 బ్యాచ్ ట్రెయినీ ఐఏఎస్‌లు గురువారం తెలంగాణ సచివాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన తన పాలనానుభవాలపై వారికి మార్గనిర్దేశం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి పథకాల అమలును వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, నిర్ణయాలను ఎలా అమలు చేయాలో అవగాహన కల్పించారు.

వర్షాలు చేసిన మేలు..

- 18 ఏళ్ల తర్వాత తొలిసారిగా మే నెలలో జూరాలకు వరద..
- ప్రాజెక్టు 12 గేట్లు ఎత్తివేత



గద్వాల: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో కృష్ణా బేసిన్‌లోని నదీ పరీవాహక ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు 18 ఏళ్ల తరువాత తొలిసారిగా మే నెలలో ప్రాజెక్టుకు భారీ వరద నీరు వచ్చి చేరింది. గురువారం రాత్రి 9 గంటల సమయంలో జూరాలకు 99 వేల క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా.. ప్రాజెక్టు 12 గేట్లను 2 మీటర్ల మేర ఎత్తి 83,616 క్యూసెక్కుల నీటిని దిగువన శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేశారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయిన 40 ఏళ్లలో జూరాలకు మే నెలలో వరద రావడం ఇది ఐదోసారి. గతంలో 2002లో 2 టీఎంసీలు రాగా 4 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. అదేవిధంగా 2003లో 2.5 టీఎంసీలు వరద నీరు రాగా 5 గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేశారు. తరువాత 2004లో 8 టీఎంసీల వరద రాగా 10 గేట్లు ఎత్తారు. తరువాత 2007లో 1.5 టీఎంసీలు రాగా 2 గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేశారు. ప్రస్తుతం జూరాలకు 99 వేల క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా.. శుక్రవారం వరకు 1.10 లక్ష క్యూసెక్కులకు పెరగనున్నట్లు గద్వాల జిల్లా ఇరిగేషన్ శాఖ ఎస్‌ఈ రహీముద్దీన్ తెలిపారు. జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం జలాశయంలో 8.571 టీఎంసీల నిల్వ ఉంది. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకానికి 1,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శుక్రవారం ॥ 30-5-2025

ఫ్యాషన్

కాన్స్ ఫెస్టివల్‌లో ఐశ్వర్య ధరించిన సంస్కృత శ్లోకంతో డిజైన్ చేసిన కేప్



ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొనేటప్పుడు సంస్కృత పదాల ప్రింట్లు ఉన్న కండువాలు, దుపట్టాలు వంటివాటిని ధరించడం చూస్తుంటాం. అయితే ఇటీవల అంతర్జాతీయ వేదికలపైనా ఆడంబరంగా జరిగే వేడుకలలోనూ సంస్కృత శ్లోకాల ఎంబ్రాయిడరీ, ప్రింట్లతో డిజైన్ చేసిన దుస్తులు ధరించి లోతైన భారతీయ ఆత్మను సరికొత్తగా పరిచయం చేస్తున్నారు. ఆధునిక ఆలోచనలకు సంప్రదాయాన్ని జోడించి ఫ్యాషన్ రంగంలో హుందాతనాన్నీ చాటుతున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేవారు వీటిని ఎంచుకుంటున్నారు.

సంస్కృత శ్లోకాల సంస్కృతి



• కాన్స్‌లో.. సంస్కృత శ్లోకం

ఇటీవల కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్–2025లో నటి ఐశ్వర్యారాయ్ అద్భుతమైన బ్రొకేడ్ సిల్వర్ కేప్, బ్లాక్ గౌన్ ధరించి అంతర్జాతీయంగా అభిమానులను ఆకట్టుకున్నారు. భారతీయ డిజైనర్ గౌరవ్ గుప్తా డిజైన్ చేసిన ఆ గౌను కేప్‌పైన భగవద్గీత శ్లోకాన్ని ఎంబ్రాయిడరీ చేశారు. 'కర్మణ్యే వాధికారస్తే మా ఫలేషు కదాచనా. అంటే–కర్మలను చేసే హక్కు మీకు ఉంటుంది. కానీ, ఆ కర్మల ఫలాలకు కాదు' అని అర్థం వచ్చేలా ఫ్యాషన్, ఆధ్యాత్మికత– ఈ రెండింటి కలబోతను ఐశ్వర్య తన దుస్తుల ద్వారా ప్రకటించింది. కాన్స్ డ్రెస్ కోడ్ ప్రకారం బనారసి వెండి కేప్ ఐశ్వర్య లుక్‌ను ఆకర్షణీయంగా మార్చింది. వెండి, బంగారు, నలుపు రంగులతో కూడిన ఈ డ్రెస్‌తో విశ్వపు అందాన్ని వేదికపైన చిత్రీకరించి, రాణిలా వెలిగిపోయింది ఐష్.

ఈషా అంబానీ ధరించిన లెహంగా అంచుల్లో శ్లోకాలు

• వెడ్డింగ్ లెహంగాపైన

ఇషా అంబానీ తన సోదరుడి వివాహ సమయంలో ధరించిన సంప్రదాయ లెహంగా అందరినీ అమితంగా ఆకట్టుకుంది. డిజైనర్లు అబుజాని, సందీప్ ఖోస్లా డిజైన్ చేసిన ఆ లెహంగాపైన భగవద్గీత శ్లోకాలను ఎంబ్రాయిడరీతో డిజైన్ చేశారు. గౌరీ పూజలో పాల్గొనడానికి ఆమె ఈ సంస్కృత శ్లోకాలతో డిజైన్ చేసిన లెహంగాను ధరించింది.

• అక్షరాల మాల

ఫ్యాబ్రిక్ పైన క్లిష్టమైన డిజైన్లుగా సంస్కృత శ్లోకాలు ప్రాచుర్యం పొందడంతో డిజైనర్లు కూడా ఆసక్తి చూపుతున్నారు. దీంతో సంస్కృత శ్లోకాలు, ప్రాంతీయ భాషలో ఉన్న అక్షరాల ప్రింట్లు సాంస్కృతిక, ఆధ్యాత్మిక ప్రాముఖ్యత నింపుకుంటున్నాయి. భగవద్గీత వంటి గ్రంథాల నుండి ఈ శ్లోకాలను తరచుగా చీరలు, లెహంగాలు, కుర్తీలు, దుపట్టాలు వంటి క్లాత్స్‌పై ముద్రించడం, ఎంబ్రాయిడరీ చేయడం, నేత నేయడం చేస్తున్నారు. ఈ ధోరణి మహిళలు తమ దుస్తుల ద్వారా వారి సాంస్కృతిక గుర్తింపును, వారసత్వాన్ని వ్యక్తపరిచే వీలు కల్పిస్తోంది.



• అక్షరాల మాల

ఫ్యాబ్రిక్ పైన క్లిష్టమైన డిజైన్లుగా సంస్కృత శ్లోకాలు ప్రాచుర్యం పొందడంతో డిజైనర్లు కూడా ఆసక్తి చూపుతున్నారు. దీంతో సంస్కృత శ్లోకాలు, ప్రాంతీయ భాషలో ఉన్న అక్షరాల ప్రింట్లు సాంస్కృతిక, ఆధ్యాత్మిక ప్రాముఖ్యత నింపుకుంటున్నాయి. భగవద్గీత వంటి గ్రంథాల నుండి ఈ శ్లోకాలను తరచుగా చీరలు, లెహంగాలు, కుర్తీలు, దుపట్టాలు వంటి క్లాత్స్‌పై ముద్రించడం, ఎంబ్రాయిడరీ చేయడం, నేత నేయడం చేస్తున్నారు. ఈ ధోరణి మహిళలు తమ దుస్తుల ద్వారా వారి సాంస్కృతిక గుర్తింపును, వారసత్వాన్ని వ్యక్తపరిచే వీలు కల్పిస్తోంది.

• కలెక్షన్ థీమ్

ధ్యాన, యోగ కలెక్షన్‌లో 'ఓం నమః శివాయ, యోగ కర్మస్య కోశలం, సర్వ భవంతు సుఖినః శాంతిః భవంతుః శాంతిః ... వంటి శ్లోకాలతో మోడ్రన్ ట్రెడిషనల్ వేర్ రూపుదిద్దుకుంటోంది.

• రాజస సంస్కృతం

మహాభారతం, రామాయణం వంటి ఇతిహాసాల నుండి శ్లోకాలతో గౌన్లు, షేర్వాణీలను అలంకరిస్తున్నారు. బ్లాక్ కాటన్ లేదా సిల్క్ ఫ్యాబ్రిక్ మీద బంగారు రంగులో సంస్కృత అక్షరాలను ఎంబ్రాయిడరీ లేదా ప్రింట్స్‌గా వేస్తున్నారు.

బోర్డర్ డిజైన్లు, ప్రింటింగ్ టెక్నిక్‌లు

సంస్కృత శ్లోకాలను చీరలు లేదా దుపట్టాల అంచులపై ముద్రిస్తున్నారు. వీటిలో జైపూర్ స్టయిల్ బ్లాక్ ప్రింట్స్‌ని ఉపయోగిస్తున్నారు.

• ఇంటిప్స్

మచ్చల్ని మాయంచేసే డ్రింక్

దాహాన్ని తీర్చే కూల్‌డ్రింక్స్ టైల్స్, గిన్నెల మీద ఉన్న మరకలను ఇట్టే పోగొడతాయి.

- ఐరన్ ట్యాప్‌లు, టైల్స్ మీద ఏర్పడిన తుప్పు మరకలు ఒకపట్టాన వదలవు. అల్యూమినియం ఫాయిల్‌ను ఉండలా చుట్టి, కూల్‌డ్రింక్‌లో ముంచి తుప్పు మరకలపై రుద్దితే నిమిషాలో మరకలు మాయమైపోతాయి.



- డీప్ ఫ్రైకి వాడే బాణళ్లు తరచూ వాడడం వల్ల లోపల బయట నల్లగా మారిపోతాయి. ఈ బాణలిపై కూల్‌డ్రింక్‌ను పోసి పదినిమిషాలు నానబెట్టాలి. తరువాత స్క్రబ్బర్‌తో రుద్దితే మసిమరకలు పోయి బాణలి తెల్లగా మెరుస్తుంది.
- బాత్‌రూం టైల్స్ మీద వదలకుండా పట్టి పీడిస్తోన్న మొండి మరకలను కూల్ డ్రింక్‌లో ముంచిన స్క్రబ్బర్‌తో రుద్దితే ఇట్టే పోతాయి.



బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) 29న ముగింపు రూ.లలో

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	96,110
బంగారం (22 క్యారెట్లు)	88,890
వెండి	99,200
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	97,500
బంగారం (22 క్యారెట్లు)	88,950
వెండి	100,200
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	97,040
బంగారం (22 క్యారెట్లు)	88,950
వెండి	1,10,900
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	97,950
బంగారం (22 క్యారెట్లు)	91,620
వెండి	1,00,200
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	95,100
బంగారం (22 క్యారెట్లు)	87,490
వెండి	98,700
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	97,030
బంగారం (22 క్యారెట్లు)	88,950
వెండి	1,11,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ఫస్ట్ టైమ్

చూపున్న కీర్తన



ప్రియవదన

చెన్నైకి చెందిన ఎస్.ఎస్. ప్రియవదన తిరువన్మియూర్‌లోని పంబన్ స్వామిగళ్ ఆలయానికి ఉదువర్‌గా నియామకం అయింది. దేవాలయాలలో తమిళ శ్లోకాలు పఠించే భక్తి గాయకులను ఉదువర్ అంటారు. దేవాలయంలో ఉదువర్‌గా నియమితురాలైన తొలి అంధ మహిళ ప్రియవదన.

పుట్టిన అయిదు నెలలకు ఆమెకు దృష్టి వైకల్యం ఉన్నట్లు నిర్ధారణ అయింది.

చూపు లేకపోయినా అద్భుతమైన గాత్రం ఆమె సొంతం.

చెన్నైలోని ప్రభుత్వ సంగీతకళాశాలలో గాత్రసంగీతంలో పట్టా పుచ్చుకుంది.

తమిళ భక్తి కీర్తనలలో మాస్టర్స్ చేసింది.

ఎన్నో ఆలయాలలో కీర్తనలను ఆలాపించింది.

తమిళంలోనే కాదు తెలుగు, హిందీ, మరాఠీ భక్తి కీర్తనలను కూడా ఆలపిస్తుంది. వయోలిన్ వాయిస్తుంది. రోజుకు మూడు నుంచి నాలుగు గంటల పాటు సంగీత సాధన చేస్తుంది.

'చిన్నప్పుడు టీవీ స్పీకర్‌ల దగ్గర కూర్చొని అందులో వినిపిస్తున్న పాటతో గొంతు కలిపేది. సంగీతంలో ప్రియవదన ఆసక్తిని గమనించి సంగీతంలో శిక్షణ ఇప్పించాం' అంటుంది ప్రియవదన తల్లి సుభాషిణి.

ప్రియవదనకు సంగీతంలో తొలి గురువు సుభాషిణి.

మొదట తాను భక్తి కీర్తనలను నేర్చుకొని ఆ తరువాత కుమార్తెకు నేర్పించేది.

బుక్ షెల్ఫ్

డైట్ సెన్స్



ఇన్‌స్టాగ్రామ్‌లో 1.5 మిలియన్‌ల (15 లక్షలమంది) ఫాలోవర్స్ ఉన్న ఫిట్‌నెస్, న్యూట్రిషనిస్ట్ రుజుత దివాకర్ తన పుస్తకాల ద్వారా కూడా ఎంతోమంది అభిమానులను సంపాదించుకుంది. కొన్ని సంవత్సరాల క్రితం 'డోంట్ లూజ్ యువర్ మైండ్, లూజ్ యువర్ వెయిట్' పుస్తకంతో పాపులర్ అయింది. ఆమె తాజా పుస్తకం...కామన్‌సెన్స్ డైట్. మన ఆహారం, ఆహారపు నియమాలు, ఉపవాసాలు... ఇలా అనేక అంశాలపై తలెత్తే సందేహాలకు సమాధానం ఇస్తుందామె.

'ఏది తినాలి... ఏది తినకూడదు అని తెలుసుకోవడానికి ఇబ్బంది పడనక్కర్లేదు. అదేమీ రాకెట్ సైన్స్ కాదు. కామన్ సెన్స్ మాత్రమే. హెల్త్ అంటే సిక్స్–ప్యాక్ మెయింటైన్ చేయడం. బరువు తగ్గడమే పనిగా పెట్టుకోవడం కాదు' అంటుంది రుజుత.

'మంచి ఆరోగ్యం గురించి ఎక్కడికో వెళ్లనక్కర్లేదు. బేసిక్స్‌ను చెక్ చేసుకుంటే సరిపోతుంది. సమయానికి భోజనం చేస్తున్నామా? వ్యాయామాలు మరీ ఎక్కువగా చేస్తున్నామా? అసలే చేయడం లేదా? రాత్రి లేటుగా నిద్రపోతున్నామా?... మొదట ఇలాంటి వాటిపై దృష్టి పెట్టాలి'

'ఆరోగ్యానికి సంబంధించి ఏది సరియైన సమాచారమో, కాదో క్షుణ్ణంగా తెలుసుకోవాలి. సోషల్ మీడియా ద్వారా హెల్త్‌కు సంబంధించిన సమాచారం కుప్పలు తెప్పలుగా కనిపిస్తుంది. ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలి'

'తినే ఆహారం మనకు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని ఇవ్వాలి. అలా కాని పక్షంలో జాగ్రత్త పడాల్సిందే'... ఇలాంటి విషయాలెన్నో 'కామన్ సెన్స్ డైట్' పుస్తకంలో ఉన్నాయి.

ఇస్మార్ట్ ఐడియా

డీఎన్‌డీ మోడ్



పనిచేస్తున్నప్పుడు, చదువుతున్నప్పుడు లేదా డ్రైవింగ్ చేస్తున్నప్పుడు స్మార్ట్‌ఫోన్‌ల నుంచి తరచుగా వచ్చే నోటిఫికేషన్‌లు దృష్టిని మరల్చుతుంటాయి. అలా అని ఫోన్‌ను ఏరోప్లేన్ మోడ్‌లో ఉంచడం మంచిది కాదు.

ఇలాంటి పరిస్థితుల్లో డీఎన్‌డీ మోడ్‌గా ప్రసిద్ధి చెందిన 'డూ నాట్ డిస్టర్బ్ మోడ్' అవసరం.

అప్లికేషన్‌ల నుండి నోటిఫికేషన్‌లను బ్లాక్ చేయడానికి, ముఖ్యమైన పనుల్లో ఉన్నప్పుడు దృష్టిని మరల్చే ఫోన్‌కాల్‌లను మ్యూట్ చేయడానికి డీఎన్‌డీ ఉపయోగపడుతుంది.

డీఎన్‌డీ సెట్టింగ్ బ్రాండ్ నుంచి బ్రాండ్‌కు భిన్నంగా ఉంటుంది.

కానీ బేసిక్స్ మాత్రం అలాగే ఉంటాయి.

డీన్‌డీ సెట్ చేయడానికి...

- ఫోన్‌లో సెట్టింగ్స్ ఓపెన్ చెయ్యాలి
- 'డోన్ట్ డిస్టర్బ్' అని సెర్చ్‌బార్‌లో టైప్ చేయాలి.
- ఆండ్రాయిడ్ ఫోన్‌లోని క్విక్ సెట్టింగ్ ప్యానెల్‌లో కూడా డీఎన్‌డీ కనిపిస్తుంది.
- ఇప్పుడు డీఎన్‌డీ మోడ్ ఆన్ చేయవచ్చు
- డీఎన్‌డీని షెడ్యూల్డ్ చేయడానికి 'షెడ్యూల్డ్'ను క్లిక్ చేయాలి
- ప్లస్(+) సైన్‌లోకి వెళ్లి యాక్టివిటీని ఎంపిక చేసుకోవాలి. ఉదా: వర్కింగ్, స్లీపింగ్, స్టడీ... మొదలైనవి
- డీఎన్‌డీ మోడ్ టైమింగ్స్ ఎంపిక చేసుకోవచ్చు
- ఎక్సెప్షన్స్‌ను యాడ్ చేసుకోవచ్చు. ఉదా: బాస్, వైఫ్, ఫాదర్, మదర్... మొదలైనవి
- నోటిఫికేషన్ రిసీవ్ చేసుకోవాలనుకునే యాప్‌లను కూడా యాడ్ చేసుకోవచ్చు.

కూతురు ఆడుకోవడానికి అమ్మ చేసిన బొమ్మల ఆలోచన ఇప్పుడు నెలకు రూ. 2 లక్షల వ్యాపారం చేసేలా ఎదిగింది. కూతురికి ఉల్లాసాన్నిచ్చే ఒక సాధారణ ఆలోచన నుండి వీణా పీటర్ 'తారాస్ డాల్ హౌస్' పేరుతో బెంగళూరులో ఒక ప్రసిద్ధ బ్రాండ్‌గా మారింది. ప్లాస్టిక్ బొమ్మల ప్రపంచం నుంచి పిల్లలకు ఆలోచనాత్మక, పర్యావరణ హితమైన బొమ్మలను అందిస్తూ తల్లులకు ప్రేరణగా నిలిచింది. రెండేళ్ల క్రితం 30 బొమ్మలతో మొదలుపెట్టిన వీణా పీటర్ బిజినెస్ ప్రయాణం మనల్నీ తన వెంట తీసుకెళుతుంది.

అమ్మ చేసిన బొమ్మలు

“ముందస్తు వ్యాపార ప్రణాళిక లేదు, ఓ పేరూ లేదు, ధరల వ్యూహం అసలే లేదు. చేతితో తయారు చేసిన, పాతకాలం నాటి వస్తువులను అమ్మే ఓ మార్కెట్‌లో మొదటిసారి నా బొమ్మల ధరలను నిర్ణయించాను. ప్లాస్టిక్‌తో నిండిన పిల్లల బొమ్మల ప్రపంచంలో ఆలోచనాత్మకమైన, సున్నితమైన ప్రత్యామ్నాయమిది. చెన్నైలో మాస్టర్స్ చేసిన తర్వాత కార్పొరేట్ కంపెనీలలో దశాబ్దం పాటు ఉద్యోగినిగా కొనసాగాను. కానీ 2015లో నెక్స్ట్ ఏంటి అనే ఆలోచన నన్ను కుదురుగా ఉండనిచ్చేది కాదు. నా మార్గాన్ని వెతుకుతూనే నా భర్త ఎడ్యుకేషనల్ స్టార్టప్‌లో సాయం చేయడం ప్రారంభించాను.

డిజిటల్ లోకం నుంచి డాల్ హౌస్‌కు...

నా కూతురు తారా పుట్టాక నా ప్రపంచమే మారిపోయింది. డిజిటల్ లోకం నుంచి తప్పుకున్నాను. నా కూతురుతో ప్రతి క్షణాన్ని ఆస్వాదించాలనుకున్నాను. తారా పెరిగేకొద్దీ, బొమ్మల పట్ల ఆమెకు ప్రేమ పెరగడం గమనించాను. అయితే ఆమె ఆడుకునే బొమ్మల ఎంపిక నాకు ఇబ్బందిగా అనిపించేది. అన్నీ ప్లాస్టిక్, సింథటిక్ బొమ్మలు. పైగా అవి ఎక్కువ కాలం ఉండేవి కావు. పర్యావరణ అనుకూలమైనవి అసలే కావు. తారా నా జుట్టును చేత్తో పట్టుకొని పడుకునేది. ఆ అలవాటును ఎలా పోగొట్టాలో తెలిసేది కాదు. ఓ రాత్రిపూట జుట్టున్న బొమ్మను కొంటే..? అనే ఆలోచన వచ్చింది. దాని కోసం చాలా స్టోర్స్ వెతికాను. కానీ, అవన్నీ నాణ్యత లేనివి. నేనే ఏదో ఒకటి చేయాలి అనుకున్నాను.



వీణా పీటర్

వాడిన ఫ్యాబ్రిక్‌తో బొమ్మ





మా అమ్మ పాత కాటన్ చీరలను ఉపయోగించి మొదటి బొమ్మను తయారు చేశాను. ఉన్ని దారాలతో జుట్టు కుట్టాను. తర్వాత మరికొన్నింటిని అలాగే కుట్టాను. తారాకు ఆ బొమ్మలు బాగా నచ్చాయి. మా ఫ్రెండ్స్ వాటిని చూసి, తమ పిల్లలకు కూడా అలాంటి బొమ్మలను తయారు చేసిమ్మన్నారు. దీంతో ఇది నా వ్యక్తిగత ప్రాజెక్ట్‌గా ప్రారంభమైంది. ఓ 30 బొమ్మలను తయారు చేశాను. వాటికి ధర ఎలా నిర్ణయించాలో తెలియలేదు. హస్తకళా కృతులు అమ్మే వీకెండ్ మార్కెట్‌కు వాటిని తీసుకెళ్లి, అక్కడ ప్రదర్శనకు పెట్టా. ఈవెంట్ అయ్యేలోపు బొమ్మలన్నీ అమ్ముడయ్యాయి. దీంతో నమ్మకం వచ్చేసింది. అలా నా కూతురి పేరుతోనే 'తారాస్ డాల్ హౌస్' పుట్టింది.

బొమ్మల తయారీ కళను నేర్చుకోవడం

2023 ప్రారంభంలో మొదలుపెట్టిన ఈ వ్యాపారం కొన్ని నెలల వ్యవధిలో నెమ్మదిగా ఊపందుకుంది. ముందుగా ముడి బొమ్మలను తయారుచేయడాన్ని బాగా అధ్యయనం చేశాను. ప్రతి బొమ్మను కాటన్ పై ఒక ట్రేస్డ్ ప్యాటర్న్ తో ప్రారంభించి, కత్తిరించి, అవుట్ లైన్ల వెంట కుట్టి,. తర్వాత దానిని లోపలి వైపుకు తిప్పి, కాటన్–పాలిస్టర్ ఫ్యాబ్రిక్‌తో నింపుతాను. దాని వల్ల ఇది ఒకసారి ఉతికిన తర్వాత కూడా ముడుచుకుపోదు. బొమ్మల ముఖాలను ఫ్యాబ్రిక్ మార్కర్లతో గీసి, విడిగా డ్రెస్సులు కుట్టి ఇస్తాను. పిల్లల చేతే బొమ్మలకు ఆ డ్రెస్సులు వేయిస్తే, వారికి సరదాగా ఉంటుంది. మొదట్లో ఈ పనిని ఒక్కదాన్నే చేసేదాన్ని. డిమాండ్ పెరిగేకొద్దీ, మరో ముగ్గురిని నియమించుకున్నాను.



ఒకేసారి 100 బొమ్మలు

బొమ్మల తయారీలో అసెంబ్లింగ్ విధానాన్ని రూపొందించాను. మొదట్లో ఒక బొమ్మకు రెండు రోజుల సమయం పట్టేది. ఇప్పుడు ఒక రోజులో 100 బొమ్మలను తయారు చేస్తున్నాం. బొమ్మలతో పాటు వాటికి వేసే నైట్ సూట్లు, గౌన్లు, సాంప్రదాయ దుస్తులు వంటి వివిధ రకాల దుస్తులను కూడా డిజైన్ చేస్తాం. మిగిలిపోయిన అతి చిన్న బట్టలను బొమ్మల పడకలు, దిండ్లు, ఇతర ఉపకరణాలలో తిరిగి ఉపయోగిస్తాం. ఏదీ వృథా కాదు. పిల్లలు ఈ బొమ్మలతో ఆటలో నిమగ్నమవ్వడం మాకు అతిపెద్ద బహుమతి. పిల్లలు బొమ్మలను కౌగిలించుకోవడం, వాటికి పేర్లు పెట్టడం వంటి ఫోటోలను చూసినప్పుడు అది నా బాధ్యతను మరింత గుర్తు చేసినట్లవుతుంది.

ప్రతి బొమ్మకు మోడర్న్, ట్రెడిషనల్ రెండు డ్రెస్ డిజైన్లు చేసి ఇస్తాం. ఒక చిన్నారి పంజాబీ ఇంటి నుండి వచ్చినట్లయితే, ఆ బొమ్మకు ఘాగ్రా ఉంటుంది. దక్షిణ భారతదేశ పిల్లలకు లంగా వోణి ఎంపిక కావచ్చు. చిన్న డిజైన్‌లకు ధర రూ.500, అదనపు దుస్తులతో వచ్చే 12 అంగుళాల బొమ్మకు రూ. 1,000, వార్డ్‌రోబ్, పరుపులతో పూర్తి చేసిన డీలక్స్ డాల్‌హౌస్ సెట్‌లకు రూ. 3,500 వరకు ధరలు ఉన్నాయి. కుట్టుపని చేసిన మొదటి రోజు నాటి నుండి ఇప్పుడు నెలకు 200 బొమ్మలు అమ్మే వరకు, తారాస్ డాల్ హౌస్ నెలకు రూ. 2 లక్షల ఆదాయాన్ని ఆర్జించే వ్యాపారంగా ఎదగడం చూస్తుంటే చాలా ఆశ్చర్యమేస్తుంది” అని తన బొమ్మల ప్రయాణాన్ని మురిపెంగా వివరించింది వీణ.

● గేమింగ్

రాకాసి డేగ రెక్కల చప్పుడు



యాక్షన్ రోల్-ప్లేయింగ్ గేమ్ ఎల్డెన్ రింగ్. డైరెక్టర్ మియ జాకీ, అమెరికన్ ఫాంటసీ రైటర్ జార్జ్ ఆర్ ఆర్ మార్టిన్‌లు సృష్టించిన ఈ గేమ్ 2022లో విడుదల అయింది. 'ఎల్డెన్ రింగ్' సిరీస్‌లో భాగంగా వచ్చిన తాజా గేమ్... ఎల్డెన్ రింగ్ నైట్‌రీగ్నెన్. మార్పు విషయానికి వస్తే.... గత గేమ్‌లో ప్లేయర్స్ ఒకరితో ఒకరు షేర్ చేసుకునే మెసేజ్ ఆప్షన్ ఉండేది. అయితే గేమ్ లెంత్‌ను తగ్గించడంలో భాగంగా ఈ ఆప్షన్‌ను కట్ చేశారు.

మరో విశ్వంలో జరిగే కథలో ప్లేయర్స్ ఎనిమిది ప్రీ-మేడ్ కారెక్టర్‌లను ఎంచుకోవాల్సి ఉంటుంది.

ప్లాట్‌ఫామ్స్: ప్లేస్టేషన్ 4, ప్లేస్టేషన్ 5, విండోస్, ఎక్స్‌బాక్స్ వన్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్ జానర్: యాక్షన్ రోల్-ప్లేయింగ్, రోగ్‌లైక్ మోడ్స్: సింగిల్-ప్లేయర్, మల్టీప్లేయర్

ఇన్ ది డాగ్ హౌస్

ఏదైనా పొరపాటు జరిగినప్పుడు, ఒకరి వల్ల సమస్య ఎదురైనప్పుడు, ఏదైనా పనికి ఆమోదం లభించనప్పుడు... మొదలైన సందర్భాల్లో ఉపయోగించే మాట.... ఇన్ ది డాగ్ హౌస్.

ఉదా: హీ ల్యాండెడ్ ఇన్ ది డాగ్ హౌస్ వెన్ హీ యాక్సిడెంటల్లీ డిలీటెడ్ ది రిపోర్ట్



ఔట్ ఆఫ్ ది వుడ్స్

ఇక ప్రమాదం లేదు, సమస్య లేదు.... అనుకునే సందర్భంలో వాడే మాట...ఔట్ ఆఫ్ ది వుడ్స్.

ఉదా: ఆఫ్టర్ మంత్స్ ఆఫ్ అన్‌సెర్టినిటీ, ది కంపెనీ ఈజ్ ఫైనల్లీ ఔట్ ఆఫ్ ది వుడ్స్ అండ్ బ్యాక్ ఆన్ ట్రాక్

చదువులు, ఉద్యోగాలు ఆ తర్వాత జీవితపు బాధ్యతలలో తలమునకలవడంతోనే సరిపెట్టుకోకూడదు అనుకుంటుంది నవతరం. సమాజసేవను బాధ్యతగా తీసుకుంటూ చదువు-సేవ రెండింటినీ బ్యాలెన్స్ చేస్తూ ముందుకు సాగుతోంది. హైదరాబాద్ యూత్ అసెంబ్లీ ద్వారా దాదాపు తొంభై మంది యువ విద్యార్థులు నగరంలోని స్లమ్స్‌తో పాటు గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లోని వారికి సేవలు అందిస్తూ 'మేమున్నాం' అని బాసటగా నిలుస్తున్నారు. తోటి వారికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు.



● సేవాపథం

యూత్ అసెంబ్లీ

గ్రామీణ ప్రాంతాలు బాగుపడినప్పుడే దేశం అభివృద్ధిలో ముందంజలో ఉంటుందన్నది మహాత్ముని మాట. ఇప్పుడు ఆ మాటలు నిజం చేస్తూ యువత ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలను హైదరాబాద్ యూత్ అసెంబ్లీ ద్వారా నిర్వహిస్తున్నారు. తమ సేవాకార్యక్రమాలతో మారుమూల స్థాయి అభివృద్ధికి కృషి చేస్తున్నారు. నగరంలోని వివిధ కాలేజీల నుంచి 90 మందికి పైగా విద్యార్థులు తమ సేవలను అందిస్తున్నారు. 'యువతలో సాధికారత, సామాజిక మార్పు' అనే నినాదంతో వీరు చేస్తున్న సేవాకార్యక్రమాలు స్ఫూర్తిని కలిగిస్తున్నాయి.

ఇరువైపులా అవగాహన



ఇప్పుడు మేం చేస్తున్నది రెవల్యూషనరీ సీజన్. దీనిలో భాగంగా ఉమెన్ ఎంపవర్‌మెంట్, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, సోలార్ పవర్, శుభ్రత పట్ల అవగాహన, మంచినీటి సౌకర్యం, ఆహార వ్యర్థాన్ని నిరోధించడం, వాటర్ వీల్ డిస్ట్రిబ్యూషన్... మొదలైన వాటి మీద వర్క్ చేస్తున్నాం. ఇందులో దాదాపు 90 మంది కాలేజీ విద్యార్థులు పాల్గొంటున్నారు. హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని మారు మూల ప్రాంతాలకు వెళ్లి స్వచ్ఛందంగా వర్క్ చేస్తున్నాం. నగరంలోని స్లమ్స్, గ్రామీణ, గిరిజన ప్రాంతాలలోని సమస్యలను గుర్తించడం, పరిష్కార దిశగా చేసిన ఆలోచలను మూడు నెలలకు ఒకసారి అందరం కలిసి, చర్చిస్తాం. ఎక్కడ ముందస్తు సేవ అవసరం అవుతుందో దానిని ప్రధానంగా తీసుకుంటాం. వీటి ద్వారా చదువొక్కటే కాకుండా సమాజంలో ఉన్న సమస్యలపై అవగాహన కూడా కలుగుతుంది. బాధ్యత పెరుగుతుంది.

– లాస్య వంకదారి, ఆర్కిటెక్చర్ ఫైనల్ ఇయర్, హైదరాబాద్ యూత్ అసెంబ్లీ చైర్ పర్సన్

ప్రాజెక్ట్ రిపోర్ట్‌తో...



ప్రతి సీజన్‌లో ఎనిమిది ప్రధాన సమస్యలపై వర్క్ చేస్తుంటాం. ముందుగా అందరం కలిసి, చర్చించుకొని ఒక ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారుచేసుకుంటాం. మెంబర్స్ అందరం అమ్మానాన్నలు, స్నేహితులు, బంధువులు, చుట్టుపక్కల వారి నుంచి ఫండ్ సేకరిస్తాం. ఆ మొత్తాన్ని యూత్ అసెంబ్లీ ద్వారా ఒక మంచి పనికోసం కేటాయించి, సేవలో పాల్గొనడం సమాజం పట్ల బాధ్యతను, సమస్యల పట్ల అవగాహనను కలిగిస్తుంది. ఈ నెల 31న భద్రాద్రి కొత్తగూడెంలో స్కూల్‌కి సంబంధించి ఈవెంట్ చేస్తున్నాం. చుట్టుపక్కల ఉన్న తాండాల వారికి, గర్భవతులకు, పిల్లలకు న్యూట్రిషన్ కిట్స్ ఇచ్చేలా ప్లాన్ చేస్తున్నాం. నవజాత శిశువులకు అవసరమయ్యే వస్తువులను కూడా అందిస్తున్నాం. కిందటిసారి ములుగులో చేసిన కార్యక్రమంలో పాల్గొన్నాను.

– విజయ్, బిటెక్ ఫస్టియర్, హైదరాబాద్

కెరియర్ గైడెన్స్‌లో అవగాహన



స్టేట్ కాజ్ ఆర్గనైజేషన్‌లో మూడేళ్ల పాటు వర్క్ చేశాను. ఇప్పుడు యూత్ అసెంబ్లీ నుంచి సేవలు అందిస్తున్నాను. పట్టణాల్లో ఉన్న నిరుపేదల జీవనశైలిని మార్చే ప్రయత్నం, గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో సమస్యలను తెలుసుకొని పరిష్కరించడం, స్కూల్స్‌కు వెళ్లి కెరియర్ గైడెన్స్ వంటివి చేస్తున్నాం. సిద్దిపేటలోని కిష్టాపూర్, ములుగు ప్రాంతంలోని తక్కెళ్లగూడెంలో సోలార్ ప్యానెల్స్ డిస్ట్రిబ్యూషన్, గవర్నమెంట్ స్కూల్‌లో వాటర్ ట్యాంక్ ఏర్పాటు, డిజిటల్ అవేర్‌నెస్... వంటివి చేశాం.

– చంద్రశేఖర్, బిటెక్ థర్డ్ ఇయర్, ఇంబ్రహీంపట్నం

నిర్మలా రెడ్డి

యువర్స్

● టెక్.. టాక్

లావా షార్క్ 5జీ



డిస్‌ప్లే: 6.75 అంగుళాలు ఫ్రంట్ కెమెరా: 5-మెగా పిక్సెల్ ర్యామ్: 4జీబి స్టోరేజ్: 64 జీబి వోఎస్: ఆండ్రాయిడ్ 15 బ్యాటరీ: 5000 ఎంఏహెచ్ రిజల్యూషన్: 720×1600 పిక్సెల్స్

వాట్సాప్ స్టేటస్‌కు మ్యూజిక్ యాడ్ చేయడానికి...



● బాటమ్ నేవిగేషన్ బార్ మీద ఉన్న 'అప్‌డేట్స్'ను నొక్కాలి ● యాడ్ స్టేటస్ బటన్-క్లిక్ ● బిల్ట్-ఇన్ మీడియా పికర్ నుంచి ఇమేజ్ లేదా వీడియోను సెలెక్ట్ చేసుకోవాలి ● స్క్రీన్ టాప్‌లో ఉన్న న్యూ మ్యూజిక్ ఐకాన్‌ను క్లిక్ చేయాలి ● పాప్-కార్డ్ జాబితాలో ఉన్న సాంగ్, పాపులర్ ట్రాక్‌ను సెలెక్ట్ చేసుకోవాలి ● స్క్రీన్ బాటమ్‌లో ఉన్న స్లైడర్‌ను డ్రాగ్ చేయాలి ● డన్-ట్యాప్ ● గ్రీన్ సెండ్ బటన్-క్లిక్


అవును...ఇది నిజమే!



● విక్టోరియన్ కాలంలో చనిపోయిన వాళ్లకు కొత్త దుస్తులు వేసి, వాళ్లు బతికి ఉన్నట్లుగా పోజులు పెట్టి ఫోటోలు తీసేవారు.
● చరిత్రలో అత్యంత చిన్న యుద్ధం 30 నిమిషాలు మాత్రమే జరిగింది. ఇది బ్రిటన్, జంజిబార్‌ల మధ్య జరిగింది. దీన్ని ఆంగ్లో-జాంబీబార్ వార్ అని పిలుస్తారు ● 18వ శతాబ్దంలో ఇంగ్లాండ్‌లో పైనాపిల్స్‌ను స్టేటస్ సింబల్‌గా భావించేవారు. తమ హోదాను చాటుకోవడానికి పైనాపిల్స్‌ను తీసుకొని తిరిగేవారు. ఆ కాలంలో దుస్తుల నుంచి ఇంట్లో వాడే వస్తువుల వరకు పైనాపిల్స్‌తో అలంకరించేవారు. ● టేబుల్ క్లాత్స్‌ను మొదట్లో అందరూ కలిసి వాడే నాప్‌కిన్‌లా ఉపయోగించడానికి డిజైన్ చేశారు. డిన్నర్ పార్టీ తరువాత గెస్టులు తమ చేతులు, ముఖాలను టేబుల్‌క్లాత్‌తో తుడుచుకునేవారు.

● గిన్నిస్ రికార్డ్స్

మెరుపు వేగంతో...



ఇండియానా(యూఎస్)లోని పర్డ్యూ యూనివర్శిటీ స్టూడెంట్స్ ఫాస్టెస్ట్-సాల్వింగ్ రూబిక్ క్యూబ్ రోబోట్‌ను సృష్టించి గిన్నిస్‌బుక్‌లో చోటు సాధించారు. స్టూడెంట్స్ టీమ్ క్రియేట్ చేసిన రోబోట్ జస్ట్ 0.103 సెకన్‌లలో పరిష్కరించగలదు. దీనికి 'పర్ద్యూబిక్ క్యూబ్' అని పేరు పెట్టారు. కొందరు ఎలక్ట్రిక్ ఇంజనీర్‌లు పజిల్‌ను 0.305 సెకన్‌లలో పరిష్కరించే రోబోట్‌ను తయారుచేశారు. ఇంజినీర్స్ రికార్డ్‌ను స్టూడెంట్స్ బ్రేక్ చేశారు. 'కనురెప్ప వేసేలోపే మీరు మిస్ అయిపోతారు' అనే కాప్షన్‌తో ఈ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్.

వన్‌ప్లస్ ప్యాడ్ 3



డిస్‌ప్లే: 13.2 అంగుళాలు రిఫ్రెష్‌రేట్: 144 హెచ్‌జడ్ రిజల్యూషన్: 2000×2800 పిక్సెల్స్ ఇంటర్నల్ మెమొరీ: 128 జీబి బరువు: 552 గ్రా. బ్యాటరీ: 12.140 ఎంఏహెచ్ ● 67 డబ్ల్యూ వైర్‌డ్ ఫాస్ట్ చార్జింగ్ సపోర్ట్

నోట్‌పాడ్‌లో కొత్త ఏఐ ఫీచర్స్




'నోట్‌పాడ్' కోసం కొత్త ఏఐ ఫీచర్లు తీసుకువచ్చింది మైక్రోసాఫ్ట్. ఇందులో పెయింట్, స్నిప్పింగ్ టూల్స్ ఉన్నాయి. కస్టమ్ స్టిక్కర్స్‌ను తయారు చేసుకోవడానికి 'పెయింట్' ఉపయోగపడుతుంది. ఈ ఏఐ-పవర్డ్ స్టిక్కర్ జనరేటర్ ద్వారా చాలా త్వరగా కస్టమ్ స్టిక్కర్‌లను క్రియేట్ చేయవచ్చు.

'పెయింట్'లోని 'స్మార్ట్ సెలెక్షన్ టూల్' ద్వారా ఇమేజ్‌ను ఎడిట్ చేయవచ్చు. ఇక బిల్ట్-ఇన్ విండోస్ యాప్ 'స్నిప్పింగ్ టూల్' ద్వారా స్క్రీన్‌షాట్‌ను వేగంగా గ్రాబ్ చేయవచ్చు. వీడియోలను వేగంగా రికార్డ్ చేయవచ్చు.

సాక్షి సినిమా

మాస్ పండగ



● రవితేజ

వినాయక చవితికి థియేటర్స్‌లో 'మాస్ జాతర' కన్ఫార్మ్ అంటున్నారు హీరో రవితేజ. ఆయన కెరీర్‌లోని 75వ చిత్రం 'మాస్ జాతర'. ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారు. భాను భోగవరపు దర్శకత్వంలో శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో పోలీసాఫీసర్ లక్ష్మణ్ భేరి పాత్రలో నటిస్తున్నారు రవితేజ. కాగా 'మాస్ జాతర' సినిమాను వినాయక చవితి సందర్భంగా ఆగస్టు 27న విడుదల చేయనున్నట్లు గురువారం అధికారికంగా ప్రకటించి, ఈ సినిమా కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ''రవితేజగారి నుంచి ప్రేక్షకులు, ఆయన అభిమానులు కోరుకునే విధంగా మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ మూవీగా 'మాస్ జాతర' సినిమాని రూపొందిస్తున్నాం. ఈ సినిమా థియేటర్లలో మాస్ పండగను తీసుకురానుంది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: భీమ్స్ సిసిరోలియో.

రీ రిలీజ్ వల్ల నిర్మాతలు సంతోషంగా ఉంటున్నారు - ఆదిశేషగిరి రావు



● శింగనమల రమేశ్, ఆదిశేషగిరి రావు, అలీ, కల్యాణ్, సునీల్ నారంగ్, ఖాజా సూర్యనారాయణ

''పోకిరి' సినిమాతో రీ రిలీజ్ ట్రెండ్ మొదలైంది. 'ఖలేజా' సినిమాను సుబ్బారావు రిలీజ్ చేయడం హ్యాపీగా ఉంది. రీ రిలీజ్ వల్ల నిర్మాతలు సంతోషంగా ఉంటున్నారు. 'ఖలేజా'కి మంచి ఆదరణ లభిస్తుందనే నమ్మకం ఉంది'' అని నిర్మాత ఆదిశేషగిరి రావు పేర్కొన్నారు. మహేశ్‌బాబు, అనుష్క జోడీగా త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో శింగనమల రమేశ్, సి. కల్యాణ్ నిర్మించిన 'ఖలేజా' 2010 అక్టోబరు 7న విడుదలైంది. సూపర్ స్టార్ కృష్ణ జయంతిని (మే 31) పురస్కరించుకుని 'ఖలేజా' చిత్రాన్ని నేడు రీ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో సి. కల్యాణ్ మాట్లాడుతూ– ''ఇప్పటికి 1500 సార్లు బుల్లి తెరపై ప్రదర్శితమై, రికార్డ్ సృష్టించిన సినిమా 'ఖలేజా'. రీ రిలీజ్ సినిమాల్లో మా సినిమా సరికొత్త రికార్డ్ క్రియేట్ చేస్తుంది'' అన్నారు. ''ఈ చిత్రం అందర్నీ అలరిస్తుంది'' అని శింగనమల రమేశ్ చెప్పారు. ''ఆన్‌లైన్ బుకింగ్స్ ఓపెన్ చేసిన నిమిషాల్లోనే టికెట్స్ అన్నీ బుక్ అవడం ఆశ్చర్యంగా ఉంది'' అన్నారు ఏషియన్ సునీల్ నారంగ్. జూబ్లీ హిల్స్ మాజీ కార్పొరేటర్ ఖాజా సూర్యనారాయణ పాల్గొన్నారు.

గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల ప్రకటన

ఆనందంలో విజేతలు

"రాష్ట్ర ప్రభుత్వం అందించే అవార్డు ఎవరికైనా ప్రత్యేక ఆనందాన్నిస్తుంది" అంటూ చిత్రరంగానికి చెందిన పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. గురువారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డులను ప్రకటించింది. "సృజనాత్మక రంగంలో ఉన్న ఏ ఆర్టిస్ట్‌కైనా, టెక్నీషియన్‌కి అయినా రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు ఎంతో విలువైనది. అవార్డుల సంప్రదాయాన్ని తెలంగాణ ప్రభుత్వం పునరుద్ధరించడం ప్రోత్సాహకరంగా ఉంది. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారు, సంబంధిత అధికారులు, ఇతర బృందానికి కృతజ్ఞతలు" అని చిరంజీవి సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. ఇక 2024 సంవత్సరానికిగాను అవార్డు విజేతల స్పందన ఈ విధంగా...



తొలిసారిగా ప్రవేశ పెట్టిన గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్‌లో 'పుష్ప: ది రూల్' సినిమాకుగాను తొలి ఉత్తమ నటుడిగా నాకు అవార్డు రావడాన్ని గౌరవంగా భావిస్తున్నాను. ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారానికి నన్ను ఎంపిక చేసిన తెలంగాణ ప్రభుత్వానికి నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఈ అవార్డు క్రెడిట్ అంతా నా దర్శకుడు సుకుమార్‌గారు, నా నిర్మాతలు (మైత్రీ మూవీ మేకర్స్ నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్) అండ్ 'పుష్ప' టీమ్‌కే చెందుతుంది. నన్ను ఎల్లప్పుడూ సపోర్ట్ చేస్తూ, నాలో స్ఫూర్తి నింపుతున్న నా అభిమానులకు ఈ అవార్డును అంకితం ఇస్తున్నాను.

– హీరో అల్లు అర్జున్



● నాగ్ అశ్విన్

● ''గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్‌లో మాకు నాలుగు (ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు, ఆర్ట్ డైరెక్షన్, కాస్ట్యూమ్ డిజైన్) అవార్డులు రావడం గర్వంగా ఉంది. ఇది మాకెంతో ప్రత్యేకం. తెలంగాణ ప్రభుత్వానికి, సీయం రేవంత్‌రెడ్డి, సినిమాటోగ్రఫీ మినిస్టర్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిగార్లకు, జ్యూరీకి ధన్యవాదాలు'' అంటూ 'ఎక్స్' వేదికగా 'కల్కి 2898ఏడీ' చిత్రబృందం పేర్కొంది.



● తెలంగాణ ప్రభుత్వం చొరవ తీసుకుని ఈ ఏడాది నుంచి అవార్డ్స్‌ను ప్రకటించడం నిజంగా సంతోషంగా ఉంది. తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ విజేతలందరికీ నా శుభాకాంక్షలు. అలాగే 'దేవర' సినిమాకుగానూ బెస్ట్ కొరియోగ్రాఫర్‌గా విజేతగా నిలిచిన గణేశ్ ఆచార్యగారికి కంగ్రాట్స్.

– హీరో ఎన్టీఆర్



● నా జీవితంలో ఎప్పుడూ కష్టపడని రీతిలో 'పొట్టేల్' సినిమా కోసం కష్టపడ్డాను. చదువు గురించి చెప్పిన కథను ప్రభుత్వం గుర్తించడం హ్యాపీగా ఉంది. 'కల్కి 2898 ఏడీ, లక్కీ భాస్కర్ సినిమాల మధ్యలో మా సినిమాకూ చాన్స్ కల్పించారు. వెయ్యి కోట్ల (కలెక్షన్స్), వంద కోట్ల రూపాయల సినిమాల మధ్య మా సినిమా ఉంటుందని కలలో కూడా ఊహించలేదు. మా నిజాయితీకి ప్రతిఫలం ఈ రూపంలో వచ్చిందనుకుంటున్నా. తెలంగాణ ప్రభుత్వానికి, మా సినిమాను గుర్తించిన జ్యూరీకి థ్యాంక్స్.

– 'పొట్టేల్' దర్శకుడు సాహిత్ మోత్కూరి

● 14 ఏళ్ల తర్వాత మళ్లీ స్టేట్ అవార్డ్స్ రావడం, గద్దర్ అవార్డ్స్ తొలి ఎడిషన్‌లో నా పేరు ఉండటం, నా దర్శకత్వంలోని 'లక్కీ భాస్కర్' సినిమాకు నాలుగు అవార్డులు రావడం హ్యాపీ. ఈ సినిమా స్క్రీన్ ప్లే మొత్తం కరెక్ట్‌గా కుదిరింది. ఇందుకు హెల్ప్ చేసిన మా ఎడిటర్ నవీన్ నూలికి అవార్డు వచ్చింది. ఈ సినిమా చిత్రీకరణప్పుడే దుల్కర్ సల్మాన్ చాలా మంచి గుర్తింపు వస్తుందన్నారు. నిర్మాత నాగవంశీగారితో 'లక్కీ భాస్కర్' నా మూడో సినిమా. ఈ సినిమాకు గద్దర్ అవార్డు రావడం సంతోషంగా ఉంది. ఎంటర్‌టైన్‌మెంట్ అవార్డులను తిరిగి తీసుకొచ్చిన తెలంగాణ సీయం రేవంత్ రెడ్డి, సినిమాటోగ్రఫీ మినిస్టర్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ 'దిల్' రాజుగార్లకు, జ్యూరీకి థ్యాంక్స్.



– 'లక్కీ భాస్కర్' దర్శకుడు వెంకీ అట్లూరి



● మాలాంటి న్యూ టాలెంట్‌ని ప్రోత్సహించేలా అవార్డు ఇచ్చినందుకు తెలంగాణ ప్రభుత్వానికి ధన్యవాదాలు. మా టీమ్ సహకారం లేకపోతే ఇలాంటి అవార్డులు కష్టం. ఈ సినిమాని నిర్మించిన మా నిర్మాతలు నిహారిక, ఫణిగార్ల ప్రొడక్షన్ హౌస్‌లకి ఈ అవార్డు ఓ బూస్ట్ లాంటిది. ఈ అవార్డు కొత్తవాళ్లతో సినిమాలు తీయొచ్చనే అభిప్రాయాన్ని వారికి బలపరుస్తుంది. మా 'కమిటీ కుర్రోళ్లు'లో నటించిన హీరోలు, మా మ్యూజిక్ డైరెక్టర్, మా డీఓపీగారు సినిమాలతో బిజీ అయ్యారు. ఈ సినిమా విడుదల కాగానే పెద్ద బేనర్స్ నుంచి నాకు ఆఫర్స్ వచ్చాయి.

– 'కమిటీ కుర్రోళ్లు' దర్శకుడు యదు వంశీ



● హైదరాబాద్‌లో జరిగిన మారణహోమాన్ని భారతీయుల కళ్ల ముందుకు తీసుకువచ్చేందుకు నిజాయతీగా మేం పెట్టిన కష్టానికి 'రజాకార్' సినిమాకిగాను అవార్డ్స్ వచ్చాయనిపిస్తోంది. 1947, 1948 సమయంలో హైదరాబాద్ స్టేట్ కింగ్ నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ నేతృత్వంలో హిందువులపై రజాకార్లు జరిపిన దురాగతాలను నేటి తరం ప్రేక్షకుల ముందుకు 'రజాకార్' సినిమా రూపంలో తీసుకొచ్చే ప్రయత్నంలో మేం సక్సెస్ అయ్యాం. గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్ ఇస్తున్నందుకు తెలంగాణ సీయం రేవంత్ రెడ్డి, సినిమాటోగ్రఫీ మినిస్టర్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జ్యూరీ చైర్‌పర్సన్ జయసుధ, ఎఫ్‌డీసీ చైర్మన్ 'దిల్' రాజులకు ధన్యవాదాలు.

– బీజేపీ సీనియర్ నేత, 'రజాకార్' సినిమా నిర్మాత గూడూరు నారాయణ రెడ్డి



● మా 'రజాకార్'కి మూడు అవార్డులు రావడం చాలా ఆనందంగా ఉంది. మేం ఎంత నిజాయతీగా ఆలోచించి ఈ సినిమా చేశామో జ్యూరీ కూడా అంతే నిజాయతీగా మా సినిమాని ఎంపిక చేయడం సంతోషం. దాదాపు ఇరవయ్యేళ్లుగా ఇండస్ట్రీలో ఇబ్బందులు ఎదుర్కొన్న భీమ్స్ సిసిరోలియోకి మా సినిమా ద్వారా అవార్డు రావడం మాకు, తనకు సంతోషంగా ఉంది. ఇరవయ్యేళ్లుగా ఉన్న మేకప్ ఆర్టిస్ట్ నల్ల శ్రీనుకు అవార్డు రావడం ఆనందంగా ఉంది. నిర్మాత గూడూరు నారాయణ రెడ్డిగారు కూడా చాలా ఆనందంతో ఫోన్ చేసి, మాట్లాడారు.

– 'రజాకార్' దర్శకుడు యాటా సత్యనారాయణ



● 'మ్యూజిక్‌షాప్ మూర్తి' సినిమాకి నాకు అవార్డు రావడానికి మా టీమ్ సహకారం ఉంది. నిర్మాతలు హర్ష గారపాటి, రంగారావు, సహ-నిర్మాతలు సత్య కుమార్, వంశీ ప్రసాద్, సత్యనారాయణ పాలడుగు మమ్మల్ని నమ్మి, అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు. చిన్న సినిమా అని కాకుండా కథ, కథనం, ఆర్టిస్టుల పెర్ఫార్మెన్స్, దర్శకుడి విజన్... ఇవే జ్యూరీ చూసిందని నేను అనుకుంటున్నాను. ఎంటర్‌టైన్‌మెంట్ అవార్డులను తిరిగి తీసుకొచ్చిన ప్రభుత్వానికి, సినిమాటోగ్రఫీ మినిస్టర్, జ్యూరీకి ధన్యవాదాలు.

– 'మ్యూజిక్‌షాప్ మూర్తి' దర్శకుడు శివ పాలడుగు



● కొత్తవారికి ప్రభుత్వ అవార్డులు ఓ మంచి బూస్ట్‌లాంటివి. తెలంగాణ ప్రభుత్వానికి థ్యాంక్స్. 'క' రిస్కీ లైన్‌తో చేసిన సినిమా. స్క్రీన్‌ప్లేని ప్రేక్షకులు ఎలా అర్థం చేసుకుంటారు? ఎలా ట్రావెల్ అవుతారు? అనుకునే వాళ్లం. కానీ సబ్జెక్ట్‌ని బలంగా నమ్మాం. క్లైమాక్స్‌లో మేం చెప్పిన విషయానికి ప్రతి ఒక్కరూ కనెక్ట్ అయితే హిట్ అనుకున్నాం. మేం అనుకున్నట్లే కనెక్ట్ అయ్యారు. ఇక... మేం కొత్త కథలు అనుకోవడానికి చిన్నప్పట్నుంచి మా అమ్మ చెప్పిన కథలు హెల్ప్ అయ్యాయి. మా నాన్నగారి ఎంకరేజ్‌మెంట్‌ని మరచిపోలేం. అయితే మా సక్సెస్‌ని చూడకుండానే నాన్నగారు గత ఏడాది దూరం అయ్యారు. ఆ వెలితి ఉంది.

– 'క' చిత్రదర్శకులు సుజీత్-సందీప్



● పద్నాలుగేళ్ల తర్వాత ఇస్తున్న అవార్డ్స్‌లో నా తొలి సినిమాకు అవార్డ్ రావడం హ్యాపీగా ఉంది. గీతా ఆర్ట్స్ వంటి నిర్మాణ సంస్థ అండగా ఉండటంతో ఈ సినిమా జర్నీ సాఫీగా సాగింది. అయితే మా సినిమా రిలీజ్ టైమ్‌లో మరో రెండు సినిమాలు విడుదలయ్యాయి. దాంతో మా సినిమా రిజల్ట్ విషయంలో ఆందోళన చెందాను. అయితే ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. 'ఆయ్'కు అవార్డు వచ్చిందనగానే హీరో నార్నే నితిన్, నిర్మాత బన్నీ వాసుగారు, ఇంకా మా టీమ్ అంతా ఆ షూట్ డేస్‌ని గుర్తు చేసుకున్నాం.

– 'ఆయ్' దర్శకుడు అంజి కె. మణిపుత్ర

సాక్షి
శుక్రవారం
30-5-2025

బిజినెస్

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	321	81,633
నిఫ్టీ ▲	81	24,834

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	19,213	▲	113
డోజోన్స్	42,207	▲	11
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,726	▼	10
డాక్స్	24,039	▼	105
షాంఘై	3,363	▲	24
నికాయ్	38,433	▲	711

●అమెరికా ●బ్రిటన్ ●జర్మనీ ●చైనా ●జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	85.10	86.22
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	113.60	116.52
€	యూరో	ఎస్‌బీఐ	95.00	97.69
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.60	60.13
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.90	56.10
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	64.11	68.79
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.90	23.41
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.39	24.17
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.02	12.85

ఓలా ఎలక్ట్రిక్‌కు పెరిగిన నష్టాలు

క్యూ4లో రూ. 870 కోట్లు

న్యూఢిల్లీ: ద్విచక్ర ఈవీ కంపెనీ ఓలా ఎలక్ట్రిక్ ఇండస్ట్రీస్ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర నష్టం రెట్టింపై రూ. 870 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది (2023-24) ఇదే కాలంలో రూ. 416 కోట్ల నష్టం మాత్రమే నమోదైంది.



అయితే ఈ ఏడాది(2025-26) టర్న్‌అరౌండ్ సాధించనున్నట్లు కంపెనీ పేర్కొంది. కాగా.. మొత్తం ఆదాయం సైతం రూ. 1,598 కోట్ల నుంచి రూ. 611 కోట్లకు క్షీణించింది. ఇక మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర నష్టం భారీగా పెరిగి రూ. 2,276 కోట్లకు చేరింది. 2023-24లో రూ. 1,584 కోట్ల నష్టం ప్రకటించింది. మొత్తం ఆదాయం రూ. 5,010 కోట్ల నుంచి రూ. 4,514 కోట్లకు డీలా పడింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్‌ఈలో 0.6 శాతం లాభంతో రూ. 53 వద్ద ముగిసింది.

సుజ్లాన్ ఎనర్జీ లాభం దూకుడు

క్యూ4లో రూ. 1,181 కోట్లు

ముంబై: పవన విద్యుత్ రంగ దిగ్గజం సుజ్లాన్ ఎనర్జీ కన్సాలిడేటెడ్ నికర లాభం గతేడాది(2024-25) చివరి త్రైమాసికం(క్యూ4)లో 5 రెట్లు దూసుకెళ్లి రూ. 1,181 కోట్లకు చేరింది. అమ్మకాలు పుంజుకోవడం ఇందుకు ప్రధానంగా సహకరించింది. అంతక్రితం ఏడాది (2023-24) ఇదే కాలంలో కేవలం రూ. 254 కోట్లు ఆర్జించింది.



మొత్తం ఆదాయం రూ. 2,207 కోట్ల నుంచి రూ. 3,825 కోట్లకు ఎగసింది. పూర్తి ఏడాదికి కన్సాలిడేటెడ్ నికర లాభం రూ. 660 కోట్ల నుంచి రూ. 2,072 కోట్లకు జంప్‌చేసింది. మొత్తం ఆదాయం రూ. 6,568 కోట్ల నుంచి రూ. 10,993 కోట్లకు పెరిగింది.

సుజ్లాన్ షేరు బీఎస్‌ఈలో 1.4 శాతం బలహీనపడి రూ. 65 వద్ద ముగిసింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
లాభాలకు తగ్గట్లు జీతాలు పెంచండి | చాలా స్టార్టప్‌లు.. విదేశీ సంస్థలకు నకళ్లే

వృద్ధి జోరులో మనమే టాప్!

- పటిష్టంగా స్థూల ఆర్థిక మూలాలు
- సవాళ్లు ఉన్నా 2024-25లో బలమైన పనితీరు
- రూ.76.25 లక్షల కోట్లకు బ్యాలన్స్ షీటు
- మెరుగైన వృద్ధితోనే రూ.2.7 లక్షల కోట్ల డివిడెండ్
- ఆర్‌బీఐ వార్షిక నివేదికలో వెల్లడి



ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ (2025-26) భారత్ ప్రపంచంలో వేగవంతమైన వృద్ధిని నమోదు చేస్తుందని ఆర్‌బీఐ పేర్కొంది. స్థూల ఆర్థిక బలాలకుతోడు ఆర్థిక రంగం పటిష్టంగా ఉండడం, స్థిరమైన వృద్ధి పట్ల ప్రభుత్వం చూపిస్తున్న అంకిత భావం ఇందుకు మద్దతుగా నిలుస్తాయని తెలిపింది. బ్యాంకింగ్ రంగంలో రిస్కులు, బలహీనతలను ముందస్తుగా గుర్తించేందుకు ఆర్‌బీఐ పర్యవేక్షణ చర్యలు కొనసాగుతాయని ప్రకటించింది. ఈ మేరకు తన వార్షిక నివేదికను ఆర్‌బీఐ విడుదల చేసింది.

ఎన్నో సవాళ్లు.. అయినా సానుకూలతలు

బ్యాంకుల ఆస్తుల నాణ్యత మెరుగుపడడం, నిధుల లభ్యత తగినంత ఉండడం ఆర్థిక రంగం పటిష్టతను సూచిస్తున్నట్టు ఆర్‌బీఐ తెలిపింది. ఇది ఆర్థిక కార్యకలాపాలకు మద్దతునిస్తుందని అభిప్రాయపడింది. అంతర్జాతీయంగా ఎన్నో సమస్యలు నెలకొన్నప్పటికీ భారత ఫైనాన్షియల్ మార్కెట్లు బలంగా నిలబడినట్టు గుర్తు చేసింది. అంతర్జాతీయంగా ఫైనాన్షియల్ మార్కెట్లలో అనిశ్చితులు, భౌగోళిక ఉద్రిక్తతలు, వాణిజ్యంలో సమస్యలు, సరఫరా వ్యవస్థలో అవాంతరాలు, వాతావరణ ఆధారిత అనిశ్చితులు దేశ వృద్ధి అంచనాలను దిగువ వైపునకు తీసుకెళ్లే రిస్కులను ఆర్‌బీఐ తన నివేదికలో ప్రస్తావించింది. సరఫరా వ్యవస్థలో ఒత్తిళ్లు తగ్గుముఖం పడుతుండడంతోపాటు, అంతర్జాతీయంగా కమోడిటీ ధరలు శాంతించడం, వ్యవసాయ ఉత్పత్తి పెరగడం, నైరుతిలో సాధారణం కంటే అధిక వర్షపాతం అంచనాలు ద్రవ్యోల్బణాన్ని అదుపులోనే ఉంచడానికి సాయపడే అంశాలుగా పేర్కొంది. వాణిజ్య విధానాల్లో ఊహించని మలుపులు ఫైనాన్షియల్ మార్కెట్లలో అనిశ్చితులకు దారితీయవచ్చని.. ఎగుమతులకు సమస్యలు ఎదురు కావొచ్చని అంచనా వేసింది. అదే సమయంలో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాల కోసం భారత్ చర్చలు నిర్వహిస్తుండడం ఈ ప్రభావాలను పరిమితం చేయొచ్చని పేర్కొంది.

మెరుగైన రిస్క్ నిర్వహణ: దేశ బ్యాంకింగ్ రంగం బలంగా ఉందని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. ఫిర్యాదులను వేగంగా పరిష్కరించేందుకు, ఈ దిశగా సేవల నాణ్యతను పెంచేందుకు 'ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్‌మన్ స్కీమ్, 2021'ను ఈ ఆర్థిక సంవత్సరంలో సమీక్షించనున్నట్టు తెలిపింది.

బ్యాలన్స్ షీటు 8 శాతం వృద్ధి

ఆర్‌బీఐ బ్యాలన్స్ షీటు గత ఆర్థిక సంవత్సరంలో (2024-25) 8.20 శాతం (5.77 లక్షల కోట్లు) పెరిగి రూ.76.25 లక్షల కోట్లకు చేరుకుంది. 2024 మార్చి నాటికి ఇది రూ.70.47 లక్షల కోట్లుగా ఉంది. మిగులు నిల్వలు 27 శాతం అధికమై రూ.2,68,590 కోట్లకు చేరాయి. విదేశీ మారకం లావాదేవీలపై ఆదాయం 33 శాతం పెరిగి రూ.1.11 లక్షల కోట్లకు చేరింది. దీంతో కేంద్ర ప్రభుత్వానికి రూ.2.7 లక్షల కోట్ల భారీ డివిడెండ్‌ను ప్రకటించినట్టు ఈ నివేదిక తెలిపింది.

బంగారం ఆస్తులు 57 శాతం జంప్



ఆర్‌బీఐ నిర్వహణలోని బంగారం ఆస్తుల విలువ గత ఆర్థిక సంవత్సరంలో 57 శాతం జంప్ చేసి రూ.4.32 లక్షల కోట్లకు చేరుకుంది. 2024 మార్చి నాటికి ఈ మొత్తం రూ.2.74 లక్షల కోట్లుగానే ఉండడం గమనార్హం. పరిమాణం పరంగా చూస్తే 2024 మార్చి నాటికి 822 టన్నుల బంగారం ఉంటే, ఈ ఏడాది మార్చి నాటికి 879.58 టన్నులకు పెరిగింది.

కరెన్సీ నోట్లతో పార్టికల్ బోర్డులు



కరెన్సీ నోట్లను నిర్వీర్యం చేసే విషయమై ఆర్‌బీఐ పర్యావరణ అనుకూల నిర్ణయం తీసుకుంది. ముక్కలైన నోట్లు, కాలం చెల్లిన నోట్లతో పార్టికల్ బోర్డులు తయారు చేయనున్నట్టు ప్రకటించింది. తయారీదారులను నియమించే ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించింది. కాగా, రూ.10, 20, 50, 100, 2000 నకిలీ నోట్లను ఆర్‌బీఐ గుర్తించింది. రూ.200, 500 డినామినేషన్ నకిలీ నోట్ల విలువ వరుసగా 13.9 శాతం, 37.3 శాతం చొప్పున గత ఆర్థిక సంవత్సరంలో పెరిగాయి.

నోట్ల ముద్రణ ఖర్చు రూ.6,373 కోట్లు



గత ఆర్థిక సంవత్సరంలో కరెన్సీ నోట్ల ముద్రణపై ఆర్‌బీఐ రూ.6,373 కోట్లు ఖర్చు చేసింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో ముద్రణ వ్యయం రూ.5,101 కోట్లతో పోల్చి చూసినప్పుడు 25 శాతం ఎగిసింది. మొత్తం నోట్లలో 86 శాతం (విలువ పరంగా) రూ.500 రూపంలోనే ఉండడం గమనార్హం. సంఖ్యా పరంగా మొత్తం నోట్లలో 40.9 శాతం రూ.500 రూపంలో ఉన్నాయి. ఆ తర్వాత రూ.10 నోట్లు, 20, 50 రూపాయల నోట్లు 31.7 శాతం ఉన్నాయి. చెలామణిలో కాయిన్ల విలువ (50 పైసలు, రూ.1, 2, 5, 10, 20 కాయిన్లు) 6 శాతంగా ఉంది. ఉపసంహరించుకున్న రూ.2,000 నోట్లు 2025 మార్చి నాటికి 98.2 శాతం వెనక్కి వచ్చాయి. 2022 నవంబర్‌లో తీసుకొచ్చిన సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ (సీబీడీసీ/ఇ-రూపీ) వినియోగం గత ఆర్థిక సంవత్సరంలో గణనీయంగా పుంజుకుంది. 2024 మార్చి నాటికి ఇ-రూపీ చెలామణి రూ.234 కోట్లుగానే ఉండగా.. 2025 మార్చి నాటికి రూ.1,016 కోట్లకు పెరిగింది. ఇందులో రూ.500 నోట్ల రూపంలోనే రూ.857 కోట్లు ఉంది. సీమాంతర చెల్లింపులకు సీబీడీసీని ప్రయోగాత్మక వినియోగాన్ని పరిశీలిస్తున్నట్టు ఆర్‌బీఐ తెలిపింది.

మూడు రెట్లు పెరిగిన మోసాలు



గత ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక మోసాల విలువ మూడు రెట్లు పెరిగినట్టు ఆర్‌బీఐ నివేదిక తెలియజేసింది. రుణ ఖాతాలు, డిజిటల్ చెల్లింపులు తదితర మోసాల విలువ రూ.36,014 కోట్లుగా ఉన్నట్టు పేర్కొంది. అంతకుముందు సంవత్సరంలో ఈ మొత్తం రూ.12,330 కోట్లుగానే ఉంది. మోసాల కేసుల సంఖ్య మాత్రం 23,953 నుంచి 36,060కు తగ్గింది. సుప్రీంకోర్టు ఆదేశాలకు లోబడి 122 మోసం కేసులను (రూ.18,674 కోట్ల మొత్తం) పునఃపరిశీలన తర్వాత మళ్లీ రిపోర్ట్ చేయడం వల్లే మోసాల విలువ గత ఆర్థిక సంవత్సరంలో గణనీయంగా పెరిగినట్టు ఆర్‌బీఐ తెలిపింది.

బజాజ్ ఆటో లాభం డౌన్

- క్యూ4లో రూ. 1,802 కోట్లు
- షేరుకి రూ. 210 డివిడెండ్

న్యూఢిల్లీ: ద్విచక్ర, త్రిచక్ర వాహన దిగ్గజం బజాజ్ ఆటో గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 10%నీరసించి రూ. 1,802 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో రూ. 2,011 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 11,555 కోట్ల నుంచి రూ. 12,646 కోట్లకు బలపడింది. ఈ కాలంలో 11,02,934 వాహనాలు విక్రయించింది. అంతక్రితం క్యూ4లో 10,68,576 యూనిట్ల అమ్మకాలు నమోదయ్యాయి.



వాటాదారులకు షేరుకి రూ. 210 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం 5 శాతం నీరసించి రూ. 7,325 కోట్లకు చేరింది. 2023-24లో రూ.7,708 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 44,870 కోట్ల నుంచి రూ. 50,995 కోట్లకు ఎగసింది. మొత్తం వాహన విక్రయాలు 7% పుంజుకుని 46,50,966 యూనిట్లను తాకాయి.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్‌ఈలో 0.3 లాభంతో రూ. 8,873 వద్ద ముగిసింది.

పోకర్ణ లాభం రూ. 59 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో పోకర్ణ లిమిటెడ్ నికర లాభం సుమారు 280 శాతం వృద్ధి చెంది రూ. 59 కోట్లకు ఎగిసింది. ఆదాయం 62 శాతం వృద్ధి చెంది రూ. 263 కోట్లకు పెరిగింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను లాభం 115 శాతం పెరిగి రూ. 186 కోట్లకు, ఆదాయం 35 శాతం వృద్ధి చెంది రూ. 930 కోట్లకు చేరాయి. పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ 30 శాతం డివిడెండ్ ప్రకటించింది. అంతర్జాతీయంగా అసాధారణ పరిస్థితులు నెలకొన్నప్పటికీ పటిష్టమైన పనితీరు సాధించగలిగామని సంస్థ చైర్మన్ గౌతమ్ చంద్ జైన్ తెలిపారు.

రెండురోజుల నష్టాలకు చెక్

- ట్రంప్ ప్రతీకార సుంకాలు నిలిపివేసిన అమెరికా కోర్టు
- సెన్సెక్స్ లాభం 321 పాయింట్లు



ముంబై: దేశీయ స్టాక్ సూచీల రెండురోజుల నష్టాలకు గురువారం చెక్ పడింది. ట్రంప్ ప్రతీకార సుంకాలను అమెరికా ఫెడరల్ కోర్టు నిలిపివేయడంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో నెలకొన్న సానుకూలతలు మన మార్కెట్‌కు కలిసొచ్చాయి. మే సిరీస్ డెరివేటివ్స్ కాంట్రాక్టులు ముగింపు నేపథ్యంలో పలు కీలక రంగాల్లో షార్ట్ కవరింగ్ కొనుగోళ్లు చోటుచేసుకున్నాయి. సెన్సెక్స్ 321 పాయింట్లు పెరిగి 81,633 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 81 పాయింట్లు బలపడి 24,834 వద్ద నిలిచింది. ఉదయం లాభాలతో మొదలైన సూచీలు ట్రేడింగ్ ప్రారంభంలో లాభ, నష్టాల మధ్య కదలాడాయి. ఒక దశలో సెన్సెక్స్ 505 పాయింట్లు ఎగసి 81,817 వద్ద, నిఫ్టీ 141 పాయింట్లు బలపడి 24,893 వద్ద ఇంట్రాడే గరిష్టాలు అందుకున్నాయి. 'లిబరేషన్ డే' పేరుతో ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలపై ట్రంప్ విధించిన భారీ సుంకాలను ఫెడరల్ కోర్టు అమలు కాకుండా స్టే విధించడంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

సాక్షి స్పోర్ట్స్



క్వార్టర్స్‌లో సాత్విక్–చిరాగ్ జోడీ... సింధు నిష్క్రమణ

సింగపూర్: భారత స్టార్ బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి సింగపూర్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. గురువారం జరిగిన ప్రిక్వార్టర్స్‌లో సాత్విక్–చిరాగ్ జంట 19–21, 21–16, 21–19తో ఏడో సీడ్ సాబర్ కార్యమాన్ గుటామా–మొహమ్మద్ రెజా (ఇండోనేసియా) ద్వయంపై విజయం సాధించింది. ఇక మిగిలిన మ్యాచ్‌ల్లో భారత షట్లర్లు పరాజయం పాలయ్యారు. పీవీ సింధు 9–21, 21–18, 16–21తో ప్రపంచ ఐదో ర్యాంకర్ చెన్ యూఫీ (చైనా) చేతిలో ఓడింది. పురుషుల సింగిల్స్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్ 16–21, 14–21తో క్రిస్టి పొపోవ్ (ఫ్రాన్స్) చేతిలో ఓడింది. మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపీచంద్–ట్రెసా జాలీ జంట 8–21, 10–21తో జియా యి ఫాన్–జాంగ్ షు జియాన్ (చైనా) ద్వయం చేతిలో ఓడింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో గద్దె రుత్విక శివాని–రోహన్ కపూర్ జంట కూడా పరాజయం పాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది.

తొమ్మిదేళ్ల తర్వాత తుది పోరుకు...

నాలుగోసారి ఐపీఎల్ ఫైనల్లో బెంగళూరు

ఐపీఎల్ ప్రారంభమైన నాటినుంచి తొలి టైటిల్ కోసం పోరాడుతూనే ఉన్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు... ఈ సీజన్‌లో ట్రోఫీ దిశగా మరో ముందడుగు వేసింది. బౌలర్లు విజృంభించడంతో క్వాలిఫయర్–1లో పంజాబ్‌పై ఏకపక్ష విజయం సాధించిన బెంగళూరు... తొమ్మిదేళ్ల తర్వాత నాలుగోసారి ఐపీఎల్ ఫైనల్‌కు చేరింది. హాజల్‌వుడ్ పేస్‌తో బెంబేలెత్తిస్తే... సుయాశ్ శర్మ గూగ్లీలతో పంజాబ్ పని పట్టాడు. ఈ సీజన్‌లో ప్రధానంగా టాప్–3 ఆటగాళ్లపైనే ఎక్కువ ఆధారపడ్డ పంజాబ్.. ఆ ముగ్గురు మూకుమ్మడిగా చేతులెత్తేయడంతో ఓటమి పాలైంది.

- క్వాలిఫయర్–1లో 8 వికెట్లతో పంజాబ్ చిత్తు
- రాణించిన సుయాశ్, హాజల్‌వుడ్, సాల్ట్



ముల్లాన్‌పూర్: సీజన్ ఆసాంతం నిలకడగా రాణించిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) క్వాలిఫయర్–1లోనూ సంపూర్ణ ఆధిపత్యం కనబరుస్తూ ఐపీఎల్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. గురువారం జరిగిన పోరులో బెంగళూరు 8 వికెట్ల తేడాతో పంజాబ్ కింగ్స్‌ను చిత్తుచేసి తుదిపోరుకు చేరింది. బౌలర్లు సమష్టిగా సత్తా చాటడంతో ఆర్‌సీబీ ఐపీఎల్ ఫైనల్లో అడుగుపెట్టగా... 11 ఏళ్ల తర్వాత 'ప్లే ఆఫ్స్'కు చేరిన పంజాబ్ బ్యాటర్ల వైఫల్యంతో పరాజయం వైపు నిలిచింది. మొదట పంజాబ్ 14.1 ఓవర్లలో 101 పరుగులకు ఆలౌటైంది. మార్కస్ స్టొయినిస్ (17 బంతుల్లో 26; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్ కాగా... ప్రభ్‌సిమ్రన్ సింగ్ (18), అజ్మతుల్లా ఒమర్‌జాయ్ (18) మాత్రమే రెండంకెల స్కోరు చేయగలిగారు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (2)తో పాటు ప్రియాన్ష్ ఆర్య (7), జోష్ ఇన్‌గ్లిస్ (4), నేహాల్ వధేరా (8), శశాంక్ సింగ్ (3), ముషీర్ ఖాన్ (0) విఫలమయ్యారు. బెంగళూరు బౌలర్లలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సుయాశ్ శర్మ, హాజల్‌వుడ్ చెరో 3 వికెట్లు పడగొట్టగా... యశ్ దయాళ్ రెండు వికెట్లు తీశాడు. అనంతరం స్వల్ప లక్ష్యఛేదనలో బెంగళూరు 10 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 106 పరుగులు చేసింది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి (12; 2 ఫోర్లు) త్వరగానే అవుట్ అయినా... ఫిల్ సాల్ట్ (27 బంతుల్లో 56 నాటౌట్; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) అజేయ అర్ధశతకంతో ఆకట్టుకున్నాడు. మంగళవారం అహ్మదాబాద్ వేదికగా జరగనున్న తుదిపోరులో క్వాలిఫయర్–2 విజేతతో బెంగళూరు ట్రోఫీ కోసం తలపడనుంది.

ఒకరి వెంట ఒకరు...

టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ కింగ్స్‌కు శుభారంభం దక్కలేదు. ఈ సీజన్‌లో మెరుగైన ఆరంభాలతో జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించిన ఓపెనర్లు ప్రియాన్ష్, ప్రభ్‌సిమ్రన్ కీలక పోరులో ఆకట్టుకోలేకపోయారు. యశ్ దయాళ్ వేసిన రెండో ఓవర్ రెండో బంతికి ప్రియాన్ష్ సులువైన క్యాచ్ ఇచ్చి వెనుదిరగగా... భువనేశ్వర్ వేసిన మరుసటి ఓవర్‌లో రెండు ఫోర్లతో టచ్‌లోకి వచ్చిన ప్రభ్‌సిమ్రన్ అదే జోరులో మరో షాటే ఆడేందుకు ప్రయత్నించి పెవిలియన్ బాట పట్టాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 3 బంతులే ఆడి అవుట్ అయ్యాడు. హాజల్‌వుడ్ బంతిని కట్ చేసే ప్రయత్నంలో కీపర్‌కు క్యాచ్ ఇచ్చాడు. హాజల్‌వుడ్ తన మరుసటి ఓవర్‌లో ఇన్‌గ్లిస్‌ను కూడా బుట్టలో వేసుకోగా... నేహల్ వధేరా ఇలా వచ్చి అలా వెళ్లాడు. స్టొయినిస్ కొన్ని షాట్లతో ఇన్నింగ్స్‌ను నడిపించే ప్రయత్నం చేసినా అతడికి సహకారం అందించేవాళ్లే కరువయ్యారు. సుయాశ్ గూగ్లీని అర్థం చేసుకోలేక శశాంక్ క్లీన్ బౌల్డ్ కాగా... ఇంపాక్ట్ ప్లేయర్‌గా అనూహ్య అవకాశం దక్కించుకున్న ముషీర్ ఖాన్ ఐపీఎల్ అరంగేట్రంలో డకౌట్‌గా వెనుదిరిగాడు. బ్యాటర్లు వరసగా విఫలమవుతుండటంతో... ముషీర్‌కు తుది జట్టులో చోటు దక్కగా... ఆడిన తొలి ఐపీఎల్ మ్యాచ్‌లో ఒక్క పరుగు కూడా చేయకుండానే అతడు అవుట్ అయ్యాడు. తన తదుపరి ఓవర్‌లో స్టొయినిస్‌ను కూడా సుయాశ్ పెవిలియన్‌కు పంపడంతో పంజాబ్ పనైపోయింది. ఆఖర్లో అజ్మతుల్లా విలువైన పరుగులు చేసి జట్టు స్కోరును వంద పరుగుల మార్క్ దాటించాడు.

ఆడుతూ పాడుతూ..

బెంగళూరు బ్యాటింగ్ ప్రారంభానికి ముందే పంజాబ్ పరాజయం ఖాయమైపోగా... నాలుగో ఓవర్‌లో కోహ్లిని ఔట్ చేసి జెమీసన్ కాస్త ఆసక్తి రేపినా... సాల్ట్ విజృంభణతో ఎలాంటి సంచలనానికి అవకాశం లేకుండా పోయింది. మూడో ఓవర్‌లో 4, 6 కొట్టిన సాల్ట్... ఐదో ఓవర్‌లో రెండు ఫోర్లు బాదాడు. జెమీసన్ ఓవర్‌లో వరసగా 4, 4, 6 కొట్టడంతో పవర్‌ప్లే ముగిసేసరికి ఆర్‌సీబీ 61/1తో నిలిచింది. మయాంక్ అగర్వాల్ (19; 2 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ రజత్ పాటీదార్ (15 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) రాణించారు. 23 బంతుల్లో సాల్ట్ హాఫ్‌సెంచరీ పూర్తి చేసుకోగా... భారీ సిక్స్‌తో పాటీదార్ మ్యాచ్‌ను ముగించాడు.

4 బెంగళూరు జట్టు ఐపీఎల్ ఫైనల్‌కు చేరడం ఇది నాలుగోసారి. 2009, 2011, 2016లో తుదిపోరుకు చేరిన బెంగళూరు జట్టు మూడుసార్లు రన్నరప్‌గానే నిలిచింది. 2009లో దక్కన్ చార్జర్స్ చేతిలో, 2011లో చెన్నై సూపర్ కింగ్స్ చేతిలో, 2016లో సన్‌రైజర్స్ హైదరాబాద్ చేతిలో బెంగళూరు పరాజయాలు ఎదుర్కొంది.

- ఐపీఎల్‌లో 2011 నుంచి 'ప్లే ఆఫ్స్' నిర్వహిస్తుండగా... అప్పటి నుంచి పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో నిలిచిన జట్టే తొలుత ఫైనల్లో అడుగుపెట్టడం విశేషం.


శ్రేయస్

స్కోరు వివరాలు

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రియాన్ష్ (సి) కృనాల్ (బి) దయాళ్ 7; ప్రభ్‌సిమ్రన్ (సి) జితేశ్ (బి) భువనేశ్వర్ 18; ఇన్‌గ్లిస్ (సి) భువనేశ్వర్ (బి) హాజల్‌వుడ్ 4; శ్రేయస్ (సి) జితేశ్ (బి) హాజల్‌వుడ్ 2; నేహల్ (బి) దయాళ్ 8; స్టొయినిస్ (బి) సుయాశ్ 26; శశాంక్ (బి) సుయాశ్ 3; ముషీర్ (ఎల్బీ) (బి) సుయాశ్ 0; అజ్మతుల్లా (సి) జితేశ్ (బి) హాజల్‌వుడ్ 18; హర్‌ప్రీత్ (బి) షెఫర్డ్ 4; జెమీసన్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (14.1 ఓవర్లలో ఆలౌట్) 101. వికెట్ల పతనం:** 1–9, 2–27, 3–30, 4–38, 5–50, 6–60, 7–60, 8–78, 9–97, 10–101. **బౌలింగ్:** భువనేశ్వర్ 2–0–17–1; యశ్ దయాళ్ 4–0–26–2; హాజల్‌వుడ్ 3.1–0–21–3; సుయాశ్ శర్మ 3–0–17–3; కృనాల్ పాండ్యా 1–0–10–0, రొమారియో షెఫర్డ్ 1–0–5–1.

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: సాల్ట్ (నాటౌట్) 56; కోహ్లి (సి) ఇన్‌గ్లిస్ (బి) జెమీసన్ 12; మయాంక్ (సి) శ్రేయస్ (బి) ముషీర్ 19; రజత్ పాటీదార్ (నాటౌట్) 15; ఎక్స్‌ట్రాలు: 4; **మొత్తం (10 ఓవర్లలో 2 వికెట్లకు) 106. వికెట్ల పతనం:** 1–30, 2–84. **బౌలింగ్:** అర్ష్‌దీప్ సింగ్ 2–0–20–0; జెమీసన్ 3–1–27–1; అజ్మతుల్లా 1–0–10–0; హర్‌ప్రీత్ బ్రార్ 2–0–18–0; ముషీర్ ఖాన్ 2–0–27–1.



గుజరాత్ X ముంబై

నేడు ఐపీఎల్ ఎలిమినేటర్

ముల్లాన్‌పూర్: ఐపీఎల్ 18వ సీజన్‌లో బెంగళూరు జట్టు తుది పోరుకు అర్హత సాధించగా... గుజరాత్ టైటాన్స్, ముంబై ఇండియన్స్ ఎలిమినేటర్ మ్యాచ్‌కు సిద్ధమయ్యాయి. శుక్రవారం జరగనున్న పోరులో గెలిచిన జట్టు... క్వాలిఫయర్–1లో ఓడిన పంజాబ్ కింగ్స్‌తో క్వాలిఫయర్–2లో తలపడనుంది. ఓడిన జట్టు లీగ్ నుంచి నిష్క్రమిస్తుంది. ఈ సీజన్‌లో ఆడిన 14 మ్యాచ్‌ల్లో 9 విజయాలు, 5 పరాజయాలతో 18 పాయింట్లు ఖాతాలో వేసుకున్న గుజరాత్ పట్టికలో మూడో స్థానంతో 'ప్లే ఆఫ్స్'కు చేరుకుంది. హార్దిక్ పాండ్యా సారథ్యంలోని ముంబై 14 మ్యాచ్‌ల్లో 8 విజయాలు, 6 పరాజయాలతో 16 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచి నాకౌట్‌కు చేరింది. ఈ సీజన్‌లో ఇరు జట్ల మధ్య రెండు మ్యాచ్‌లు జరగగా... రెండింట్లోనూ గుజరాత్‌నే విజయం వరించింది. రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, రికెల్టన్, హార్దిక్ పాండ్యా నమన్ ధీర్ ముంబై బ్యాటింగ్‌కు కీలకం కానుండగా... జస్‌ప్రీత్ బుమ్రా, బౌల్ట్, దీపక్ చహర్, సాంట్నర్ బౌలింగ్ భారం మోయనున్నారు. మరోవైపు స్టార్ బ్యాటర్ జోస్ బట్లర్ సేవలు అందుబాటులో లేకపోవడంతో గుజరాత్ కాస్త వెనుకబడినట్లు కనిపిస్తోంది. కెప్టెన్ శుబ్‌మన్ గిల్, మరో ఓపెనర్ సాయి సుదర్శన్ ప్రదర్శనపైనే ఆ జట్టు భవితవ్యం ఆధారపడి ఉంది. రూథర్‌ఫోర్డ్, షారుక్ ఖాన్, రాహుల్ తెవాటియా సత్తా చాటాల్సిన అవసరముంది.

ఐపీఎల్‌లో నేడు (ఎలిమినేటర్)
గుజరాత్ X ముంబై
వేదిక: ముల్లాన్‌పూర్
రాత్రి 7:30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో

ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో జ్యోతి యర్రాజీ 'పసిడి' పరుగు
ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ ఫలితాలు సహా
మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

ఎన్ఐఏకు సహకరిస్తున్నాం

- ఇటీవల వారితో కలిసి నాలుగు చోట్ల దాడులు చేశాం
- హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: అల్ హింద్ ఇత్తెహదుల్ ముస్లిమీన్ (ఏఐహెచ్ఎం) ముసుగులో ఉగ్రదాడులకు కుట్రపన్ని విజయనగరం పోలీసులకు చిక్కిన సిరాజ్, సమీర్‌ల కేసును ప్రస్తుతం జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) దర్యాప్తు చేస్తోందని నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. ఈ ద్వయంలో సయ్యద్ సమీర్ నగరంలోని బోయిగూడకు చెందిన వాడు కాగా... సిరాజ్ సుదీర్ఘకాలం ఇక్కడ ఉండి వెళ్లాడు. గురువారం విలేకరుల సమావేశంలో సీపీ మాట్లాడుతూ.. 'ఈ కేసు దర్యాప్తులో ఎన్ఐఏకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నాం. ఆ అధికారులు కోరిన మీదట టాస్క్‌ఫోర్స్ బృందాలు వారితో కలిసి ఇటీవల నాలుగు ప్రాంతాల్లో దాడులు చేశాయి. ఆ ఇద్దరు ఉగ్రవాదులు రెక్కీలు నిర్వహించే వరకు వెళ్లలేదు. కేవలం ఉగ్రవాదంపై చర్చించుకుంటున్న సమయంలోనే అరెస్టు అయ్యారు. నగరంలో ఉన్న బంగ్లాదేశీయుల అంశాన్నీ కేంద్ర హోంమంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకువెళ్లాం. దీనిపై కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నడుచుకుంటాం. కాచిగూడలోని వ్యాపారి ఇంట్లో భారీ చోరీ చేసిన నేపాలీ లోకేంద్ర గ్యాంగ్ ఇంకా వారి దేశం వెళ్లలేదు. మా బృందాలు ఆ నిందితుల గ్రామానికి వెళ్లి ఆరా తీసి రావడంతో పాటు సరిహద్దుల్లో ఉండే పోలీసు, బీఎస్ఎఫ్, ఇమ్మిగ్రేషన్ అధికారులను అప్రమత్తం చేశాయి'అని సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

అంతా చూస్తున్నారు.. అతి వద్దు!



ఫన్ పేరిట కించపర్చేలా వ్యాఖ్యలు

- సోషల్‌మీడియాలో వివాదాస్పద, అడ్డగోలు వ్యాఖ్యలతో అనవసర తలనొప్పులు
- ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాలలో మనం పెట్టే కామెంట్స్.. ఫొటోల ఆధారంగా వ్యక్తిత్వ నిర్ధారణ
- విద్యార్థుల వీసా విషయంలో ట్రంప్ సర్కార్‌ది ఇదే వ్యూహం
- సోషల్ మీడియా ప్రొఫైలింగ్‌కు పెరుగుతున్న ప్రాధాన్యత

సాక్షి, హైదరాబాద్: 'విద్యార్థి వీసాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి సోషల్ మీడియా ఖాతాలను మరింత లోతుగా పరిశీలిస్తాం... సోషల్ మీడియా ఖాతాలను పరిశీలించే ప్రణాళిక కొనసాగుతోంది'ఇదీ అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఇటీవల ప్రకటించిన విషయం. దీన్నిబట్టి చూస్తే సోషల్ మీడియా ప్రొఫైలింగ్‌కు ఎంతటి ప్రాధాన్యత పెరుగుతుందో అర్థమవుతోంది. కేవలం విదేశాల్లో చదువు, ఉద్యోగాలకు వెళ్లే వారికే కాదు.. స్థానికంగా ఉద్యోగాలు పొందాలనుకునే యువతకు సంబంధించి సైతం ఆయా సంస్థలు ఇటీవల సోషల్ మీడియా ప్రొఫైలింగ్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నాయి. సదరు వ్యక్తి సోషల్ మీడియాలో వెల్లడించే భావాలు.. పెడుతున్న పోస్టులు, కామెంట్లు, వీడియోల ఆధారంగా అతడి వ్యక్తిత్వం ఏంటి? ఎలాంటి ప్రవర్తన కలిగి ఉన్నాడు? ఇలా అనేక విషయాల్ని అంచనా వేస్తున్నాయి. ఇంకాస్త లోతుగా వెళితే పెళ్లి సంబంధాల సమయంలోనూ అబ్బాయి-అమ్మాయిల గురించి, వారి స్నేహాలు, ప్రవర్తన, ఇతరులతో ఉన్న సంబంధాలపై ఒక అంచనాకు వస్తున్నారు. ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్, ఎక్స్‌లలో వాళ్లు షేర్ చేసే ఫొటోలు, వీడియోల ఆధారంగా కూడా ప్రవర్తన, నడవడికను ఇట్టే అంచనా వేస్తున్న రోజులివి. అందుకే సోషల్ మీడియాలో అంతాచూస్తున్నారని, కాబట్టి అతి ధోరణి వద్దని సైబర్ నిపుణులు సూచిస్తున్నారు.

→ సాంకేతికతతో ఎంత ఉపయోగం ఉంటుందో.. అంతేస్థాయిలో అనర్థాలున్నాయి. నేటి యువత ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగామ్, టెలిగ్రామ్, స్నాప్‌చాట్ వాడటం పరిపాటిగా మారింది. గంటల తరబడి చాటింగ్‌లు, మీటింగ్‌ల్లో కొందరు హద్దు దాటుతున్నారు. యువత, విద్యార్థులు ఫన్ పేరిట ఎదుటి వారిని కించపర్చేలా వ్యాఖ్యలు చేస్తున్నారు.. తోటి విద్యార్థులను సైబర్ బుల్లీయింగ్ (తప్పుడు వ్యాఖ్యలతో వేధించడం) చేస్తున్నారు. రాజకీయ వ్యాఖ్యలు, మతపరమైన వివాదాస్పద కామెంట్లు పెడుతుంటారు. ఈ వ్యాఖ్యలే వారిపాలిట ఇబ్బందికరంగా మారుతున్నాయి. కొన్నిసార్లు వీసాల రద్దు వరకు దారి తీస్తున్నాయి. ఎంబసీల్లోని అధికారులు వీసా కోసం దరఖాస్తు చేసుకునే వారి సోషల్ మీడియా ఖాతాలు వెరిఫై చేస్తున్నారు. యూకే, కెనడా, అమెరికా లేదా ఇతర ఏ దేశానికి వెళ్లాలన్నా వీసాలు ఆమోదం పొందడం లేదు. ఇందుకు ప్రధాన కారణం సోషల్ మీడియా ప్రొఫైలింగ్. అందుకే మన వ్యక్తిగత ప్రవర్తన కేవలం బయటి సమాజంలోనే కాదు.. సోషల్ మీడియా ప్రపంచంలోనూ ఉన్నతంగా ఉండాలని చెబుతున్నారు.

మన చేతుల్లోనే.. మన భవిష్యత్తు

→ కేవలం విదేశాల్లో విద్యా అవకాశాల విషయంలోనే కాదు.. అన్ని వయస్సుల వారి అవకాశాలకు ప్రతిబంధకంగా ఈ సోషల్ మీడియా ప్రొఫైలింగ్ మారుతోందని మరవొద్దు.

→ పెళ్లి సంబంధమైనా, కొత్త ఉద్యోగమైనా సోషల్ మీడియాలో వ్యక్తిగత వివరాల వెతుకులాట కొనసాగుతోందని మరవొద్దు.

→ ప్రభుత్వ లేదా ప్రైవేటు సంస్థల్లో పని చేసే ఉద్యోగులు సైతం సోషల్ మీడియా యాప్‌లలో, వాట్సాప్ వంటి గ్రూప్‌ల్లో సంయమనంతో ఉండకపోతే చిక్కులు తప్పవు.

→ అనసవర వ్యాఖ్యలు చేయడంతో కొన్నిసార్లు ఇతర కంపెనీల్లో గొప్ప ఆఫర్లు వచ్చినా ఉద్యోగాలు పొందలేని పరిస్థితి. అదేవిధంగా ఒక ఉద్యోగి మతం, ప్రాంతం, కులాన్ని కించపర్చేలా వ్యాఖ్యలు పోస్టులు పెడితే ఉద్యోగ ఎదుగుదలకు అవి ప్రతిబంధకాలుగా మారే ప్రమాదం ఉంటుంది.

→ మన వ్యక్తిగత వివరాలు, చిరునామా, కుటుంబ సభ్యుల వివరాలు, ఫ్రెండ్స్ ఎవరు, తరచూ ఎక్కడికి వెళుతుంటాం .. వీటన్నింటినీ క్రోడీకరించి ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్ టూల్స్ వాడి అవతలి వ్యక్తి ఎమోషనల్ ఇంటెలిజెన్స్ డెవలప్ చేయొచ్చని సైబర్ భద్రత నిపుణులు హెచ్చరిస్తున్నారు.

అతిగా సమాచారం అనవసరం..

సోషల్ మీడియాలో కొందరు తమ సమస్త వివరాలు చెబుతుంటారు. కానీ, అవసరానికి మించి ఏ వ్యక్తిగత సమాచారమూ సోషల్ మీడియాలో పంచుకోకపోవడమే ఉత్తమం అని నిపుణులు చెబుతున్నారు. పుట్టిన రోజులు, కుటుంబ సభ్యుల వివరాలు, ఫొటోలు, మన స్వస్థలాల వివరాలు వీలైనంత వరకు పెట్టకుండా ఉండాలని సూచిస్తున్నారు. సోషల్ మీడియా వాడకంపై సరైన అవగాహన ఉండాలని పేర్కొంటున్నారు. మన వ్యక్తిగత సమాచారం మనం కాకుండా ఏ వెబ్‌సైట్‌లో, సెర్చ్ ఇంజిన్‌లో చూసినా వెంటనే దాన్ని తొలగించాలని ఆ వెబ్‌సైట్‌ను కోరాలని వారు సూచిస్తున్నారు.

సోషల్ మీడియా ప్రొఫైలింగ్ అంటే..?

ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, ఎక్స్ (ట్విట్టర్), స్నాప్‌చాట్, టెలిగ్రామ్ వంటి సోషల్ మీడియా యాప్‌లలో ఖాతాలున్న వారు.. వాటిల్లో షేర్ చేసుకుంటున్న ఫొటోలు, వీడియోలు, వివరాలు, పెడుతున్న కామెంట్లు అన్నింటినీ క్రోడీకరించి అవతలి వ్యక్తి గురించి అంచనావేసే పద్ధతినే సోషల్ మీడియా ప్రొఫైలింగ్ అంటాం. దీని ఆధారంగా ఒక వ్యక్తి సామాజిక ప్రవర్తనను దాదాపుగా అంచనా వేయొచ్చు.



తెలంగాణకు 4, ఏపీకి 8 ఐఏఎస్ పోస్టులు

- 2024 సివిల్స్ ద్వారా రెండు రాష్ట్రాలకు కేటాయింపు
- సీఎస్ఈ-2024లో మొత్తం ఐఏఎస్ పోస్టులు 180

సాక్షి, న్యూఢిల్లీ: సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ (సీఎస్ఈ)-2024 ద్వారా తెలంగాణకు నలుగురు ఐఏఎస్ అధికారులను కేటాయించనున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు 8 మందిని ఇవ్వనున్నారు. సీఎస్ఈ-2024 ద్వారా భర్తీ చేయనున్న ఖాళీల వివరాలను కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ (డీఓపీటీ) విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్‌లో మొత్తం ఐఏఎస్ ఖాళీలు 180 ఉన్నాయి. అందులో అన్‌రిజర్వ్‌డ్ ఈడబ్ల్యూఎస్ కలిపి 91 పోస్టులు ఉన్నాయి. ఓబీసీ కేటగిరీలో 52, ఎస్సీ కేటగిరీలో 24, ఎస్టీ కేటగిరీలో 13 ఉన్నాయి. తెలంగాణకు కేటాయించే నాలుగు పోస్టుల్లో ఇద్దరు ఇన్‌సైడర్లు, ఇద్దరు ఔట్‌సైడర్లు ఉన్నారు. అన్‌రిజర్వ్‌డ్ కేటగిరీలో 2, ఓబీసీ కేటగిరీలో 2 ఖాళీలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఇన్‌సైడర్లు ఇద్దరు, ఔట్‌సైడర్లు ఆరుగురు ఉన్నారు. అన్‌రిజర్వ్‌డ్ కేటగిరీలో 5, ఓబీసీ కేటగిరీలో 2, ఎస్సీ కేటగిరీలో 1 ఖాళీ ఉన్నాయి. ఈ విధంగా, ప్రతి రాష్ట్రంలో కొన్ని ఖాళీలు వారి స్వంత రాష్ట్రానికి చెందిన అభ్యర్థులకు (ఇన్‌సైడర్ కోటా), మిగిలినవి ఇతర రాష్ట్రాల అభ్యర్థులకు (ఔట్‌సైడర్ కోటా) కేటాయించారు. ఇది దేశవ్యాప్తంగా పరస్పర సమన్వయం, సామరస్యాన్ని పెంచే విధంగా రూపొందించారు. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, ముస్సోరీలోని శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్, యూపీఎస్సీ కార్యదర్శులకు డీఓపీటీ డిప్యూటీ సెక్రటరీ చారులత లేఖలు రాశారు.

ఉద్యానానికి ఊతం!

- పండ్ల తోటల పునరుద్ధరణ.. కొత్తగా వేల ఎకరాల్లో సాగు
- కేంద్ర ప్రభుత్వ ఎంఐడీహెచ్ పథకం ద్వారా ఉద్యాన పంటల విస్తరణ
- రైతులకు ఆదాయం సమకూరేలా కూరగాయలు, పండ్లకు ప్రాధాన్యత



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న పండ్ల తోటలను పునరుద్ధరించి, దిగుబడి పెరిగేలా కృషి చేయడంతో పాటు కొత్తగా వేల ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెంచే దిశగా ఉద్యానవన శాఖ అడుగులు వేస్తోంది. కేంద్ర ప్రభుత్వ సమగ్ర ఉద్యాన పంటల అభివృద్ధి మిషన్ (ఎంఐహెచ్‌డీ) కింద ఈ వానాకాలం సీజన్‌లోనే పనులు చేపట్టాలని నిర్ణయించింది. వచ్చే నెల మొదట వారం నుంచే రాష్ట్రంలో విస్తృతంగా ఉద్యాన పంటల విస్తరణ కార్యక్రమాలు అమలు చేయాలని క్షేత్రస్థాయికి ఆదేశాలు జారీ అయ్యాయి. రూ.145 కోట్ల వ్యయమయ్యే ఈ కార్యక్రమానికి కేంద్ర వాటా కింద 60 శాతం నిధులు అంటే సుమారు రూ.87 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు అంటే సుమారు రూ.58 కోట్లు వెచ్చించనున్నాయి.

వానాకాలంలో 9,818 హెక్టార్లలో సాగు లక్ష్యం

ఈ వానాకాలం సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 9,818 హెక్టార్లలో కొత్త ఉద్యాన పంటల సాగుతో పాటు, తోటలు ఏర్పాటు చేయాలని ఎంఐడీహెచ్ ప్రణాళికలో పొందుపరిచారు. కొత్తగా వచ్చే ఈ ఉద్యాన పంటలను రెండేళ్ల పాటు తప్పనిసరిగా సంరక్షించాల్సి ఉంటుంది. కూరగాయలు, పూలు, పండ్ల సాగుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచేలా ఈ పథకాన్ని రూపొందించారు.

సురక్షిత ఉద్యాన సాగుకు ప్రాధాన్యత

ఏ వాతావరణంలోనైనా ఎక్కువ దిగుబడినిచ్చి, రైతులకు ఆర్థికంగా తోడ్పాటును అందించే పాలీ హౌస్, గ్రీన్‌హౌస్ విధానంలో పంటల సాగుకు కూడా ప్రభుత్వం ఈసారి ప్రాధాన్యత ఇవ్వనుంది. 7,169 హెక్టార్లలో ఈ సురక్షిత ఉద్యాన పంటల సాగుకు తోడ్పాటు అందించాలని నిర్ణయించింది. ఇందుకోసం ఎంఐడీహెచ్ కింద రూ. 21.97 కోట్లు కేటాయించింది. అలాగే ఐపీహెచ్ఎం కింద 721 యూనిట్లు ఏర్పాటు చేయడం ద్వారా పంటల నిల్వ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ వసతులు మెరుగు పరచనున్నారు.

కిడ్నీ రాకెట్ కేసులో మరో ఇద్దరి అరెస్టు

- తమిళనాడులో అరెస్టు చేసిన సీఐడీ బృందం
- ఈ కేసులో ఇప్పటికే 13 మంది అరెస్టు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన కిడ్నీ అమ్మకం రాకెట్ కేసులో సీఐడీ అధికారులు ఇద్దరు కీలక నిందితులను అరెస్టు చేశారు. శంకరన్, ఎస్ రమ్యలను చెన్నైలో అరెస్టు చేసి ట్రాన్సిట్ వారెంట్‌పై హైదరాబాద్‌కు తరలించారు. ఇద్దరు నిందితులను గురువారం కోర్టులో హాజరుపర్చినట్లు సీఐడీ డీజీ శిఖాగోయల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వారి నుంచి ఒక పాస్‌పోర్టు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. రంగారెడ్డి జిల్లా కొత్తపేటలోని అలకనంద ఆసుపత్రిలో అవయవదానం పేరిట అంతర్రాష్ట్ర ముఠా మానవ అవయవాల అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్టు సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసును ప్రభుత్వం సీఐడీకి బదిలీ చేసింది. సీఐడీ అధికారులు ఈ ఏడాది ఏప్రిల్ 24 నుంచి దర్యాప్తు మొదలు పెట్టి ఇప్పటికే 13 మందిని అరెస్టు చేశారు. తాజాగా అరెస్టయిన శంకరన్, రమ్య తమిళనాడులో కొందరు అమయాకులను ఉద్యోగాలు ఇప్పిస్తామని మభ్యపెట్టి హైదరాబాద్‌కు తీసుకువచ్చి కిడ్నీలు అమ్ముకునేలా బలవంతపెడుతున్నట్లు గుర్తించారు. ఒక్కో కిడ్నీ విక్రయానికి రూ.10 లక్షల చొప్పున కమీషన్ తీసుకుంటున్న నిందితులు.. కిడ్నీ దాతలకు మాత్రం రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలు మాత్రమే చెల్లిస్తున్నట్టు అధికారులు గుర్తించారు. ఈ ముఠాలో కీలక నిందితులైన పవన్, పూర్ణచందర్ సహా మరో ఏడుగురి కోసం సీఐడీ బృందాలు గాలిస్తున్నాయి.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

అపురూపాలు పదిలం

గత స్మృతులను నెమరు వేసుకోవాలి. వర్తమానంలో మనుగడ సాధిస్తూ.. భవిష్యత్‌పై కలలు కనాలి. వాటిని నిజం చేసుకునేందుకు ప్రయత్నాలు చేయాలి.. అంటారు పెద్దలు. గతం తిరిగిరానిదని కూడా ఉద్బోధిస్తుంటారు. ఏ శాస్త్ర సాంకేతిక విజయాన్ని పరిశీలించినా.. దానికి మూలం పూర్వీకుల నుంచి సంక్రమించిన పరిజ్ఞానమే. ఇలాంటి పరిజ్ఞానాన్ని మరిచిపోకుండా.. పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ.. వాటిని భద్రపరిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం శ్రీరామగిరి గ్రామస్తులు. అయిదారు దశాబ్దాల క్రితం వినియోగించిన వస్తువులు, వ్యవసాయ పరికరాలను భావితరాలకు అందించే ప్రయత్నం చేస్తున్నారు. గ్రామంలో సేకరించిన వస్తువులను తెలంగాణ ఆద్యకళా మ్యూజియం పేరిట భద్రపరిచే ప్రయత్నాలు చేస్తూ పలువురి మన్ననలు పొందుతున్నారు.

- సాక్షి, మహబూబాబాద్

పురాతన వస్తువుల సేకరణ - సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ కోసం ప్రయత్నం

‘ఆద్యకళా’పేరుతో హైదరాబాద్‌లో మ్యూజియం - శ్రీరామగిరి గ్రామ వస్తువులకు చోటు



మైల్‌దాన్



ఉట్టి

యాభై ఏళ్లుగా ప్రయత్నాలు

పూర్వీకులు వినియోగించిన వస్తువులు, ఆనాటి కళలు, వారి సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు పూనుకున్నారు శ్రీరామగిరి వాసులు. యాభై ఏళ్ల క్రితం వివేకానంద సాంస్కృతిక సమితిని ఏర్పాటు చేశారు. ఈ సమితి ద్వారా ఆనాటి వీధిభాగోతాలు మొదలుకొని.. చిడతల రామాయణం, జడకుప్పి, కోలాటం తదితర కళలను పరిరక్షిస్తూ నేటికీ ప్రదర్శిస్తున్నారు. పాతకాలం నాటి వస్తువులను కూడా సేకరిస్తున్నారు.

భావితరాల కోసం..

మారిన కాలం, వైజ్ఞానిక రంగాల్లో వచ్చిన మార్పుల ఫలితంగా అనేక నూతన ఆవిష్కరణలు వచ్చాయి. కానీ గతంలో పూర్వీకులు వినియోగించిన వస్తువులను భావితరాలకు చూపించాలనే ఆలోచనతో శ్రీరామగిరి వాసులు తమ ఇళ్లల్లోని వస్తువులను భద్రపరిచారు. వీటిలో మోటబొక్కెన, బకెట్ పంపు డబ్బాలు, కుందెన, పాన్‌ధాన్ (ఆకులు, సున్నం, వక్కల కత్తెర, వక్కలు భద్రపరిచే పెట్టె), చుట్టకుదురు, రోకళ్లు, ఇసుర్రాయి, ఉట్టి, చల్లకవ్వం, ఉట్టి, అటికలు (మట్టితో తయారు చేసిన పాత్రలు), పిల్లలు ఆడుకునే రింగున్, బొంగరాలు మొదలైనవి ఉన్నాయి. చేపల వేట కోసం వినియోగించే ఊత, మావుతోపాటు విడిచిన బట్టలు వేసుకునే మైల్‌దాన్, మంగలి పెట్టె, సానరాయి మొదలైవాటితోపాటు, శ్రీరామగిరి గ్రామానికి చెందిన పాతకాలం పండితులు రాసిన తాళపత్ర గ్రంథాలను కూడా సేకరించారు.

ఆద్యకళా మ్యూజియం ఏర్పాటు..

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఇందులో భాగంగానే తెలుగు విశ్వవిద్యాల యం ప్రొఫెసర్లు, పురావస్తు శాఖ వారి ఆధ్వ ర్యంలో వస్తువులు, జానపద కళల ప్రదర్శనల ద్వారా ఆనాటి కళలకు గుర్తింపు తెచ్చేందుకు కసరత్తు ప్రారంభించారు. ఇందులో భాగంగానే ప్రొఫెసర్ సుజాత, జయధీర్ తిరుమలరావు శ్రీరామగిరి గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలోని యువకులు, పెద్దలు సేకరించిన పురాతన వస్తువులు, వ్యవసాయ పరికరాలను చూసి ఆశ్చర్యపోయారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వివేకానంద సాంస్కృతిక మండలి సభ్యులను అభినందించారు. గ్రామంలో సేకరించిన వస్తువులను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్న ఆద్యకళా మ్యూజియానికి తరలించారు.



తాళపత్రం



పాన్‌ధాన్



మోట బొక్కెన



ఊత

పురాతన కళ, సంస్కృతి పరిరక్షణ



మా గ్రామంలో ఐదు దశాబ్దాల క్రితం సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ కోసం వివేకానంద సాంస్కృతిక కళామండలిని ఏర్పాటు చేశాం. నాతోపాటు, మా గ్రామానికి చెందిన బొమ్మిడి వినోద్‌రెడ్డి, ఇతర మిత్రులం.. ఇప్పటికీ ప్రాచీన కళల పరిరక్షణకు పాటుపడుతున్నాం. వస్తువులు, వ్యవసాయ పరికరాలను సేకరించాం. చిడతల రామాయణం, జడకుప్పి వంటి కళల ప్రదర్శనకు.. రాష్ట్ర స్థాయిలో మా గ్రామానికి ప్రత్యేక గుర్తింపు వచ్చింది. ఊరిలో సేకరించిన వస్తువులను మ్యూజియంలో భద్రపరుస్తున్నారంటే మా గ్రామానికే గర్వకారణంగా భావిస్తున్నాం.

- కళాధర్ రాజు, ప్రధాన కార్యదర్శి, వివేకానంద సాంస్కృతిక మండలి

కావలసినవి తయారు చేసుకునేవాళ్లు



పూర్వ కాలం పద్ధతులే వేరు. చేతి వృత్తులు, కుల వృత్తుల వాళ్లు ఎక్కువ. ఎవరికి కావలసిన వస్తువులను వారు తయారు చేసుకునే వాళ్లు. అప్పుడు వస్తు మార్పిడి ఉండేది. ఏ వస్తువు కూడా పర్యావరణానికి భంగం కలిగించేది కాదు. అందువల్లే పూర్వీకులు అంత ఆరోగ్యంగా ఉన్నారు.

- మురళీధర్ స్వామి, రిటైర్డ్ ఉపాధ్యాయుడు

జ్ఞాపకాలు పదిలం



చిన్నతనంలో పల్లెటూరులో పెరిగాను. అందరం వరుసలతో పిలుచుకునే వాళ్లు. కానీ గోళం, ఊత, గాజె, బొట్టుపెట్టెలు ఇప్పుడు కనిపించడం లేదు. వండిన అన్నం ఉట్టిమీద పెడితే.. స్టూలు వేసుకొని ఎక్కి అన్నం పెట్టుకున్న గుర్తులు ఇప్పటికి మరుపు రావు.

- బందారు వెంకటరమణ, మహబూబాబాద్

‘నంబాల’ అస్థికలకు న్యాయపోరాటం

సిద్ధమవుతున్న మావోయిస్టు అగ్రనేత కుటుంబ సభ్యులు

- ‘నంబాల’మృతదేహానికి పోలీసుల అంత్యక్రియలు
- అస్థికలైనా ఇవ్వాలన్న కుటుంబ సభ్యులు
- గుర్తింపుపై ‘డిక్లరేషన్’ కోరిన ఛత్తీస్‌గఢ్ పోలీసులు
- మిగిలిన మావోయిస్టుల అస్థికల అప్పగింతపైనా సందిగ్ధత
- అంత్యక్రియల వ్యవహారంపై జాతీయ మీడియాలో కథనాలు



మావోయిస్టుల మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహిస్తున్న పోలీసులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మావోయిస్టు పార్టీ సుప్రీం కమాండర్ నంబాల కేశవరావు అస్థికల కోసం కుటుంబ సభ్యులు న్యాయపోరాటానికి సిద్ధమవుతున్నారు. ఈనెల 21న జరిగిన ఎన్‌కౌంటర్‌లో నంబాల చనిపోగా.. ఆయన మృతదేహానికి పోలీసులే 26వ తేదీన అంత్యక్రియలు నిర్వహించారు. ఆయనతో పాటు మరికొందరి అంత్యక్రియలు కూడా పూర్తి చేశారు. అయితే అస్థికలను కుటుంబసభ్యులకు అప్పగించే విషయంలో.. మరోసారి వివాదం చెలరేగినట్టు బస్తర్, జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి.

ఆదివాసీ శ్మశానవాటికలో..

ఈనెల 21న నంబాలతో పాటు 28మంది మావోయిస్టులు చనిపోగా అందులో 27మంది మృతదేహాలకు నారాయణపూర్ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఇందులో తెలుగు రాష్ట్రాలకు చెందిన ఐదుగురి మృతదేహాలు ఉన్నాయి. వీరి మృతదేహాలను స్వగ్రామాలకు తీసుకెళ్లేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి ఫ్రీజర్లతో కూడిన మూడు అంబులెన్సులు 22వ తేదీ సాయంత్రం నాటికి నారాయణపూర్ చేరుకున్నాయి. కాగా, మృతులతో తమకున్న రక్త సంబంధం నిరూపించుకునేందుకు చట్టపరమైన ఆధారాలు (ఆధార్ కార్డ్, ఫ్యామిలీ ఫొటో, సర్పంచ్ ధ్రువీకరణ పత్రం) సమర్పించలేదనే కారణంతో.. 26వ తేదీన సాయంత్రం పోలీసులే మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు. నారాయణపూర్‌లోని ఆదివాసీ శ్మశానవాటికలో తెలుగు రాష్ట్రాలకు చెందిన ఐదుగురు మావోయిస్టులతో పాటు మరో ముగ్గురు ఛత్తీస్‌గఢ్ నక్సల్స్ మృతదేహాలకు అంత్యక్రియలు జరిగాయి.

డిక్లరేషన్ పేచీ..

అంత్యక్రియలు జరిగిన మర్నాడు.. నంబాల కేశవరావు సోదరుడు నంబాల రామ్‌ప్రసాద్ ఛత్తీస్‌గఢ్ పోలీసులను ఆశ్రయించి తన సోదరుడి అస్థికలు ఇవ్వాలని కోరారు. కాగా, తమ కుటుంబ సభ్యుడేనని నిరూపించుకునేందుకు అవసరమైన చట్టపరమైన పనులు నిర్వర్తించడంలో విఫలమైనట్లు డిక్లరేషన్ పత్రంపై సంతకం చేయాలని అక్కడి పోలీసులు సూచించినట్లు సమాచారం. దీనికి నిరాకరించిన నంబాల సోదరుడు మరోసారి న్యాయపరంగా ముందుకు వెళ్లాలని నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది.



చివరి చూపైనా దక్కలేదు

ఎనిమిది మంది మృతదేహాలకు పోలీసులు అంత్యక్రియలు నిర్వహించారు. అందులో మావోయిస్టు హుంగీ కుటుంబ సభ్యులు.. తమ ఆర్థిక సమస్యల రీత్యా.. పోలీసులే నిర్వహించాలని కోరారు. కానీ అంత్యక్రియలకు ముందు ఒక్కసారైనా హుంగీ మృతదేహాన్ని తమకు చూపలేదని వారు వాపోయారు. ఏళ్ల తరబడి ఇంటికి దూరమై విగత జీవులుగా మారిన తమ వారికి గౌరవప్రదమైన అంత్యక్రియలు నిర్వహించాలనే లక్ష్యంతో ఫ్రీజర్ బాక్సులున్న అంబులెన్సులు తెచ్చుకున్నామని, కానీ ఉత్త చేతులతో తిరుగు ముఖం పట్టాల్సి వచ్చిందని తెలుగు రాష్ట్రాలకు చెందిన మావోయిస్టుల కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 21న ఎన్‌కౌంటర్ జరిగితే.. 26వ తేదీ వరకు మృతదేహాలన్నీ ఆరుబయటే ఉన్నాయని, మార్చురీ నుంచి వచ్చే దుర్గంధంతో ఆస్పత్రి ప్రాంగణం, సమీపంలోని టీ కొట్లు, ఇతర దుకాణాలను మూసేశారని వెల్లడించారు. ఇంత జరిగినా తమ వారి చివరి చూపు కోసం పరితపిస్తే ఛత్తీస్‌గఢ్ పోలీసులు సహకరించలేదని కన్నీరు పెట్టుకున్నారు. ఛత్తీస్‌గఢ్ మావోయిస్టుల విషయంలో కేవలం ఆధార్‌కార్డు వివరాలు నమోదు చేసుకుని మృతదేహాలు ఇచ్చారని.. తెలుగు రాష్ట్రాల మావోయిస్టుల విషయంలోనే పేచీ పెట్టారని వారు వాపోతున్నారు.

దోస్త్ సీట్ల భర్తీలో టాప్ టెన్ కాలేజీలు

కాలేజీ	మొత్తం సీట్లు	కేటాయింపు	కేటాయింపు శాతం
నిజాం కాలేజీ, హైదరాబాద్	1,197	1,170	97.74
ఉమెన్స్ కాలేజీ, కోఠి	1,850	1,724	93.19
సిటీ కాలేజీ, హైదరాబాద్	1,800	1,600	88.89
మహిళా కాలేజీ, బేగంపేట	1,860	1,538	82.69
ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ	1,740	1,409	80.98
బాబూ జగ్జీవన్‌రాం డిగ్రీ కాలేజీ (నారాయణగూడ)	1,380	1,108	80.29
ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ కాలేజీ (కరీంనగర్)	1,560	1,139	73.01
ఇందిరా ప్రియదర్శిని మహిళా కాలేజీ	1,740	1,193	68.56
యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ సుబేదారి, హన్మకొండ	1,770	1,170	100
గిరిరాజ్ గవర్నమెంట్ కాలేజీ (నిజామాబాద్)	1860	1223	65.75

మేనేజ్‌మెంట్‌వారీగా సీట్ల కేటాయింపు

మేనేజ్‌మెంట్	సంఖ్య కాలేజీల	మొత్తం సీట్లు	కేటాయింపు	బాలురు	బాలికలు
ప్రభుత్వ కాలేజీలు	117	49,110	8,091	3,201	4,890
ప్రభుత్వ (అటానమస్)	35	38,580	18,096	7,214	10,882
ప్రైవేటు కాలేజీలు (ఎయిడెడ్)	24	11,130	3,438	1,455	1,983
ప్రైవేటు ఎయిడెడ్ (అటానమస్)	2	1,200	793	0	793
ప్రైవేటు కాలేజీలు	617	2,59,640	23,018	8,225	14,793
ప్రైవేటు (అటానమస్)	3	4,980	1,316	651	665
రైల్వే శాఖ కాలేజీలు	1	189	170	96	74
విశ్వవిద్యాలయాలు (అటానమస్)	2	2,967	2,340	979	1,361
విశ్వవిద్యాలయాల కాలేజీలు	4	3,300	3,174	574	2,600
మొత్తం	805	3,71,096	60,436	22,395	38,041

కవిత మాట్లాడిన తీరు సరికాదు

ఎమ్మెల్సీ తక్కెల్లపల్లి రవీందర్‌రావు

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ పార్టీని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేధిస్తున్న సమయంలో ఎమ్మెల్సీ కవిత మాట్లాడిన తీరు సరికాదని పార్టీ ఎమ్మెల్సీ తక్కెల్లపల్లి రవీందర్‌రావు అన్నారు. కవిత వ్యాఖ్యలపై స్పందించవద్దని అధిష్టానం నుంచి ఆదేశాలు ఉన్నా.. తమకు స్పందించక తప్పడం లేదన్నారు. గురువారం రవీందర్‌రావు ‘సాక్షి’తో మాట్లాడారు. కేసీఆర్‌కు రాసిన లేఖ లీక్ అయిన అంశంపై ఆయన స్పందించే వరకు వేచి ఉండాలన్నారు. కేసీఆర్‌ను దేవుడు అంటున్న వారు దేవుడిపై దండెత్తుతారా అని ప్రశ్నించారు. కేసీఆర్ చుట్టూ దెయ్యాలు, భూతాలు ఉన్నాయనడం సరికాదని, లేఖ బహిర్గతం కావడం వెనుక ఎవరున్నారో కచ్చితంగా తేలాల్సిందే అన్నారు. కవిత, కేటీఆర్‌కు మధ్య ఏం జరిగిందో తమకు తెలియదని, పార్టీలోని ప్రతి ఒక్కరూ అధినేత ఆదేశాలు పాటించాలని చెప్పారు. కవిత ఉద్యమ నాయకురాలని, కేసీఆర్ కూతురుగా ఆమెను గౌరవిస్తామన్నారు. కేసీఆర్ ఆదేశిస్తే కవిత వ్యాఖ్యలపై పార్టీ స్పందిస్తుందని పేర్కొన్నారు.



ఆకలి వేస్తోంది ఆహారం పెట్టు అంటూ నోరు తెరిచిన నీటి ఏనుగు

భలే మంచి రోజూ

ఆరిలోవ(విశాఖ): ఇందిరాగాంధీ జూపార్క్ కళకళలాడుతోంది. ఒకవైపు చిన్నారులు విత్తన బంతులు వేస్తూ సందడి చేస్తుంటే, సందర్శకులతో జూ అంతా కోలాహలంగా మారింది. జూలో జంతువుల చేష్టలు చూపరులను కట్టిపడేశాయి. ఏనుగులు తొండంతో గోడ దగ్గరకు రావడం పిల్లలు కేరింతలు కొట్టారు. వాతావరణం చల్లగా ఉండడంతో జంతువులు మరింత ఉత్సాహంగా కనిపించాయి. ఖడ్గమృగం నీటిలో మునిగి తేలుతూ ఉంటే, ఒడ్డున నిలబడిన రంగుల పెయింటెడ్ స్టార్క్స్ పక్షులు చేపల కోసం గంటల తరబడి ఎదురుచూడటం ఆసక్తికరంగా అనిపించింది. అంతేకాదు ఆహారం తీసుకొచ్చిన జూ సిబ్బందిని చూడగానే నీటి ఏనుగు నోరు తెరిచి ఆకలిగా ఉందని సైగలు చేస్తూ అందరినీ నవ్వించింది. ఇక మొసళ్ల కొలనులోనైతే అసలు సిసలు పోటీ ఏర్పడింది. సిబ్బంది వేసిన చేపల కోసం ఘరియల్ మొసళ్లు, కొంగలు పోటీ పడి ఎవరికి దొరికితే వారిది అన్నట్లుగా ఎదురుచూశాయి. మొత్తానికి ఇందిరాగాంధీ జూపార్క్ సందర్శకులకు మంచి వినోదాన్ని పంచింది.



ఎవరికి దొరికితే వారికే చేప అంటూ పోటీ పడుతున్న ఘరియల్ మొసలి, కొంగలు



ఖడ్గమృగం కొలనులో చేపల కోసం వెతుకుతున్న పెయింటెడ్ స్టోర్క్ పక్షులు



ఇంద్రకీలాద్రికి పచ్చని హారం

బెజవాడలో కనకదుర్గమ్మ వెలసిన ఇంద్రకీలాద్రి పచ్చదనంతో తొణికిసలాడుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు కొండమొత్తం పచ్చదనం పరచుకోవడంతో అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు ఇంద్రకీలాద్రిని చూసి మురిసిపోతున్నారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

బలసిరి.. కొత్తవరి

- కాకినాడ జిల్లాలో పెరిగిన కొత్త విత్తనాభివృద్ధి
- అందుబాటులోకి ఆధునిక వరి వంగడాలు
- విత్తనాభివృద్ధికి ప్రా'ధాన్యం'
- ఆన్‌లైన్‌లోనూ విక్రయాలు
- ఆరోగ్యదాయక సాగుపై ప్రకృతి రైతుల ఆసక్తి



అరుదైన రకాల ధాన్యం



కొత్తపల్లిలో అరుదైన రకాల వరి సాగు చేస్తున్న పొలం

పిఠాపురం: రంగు.. రుచి.. వాసన.. ఇదేదో వాణిజ్య ప్రకటన అనుకుంటే పొరపాటే. వరిలోనూ ఇటువంటి లక్షణాలున్న బియ్యం అందుబాటులోకి వచ్చాయి. గతంలో ఇటువంటి బియ్యం ఉన్నాయని చెబితే.. ఆశ్చర్యం వ్యక్తం చేసేవారు. ఇటువంటి అనేక రకాల కొత్త వంగడాలను ఇక్కడి రైతులు పండిస్తూ అందుబాటులోకి తెస్తున్నారు. అత్యధిక పోషక విలువలున్న వరి వంగడాలను ఉత్పత్తి చేయడానికి ప్రకృతి వ్యవసాయ రైతులు నడుం బిగించారు. అరుదైన వరి రకాలు గతంలో రాష్ట్రేతర ప్రాంతాల నుంచి తెచ్చే స్థానిక రైతులు.. ఇప్పుడు కాకినాడ జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలకు పలు రకాల వరి వంగడాలను ఆన్‌లైన్ ద్వారా విక్రయిస్తున్నారు. ఇక్కడ పండించిన అరుదైన వరి రకాలు తిరుమల తిరుపతి దేవస్థానంలో వేంకటేశ్వర స్వామివారి నైవేద్యానికి సైతం ఉపయోగిస్తుండడం విశేషం. ఈ అరుదైన రకాల్లో నవారా, ఇంద్రాణి, కాలపట్టి, డెహ్రాడూన్ రెడ్ రైస్, పరిమళ సన్న, బర్మా బ్లాక్, రత్నచొడి, రక్తసాలి, చింతలూరు సన్నాలు, కూజి, పాటలియా, బాస్ బోగ్, కామిని బోగ్, మైసూర్ మల్లిగ, సిద్ధ సన్నాలు, కోమల్ సాల్ వంటి రకాలున్నాయి. జిల్లాలో సుమారు 25 హెక్టార్లలో 30 మంది రైతులు సేంద్రియ పద్ధతిలో అరుదైన వరి రకాలను పండిస్తున్నారు.

అరుదైన రకాలివే..

- రక్తసాలి రక్త హీనతతో బాధపడుతున్న వారికి మంచి ఆహారం. ఈ బియ్యం తినడం వల్ల హిమోగ్లోబిన్ పర్సంటేజ్ పెరుగుతుంది. మూడు వేల ఏళ్ల నుంచి ఇది వాడుకలో ఉంది.
- కూచి పట్టాలియా బాగా సన్నగా ఉంటుంది. తినడానికి బాగుంటుంది. పోషకాలు ఎక్కువ.
- నవరను కింగ్ ఆఫ్ రైస్ అంటారు. ప్రస్తుతం దేశంలో లభించే బియ్యంలో అత్యంత పోషక విలువలున్న ఆహారం. సుగర్ వ్యాధిగ్రస్తులకు చాలా మంచి ఆహారం. దీనిని రోజూ తింటే సుగర్ నార్మల్‌కు వస్తుంది. మోకాళ్ల నొప్పులూ తగ్గిస్తుంది.
- ధూదేశ్వర్ అనే దేశీయ వరి విత్తనం. గాలులకు పడిపోని సన్న రకం. పంటకాలం సుమారు 120 రోజులు. ఇది తెలుపు రంగులో ఉంటుంది, బాలింతలకు శక్తినిచ్చి, తల్లులకు, పిల్లలకు అధిక పోషకాలు అందిస్తుంది. పాల వృద్ధి, పిల్లల రోగ నిరోధక శక్తిని పెంచుతుంది.
- ఇంద్రాణి అనేది దేశీయ వరిరకం. సువాసన ఉండే ఈ రకం పంట కాలం సుమారు 130 రోజులు. పాయసం, పులిహోర, పలావు, దద్దోజనానికి అనుకూలమైంది.
- రత్నచొడి అనే దేశీయ వరి విత్తనం. తెలుపు రంగులో ఉండే సన్న రకం. పంట కాలం సుమారు 135 రోజులు. అధిక పోషక విలువలు కలిగి, కండపుష్టి, శరీర ధారుఢ్యం పెంచి, మంచి పోషకాలు కలిగి ఉంటుంది. రోగ నిరోధక శక్తి కలిగిస్తుంది. పూర్వకాలంలో సైనికులకు ఆహారంగా ఇచ్చేవారు.
- కుజీపటాలియా అనేది దేశీయ విత్తనం. సన్న రకం. పంటకాలం సుమారు 120 రోజులు. గాలులకు పడిపోదు. కొవ్వు రహిత, సోడియం లేనివి. తక్కువ కేలరీలు, గ్లూకోజ్ తక్కువగా ఉండి, రోగ నిరోధక శక్తి పెంచుతుంది.
- కేత్రీ మహరాజ్ సెంటెడ్ వెరైటీ. గింజ పొడవుగా ఉంటుంది. పంటకాలం సుమారు 130 రోజులు. పాయసం, దద్దోజనం, పులిహోర పలావులకు బాగుంటుంది.
- మైసూరు మల్లిగ దేశీయ విత్తనం. తెల్లని రంగు, గాలులకు పడిపోని సన్నని గింజ. పంట కాలం సుమారు 120 రోజులు. ఎదిగే పిల్లలకు అధిక పోషకాలు, ప్రొటీన్లు అందిస్తుంది.
- ఘని అనే దేశీయ వరి రకం. చిన్న గింజ. పంట కాలం సుమారు 130 రోజులు. అధిక ఫైబర్, కాల్షియం కలిగి ఉంటుంది. స్పాండిలైటిస్, మోకాళ్ల నొప్పులు తగ్గించే ఆహార ఔషధంగా గుర్తింపు పొందింది.
- కుంకుమసాలి.. కుంకుమ పువ్వు, రక్తసాలి మొదలైన విత్తనాలు ఒకే కోవకు చెందిన దివ్యమైన ఔషధాలు. ఇవి రక్తంలోని మలినాలను శుభ్రం చేసి, వాత, పిత్త, కఫాలను సమపాళ్లలో ఉంచే దివ్యమైన ఆహార ఔషధాలు.

చాలా డిమాండ్ ఉంది



పన్నెండేళ్ల నుంచి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రాణప్రదంగా చేస్తున్నాను. ప్రకృతి వ్యవసాయంలో పండించిన అరుదైన రకాల ధాన్యం తిరుమల తిరుపతి దేవస్థానంలో వేంకటేశ్వర స్వామివారికి నైవేద్యంగా ఉపయోగించడానికి ఇస్తున్నాను. సాధారణ రకాల కంటే.. మంచి డిమాండ్ ఉన్న అరుదైన రకాలను సాగు చేస్తున్నాను. ఇతర ప్రాంతాల నుంచి వివిధ రకాల విత్తనాలు తెచ్చి, విత్తనాభివృద్ధి చేస్తున్నాను. కేవలం విత్తనాలకు మాత్రమే వీటిని పండిస్తున్నాను. రెండు తెలుగు రాష్ట్రాల రైతులు కొనుగోలు చేస్తున్నారు. వీటిని ఆన్‌లైన్ ద్వారా పంపిస్తున్నాం. ఈ బియ్యానికి మంచి డిమాండ్ ఉండడంతో ఆదాయం బాగుంటుంది. నాతో పాటు జిల్లాలో చాలా మంది రైతులు వీటి సాగు ప్రారంభించారు. ఇతర రాష్ట్రాల రైతులూ నా వద్ద విత్తనాలు తీసుకుంటున్నారు.

– అదపా వెంకటరమణ, ప్రకృతి వ్యవసాయ రైతు, భోగాపురం, పిఠాపురం మండలం, కాకినాడ జిల్లా

విత్తనం కోసమే పండిస్తున్నా...



ప్రకృతి వ్యవసాయంలో పలు రకాల ధాన్యాన్ని పండిస్తున్నాను. కేవలం విత్తనాల కోసం కొన్ని అరుదైన రకాలు పండిస్తున్నాను. ఎవరైనా విత్తనాలకు అడిగితే ఉచితంగా ఇస్తున్నాను. ఇతర రాష్ట్రాల నుంచి ఆర్డర్లు వస్తున్నాయి.ఎకరం పొలంలో పది రకాల అరుదైన రకాలను పండిస్తున్నాను. ఈ సాగంతా పాతకాల పద్ధతిలోనే చేయాలి. యంత్రాలతో సాధ్యం కాదు.

– ఉల్లి సురేష్, ప్రకృతి వ్యవసాయ యువ రైతు, కొత్తపల్లి, కాకినాడ జిల్లా

పీపీపీతో ప్రజల ఆరోగ్యానికి చేటు

- విద్య, వైద్యం ప్రభుత్వ నిర్వహణలోనే ఉండాలి
- ప్రైవేట్‌కు ఇస్తే జవాబుదారీతనం ఉండదు
- సీఎం చంద్రబాబుకు ప్రజారోగ్య వేదిక లేఖ

సాక్షి, అమరావతి : ప్రభుత్వ వైద్య కళాశాలలు పీపీపీ పద్ధతిలో నిర్వహించడం ప్రజల ఆరోగ్యానికి విఘాతం కలిగించే చర్య అని ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రమణయ్య, కార్యదర్శి కామేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం వారు ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాశారు. వైద్య కళాశాలలను 66 ఏళ్లపాటు ప్రైవేట్‌కు లీజుకు ఇచ్చే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతుండటం కలవర పెడుతోందన్నారు. మాజీ ఐఏఎస్ అధికారులు, వైద్యులు, సామాజిక కార్యకర్తలు, ఇతరుల నుంచి చేపట్టిన అభిప్రాయ సేకరణలో 99 శాతం మంది విద్య, వైద్యం ప్రభుత్వమే నిర్వహించాలని కోరినట్టు వివరించారు. అప్పుడే ప్రజలకు జవాబుదారీగా ఉంటుందన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వమే నిలిచిపోయిన వైద్య కళాశాలలు, బోధనాస్పత్రుల నిర్మాణాలు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రజారోగ్య పరిరక్షణలో ప్రభుత్వానిదే ప్రధాన వాటాగా ఉండాలని సూచించారు. ప్రైవేట్ వైద్య రంగానికి జవాబుదారీతనం, సామాజిక బాధ్యత ఉండవని అభిప్రాయపడ్డారు. కేవలం లాభాలే యాజమాన్యాల ఎజెండా అన్నారు.

రాష్ట్రంలో హెచ్‌టీ పత్తిసాగు లేదు

- ఆ విత్తనాల సరఫరా కూడా లేదు
- కర్నూలు జిల్లాలో మాత్రమే హెచ్‌టీ జన్యువు గుర్తింపు
- వ్యవసాయశాఖ డైరెక్టర్ సేనాపతి ఢిల్లీరావు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో హెచ్‌టీ(హెర్బిసైడ్ టోలరెన్స్) పత్తి సాగు ఎక్కడా జరగడం లేదని వ్యవసాయ శాఖ డైరెక్టర్ సేనాపతి ఢిల్లీరావు స్పష్టం చేశారు. నిషేధిత బీటీ–3, హెచ్‌టీ పత్తి విత్తనాల అమ్మకాలపై ‹గుంటూరు నుంచి గుండె పూడి› అనే శీర్షికన సాక్షిలో వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. గుంటూరు జిల్లా రవాణా కార్యకలాపాలకు కేంద్ర బిందువుగా ఉండడం వల్ల వేరే ప్రాంతాలలో పండించిన పత్తి విత్తనాలు గుంటూరు నుంచి తరలిస్తున్న మాట వాస్తవమేనని పేర్కొన్నారు. అయితే ఇప్పటి వరకు తరలించిన విత్తనాల్లో హెచ్‌టీ విత్తనాలు ఉన్నట్టుగా ధ్రువీకరణ కాలేదన్నారు. పత్తి సాగవుతున్న జిల్లాల్లో వెయ్యి విత్తన పరీక్షలు నిర్వహించామని, ఒక్క కర్నూలు జిల్లాలోనే హెచ్‌టీ జన్యువు ఉన్నట్టు నిర్ధారణైందని, ఆ విత్తనాల అమ్మకాలు నిలిపివేశామని పేర్కొన్నారు. గుంటూరు జిల్లాలో ప్రత్యేకంగా 70 హెచ్‌టీ పరీక్షలు చేశామని, అన్నీ నెగెటివ్‌గానే వచ్చాయని వివరించారు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 180 పత్తి విత్తన నమూనాలను సేకరించి నాణ్యతా ప్రమాణాలు పరీక్షించామని ఢిల్లీరావు పేర్కొన్నారు. ఎవరైనా అనధికార(హెచ్‌టీ) పత్తి విత్తనాల అమ్మకాలు, సాగు చేపట్టినట్టు సమాచారం ఉన్నట్టయితే సంబంధిత మండల వ్యవసాయాధికారికి ఫిర్యాదు చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో టోల్ ఫ్రీ నెం.155251కు ఫోన్ చేసి కూడా సమాచారం ఇవ్వొచ్చునని వివరించారు.

కమల్‌హాసన్ క్షమాపణ చెప్పాలి

- కర్ణాటక మంత్రి డిమాండ్
- లేదంటే కమల్ సినిమాలు నిషేధిస్తామని హెచ్చరిక

శివాజీనగర: ప్రముఖ నటుడు కమల్‌హాసన్ తక్షణమే కన్నడిగులకు క్షమాపణలు చెప్పాలని కర్ణాటక సంస్కృతి శాఖ మంత్రి శివరాజ్ తంగడగి డిమాండ్ చేశారు. లేకపోతే కమల్‌హాసన్ సినిమాలను కర్ణాటకలో నిషేధిస్తామని హెచ్చరించారు. ఆయన గురువారం బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ తమిళం నుంచే కన్నడ భాష పుట్టింది అని కమల్‌హాసన్ చెప్పడం తగదన్నారు. కన్నడ భూమి, జలం, భాష విషయంలో కించపరిస్తే ఎంత పెద్ద వ్యక్తి అయినా కూడా సహించేది లేదని చెప్పారు. కమల్‌హాసన్ క్షమాపణ చెప్పకపోతే ఆయన నటించిన సినిమాలను రాష్ట్రంలో నిషేధించాలని కన్నడ చలనచిత్ర వాణిజ్య మండలికి మంత్రి లేఖ కూడా రాశారు. మరోవైపు ఇదే డిమాండ్‌తో కన్నడ సంఘాలు కూడా పలు ప్రాంతాల్లో నిరసనలు తెలిపాయి.

ఏపీలో 8 ఐఏఎస్ ఖాళీ పోస్టులు

సాక్షి, న్యూఢిల్లీ : దేశంలో ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఏఎస్) లో సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ (సీఎస్‌ఈ)–2024 ద్వారా భర్తీ చేయవలసిన ఖాళీల వివరాలను డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డీఓపీటీ) విడుదల చేసింది. మొత్తం ఐఏఎస్ ఖాళీలు 180 ఉండగా.. అందులో అన్ రిజర్వ్‌డ్ సహా ఆర్థికంగా బలహీనవర్గాల (ఈడబ్ల్యూఎస్) కేటగిరీలో 91, ఇతర వెనుకబడిన వర్గాల (ఓబీసీ) కేటగిరీలో 52, షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) కేటగిరీలో 24, షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) కేటగిరీలో 13 ఉన్నాయి. కాగా.. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 8 ఖాళీలు ఉండగా, అందులో ఇన్‌సైడర్లు ఇద్దరు, ఔట్‌సైడర్లు ఆరుగురు ఉన్నారు. అన్‌రిజర్వ్‌డ్ కేటగిరీలో 5, ఓబీసీ కేటగిరీలో 2, ఎస్సీ కేటగిరీలో 1 ఖాళీ ఉన్నాయి. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ సహా దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, ముస్సోరిలోని లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్, యూపీఎస్సీ కార్యదర్శులకు డీఓపీటీ డిప్యూటీ సెక్రటరీ చారులత సోమల్ లేఖలు పంపించారు.

ఏపీ ఎడ్‌సెట్‌కు 17,791 దరఖాస్తులు

- జూన్ 5న ఏపీ ఎడ్‌సెట్
- ఎడ్‌సెట్ కన్వీనర్ ఆచార్య ఏవీవీఎస్ స్వామి

ఏఎన్‌యూ: బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బీఈడీ) కోర్సుల్లో ప్రవేశాల కోసం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆధ్వర్యంలో జరిగే ఏపీ ఎడ్‌సెట్–2025కు 17,791 దరఖాస్తులు వచ్చాయని ఎడ్‌సెట్ కన్వీనర్ ఆచార్య ఏవీవీఎస్ స్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది మ్యాథ్స్ మెథడాలజీకి 5,191 దరఖాస్తులు, ఫిజికల్ సైన్స్‌కు 2,045, బయాలజీకి 4,323, సోషల్ స్టడీస్‌కు 5,418, ఇంగ్లిష్‌కు 814 దరఖాస్తులు వచ్చాయని వివరించారు. రూ.10వేల అపరాధ రుసుముతో జూన్ 3వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. జూన్ 5వ తేదీన పరీక్ష నిర్వహిస్తామని, రాష్ట్రవ్యాప్తంగా 87 ఆన్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అభ్యర్థులు శుక్రవారం నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు.

అమెరికా వెళ్లే విద్యార్థుల అవస్థలు తొలగించండి

సీఎంకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు లేఖ

సాక్షి, అమరావతి: అమెరికా వెళ్లే విద్యార్థుల వీసాలు తాత్కాలికంగా నిలిపివేయడం, సోషల్ మీడియా అకౌంట్‌ల తనిఖీ వంటి అవస్థలను పట్టించుకోవాలని, ఈ విషయమై కేంద్రంపై ఒత్తిడి చేసి నిబంధనలు తొలగించేందుకు కృషి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు రాసిన లేఖను గురువారం ఆయన మీడియాకు విడుదల చేశారు. ప్రతిఏటా భారత్ నుంచి 3 లక్షల మంది విద్యార్థులు అమెరికాకు చదువుకోవడానికి వెళ్తున్నారని, వారిలో ఏపీ నుంచి వెళ్లేవారు గణనీయంగానే ఉన్నారన్నారు. ఇప్పుడు ట్రంప్ నిర్ణయంతో అనేక మంది విద్యార్థులకు వీసాలు రాకుండా నిలిపివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో జోక్యం చేసుకుని అమెరికా పెట్టిన నిబంధనలు ఉపసంహరించుకునేట్లు కేంద్రం ద్వారా ఒత్తిడి చేయాలని సీఎం చంద్రబాబును కోరారు.

రేషన్ వాహనాల రద్దును ఉపసంహరించుకోవాలి

సాక్షి, అమరావతి: ప్రజల ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేస్తున్న రేషన్ వాహనాల డ్రైవర్ల వ్యవస్థ రద్దును ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. నాలుగేళ్లుగా పేదలు రేషన్ దుకాణాల వద్ద పడిగాపులు పడాల్సిన పని లేకుండా ఎండీయూలు సేవలందించాయని పేర్కొన్నారు. ఈ విధానం సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ఉపాధిగా నిలిచిందన్నారు.

ఏపీ సచివాలయ స్టాఫ్ కో-ఆపరేటివ్ సొసైటీ కార్యవర్గం

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ సచివాలయ స్టాఫ్ కో–ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షునిగా రెండ్ల రాజేశం ఎన్నికయ్యారు. ఏపీ సెక్రటేరియట్ కో–ఆపరేటివ్ సొసైటీకి గురువారం జరిగిన ఎన్నికల్లో కొత్త కార్యవర్గం ఎంపికైంది. ఎన్నికల్లో మొత్తం 28 మంది పోటీ చేయగా.. 11 మంది ఎన్నికయ్యారు. వీరిలో అధ్యక్షునిగా రాజేశం, ప్రధాన కార్యదర్శిగా టి.స్వరణ్ రాజ్, ఉపాధ్యక్షునిగా టి.జయహరి గౌడ్, కోశాధికారిగా ప్రశాంత్ కుమార్, మేనేజింగ్ కమిటీ సభ్యులుగా కె.స్వామి, ఆర్.శ్రీలక్ష్మి, ఆర్.అనురాధ, ఎం.రవీంద్రకుమార్, ఎస్.అరవింద్ గౌడ్, టి.రాజీవ్ చంద్, దుర్గేందర్ ఎన్నికయ్యారు. వీరంతా పదేళ్ల పాటు పదవిలో ఉంటారు.

జిల్లాకు ఒక సోలార్ గ్రామం

సాక్షి, అమరావతి: డిస్కంలు, నెడ్‌క్యాప్ కలిపి ఈ ఏడాది జూన్ చివరి నాటికి 3 లక్షల సోలార్ రూఫ్ టాప్ కనెక్షన్ల ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ నిర్దేశించారు. సీఎండీలు పృథ్వీ తేజ్ ఇమ్మడి, పి.పుల్లా రెడ్డి, కె.సంతోష రావు, నెడ్‌క్యాప్ ఎండీ కమలాకర్ బాబుతో పాటు రాష్ట్రంలోని సీఈలు, ఎస్ఈలతో గురువారం సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఒక గ్రామాన్ని సోలార్ రూఫ్ టాప్ మోడల్ గ్రామంగా రూపుదిద్దాలన్నారు.

మహిళల సంరక్షణకు అంతర్గత ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు చేయాలి

సాక్షి, అమరావతి: పని ప్రదేశంలో మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులు, తదితర సమస్యల పట్ల తక్షణం స్పందించి చర్యలు చేపట్టేందుకు 'అంతర్గత ఫిర్యాదుల కమిటీ'లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి సూర్యకుమారి ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజకు సూచించారు. ఇటీవల పదవీ బాధ్యతలు చేపట్టిన శైలజ ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో సూర్యకుమారిని గురువారం కలిశారు.

నేటినుంచి లా, పీజీ సెట్ హాల్‌టికెట్లు

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పీజీ సెట్ పద్మావతి మహిళా వర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న లాసెట్ హాల్‌టికెట్లు శుక్రవారం నుంచి అందుబాటులో ఉంటాయని కన్వీనర్ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు తెలిపారు. పీజీ సెట్ జూన్ 9 నుంచి ప్రారంభం కానుండగా, లాసెట్ జూన్ 5న జరగనుందని చెప్పారు.

పవిత్రత శివార్పణం!

అష్టాదశ శక్తిపీఠంలో అసాంఘిక కార్యకలాపాలు



ఇటీవల శ్రీశైలం ఆలయానికి సమీపంలోని ఓ కాలనీలో దొరికిన మద్యం బాటిళ్లు




ఆర్టీసీ బస్సుల్లో మద్యం తీసుకొస్తుండగా స్వాధీనం చేసుకున్న పోలీసులు

శ్రీశైలం టెంపుల్: ద్వాదశ జ్యోతిర్లింగం, అష్టాదశ శక్తిపీఠం కలగలసిన మహాపుణ్యక్షేత్రం ‹శ్రీశైలం›. పరమ పవిత్రమైన ఈ క్షేత్ర పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. ఇక్కడ తరచూ మద్యం బాటిళ్లు పట్టుబడుతుండటం, సిగరెట్లు, ఖైనీ, గుట్కా తదితర నిషేధిత వస్తువులు యథేచ్ఛగా విక్రయిస్తుండటం చూస్తే కూటమి ప్రభుత్వంలో ఆలయం ఏ స్థాయిలో నిర్లక్ష్యానికి లోనవుతుందో అర్థమవుతోంది. శ్రీశైలం శివారు ప్రాంతాలను కేంద్రంగా చేసుకుని పేకాటరాయుళ్లు రెచ్చిపోతున్నారు. కొన్ని నెలల క్రితం ఆలయంలోని కొందరు తాత్కాలిక ఉద్యోగులతో పాటు పలువురు స్థానికులు పేకాట ఆడుతుండగా పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఉగాది ఉత్సవాల్లో సైతం క్షేత్ర పరిధిలో పేకాట ఆడుతుండగా పలువురు పట్టుబడ్డారు. నిత్యం ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడాల్సిన శ్రీశైల క్షేత్రంలో ఇలాంటి పరిణామాలు జరగడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సుల్లోనే అక్రమ రవాణా

శ్రీశైల క్షేత్రంలో టోల్‌గేట్ వద్ద ఆలయ ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది, హోంగార్డులు నిత్యం వాహనాలను తనిఖీ చేస్తుంటారు. తమ సొంత వాహనాలు, ప్రైవేట్ వాహనాల్లో మద్యం, నిషేధిత పదార్థాలను తరలిస్తే దొరికిపోతామని మద్యం వ్యాపారులు అక్రమ రవాణాకు ఆర్టీసీ బస్సులనే ఎంచుకుంటున్నారు. ప్రయాణికుల తరహాలో బస్సుల్లో ప్రయాణిస్తూ యథేచ్ఛగా మద్యం, తదితర నిషేధిత వస్తువులను తరలిస్తున్నారు. ఇలా ఏడాది కాలంలో 60కి పైగా మద్యం అక్రమ రవాణా కేసులు నమోదైనట్లు సమాచారం. గడచిన నెల రోజుల్లోనే 10 కేసులు నమోదయ్యాయి. కొందరు పోలీసులు మామూళ్లు తీసుకుంటూ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మద్యం, నాటుసారా తరలిస్తూ పట్టుబడిన వారిలో మహిళలే ఎక్కువగా ఉంటున్నారు.

ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం



జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శ్రీశైలంలో నిరంతరం విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నాం. క్షేత్రంలోకి మద్యం, నిషేధిత పదార్థాలు సరఫరా చేయకూడదు. విక్రయాలు జరపకూడదు. ఈ విషయంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. అనుమానాస్పద వ్యక్తులు, గృహాలను సైతం కార్డెన్‌సెర్చ్ నిర్వహిస్తాం.

– జి.ప్రసాదరావు, శ్రీశైలం సర్కిల్ ఇన్‌స్పెక్టర్

తెలుగు చిత్ర పరిశ్రమలో యాస మారుతోంది. గతంలో హీరోలు, హీరోయిన్లు, ఇతర క్యారెక్టర్ ఆర్టిస్ట్స్ కూడా అన్ని ప్రాంతాల వారికి అర్థమయ్యేలా సాధారణ యాసలో డైలాగులు చెప్పేవారు. కానీ, ఇప్పుడు అలా కాదు. చిత్రకథ ఏ ప్రాంతీయ నేపథ్యంలో సాగుతుందో అక్కడి యాసని పలికేందుకు నటీనటులు సై అంటున్నారు. రాయలసీమ, కోస్తా, తెలంగాణ, ఆంధ్ర... ఇలా ప్రాంతం ఏదైనా అక్కడి నేటివిటీకి తగ్గట్టు యాస నేర్చుకుని, తమదైన శైలిలో డైలాగులు చెబుతూ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతులు పంచుతున్నారు. ఇలాంటి చిత్రాలని ప్రేక్షకులు కూడా ఆదరిస్తుండటంతో మేకర్స్ కూడా ఖుషీ అవుతున్నారు. ప్రస్తుతం తెలుగులో మన హీరోలు పలుకుతున్న యాస విశేషాలేంటో చూద్దాం...


చిరంజీవి
రామ్ చరణ్
విజయ్ దేవరకొండ
వరుణ్ తేజ్

యాసకు సై


జాన్వీ కపూర్
టైగర్ ష్రాఫ్

రాయలసీమ నేపథ్యంలో...

చిరంజీవి హీరోగా 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వం వహించిన చిత్రం 'విశ్వంభర'. ఈ సినిమాలో త్రిష, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటించారు. విక్రమ్ రెడ్డి సమర్పణలో యూవీ క్రియేషన్స్‌పై వంశీకృష్ణా రెడ్డి, ప్రమోద్ ఉప్పలపాటి నిర్మించిన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటుండగానే 'మెగా 157' (వర్కింగ్ టైటిల్) సినిమాకి శ్రీకారం చుట్టారు చిరంజీవి. అనిల్ రావిపూడి దర్శకత్వం వహించనున్న ఈ సినిమాలో హీరోయిన్‌గా నయనతారను ఖరారు చేశారు మేకర్స్. అర్చన సమర్పణలో షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్మెంట్స్‌పై సుష్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఔట్ అండ్ ఔట్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనుందని, చాలా కాలం తర్వాత చిరంజీవి కంప్లీట్ హ్యూమరస్ రోల్‌లో కనిపించనున్నారనీ యూనిట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే ఇందులో రాయలసీమ నేపథ్యం ఉంటుందని సమాచారం. చిరంజీవి ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్స్‌లో రాయలసీమ బ్యాక్‌డ్రాప్ ఉంటుందని తెలుస్తోంది. సో... చిరంజీవి రాయలసీమ యాసలో అటు అభిమానులను, ఇటు ప్రేక్షకులను తనదైన శైలిలో అలరిస్తారని ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. 'సైరా నరసింహారెడ్డి, గాడ్ ఫాదర్' వంటి చిత్రాల తర్వాత చిరంజీవి- నయనతార కలిసి మూడవసారి నటిస్తున్న చిత్రం 'మెగా 157'. 2026 సంక్రాంతి కానుకగా 'మెగా 157' విడుదల కానుంది.

***

పుడతాం ఏటి మళ్లీ...

రామ్‌చరణ్ హీరోగా తెరకెక్కుతోన్న పాన్ ఇండియన్ చిత్రం 'పెద్ది'. 'ఉప్పెన'తో (2021) బ్లాక్ బస్టర్ అందుకున్న బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో జాన్వీ కపూర్ కథానాయిక. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్‌పై వెంకట సతీష్ కిలారు ఈ సినిమా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం నుంచి ఇటీవల విడుదలైన గ్లింప్స్‌లో.. 'ఒటే పని చేసేనాకి, ఒకేనాక బతికే నాకి ఇంత పెద్ద బతుకెందుకు?', 'ఏదైనా ఈ నేల మీదున్నప్పుడే సేసేయాల, పుడతాం ఏటి మళ్లీ' అంటూ కోస్తాంధ్ర యాసలో రామ్‌చరణ్ చెప్పిన డైలాగులకు అద్భుతమైన స్పందన వచ్చింది. మల్టీ స్పోర్ట్స్ నేపథ్యంలో రూపొందుతోన్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ఆర్ట్ డైరెక్టర్ అవినాష్ కొల్లా నేతృత్వంలో హైదరాబాద్ శివార్లలో వేసిన ఓ భారీ విలేజ్ సెట్‌లో రామ్‌చరణ్‌తో పాటు ఇతర తారాగణంపై భారీ యాక్షన్ సీక్వెన్స్‌తో పాటు కొంత టాకీ పార్ట్ చిత్రీకరిస్తున్నారట. ఇప్పటికే 30 శాతం షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా చిత్రీకరణ తాజా షెడ్యూల్‌తో సుమారు 50 శాతం పూర్తవుతుందని టాక్. ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండటం విశేషం. 2026 మార్చి 27న 'పెద్ది' సినిమాని ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్.

***

బ్రిటీష్ పాలన నేపథ్యంలో...

విజయ్ దేవరకొండ హీరోగా తెరకెక్కనున్న తాజా చిత్రం 'వీడీ 14' (వర్కింగ్ టైటిల్). రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వం వహించనున్నారు. 'టాక్సీవాలా' (2018) వంటి హిట్ తర్వాత వీళ్లిద్దరి కాంబినేషన్‌లో వస్తున్న రెండో చిత్రమిది. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. బ్రిటీష్ పాలన కాలం నేపథ్యంలో పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ఈ చిత్రం తెరకెక్కనుంది. 19వ శతాబ్దం నేపథ్యంలో 1854 నుంచి 1878 మధ్య కాలంలో జరిగిన వాస్తవ చారిత్రక ఘటనల ఆధారంగా భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా ఈ సినిమా రూపొందనుంది. ఈ సినిమాతో తొలిసారి రాయలసీమ నేపథ్యం ఉన్న కథలో నటిస్తున్నారు విజయ్ దేవరకొండ. తెలంగాణకి చెందిన విజయ్ 'వీడీ 14'లో తన పాత్ర కోసం మొదటిసారి రాయలసీమ యాసలో మాట్లాడనున్నారట. ఆ యాసని పర్ఫెక్ట్‌గా పలికేందుకు ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకున్నట్లు సమాచారం. రాయలసీమ నేపథ్యంలో రూపొందనున్న ఈ సినిమాలో దేశభక్తి అంశాలకు కూడా ప్రాధాన్యం ఉంటుందని సమాచారం. ఈ సినిమాలో ఓ యోధుడిగా కనిపించనున్నారట విజయ్ దేవరకొండ. ఇదిలా ఉంటే... విజయ్ దేవరకొండ హీరోగా 'రాజా వారు రాణిగారు' మూవీ ఫేమ్ రవికిరణ్ కోలా దర్శకత్వంలో ఓ సినిమా రానున్న సంగతి తెలిసిందే. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై 'దిల్' రాజు, శిరీష్ నిర్మించనున్న ఈ సినిమా కథ కూడా రాయలసీమ నేపథ్యంలో పొలిటికల్ యాక్షన్ డ్రామాగా ఉంటుందని ఫిల్మ్ నగర్ టాక్. ఈ చిత్రానికి 'రౌడీ జనార్ధన' అనే టైటిల్ ఖరారు చేశారని తెలిసింది. ఇదిలా ఉంటే... విజయ్ దేవరకొండ హీరోగా నటించిన తాజా చిత్రం 'కింగ్‌డమ్'. 'జెర్సీ' మూవీ ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్మెంట్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా జూలై 4న విడుదల కానుంది.


అఖిల్
సాయి దుర్గా తేజ్

***

కదిరి నరసింహ సామి సాచ్చిగా...

వరుణ్ తేజ్ హీరోగా రూపొందుతోన్న తాజా చిత్రం 'వీటీ 15' (వర్కింగ్ టైటిల్). 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్' మూవీ ఫేమ్ మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో రితికా నాయక్ హీరోయిన్. యువీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్మెంట్ సంస్థలు నిర్మిస్తున్నాయి. ఇండో-కొరియన్ హారర్ కామెడీగా రూపొందుతోన్న ఈ చిత్రం అనంతపురం నేపథ్యంలో కొనసాగుతుంది. 'కదిరి నరసింహ సామి సాచ్చిగా ఈ తూరి నవ్వించేకి వస్తుండా' అంటూ ఇటీవల వరుణ్ తేజ్ పెట్టిన పోస్ట్‌తో ఈ విషయం స్పష్టమైంది. అందులో భాగంగానే ఈ సినిమా తాజా షెడ్యూల్ అనంతపురంలో జరిపారు మేకర్స్. అనంతపురంలోని ప్రముఖ కార్ల కంపెనీ కియా గ్రౌండ్స్‌తో పాటు అక్కడి అందమైన గ్రామీణ ప్రాంతాల్లో చిత్రీకరణ జరిపారు. ఇటీవలే ఈ షెడ్యూల్ ముగిసినట్లు మేకర్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే. తొలి షెడ్యూల్ హైదరాబాద్‌లో, ద్వితీయ షెడ్యూల్ అనంతపురంలో విజయవంతంగా పూర్తి చేసింది యూనిట్. మూడో షెడ్యూల్ కొరియాలో ప్రారంభం కానుంది. థ్రిల్లింగ్ సన్నివేశాలతో పాటు తనదైన పంచ్ హ్యూమర్‌తో ఈ సినిమాని తీర్చిదిద్దుతున్నారు మేర్లపాక గాంధీ. 'వీటీ 15' కోసం అనంతపురం యాసలో మాట్లాడనున్నారు వరుణ్ తేజ్. ఈ సినిమాకి 'కొరియన్ కనకరాజు' అనే టైటిల్ అనుకుంటున్నారట.

***


ఆ పేరు ఎట్టా నిలబడాలంటే...

అక్కినేని అఖిల్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'లెనిన్'. 'ప్రేమ కన్నా ఏ యుద్ధం హింసాత్మకమైనది' కాదు అనేది ఉపశీర్షిక. 'వినరో భాగ్యము విష్ణుకథ' మూవీ ఫేమ్ మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్‌టైన్మెంట్స్ పతాకాలపై నాగార్జున, నాగవంశీ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా కథాంశం రాయలసీమలోని చిత్తూరు నేపథ్యంలో సాగనుంది. ఏప్రిల్ 8న అఖిల్ బర్త్ డే సందర్భంగా ఈ మూవీ గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ''గతాన్ని తరమడానికి పోతా... మా నాయన నాకో మాట సెప్పినాడు.. పుట్టేటప్పుడు ఊపిరి ఉంటాది రా.. పేరు ఉండదు, అట్నే పోయేటప్పుడు ఊపిరుండదు.. పేరు మాత్రమే ఉంటాది. ఆ పేరు ఎట్టా నిలబడాలంటే...'' అంటూ రాయలసీమ యాసలో అక్కినేని అఖిల్ చెప్పిన ఇంటెన్స్ డైలాగ్స్‌కి అద్భుతమైన స్పందన వచ్చింది. ఈ సినిమాలో మాస్ లుక్‌లో కనిపించనున్నారు అఖిల్. ఇందుకోసం పొడవాటి జుట్టు, గెడ్డంతో ఆయన మేకోవర్ అయ్యారు. హైదరాబాద్ షెడ్యూల్ పూర్తయిన తర్వాత కొత్త షెడ్యూల్ చిత్తూరు జిల్లాలో కొనసాగనున్నట్లు తెలిసింది.

***

ఏటిగట్టు సాచ్చిగా సెప్తుండా...

'విరూపాక్ష, బ్రో' వంటి బ్యాక్ టు బ్యాక్ హిట్స్ తర్వాత సాయి దుర్గా తేజ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'ఎస్‌వైజీ' (సంబరాల ఏటిగట్టు). నూతన దర్శకుడు రోహిత్ కేపీ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో ఐశ్వర్యా లక్ష్మి హీరోయిన్‌గా నటిస్తున్నారు. 'హనుమాన్' వంటి బ్లాక్‌బస్టర్ పాన్ ఇండియన్ మూవీ తర్వాత ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై కె.నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ సినిమా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం భారత దేశానికి స్వాతంత్ర్యం రాక మునుపు జరిగే కథతో రాయలసీమ నేపథ్యంలో రూపొందుతోందని సమాచారం. 'ఏటిగట్టు సాచ్చిగా సెప్తుండా.. ఈ తూరి నరికినానంటే అరుపు గొంతులో నుంచి కాదు... తెగిన నరాల్లోనుంచొచ్చాది' అంటూ రాయలసీమ యాసలో సాయి దుర్గాతేజ్ చెప్పిన డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. పైగా ఫస్ట్ లుక్స్, టీజర్ చూసిన వారికి తన కెరీర్‌లోనే పూర్తి స్థాయి మాస్ లుక్‌లో, బలమైన పాత్రలో ఆయన కనిపించనున్నారని తెలుస్తుంది. భారీ బడ్జెట్‌తో రూపొందుతోన్న ఈ సినిమా కోసం పూర్తి మేకోవర్ అయ్యారు తేజ్. ఈ చిత్రం షూటింగ్ ఏకధాటిగా 120 రోజుల పాటు కొనసాగింది. ఈ లెంగ్తీ షెడ్యూల్‌లో పలు కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ షెడ్యూల్‌తో కలుపుకుని 75 శాతం చిత్రీకరణ పూర్తయినట్లు తెలిసింది. ఈ సినిమా సెప్టెంబర్ 25న తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది.


అడివి శేష్

మదనపల్లె యాసలో...

'మేజర్, హిట్: ది సెకండ్ కేస్' వంటి హిట్ సినిమాల తర్వాత అడివి శేష్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'డెకాయిట్'. ఈ సినిమాలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. షానియల్ డియో దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో ప్రముఖ దర్శకుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ తెలుగు, హిందీ భాషల్లో నిర్మిస్తున్నారు. సునీల్ నారంగ్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. హైలీ యాంటిసిపేటెడ్ పాన్ ఇండియన్ థ్రిల్లర్ మూవీగా 'డెకాయిట్' రూపొందుతోంది. ఇటీవల విడుదల చేసిన ఈ సినిమా గ్లింప్స్ చూస్తే.. ఇంటెన్స్ యాక్షన్, స్టైలిష్ విజువల్స్‌తో అద్భుతంగా అనిపించింది. ఈ గ్లింప్స్‌కి మంచి స్పందన వచ్చింది. రాయలసీమలోని అన్నమయ్య జిల్లా మదనపల్లె యాసలో అడివి శేష్ పలికిన డైలాగ్స్, ఆయన వాయిస్ మాడ్యులేషన్, ఎక్స్‌ప్రెషన్స్‌కి మంచి స్పందన వచ్చింది. ఈ చిత్రం తెలుగులో పాటు బాలీవుడ్‌లోనూ తెరకెక్కుతోంది. హిందీ వెర్షన్‌కు కూడా అడివి శేష్ సొంతంగా డబ్బింగ్ చెబుతుండటం విశేషం. 'డెకాయిట్' సినిమా క్రిస్మస్ కానుకగా తెలుగు, హిందీ భాషల్లో డిసెంబర్ 25న విడుదల కానుంది.

- దేరంగుల జగన్ మోహన్

ప్రేమ పగ!

పగ తీర్చుకోవడానికి సిద్ధం అవుతున్నారు బాలీవుడ్ హీరో టైగర్ ష్రాఫ్. రాజ్ మెహతా దర్శకత్వంలో టైగర్ ష్రాఫ్, జాన్వీ కపూర్ హీరో హీరోయిన్లుగా 'లగ్ జ గలే' అనే సినిమా తెరకెక్కనుందని సమాచారం. ఈ సినిమాను కరణ్ జోహార్ నిర్మించనున్నారట. ప్రేమ, పగ, ప్రతీకారం అంశాల మేళవింపుతో ఈ చిత్రం ఉంటుందని సమాచారం. ఈ సినిమా చిత్రీకరణను ఈ ఏడాది అక్టోబరులో ప్రారంభించాలని రాజ్ మెహతా సన్నాహాలు చేస్తున్నారని, త్వరలోనే ఈ సినిమా గురించిన అధికారిక ప్రకటన రానుందని బాలీవుడ్ సమాచారం.


కూనిరెడ్డి శ్రీనివాస్, లక్ష్మణ్ పూడి, అలీ

దేశ భక్తి పాట లాంచ్ చేయడం ఆనందం

- నటుడు అలీ

కశ్మీర్‌లోని పహల్గాం బైసరన్ లోయలో ఇటీవల జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగా 'ఆపరేషన్ సింధూర్' పేరుతో ఇండియన్ ఆర్మీ.. పాకిస్తాన్‌లోని ఉగ్ర స్థావరాలపై దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఈ స్ఫూర్తితో ప్రముఖ ఆరోగ్య డైట్ లక్ష్మణ్ పూడి 'ఆపరేషన్ సింధూర్...' పేరుతో ఓ పాట రూపంలో తన దేశభక్తిని చూపారు. ఈ పాటలో ఆయన నటించడంతో పాటు పాడారు. అలాగే దర్శకత్వం వహించారు. ప్రసాద్ రచించిన ఈ పాటకు రమేశ్ సంగీతం అందించగా, కృష్ణ సినిమాటోగ్రాఫర్‌గా చేశారు. ఉమా శంకర్ కొరియోగ్రఫీ చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన 'ఆపరేషన్ సింధూర్...' పాట విడుదల వేడుకకి మాజీ ఐపీఎస్ అధికారి వీవీ లక్ష్మీనారాయణ, నటుడు అలీ, మేజర్ ఒబెరాయ్, జేఏసీ చైర్మన్ అంజిబాబు, నిర్మాత కూనిరెడ్డి శ్రీనివాస్ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ- ''దేశంలోని జవానుల పట్ల లక్ష్మణ్‌కి ఉన్న గౌరవాన్ని ఒక పాట రూపంలో మనకు చూపించినందుకు అభినందిస్తున్నాను'' అని తెలిపారు. జేఏసీ చైర్మన్ అంజిబాబు మాట్లాడుతూ- ''దేశంపై తనకున్న భక్తిని తెలిపేలా పాటని తీసుకువచ్చిన లక్ష్మణ్‌గారికి ధన్యవాదాలు'' అన్నారు. అలీ మాట్లాడుతూ- ''లక్ష్మణ్ గారిలో ఒక మంచి గాయకుడు, నటుడు ఉన్నాడు. దేశంపై భక్తితో ఆయన చేసిన పాటను లాంచ్ చేయడం కోసం వచ్చాను. ఈరోజు స్టేజిపై ఉన్న రియల్ హీరోలను కలవడం మరింత సంతోషాన్ని కలగజేసింది'' అని పేర్కొన్నారు. మేజర్ ఒబెరాయ్ మాట్లాడుతూ- ''ఆపరేషన్ సింధూర్' గురించి నేను మాట్లాడినప్పుడు ప్రజలు బాగా యాక్సెప్ట్ చేశారు. వారి అభిమానానికి నా కృతజ్ఞతలు. ప్రపంచంలోనే మన ఆర్మీ ఎంతో బలమైనది'' అని చెప్పారు. ఆరోగ్య డైట్ లక్ష్మణ్ పూడి మాట్లాడుతూ- ''నాలో ఒక విప్లవ కళాకారుడు, ఒక గాయకుడు, ఒక రచయిత ఉన్నాడు. ఈ పాటను జవాన్ మురళీ నాయక్ కుటుంబానికి అంకితం ఇస్తున్నాను'' అని తెలిపారు.

లాభాలకు తగ్గట్లు జీతాలు పెంచండి

- మరింతగా ఇన్వెస్ట్ చేయండి
- అప్పుడే సుస్థిర వృద్ధి సాధ్యం
- కంపెనీలకు సీఈఏ అనంత నాగేశ్వరన్ సూచన



న్యూఢిల్లీ: లాభదాయకతకు అనుగుణంగా పెట్టుబడులు, ఉద్యోగుల వేతనాలను పెంచడంపై దృష్టి పెట్టాలని కార్పొరేట్లకు కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు వి. అనంత నాగేశ్వరన్ సూచించారు. అప్పుడే భారత్ 6.5 శాతం పైగా ఆర్థిక వృద్ధిని నిలకడగా సాధించగలదని, 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదగగలదని ఆయన చెప్పారు. పెట్టుబడుల సానుకూల వలయాన్ని వివరిస్తూ, ఇన్వెస్ట్‌మెంట్లతో సామర్థ్యాలు పెరగడంతో పాటు మరింత అధిక వేతనాలతో మరిన్ని ఉద్యోగాల కల్పన జరుగుతుందని, ఇది కుటుంబాలు ఇంకాస్త ఎక్కువ పొదుపు చేసేందుకు దోహదపడుతుందని నాగేశ్వరన్ చెప్పారు. కానీ ప్రస్తుతం వాస్తవ పరిస్థితి దానికి భిన్నంగా ఉంటోందని, వచ్చే 25 లేదా 30 ఏళ్ల పాటు ఇదే తీరు కొనసాగితే నిర్దేశించుకున్న లక్ష్య సాధన దిశగా పురోగమించలేమని ఆయన పేర్కొన్నారు. సాధారణంగా ఇలాంటి సమస్య సంపన్న దేశాల్లోనే కనిపిస్తుందే తప్ప భారత్‌లాంటి వర్ధమాన దేశాల్లో ఉండదని పరిశ్రమల సమాఖ్య సీఐఐ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా నాగేశ్వరన్ చెప్పారు. 21వ శతాబ్దపు రెండో దశాబ్దంలో భారతీయ ప్రైవేట్ రంగ లాభదాయకత రూ. 7.2 లక్షల కోట్ల నుంచి రూ. 28.7 లక్షల కోట్లకు నాలుగు రెట్లు పెరిగినప్పటికీ, పెట్టుబడులు మాత్రం మూడు రెట్లే పెరిగాయని ఆయన చెప్పారు.

ఇన్‌ఫ్రాలో కూడా ఇన్వెస్ట్ చేయాలి..

రాబోయే 25 ఏళ్లలో మౌలిక సదుపాయాలతో పాటు సామర్థ్యాల పెంపుపై భారత్ గణనీయంగా ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుందని, ప్రైవేట్ రంగం ఇటు పెట్టుబడులు అటు ఉద్యోగుల వేతనాల మధ్య సమతూకం ఉండేలా చూసుకోవాలని నాగేశ్వరన్ పేర్కొన్నారు. కుటుంబాల ఆదాయాలు, పొదుపు పెరిగితేనే నిలకడగా వృద్ధి సాధ్యపడుతుందని వివరించారు. పెట్టుబడులతో మరిన్ని ప్రయోజనాలను రాబట్టాలంటే పరిశ్రమలపై రెగ్యులేటరీ భారం తగ్గాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం ప్రభుత్వం, ప్రైవేట్ రంగం మధ్య విశ్వసనీయత పెరగాలని నాగేశ్వరన్ చెప్పారు. కొన్ని సార్లు నియంత్రణ సంస్థలపరంగా దేన్ని డీరెగ్యులేట్ చేయాలనే దానిపై స్పష్టత ఉన్నప్పటికీ ఎలా చేయాలనేది సవాలుగా ఉంటుందని ఆయన తెలిపారు. నియంత్రణల తొలగింపు అనేది కొన్ని సందర్భాల్లో అవాంఛితమైన విధంగా దుర్వినియోగానికి కూడా దారి తీసే అవకాశాలు ఉండటమే ఇందుకు కారణమని పేర్కొన్నారు. వికసిత భారత్ లక్ష్యాలు సాధించాలంటే ఇరుపక్షాలు పరస్పరం నమ్మకంతో కలిసి పనిచేయాల్సి ఉంటుందని చెప్పారు. 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య కాకుండా, దేశవ్యాప్తంగా ప్రభుత్వాలు, ప్రైవేట్ రంగం మధ్య కూడా నమ్మకం ఉండాలి. సమిష్టిగా కలిసి పని చేస్తే తప్ప వచ్చే 25 ఏళ్లలో మనం నిర్దేశించుకున్న అభివృద్ధి లక్ష్యాన్ని సాధించలేం' అని నాగేశ్వరన్ చెప్పారు. మరోవైపు, ఎకనమిక్ సర్వేలో పేర్కొన్నట్లు భారత్ 6.3–6.8 శాతం మధ్య వృద్ధి రేటును నమోదు చేసిందని .. రుతుపవనాలు మెరుగ్గా ఉండటం, ప్రభుత్వ పెట్టుబడుల దన్ను, పన్నులపరమైన ఉపశమనం, వడ్డీ రేట్ల తగ్గుదల తదితర సానుకూలాంశాలతో ఇదే స్థాయి వృద్ధి సుదీర్ఘకాలం పాటు కొనసాగవచ్చని ఆయన పేర్కొన్నారు.

గూగుల్ ఆన్‌లైన్ స్టోర్ ద్వారా పిక్సెల్ డివైజ్‌ల విక్రయాలు



న్యూఢిల్లీ: టెక్ దిగ్గజం గూగుల్ తమ స్వంత గూగుల్ ఆన్‌లైన్ స్టోర్ ద్వారా భారత్‌లో పిక్సెల్ డివైజ్‌లను విక్రయించడాన్ని ప్రారంభించింది. దీనితో దేశీ వినియోగదారులు తొలిసారిగా పిక్సెల్ స్మార్ట్‌ఫోన్లు, వాచీలు, బడ్స్, యాక్సెసరీలను నేరుగా గూగుల్ నుంచి కొనుక్కునేందుకు వీలవుతుంది. ప్రస్తుతం భాగస్వామ్య సంస్థలతో కలిసి గూగుల్ వీటిని ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో విక్రయిస్తోంది. రిటైల్‌గా తమ ఉత్పత్తుల లభ్యతను పెంచడం, కస్టమర్ సపోర్ట్‌ను పటిష్టపర్చుకోవడం తదితర అంశాలపై మరింతగా దృష్టి పెట్టనున్నట్లు గూగుల్ ఇండియా డివైజెస్, సర్వీసెస్ ఎండీ మితుల్ షా తెలిపారు.

రూ. 1,000 కోట్ల ఐపీవోకు ఫ్యూజన్ సీఎక్స్



న్యూఢిల్లీ: కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ సేవల సంస్థ ఫ్యూజన్ సీఎక్స్ తాజాగా పబ్లిక్ ఇష్యూ (ఐపీవో) ద్వారా రూ. 1,000 కోట్లు సమీకరించనుంది. ఇందుకు సంబంధించిన ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి సమర్పించింది. దీని ప్రకారం రూ. 600 కోట్ల విలువ చేసే షేర్లను తాజాగా జారీ చేయనుండగా ప్రమోటర్లయిన పీఎస్ఎస్ బిజినెస్, రసేష్ కన్సల్టెంట్స్ రూ. 400 కోట్ల విలువ చేసే షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) విధానంలో విక్రయించనున్నాయి. ప్రీ–ఐపీవో ప్లేస్‌మెంట్ కింద రూ. 120 వరకు సమీకరించే యోచనలో ఉంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

30-5-2025

విశాఖ	535–00
చిత్తూరు	613–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	525–00
విజయవాడ	525–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	525–00
వరంగల్	527–00
రిటైల్ ధర	5.85

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
INDUSINDBK	825	2.47
SUNPHARMA	1,699.50	1.99
ETERNAL	228.2	1.79
ADANIPORTS	1,435.50	1.74
TRENT	5,651.00	1.65

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
HDFCLIFE	781	-1.07
BEL	387.3	-0.81
TATACONSUM	1,105.60	-0.68
JIOFIN	288.4	-0.67
BAJFINANCE	9,210.00	-0.62

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,723
ఎన్ఎస్ఈ	1,07,377
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	3,49,304
ఎఫ్ఐఐ	+ 884
డీఐఐ	+ 4,287

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	60.98	$ 61.84
బ్రెంట్	63.39	$ 64.32

చాలా స్టార్టప్‌లు.. విదేశీ సంస్థలకు నకళ్లే

- సరికొత్త ఆవిష్కరణలు ఉండటం లేదు
- కౌన్సిలేజ్ ఇండియా మేనేజింగ్ పార్ట్‌నర్ సేథ్ వ్యాఖ్య



న్యూఢిల్లీ: చాలా మటుకు దేశీ అంకుర సంస్థలు, పాశ్చాత్య బిజినెస్ మోడల్స్‌ను అనుకరిస్తున్నాయే తప్ప భారత్ అవసరాలకు అనుగుణంగా సిసలైన, సరికొత్త ఆవిష్కరణలేమీ చేయడం లేదని కౌన్సిలేజ్ ఇండియా మేనేజింగ్ పార్ట్‌నర్ సుహేల్ సేథ్ ఆక్షేపించారు. 'భారత్‌లో స్టార్టప్ వ్యవస్థను చూస్తే, దాదాపు అన్నీ కూడా ఇప్పటికే పాశ్చాత్య దేశాల్లో చేసిన వాటికి కాపీలుగా ఉంటున్నాయి. వడా పావ్ దుకాణం మొదలుపెట్టినా స్టార్టప్ అనేస్తున్నారు' అని ఆయన వ్యాఖ్యానించారు. దేశీయంగా స్టార్టప్‌ల సంభాషణలు ఎంత సేపు వేల్యుయేషన్లు, యూనికార్న్ హోదా, వ్యవస్థాపకుల సంపదలాంటి అంశాల చుట్టూనే తిరుగుతుంటాయన్నారు. ఈ నేపథ్యంలో స్టార్టప్‌కు నిర్దిష్ట నిర్వచనం ఉండాలని సీఐఐ వార్షిక బిజినెస్ సదస్సు 2025లో పాల్గొన్న సందర్భంగా ఆయన పేర్కొన్నారు. స్టార్టప్ అంటే సాంకేతికంగా వినూత్నమైనదిగా, విశిష్టమైనదిగా, మరో దాన్ని పోలి ఉండని విధంగా, స్ఫూర్తివంతంగా ఉండాలని చెప్పారు.

చైనాకు పోటీనివ్వగలం: థర్డ్‌ఐటెక్ సీఈవో కపూర్

పరిశ్రమలో నిపుణుల లభ్యతపరంగా చైనాకి గట్టి పోటీనివ్వగలిగే ఏకైక దేశం భారత్ అని ఫ్యాబ్‌లెస్ చిప్‌ల తయారీ సంస్థ థర్డ్‌ఐటెక్ సీఈవో వృందా కపూర్ తెలిపారు. అనేక గ్లోబల్ టెక్ దిగ్గజాలు పలు దశాబ్దాలుగా భారత్‌లో పెద్ద ఎత్తున పరిశోధన, అభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయడం ఇందుకు దోహదపడిందని వివరించారు. అంతర్జాతీయంగా సెమీకండక్టర్ల డిజైనింగ్ నిపుణుల్లో 20 శాతం మంది హైదరాబాద్, బెంగళూరు, పుణెలో ఉన్నారని కపూర్ తెలిపారు. ఈ నేపథ్యంలో సెమీకండక్టర్ల తయారీ సామర్థ్యాల్లో, ముఖ్యంగా డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్‌లో చైనా ఆధిపత్యానికి చెక్ చెప్పగలిగే సామర్థ్యాలు భారత్‌కి ఉన్నాయని వివరించారు.

యూపీఐ చెల్లింపులు మాకూ వచ్చు!

15–29 ఏళ్ల వయసులో వారికి సుపరిచితం: టెలికం సర్వేలో వెల్లడి



న్యూఢిల్లీ: యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా 15–29 ఏళ్ల వయసులో ఉన్న అందరూ మొబైల్ ఫోన్ సాయంతో ఆన్‌లైన్ బ్యాంకింగ్ లావాదేవీలు నిర్వహించగలరని టెలికం సర్వేలో తెలిసింది. తాము యూపీఐ ద్వారా బ్యాంక్ లావాదేవీలు నిర్వహించగలమని 99.5 శాతం మంది చెప్పినట్టు 'కాంప్రహెన్సివ్ మాడ్యులర్ సర్వే: టెలికం, 2025' వెల్లడించింది. కేంద్ర గణాంకాల శాఖ ఈ నివేదికను విడుదల చేసింది. 15–29 ఏళ్లలో 97.1 శాతం మంది గత మూడు నెలలుగా స్మార్ట్‌ఫోన్ వినియోగిస్తున్నట్టు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో 96.8 శాతం మంది (15–29 ఏళ్లు) గత మూడు నెలల్లో కనీసం ఒకసారి మొబైల్ ఫోన్ ద్వారా ఇంటర్నెట్‌ను యాక్సెస్ చేసినట్టు తెలిపారు. పట్టణాల్లో ఈ వయసులోని వారిలో 97.6 శాతం మంది ఫోన్‌ను వినియోగిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇదే వయసులోని వారిలో 95.5 శాతం మందికి స్మార్ట్‌ఫోన్ ఉంది. దేశంలోని 85.5 శాతం గృహాల్లో కనీసం ఒక స్మార్ట్‌ఫోన్ ఉంది.

ఇండెల్ మనీ రూ.4,000 కోట్ల ఏయూఎం

2026 మార్చి నాటికి చేరుకోవాలన్న లక్ష్యం



న్యూఢిల్లీ: బంగారం తనఖాపై రుణాలు అందించే ఇండెల్ మనీ తన నిర్వహణ ఆస్తులను ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరికి (2026 మార్చి) రూ.4,000 కోట్లను పెంచుకోనున్నట్టు ప్రకటించింది. ప్రస్తుతం ఈ సంస్థ నిర్వహణ ఆస్తులు (రుణాలు) రూ.2,400 కోట్లుగా ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.10,000 కోట్ల రుణాల మంజూరును సాధించాలన్న లక్ష్యంతో ఉన్నట్టు తెలిపింది. గత ఆర్థిక సంవత్సరంలో 89 కొత్త శాఖలు తెరవడంతో మొత్తం 12 రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల పరిధిలో శాఖల సంఖ్య 2025 మార్చి 31 నాటికి 365కు చేరాయి. గత ఆర్థిక సంవత్సరంలో సంస్థ రూ.61 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. ఎన్‌పీఏలు గత ఆర్థిక సంవత్సరం చివరికి 1.35 శాతానికి తగ్గాయి. అంతకుముందు సంవత్సరం చివరికి ఇవి 3.17 శాతంగా ఉండడం గమనార్హం. ''రానున్న రోజుల్లో దేశీ వినియోగం మరింత పుంజుకుంటుంది. దీంతో బంగారం రుణాలకు డిమాండ్ పెరుగుతుంది. ముఖ్యంగా బంగారం ధరలు రికార్డు స్థాయికి చేరడం ఇందుకు అనుకూలిస్తుంది''అని ఇండెల్ మనీ సీఈవో ఉమేష్ మోహనన్ తెలిపారు.

చిన్న సంస్థలకు పేపాల్ సీమాంతర చెల్లింపు సేవలు

అగ్రిగేటరుగా వ్యవహరించేందుకు ఆర్‌బీఐ సూత్రప్రాయ అనుమతులు



న్యూఢిల్లీ: ఎగుమతులపరమైన సీమాంతర చెల్లింపు లావాదేవీలకు సంబంధించి పేమెంట్ అగ్రిగేటరుగా (పీఏ-సీబీ-ఈ) వ్యవహరించేందుకు రిజర్వ్ బ్యాంక్ నుంచి తమకు సూత్రప్రాయ అనుమతులు లభించినట్లు పేపాల్ హోల్డింగ్స్ భారతీయ అనుబంధ సంస్థ పేపాల్ పేమెంట్స్ వెల్లడించింది. దీనితో 200 పైగా మార్కెట్లలోని విదేశీ కస్టమర్ల నుంచి భారత్‌లోని చిన్న వ్యాపారులు, ఫ్రీలాన్సర్లు, ఔత్సాహిక వ్యాపారవేత్తలు చెల్లింపులు పొందడానికి అవసరమైన సేవలు అందించవచ్చని పేర్కొంది. వారు అంతర్జాతీయంగా వ్యాపార లావాదేవీలను సురక్షితంగా, సజావుగా నిర్వహించుకునేందుకు ఇవి ఉపయోగపడతాయని తెలిపింది. భారత్ గ్లోబల్ ఎగుమతుల హబ్‌గా ఎదుగుతున్న నేపథ్యంలో దేశీ వ్యాపార సంస్థలకు విశ్వసనీయమైన పేమెంట్ సొల్యూషన్స్ అందించేందుకు కట్టుబడి ఉన్నామని వివరించింది. పేపాల్ చెకవుట్, పేపాల్ ఇన్వాయిసింగ్, నో–కోడ్ చెకవుట్ టూల్స్ మొదలైన సురక్షితమైన సాధనాలతో దేశీ చిన్న సంస్థలు, అంతర్జాతీయంగా తమ ఉత్పత్తులను విక్రయించుకునేందుకు తోడ్పాటు అందిస్తున్నట్లు కంపెనీ సేల్స్ హెడ్ ఆబిద్ ముర్షిద్ తెలిపారు.

బ్యాంకింగ్‌లో మరిన్ని విదేశీ సంస్థల ఎంట్రీకి సానుకూలం

యస్‌బ్యాంక్‌లో ఎస్ఎంఎఫ్‌జీ వాటాలు కొనడంపై ఫిచ్ రేటింగ్స్



న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ యస్‌బ్యాంక్‌లో సుమితోమో మిత్సుయి ఫైనాన్షియల్ గ్రూప్ (ఎస్ఎంఎఫ్‌జీ) 20 శాతం వాటాలు కొనుగోలు చేయడమనేది భారతీయ బ్యాంకింగ్ రంగంలో ఇతర విదేశీ సంస్థల ప్రవేశానికి సానుకూలాంశంగా ఉంటుందని ఫిచ్ రేటింగ్స్ అభిప్రాయపడింది. ఈ డీల్‌తో యస్ బ్యాంకులో అతి పెద్ద వాటాదారుగా బోర్డులో ఇద్దరిని నియమించుకోవడంతో పాటు బ్యాంకుపై ఎస్ఎంఎఫ్‌జీకి గణనీయమైన నియంత్రణ కూడా లభిస్తుందని పేర్కొంది. ఈ లావాదేవీని పరిగణనలోకి తీసుకుంటే భవిష్యత్తులోను ఇలాంటి డీల్స్ మరిన్ని నమోదు కావచ్చని వివరించింది. వోటింగ్ హక్కులు, పెట్టుబడి పరిమితులను పెంచితే విదేశీ బ్యాంకు ఇన్వెస్టర్లు మరింత ఆసక్తి చూపించవచ్చని పేర్కొంది. భారత్‌లో కార్యకలాపాలను విస్తరించాలనుకుంటున్న విదేశీ బ్యాంకులు.. దేశీయంగా మధ్య స్థాయి బ్యాంకుల్లో ఇన్వెస్ట్ చేయొచ్చని వివరించింది. ప్రస్తుతం విదేశీ పెట్టుబడుల నిబంధనల ప్రకారం భారతీయ బ్యాంకుల్లో విదేశీ సంస్థల ఓటింగ్ హక్కులపై 26 శాతం, పెట్టుబడులపై 15 శాతం పరిమితి ఉంది.

చిన్న పట్టణాల్లోకి నిప్పన్ ఇండియా విస్తరణ

- 7–8 ఏళ్లలో రెట్టింపు ఇన్వెస్టర్ల లక్ష్యం
- సంస్థ ఈడీ, సీఈవో సందీప్ సిక్కా



కోల్‌కతా: నిప్పన్ ఇండియా మ్యూచువల్ ఫండ్ చిన్న పట్టణాల్లోకి సేవలను విస్తరించడం ద్వారా మరింత మంది రిటైల్ ఇన్వెస్టర్లకు చేరువ కావాలని చూస్తోంది. తద్వారా రానున్న 7–8 ఏళ్లలో తమ ఇన్వెస్టర్ల బేస్‌ను రెట్టింపు చేసుకోవాలన్న (5 కోట్లకు) లక్ష్యంతో ఉన్నట్టు నిప్పన్ ఇండియా మ్యూచువల్ ఫండ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈవో సందీప్ సిక్కా తెలిపారు. ముఖ్యంగా తూర్పు భారత్‌లో మ్యూచువల్ ఫండ్స్ వృద్ధి జాతీయ సగటు కంటే ఎక్కువగా ఉందని, దాంతో ఈ ప్రాంతంపై ఎక్కువ బుల్లిష్ ధోరణితో (సానుకూలం) ఉన్నట్టు చెప్పారు. ''తూర్పు భారత్‌లో మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమ వ్యాప్తంగా 20 శాతం వృద్ధి ఉంటే నిప్పన్ ఇండియా మ్యూచువల్ ఫండ్ 27 శాతం వృద్ధిని నమోదు చేసింది. 2023–24లో ఈ ప్రాంతంలో మ్యూచువల్ ఫండ్స్ సిప్ పెట్టుబడులు 38 శాతం వృద్ధిని చూస్తే.. నిప్పన్ ఇండియా సిప్ పెట్టుబడులు 55 శాతం పెరిగాయి. అదే ఏడాది జాతీయ సిప్ సగటు వృద్ధి 34 శాతంగా ఉంది. రిటైల్ మార్కెట్లోకి మరింత లోతుగా చొచ్చుకుపోవడమే మా వ్యూహం. ముఖ్యంగా ఫండ్స్ సేవలు పెద్దగా విస్తరణకు నోచుకోని ప్రాంతాలకు ప్రాధాన్యం ఇస్తాం. అక్కడే వృద్ధి అవకాశాలు ప్రధానంగా ఉన్నాయి. మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమలో యూనిక్ ఇన్వెస్టర్ల బేస్ 6 కోట్లుగా ఉంటే.. ప్రస్తుతం మా ఇన్వెస్టర్ల సంఖ్య 2 కోట్ల మేర ఉంది''అని సంస్థ ప్రణాళికలను సిక్కా వివరించారు. నిప్పన్ ఇండియా భారత్‌లో అతిపెద్ద విదేశీ మ్యూచువల్ ఫండ్ సంస్థ అని (జపాన్‌కు చెందిన నిప్పన్ లైఫ్).. టాప్ 5 సంస్థల్లో బ్యాంకింగ్ స్పాన్సర్ లేకుండా ఎక్కువ వృద్ధిని తాము నమోదు చేసినట్టు సందీప్ సిక్కా తెలిపారు. 2023–24లో 27 శాతం అధికంగా 82 లక్షల ఇన్వెస్టర్లను సొంతం చేసుకున్నట్టు చెప్పారు. దేశవ్యాప్తంగా 269 శాఖలు ఉంటే.. తూర్పున 11 రాష్ట్రాల్లోని 50 ప్రాంతాల్లో శాఖలు కలిగి ఉన్నట్టు తెలిపారు. ఇన్వెస్టర్లలో పెరుగుతున్న అవగాహనతో ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో అసంఘటిత రంగం నుంచి పొదుపులు సంఘటిత రంగం వైపు మళ్లుతున్నట్టు వెల్లడించారు. తాము కొత్త పథకాల ఆవిష్కరణ కంటే ప్రస్తుత పథకాల రూపంలో మెరుగైన పెట్టుబడుల అవకాశాలను ఆఫర్ చేయడానికి ప్రాధాన్యం ఇస్తామన్నారు.

అతిపెద్ద విదేశీ మ్యూచువల్ ఫండ్

మార్చి త్రైమాసిక ఫలితాలు

మదర్సన్ లాభం నేలచూపు

- క్యూ4లో రూ. 1,050 కోట్లు



ముంబై: ఆటో విడిభాగాల దిగ్గజం సంవర్ధన మదర్సన్ ఇంటర్నేషనల్ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 23 శాతం క్షీణించి రూ. 1,050 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 1,372 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 27,058 కోట్ల నుంచి రూ. 29,317 కోట్లకు ఎగసింది. కాగా.. పూర్తి ఏడాదికి కన్సాలిడేటెడ్ నికర లాభం 40 శాతం జంప్‌చేసి రూ. 3,803 కోట్లను తాకింది. 2023–24లో కేవలం రూ. 2,716 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 98,692 కోట్ల నుంచి రూ. 1,13,663 కోట్లకు ఎగసింది. ప్రయివేట్ ప్లేస్‌మెంట్‌లో భాగంగా మార్పిడికి వీలుకాని డిబెంచర్ల జారీ ద్వారా రూ. 8,500 కోట్ల సమీకరణకు బోర్డు అనుమతించినట్లు కంపెనీ వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 2.3 శాతం బలపడి రూ. 152 వద్ద ముగిసింది.

ఇన్ఫో ఎడ్జ్ లాభం హైజంప్

- క్యూ4లో రూ. 463 కోట్లు
- షేరుకి రూ. 3.6 డివిడెండ్



ముంబై: డైవర్సిఫైడ్ దిగ్గజం ఇన్ఫో ఎడ్జ్(ఇండియా) గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 7 రెట్లుపైగా దూసుకెళ్లి రూ. 463 కోట్లకు చేరింది. రూ. 26 కోట్ల అనుకోని లాభం ఇందుకు సహకరించింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో కేవలం రూ. 60 కోట్లు ఆర్జించింది. రూ. 162 కోట్ల అనూహ్య నష్టం ప్రభావం చూపింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 3.6 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మొత్తం ఆదాయం 14 శాతం ఎగసి రూ. 750 కోట్లకు చేరింది. అంతక్రితం క్యూ4లో రూ. 657 కోట్ల టర్నోవర్ అందుకుంది. పూర్తి ఏడాదికి నికర లాభం 67 శాతం జంప్‌చేసి రూ. 962 కోట్లను తాకింది. మొత్తం ఆదాయం సైతం 12 శాతం పెరిగి రూ. 2,850 కోట్లకు చేరింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 1 శాతం పెరిగి రూ. 1,447 వద్ద ముగిసింది.

ఆల్కెమ్ ల్యాబ్ లాభం ప్లస్

- క్యూ4లో రూ. 322 కోట్లు
- షేరుకి రూ. 8 డివిడెండ్



ముంబై: ఫార్మా రంగ కంపెనీ ఆల్కెమ్ ల్యాబొరేటరీస్ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 6 శాతం వృద్ధితో రూ. 322 కోట్లకు చేరింది. దేశీయంగా అమ్మకాలు పుంజుకోవడం ఇందుకు ప్రధానంగా సహకరించింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 304 కోట్లు ఆర్జించింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 8 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మొత్తం ఆదాయం రూ. 2,936 కోట్ల నుంచి రూ. 3,144 కోట్లకు ఎగసింది. పూర్తి ఏడాదికి కన్సాలిడేటెడ్ నికర లాభం రూ. 1,811 కోట్ల నుంచి రూ. 2,215 కోట్లకు బలపడింది. మొత్తం ఆదాయం రూ. 12,667 కోట్ల నుంచి రూ. 12,964 కోట్లకు పుంజుకుంది.

ఫలితాల నేపథ్యంలో ఆల్కెమ్ షేరు బీఎస్ఈలో 1.2 శాతం బలపడి రూ. 5,325 వద్ద ముగిసింది.

వెల్‌స్పన్ కార్ప్ లాభం హైజంప్

- క్యూ4లో రూ. 699 కోట్లు
- షేరుకి రూ. 5 డివిడెండ్



ముంబై: డీఐ, స్టెయిన్‌లెస్ స్టీల్ పైపుల తయారీ దిగ్గజం వెల్‌స్పన్ కార్ప్ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 143 శాతం దూసుకెళ్లి రూ. 699 కోట్లను అధిగమించింది. వ్యయాలు తగ్గడం ఇందుకు ప్రధానంగా సహకరించింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో కేవలం రూ. 287 కోట్లు ఆర్జించింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 5 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. అయితే మొత్తం ఆదాయం రూ. 4,544 కోట్ల నుంచి రూ. 3,967 కోట్లకు క్షీణించింది. ఈ కాలంలో మొత్తం వ్యయాలు రూ. 4,292 కోట్ల నుంచి రూ. 3,639 కోట్లకు భారీగా తగ్గాయి. కాగా.. ప్రయివేట్ ప్లేస్‌మెంట్‌కింద మార్పిడికి వీలుకాని డిబెంచర్ల జారీ ద్వారా రూ. 500 కోట్ల సమీకరణకు బోర్డు అనుమతించినట్లు కంపెనీ వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 10 శాతం దూసుకెళ్లి రూ. 895 వద్ద ముగిసింది.

ఈఐడీ ప్యారీ లాభం స్వీట్

- క్యూ4లో రూ. 539 కోట్లు



న్యూఢిల్లీ: షుగర్ తయారీ దిగ్గజం ఈఐడీ ప్యారీ(ఇండియా) గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం రూ. 539 కోట్లను అధిగమించింది. అమ్మకాలు పుంజుకోవడం ఇందుకు సహకరించింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 294 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 5,680 కోట్ల నుంచి రూ. 6,924 కోట్లకు ఎగసింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం రూ. 1,617 కోట్ల నుంచి రూ. 1,773 కోట్లకు బలపడింది. మొత్తం ఆదాయం రూ. 29,717 కోట్ల నుంచి రూ. 31,968 కోట్లకు పుంజుకుంది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 2శాతం నష్టపోయి రూ. 964 వద్ద ముగిసింది.

రిలయన్స్ ఇన్సూరెన్స్ లాభం రూ. 315 కోట్లు



ముంబై: గత ఆర్థిక సంవత్సరంలో రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ లాభం 12 శాతం పెరిగి రూ. 315 కోట్లుగా నమోదైంది. స్థూల డైరెక్ట్ ప్రీమియం 7 శాతం పెరిగి రూ. 12,548 కోట్లకు చేరింది. దాదాపు మూడేళ్ల పాటు దివాలాచట్టం కింద ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొన్న కంపెనీని కొనుగోలు చేసిన ఇండస్‌ఇండ్ ఇంటర్నేషనల్ హోల్డింగ్స్ (ఐఐహెచ్ఎల్) రూ. 300 కోట్లు ఇన్వెస్ట్ చేసింది. ఈ ఏడాది మేలో మాతృ సంస్థ రిలయన్స్ క్యాపిటల్ రూ. 100 కోట్లు సమకూర్చినట్లు సంస్థ తెలిపింది. 99.57 శాతం క్లెయిమ్స్ నిష్పత్తిని నమోదు చేసినట్లు పేర్కొంది.

సూరజ్ ఎస్టేట్ లాభం డౌన్

- క్యూ4లో రూ. 18 కోట్లు



న్యూఢిల్లీ: రియల్టీ రంగ కంపెనీ సూరజ్ ఎస్టేట్ డెవలపర్స్ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 5 శాతం నీరసించి రూ. 18 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 19 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 103 కోట్ల నుంచి రూ. 137 కోట్లకు బలపడింది. అయితే మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం రూ. 67 కోట్ల నుంచి రూ. 100 కోట్లకు జంప్‌చేసింది. మొత్తం ఆదాయం సైతం రూ. 416 కోట్ల నుంచి రూ. 553 కోట్లకు ఎగసింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 0.10% నష్టంతో రూ. 321 వద్ద ముగిసింది.

జ్యోతి 'పసిడి' పరుగు



జ్యోతి యర్రాజీ

- 100 మీ. హర్డిల్స్ స్వర్ణం నిలబెట్టుకున్న ఏపీ అథ్లెట్
- స్టీపుల్‌చేజ్‌లో అవినాశ్‌కు స్వర్ణం
- 4x400 మీ. రిలేలో మహిళలకు బంగారం
- పురుషుల జట్టుకు రజతం
- ఆసియా అథ్లెటిక్స్‌లో భారత్ పతకాల పంట



శైలీ సింగ్

గుమి (దక్షిణ కొరియా): భారత క్రీడాకారులు ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పతకాల పంట పండిస్తున్నారు. రెండో రోజు అర డజను (6) పతకాలు సాధించిన భారత బృందం మూడో రోజు కూడా మరో ఆరు పతకాలను గెలుచుకుంది. ఆంధ్రప్రదేశ్ అథ్లెట్ జ్యోతి యర్రాజీ 100 మీటర్ల హర్డిల్స్‌లో పసిడి పతకాన్ని నిలబెట్టుకుంది. పురుషుల 3000 మీ. స్టీపుల్‌చేజ్‌లో అవినాశ్ సబ్లే విజేతగా నిలువగా, 4x400 మీటర్ల రిలే ఈవెంట్‌లో భారత మహిళల బృందం స్వర్ణం సాధిస్తే... పురుషుల జట్టేమో రజతంతో సరిపెట్టుకుంది. మహిళల లాంగ్‌జంప్‌లో ఆన్సీ సోజన్ రజతం, శైలీ సింగ్ కాంస్య పతకాలు సాధించారు. ఓవరాల్‌గా ఈ మూడు రోజుల్లోనే భారత్ మొత్తం 14 పతకాలతో సత్తా చాటుకుంది. తొలి రోజు రెండు పతకాలు నెగ్గిన భారత బృందం ఈ చాంపియన్‌షిప్‌లో బుధవారం పోటీలు ముగిసే సరికి పతకాల పట్టికలో రెండో స్థానంలో కొనసాగుతోంది.

తెలుగు తేజం కొత్త రికార్డు

రెండేళ్ల క్రితం బ్యాంకాక్ (థాయ్‌లాండ్)లో జరిగిన ఆసియా చాంపియన్‌షిప్‌లో జ్యోతి యర్రాజీ బంగారు పతకాన్ని సాధించింది. తాజాగా ఇప్పుడు సరికొత్త రికార్డుతో తెలుగుతేజం స్వర్ణాన్ని నిలబెట్టుకుంది. గురువారం జరిగిన మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో పోటీని 12.96 సెకన్లలో పూర్తిచేసిన ఏపీ అథ్లెట్ విజేతగా నిలిచింది. ఈ క్రమంలో ఆమె 1998లో కజకిస్తాన్ అథ్లెట్ ఓల్గా షిషిజినా (13.04 సె.) రికార్డును అధిగమించింది. ఈ టైమింగ్‌నే 2011లో చైనా క్రీడాకారిణి సున్ యావె (13.04 సె.) నమోదు చేసింది. 2023-బ్యాంకాక్ ఈవెంట్‌లో జ్యోతి (13.09 సె.) బంగారు పతకాన్ని గెలిచింది. తద్వారా ఆసియా చాంపియన్‌షిప్ చరిత్రలో హర్డిల్స్‌లో స్వర్ణాలు నిలబెట్టుకున్న అరుదైన ఐదుగురు అథ్లెట్ల క్లబ్‌లో చేరింది. ఎమి అకిమొతొ (జపాన్; 1979, 1981, 1983), జాంగ్ యు (చైనా; 1991, 1993), సు యిన్‌పింగ్ (చైనా; 2003, 2005), సున్ యావె (చైనా; 2009, 2011)ల సరసన ఆంధ్రప్రదేశ్ అథ్లెట్ జ్యోతి నిలిచింది.

36 ఏళ్ల తర్వాత బంగారం

భారత అథ్లెట్ అవినాశ్ సాబ్లే ఈ సీజన్ అత్యుత్తమ ప్రదర్శనతో భారత్‌కు 36 ఏళ్ల తర్వాత స్టీపుల్‌చేజ్‌లో పసిడి పతకాన్ని తెచ్చిపెట్టాడు. పురుషుల 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్ పోటీని 8:20.92 సెకన్ల టైమింగ్‌తో అగ్ర స్థానంలో నిలిచాడు. గత ఏడాది భారత ఆటగాడు 8:09.91 సెకన్లతో జాతీయ రికార్డును నెలకొల్పాడు. చివరిసారిగా భారత్ ఈ క్రీడాంశంలో 1989లో బంగారు పతకం గెలిచింది. దినరామ్ విజేతగా నిలువగా, తొలిసారిగా పసడి నెగ్గిన ఘనత హర్పల్ సింగ్ (1975లో)కు దక్కింది. మహిళల 10వేల మీటర్ల పరుగులో 'పోడియం'కు దూరమైన సంజీవని జాదవ్ (33:08.17 సె.), సీమా (33:08.23 సె.) వరుసగా ఐదు, ఆరో స్థానాల్లో నిలిచారు.

రిలేలో పతకాల జోరు

మూడో రోజు పోటీల్లో రిలే బృందాలు సత్తా చాటుకున్నాయి. మహిళల 4x400 మీటర్ల రిలే ఈవెంట్‌లో ఆంధ్రప్రదేశ్ అథ్లెట్ కుంజా రజిత సహా జిస్నా మాథ్యూ, రూపల్ చౌదరి, శుభా వెంకటేశన్‌లతో కూడిన బృందం బంగారు పతకం సాధించింది. పోటీని అందరికంటే ముందుగా భారత జట్టు 3 నిమిషాల 34.18 సెకన్లలో పూర్తి చేసి విజేతగా నిలిచింది. పురుషుల 4x400 మీటర్ల రిలే ఈవెంట్‌లో తృటిలో స్వర్ణావకాశం చేజారడంతో రజతం దక్కింది. జయ్ కుమార్, ధర్మ్‌వీర్ చౌదరి, మనూ తెక్కినలిల్, విశాల్‌లతో కూడిన భారత బృందం 3 నిమిషాల 03.67 సెకన్లలో పూర్తి చేసి రెండో స్థానంలో నిలిచింది. కేవలం 0.15 సెకన్ల తేడాతో ఖతర్ జట్టు (3 ని.03.52 సె) బంగారు పతకం సాధించింది. మహిళల లాంగ్‌జంప్ ఈవెంట్‌లో ఆన్సీ సోజన్ రజతం గెలుపొందగా, షైలీ సింగ్ కాంస్య పతకం నెగ్గింది. ఆన్సీ 6.33 మీటర్లు దూకి రెండో స్థానం సాధించగా, షైలీ సింగ్ 6.30 మీటర్లతో ఆమె వెనక నిలిచింది. ఈ ఈవెంట్‌లో ఇరాన్ అథ్లెట్ మొబిని అరని (6.40 మీ.) స్వర్ణం గెలుచుకుంది.



ఆన్సీ సోజన్



అవినాశ్


హర్ష్ దూబే, కరుణ్ నాయర్, ముకేశ్ కుమార్, హర్షిత్ రాణా, ఈశ్వరన్, ఇషాన్ కిషన్

టెస్టు సిరీస్‌కు రిహార్సల్

- నేటి నుంచి ఇంగ్లండ్ లయన్స్‌తో భారత్ 'ఎ' అనధికారిక టెస్టు
- నితీశ్ రెడ్డి, కరుణ్ నాయర్, అభిమన్యు ఈశ్వరన్‌పై దృష్టి

కాంటర్‌బరీ (ఇంగ్లండ్): టీమిండియా యువ ఆటగాళ్లు యశస్వి జైస్వాల్, నితీశ్ కుమార్ రెడ్డి సహా పలువురు ప్లేయర్లు ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌కు ముందు సన్నాహక మ్యాచ్ బరిలోకి దిగనున్నారు. వచ్చే నెల 20 నుంచి భారత్, ఇంగ్లండ్ మధ్య ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ జరగనుండగా... దానికి ముందు ఇంగ్లండ్ లయన్స్ జట్టుతో భారత 'ఎ' జట్టు శుక్రవారం నుంచి నాలుగు రోజుల మొదటి అనధికారిక టెస్టు మ్యాచ్ ఆడనుంది. ఇందులో భారత్ 'ఎ' జట్టు తరఫున అభిమన్యు ఈశ్వరణ్, ధ్రువ్ జురేల్, కరుణ్ నాయర్, ఆకాశ్ దీప్, శార్దుల్ ఠాకూర్, ఇషాన్ కిషన్, తనుశ్ కొటియాన్, ముకేశ్ కుమార్, హర్షిత్ రాణా, అన్షుల్ కంబోజ్, ఖలీల్ అహ్మద్, సర్ఫరాజ్ ఖాన్, తుషార్ దేశ్‌పాండే, హర్ష్ దూబే బరిలోకి దిగనున్నారు. ఇంగ్లండ్‌తో సిరీస్‌కు ముందు అక్కడి పరిస్థితులను అర్థం చేసుకునేందుకు ఈ సన్నాహక మ్యాచ్‌లు సహకరించనున్నాయి. ఈ నేపథ్యంలో ఐపీఎల్ ప్లే ఆఫ్స్‌లో భాగం కాని... భారత టెస్టు జట్టు ఆటగాళ్లను బీసీసీఐ ముందే ఇంగ్లండ్ పంపింది. కరుణ్ నాయర్ మినహా... మిగిలిన ఆటగాళ్లందరికీ ఇదే తొలి ఇంగ్లండ్ పర్యటన. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ సుదీర్ఘ ఫార్మాట్ నుంచి తప్పుకున్న అనంతరం టీమిండియా ఆడనున్న తొలి టెస్టు సిరీస్ ఇదే కానుండటంతో... వారి స్థానాలను భర్తీ చేసే ఆటగాళ్లను ఎంపిక చేసుకునేందుకు ఈ మ్యాచ్ తోడ్పడనుంది. ప్రధాన సిరీస్‌లో భారత జట్టు బ్యాటింగ్ ఆర్డర్‌ను నిర్ణయించేందుకు కూడా ఈ సన్నాహక మ్యాచ్‌లు సహాయపడనున్నాయి. అభిమన్యు ఈశ్వరణ్, కరుణ్ నాయర్, ఆంధ్రప్రదేశ్ పేస్ ఆల్‌రౌండర్ నితీశ్ రెడ్డి ప్రదర్శనపై అందరి దృష్టి నిలవనుంది. ఆ్రస్టేలియా పర్యటనలో 298 పరుగులతో ఆకట్టుకున్న నితీశ్ రెడ్డి... ఐపీఎల్‌లో పెద్దగా ఆకట్టుకోలేకపోగా... ఇంగ్లండ్‌తో తుది జట్టులో చోటు దక్కాలంటే ఈ మ్యాచ్‌లో సత్తాచాటాల్సిన అవసరముంది. పేస్ ఆల్‌రౌండర్‌గా శార్దుల్ ఠాకూర్ నుంచి అతడికి పోటీ ఎదురు కానుంది. అశ్విన్ రిటైర్మెంట్ ప్రకటించిన నేపథ్యంలో... కొత్త స్పిన్నర్‌గా ఎవరు వెలుగులోకి వస్తారో చూడాలి.

ఇంగ్లండ్ ఘనవిజయం

వెస్టిండీస్ 238 పరుగులతో ఓటమి

బర్మింగ్‌హామ్: వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌లో ఇంగ్లండ్ శుభారంభం చేసింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా గురువారం జరిగిన తొలి వన్డేలో ఇంగ్లండ్ 238 పరుగుల తేడాతో విండీస్‌పై గెలుపొందింది. మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 400 పరుగులు చేసింది. బ్రూక్ కెప్టెన్సీలో ఆడిన తొలి మ్యాచ్‌లోనే ఇంగ్లండ్ భారీ స్కోరుతో విజృంభించింది. జాకబ్ బెథెల్ (53 బంతుల్లో 82; 8 ఫోర్లు, 5 సిక్స్‌లు), బెన్ డకెట్ (60; 6 ఫోర్లు, 1 సిక్స్), జో రూట్ (57; 5 ఫోర్లు), హ్యారీ బ్రూక్ (58; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) హాఫ్ సెంచరీలతో అదరగొట్టారు. జెమీ స్మిత్ (37), బట్లర్ (37), విల్ జాక్స్ (39) కూడా రాణించారు. విండీస్ బౌలర్లలో జైడెన్ సీల్స్ 4, అల్జారీ జోసెఫ్, జస్టిన్ గ్రేవ్స్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో వెస్టిండీస్ 26.2 ఓవర్లలో 162 పరుగులకు ఆలౌటైంది. జైడెన్ సీల్స్ (29; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), కెప్టెన్ షై హోప్ (25) కాస్త పోరాడగా... మిగిలిన వాళ్లు ప్రభావం చూపలేకపోయారు. ఇంగ్లండ్ బౌలర్లలో సాఖీబ్ మహమూద్, జేమీ ఓవర్టన్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. ఇరు జట్ల మధ్య ఆదివారం రెండో వన్డే జరగనుంది.


బ్రూక్

ఫైనల్లో నమన్, అన్షుల్

థాయిలాండ్ ఓపెన్ బాక్సింగ్


నమన్


అన్షుల్

బ్యాంకాక్: థాయిలాండ్ ఓపెన్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో భారత ఆటగాళ్లు నమన్ తన్వర్, అన్షుల్ గిల్ ఫైనల్లోకి ప్రవేశించారు. 90 కేజీల విభాగం సెమీఫైనల్లో నమన్ 4-1 స్కోరుతో ఉజ్బెకిస్తాన్‌నుకు చెందిన జురాబొవ్ ఎలీబెక్‌పై విజయం సాధించాడు. 90 ప్లస్ కేజీల కేటగిరీలో నమన్ 3-2తో రుస్తమోవ్ అబ్దురఖ్‌మాన్ (ఉజ్బెకిస్తాన్)ను ఓడించాడు. బౌట్ ఆరంభంలో భారత బాక్సర్లిద్దరూ వెనుకంజలోనే ఉన్నారు. అయితే ఆ తర్వాత చెలరేగి పంచ్‌లతో దూసుకుపోయారు. వీరి ఫైనల్ బౌట్‌లు ఆదివారం జరుగుతాయి. మహిళల విభాగంలో సెమీఫైనల్లో ఓడిన ముగ్గురు భారత బాక్సర్లు కాంస్య పతకాలతో సంతృప్తి చెందారు. తమన్నా (51 కేజీలు), ప్రియ (57 కేజీలు), లాల్‌ఫక్‌మవీ (80 కేజీలు) ఫైనల్‌కు చేరడంలో విఫలమయ్యారు.

గుకేశ్‌కు తొలి విజయం

నార్వే చెస్ టోర్నీ



స్టావెంజర్: వరల్డ్ చెస్ చాంపియన్, భారత గ్రాండ్ మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ తన 19వ పుట్టిన రోజున కీలక గెలుపును తనకు తాను బహుమతిగా ఇచ్చుకున్నాడు. నార్వే చెస్ టోర్నమెంట్ తొలి రెండు రౌండ్‌లలో పరాజయం చవిచూసిన అతను మూడో రౌండ్‌లో గెలుపు నమోదు చేశాడు. హికారు నకమురా (అమెరికా)తో గురువారం జరిగిన పోరులో గుకేశ్ 42 ఎత్తుల్లో విజయం సాధించాడు. టోర్నీ తొలి రౌండ్‌లో కార్ల్‌సన్, రెండో రౌండ్‌లో అర్జున్ ఇరిగేశి చేతిలో గుకేశ్ ఓటమిపాలయ్యాడు. గత రెండు పరాజయాలను మరచి ఒక కొత్త టోర్నీ తరహాలో ఈ రౌండ్‌ను మొదలు పెట్టానని, విజయం దక్కడం సంతోషంగా ఉందని గుకేశ్ వ్యాఖ్యానించాడు. మరో వైపు ఫాబియానో కరువానా (అమెరికా) చేతిలో అర్జున్ ఇరిగేశి పరాజయంపాలవగా...వీ యి (చైనా) చేతిలో అనూహ్యంగా మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే) అనూహ్యంగా ఓటమిపాలయ్యాడు. మూడు రౌండ్‌ల తర్వాత కరువానా అగ్రస్థానంలో ఉండగా, అర్జున్ రెండో స్థానంలో ఉన్నాడు. మరో వైపు మహిళల విభాగంలో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి సంయుక్తంగా అగ్రస్థానంలో కొనసాగుతోంది. మూడో రౌండ్‌లో హంపి...సారా ఖదమ్ (స్పెయిన్)పై గెలుపొందింది. మరో పోరులో జు వెన్ జున్ (చైనా)...భారత్‌కు చెందిన వైశాలిపై విజయం సాధించింది.

భారత్‌తో ఆసీస్ మహిళల పోరు

సెప్టెంబర్‌లో వన్డే సిరీస్



న్యూఢిల్లీ: సొంతగడ్డపై మహిళల వన్డే వరల్డ్ కప్‌కు ముందు భారత జట్టు టాప్ టీమ్ ఆ్రస్టేలియాతో సన్నాహక సిరీస్ ఆడనుంది. భారత్, ఆ్రస్టేలియా మధ్య 3 వన్డేలు జరుగుతాయి. సెప్టెంబర్ 14, 17, 20 తేదీల్లో జరిగే ఈ మూడు మ్యాచ్‌లకు చెన్నై వేదిక కానుంది. సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 26 వరకు భారత్‌లో వన్డే వరల్డ్ కప్ జరగనుంది. మరో వైపు ఇదే సమయంలో ఆ్రస్టేలియా 'ఎ' పురుషుల, దక్షిణాఫ్రికా 'ఎ' పురుషుల జట్లు కూడా భారత్‌లో పర్యటించనున్నాయి. ఇందులో భాగంగా భారత్ 'ఎ', ఆ్రస్టేలియా 'ఎ' మధ్య 2 నాలుగు రోజుల మ్యాచ్‌లు, 3 వన్డేలు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లకు లక్నో, కాన్పూర్ వేదికలుగా నిలుస్తాయి. ఆ తర్వాత భారత్ 'ఎ', దక్షిణాఫ్రికా 'ఎ' మధ్య కూడా 2 నాలుగు రోజుల మ్యాచ్‌లు, 3 వన్డేలు నిర్వహిస్తారు. ఈ ఐదు మ్యాచ్‌లను బెంగళూరు వేదికగా నిర్వహిస్తారు.

జ్వెరెవ్, సినెర్ మూడో రౌండ్లోకి...

- మహిళల్లో గాఫ్, పెగూలా ముందంజ
- ఫ్రెంచ్ ఓపెన్

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్ స్టార్లు, సీడెడ్ క్రీడాకారులు మూడో రౌండ్లోకి అడుగుపెట్టారు. ప్రపంచ నంబర్‌వన్ ఆటగాడు యానిక్ సినెర్ (ఇటలీ), మూడో సీడ్ జ్వెరెవ్ (జర్మనీ) వరుస సెట్లలో ప్రత్యర్థులపై గెలిచి ముందంజ వేశారు. మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ కొకొ గాఫ్ (అమెరికా), మూడో సీడ్ పెగూలా (అమెరికా), ఆరో సీడ్ అంద్రీవా (రష్యా), ఏడో సీడ్ మాడిసన్ కీస్ (అమెరికా)లు కూడా అలవోక విజయాలతో మూడో రౌండ్లోకి చేరుకున్నారు.

టైటిలే లక్ష్యంగా...

హార్డ్ కోర్టుల్లో (ఆ్రస్టేలియా ఓపెన్‌లో 2, యూఎస్ ఓపెన్‌లో 1) మూడు టైటిల్స్ సాధించిన టాప్‌సీడ్ ప్లేయర్ సినెర్ ఈసారి క్లే కోర్టు టైటిలే లక్ష్యంగా శ్రమిస్తున్నాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్లో ఇటలీకి చెందిన నిరుటి సెమీఫైనలిస్ట్ సినెర్ 6-3, 6-0, 6-4తో రిచర్డ్ గాస్కెట్ (ఫ్రాన్స్)పై గెలుపొందాడు. కేవలం రెండు గంటల్లోపే (1: 57 నిమిషాలు) వరుస సెట్లలో ప్రత్యర్థి ఆటకట్టించాడు. ప్రత్యర్థిపై మూడు ఏస్‌లు సంధించిన సినెర్ ఒక్క డబుల్‌ఫాల్ట్ కూడా చేయలేదు. 21 విన్నర్లు కొట్టిన సినెర్ ఫ్రాన్స్ ఆటగాడిపై సంపూర్ణ ఆధిపత్యం కొనసాగించాడు. గత ఫ్రెంచ్ ఓపెన్ ఫైనలిస్ట్, మూడో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) 3-6, 6-1, 6-2, 6-3తో జెస్పెర్ డి జోంగ్ (నెదర్లాండ్స్)పై విజయం సాధించాడు. తొలిసెట్‌ను కోల్పోయిన జర్మనీ స్టార్ తర్వాత వరుస సెట్లలో ఎలాంటి పొరపాటుకు తావివ్వకుండా పట్టుదలగా ఆడి గెలుపొందాడు. 17వ సీడ్ అంద్రీ రుబ్లెవ్ (రష్యా) 7-6 (7/1), 6-1, 7-6 (7/5)తో ఆడమ్ వాల్టన్ (ఆ్రస్టేలియా)పై గెలుపొందగా, తొమ్మిదో సీడ్ అలెక్స్ డిమినార్ (ఆ్రస్టేలియా)కు రెండో రౌండ్లోనే చుక్కెదురైంది. గత ఫ్రెంచ్ ఓపెన్ క్వార్టర్ ఫైనలిస్ట్ డిమినార్ 6-2, 6-2, 4-6, 3-6, 2-6తో అనామక కజకిస్తాన్ ప్లేయర్ బబ్లిక్ చేతిలో కంగుతిన్నాడు. సెర్బియన్ స్టార్, ఆరోసీడ్ నొవాక్ జొకోవిచ్ 6-3, 6-2, 7-6 (7/1)తో మాటెట్ (ఫ్రాన్స్)పై గెలుపొంది మూడో రౌండ్‌కు చేరుకున్నాడు.


జ్వెరెవ్

గాఫ్, అంద్రీవాల జోరు

మహిళల సింగిల్స్ రెండో రౌండ్లో రెండో సీడ్ కొకొ గాఫ్, ఆరో సీడ్ అంద్రీవా తమ ప్రత్యర్థుల్ని చాలా సులువుగా చిత్తు చేశారు. గాఫ్ (అమెరికా) 6-2, 6-4తో వాలెంతొవా (చెక్ రిపబ్లిక్)పై గంటా 15 నిమిషాల్లోనే గెలుపొందగా, అంద్రీవా 6-3, 6-4తో క్రూగెర్ (అమెరికా)ను గంటా 13 నిమిషాల్లోనే చిత్తు చేసింది. మూడో సీడ్ పెగూలా (అమెరికా) 6-3, 7-6 (7/3) అన్ లీ (అమెరికా)పై, ఏడో సీడ్ మాడిసన్ కీస్ (అమెరికా) 6-1, 6-3తో బౌల్టెర్ (ఇంగ్లండ్)పై విజయం సాధించారు. పదో సీడ్ బడొసా (స్పెయిన్) 3-6, 6-4, 6-4తో ఎలీనా గాబ్రియెలా రూస్ (రొమేనియా)పై గెలిచింది.


పెగూలా

శ్రీరామ్ బాలాజీ జోడీ కూడా...

పురుషుల డబుల్స్‌లో మరో భారత జోడీ కూడా ముందంజ వేసింది. మెక్సికో ఆటగాడు మిగుల్ రేస్ వరెలాతో జతకట్టిన శ్రీరామ్ బాలాజీ రెండో రౌండ్లోకి ప్రవేశించాడు. బుధవారం అర్ధరాత్రి ముగిసిన ఈ తొలిరౌండ్ పోరులో బాలాజీ-మిగుల్ రేస్ జోడీ 6-2, 6-1తో యుంచవొకెత్ బూ (చైనా)-యుగొ కారబెలి (అర్జెంటీనా) జంటపై వరుస సెట్లలో అలవోక విజయం సాధించింది.



ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన ఎవరెస్ట్ శిఖరంపైన పర్వతారోహకులు క్యూ కట్టిన వైనం



రాచరిక వ్యవస్థ రావాలని డిమాండ్ చేస్తూ నేపాల్ రాజధాని కఠ్మాండులో గురువారం జరిగిన భారీ ర్యాలీ

ట్రంప్ మాటలు ఉత్త డొల్ల

అమెరికాతో చర్చల్లో టారిఫ్‌ల అంశమే ప్రస్తావనకు రాలేదు

- విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: భారత్–పాకిస్తాన్‌ల మధ్య యుద్ధాన్ని ఆపేశానని, తాను చొరవ తీసుకోకపోయి ఉంటే రెండు దేశాల మధ్య కచ్చితంగా అణుయుద్ధం జరిగేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనను భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తిప్పికొట్టారు. మాట వినకపోతే టారిఫ్‌లు విధిస్తామని, వాణిజ్య సంబంధాలు తెంచేసుకుంటామని బెదిరించడంతో భారత్, పాక్‌లు దారికొచ్చాయని, బుద్ధిగా కాల్పుల విరమణకు అంగీకరించాయని ట్రంప్ చెప్పడాన్ని ఖండించారు. పహల్గాం ఉగ్రవాద దాడి అనంతరం ఆపరేషన్ సిందూర్ సమయంలో అమెరికాలో జరిగిన చర్చల్లో టారిఫ్‌ల అంశమే ప్రస్తావనకు రాలేదని గురువారం తేల్చిచెప్పారు. గత నెల 7 నుంచి 10వ తేదీ దాకా అమెరికాలో పలుమార్లు సంప్రదింపులు జరిగాయని అన్నారు. పాకిస్తాన్‌తో నెలకొన్న ఘర్షణలు, ఉద్రిక్త పరిస్థితుల గురించి మాత్రమేని మాట్లాడామని తెలిపారు. టారిఫ్‌లు, వాణిజ్య సంబంధాల అంశాన్ని అమెరికా లేవనెత్తలేదని స్పష్టంచేశారు. ట్రంప్ ప్రకటనల్లో ఏమాత్రం వాస్తవం లేదని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, పాకిస్తాన్ అభ్యర్థన మేరకే కాల్పుల విరమణకు అంగీకరించినట్లు భారత ప్రభుత్వం ఇప్పటికే పలుమార్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇది కేవలం రెండు దేశాలకు సంబంధించిన అంశమని, ఇందులో మూడో పక్షం జోక్యాన్ని అంగీకరించే ప్రసక్తే లేదని వెల్లడించింది. అయినప్పటికీ అమెరికాలో ట్రంప్ ప్రభుత్వం ఇప్పటికీ నోరుపారేసుకుంటూనే ఉంది. ట్రంప్ హెచ్చరికల కారణంగానే భారత్, పాక్‌ల మధ్య కాల్పుల విరమణ అమల్లోకి వచ్చినట్లు ఈ నెల 23న కోర్టు ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రేడ్‌కు అమెరికా ప్రభుత్వం తెలియజేసింది. విదేశీ ఉత్పత్తులపై ట్రంప్ ప్రతిపాదించిన అధిక టారిఫ్‌లకు చట్టపరమైన ఇబ్బందులు రాకుండా కోర్టు ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రేడ్‌కు తప్పుడు వివరణలు ఇస్తున్నట్లు అమెరికాపై సర్కారుపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

అమెరికా స్వేచ్ఛ అబద్ధం: చైనా

విద్యార్థుల వీసా రద్దుపై విదేశాంగ శాఖ ఆగ్రహం

బీజింగ్: కమ్యూనిస్టు పార్టీతో సంబంధాలున్నాయన్న నెపంతో తమ విద్యార్థుల వీసాలను రద్దు చేసిన అమెరికా చర్యను చైనా ఖండించింది. ఇది ద్వైపాక్షిక సంబంధాలను దెబ్బతీసే రాజకీయం ప్రేరేపిత వివక్షతో కూడిన చర్యని పేర్కొంది. ఈ అంశంపై అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో చేసిన వ్యాఖ్యలపై చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి మావో నింగ్ గురువారం తీవ్రంగా స్పందించారు. ఈ విషయంపై చైనా అమెరికాలో ఉన్న తమ ప్రతినిధులతో సంప్రదింపులు జరుపుతోందన్నారు. అమెరికా చెప్పుకునే స్వేచ్ఛ, నిష్కపట విలువలు బూటకమని వ్యాఖ్యానించారు. ఇది అమెరికా ప్రతిష్టను, విశ్వసనీయతను మరింత దెబ్బతీస్తుందన్నారు. 'జాతీయ భద్రత సాకుతో చైనా విద్యార్థుల వీసాలను అన్యాయంగా రద్దు చేయడం వారి చట్టబద్ధమైన హక్కులు, ప్రయోజనాలను తీవ్రంగా దెబ్బ తీసింది. రెండు దేశాల మధ్య సాధారణ ప్రజల మధ్య రాకపోకలకు కూడా అంతరాయం కలిగిస్తుంది. ఈ చర్యలను చైనా గట్టిగా వ్యతిరేకిస్తుంది'అని ప్రకటించారు. కాగా, చైనా కమ్యూనిస్ట్ పార్టీతో సంబంధాలు ఉన్న వారితో సహా కొన్ని కీలకమైన రంగాలలో చదువుతున్న చైనా విద్యార్థుల వీసాలను అమెరికా ప్రభుత్వం రద్దు చేస్తుందని అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో బుధవారం ప్రకటించారు.

గందరగోళంలో విద్యార్థుల భవితవ్యం

ఇప్పటికే అమెరికాలో విదేశీ విద్యార్థులపై పెరుగుతున్న అనిశ్చితికి తోడుగా వెలువడిన ఈ ప్రకటనతో చైనీస్ విద్యార్థులు భవితవ్యం గందరగోళంలో పడింది. అమెరికాలోని అంతర్జాతీయ విద్యార్థుల్లో భారత్ తరువాత రెండో అతిపెద్ద దేశం చైనా. 2023–2024 విద్యా సంవత్సరంలో 270,000 కంటే ఎక్కువ మంది అంతర్జాతీయ విద్యార్థులు చైనా నుంచే వచ్చారు. ఇది యూఎస్‌లోని మొత్తం విదేశీ విద్యార్థులలో దాదాపు నాలుగింట ఒక వంతు. విదేశాలలో చదువుతున్న చైనా విద్యార్థుల సమస్య చాలా కాలంగా ద్వైపాక్షిక సంబంధంలో ఉద్రిక్తతకు దారితీసింది. ట్రంప్ మొదటి పదవీకాలమైన 2019లో వీసాల తగ్గింపు, తిరస్కరణల రేట్లు పెరగడంతో విద్యార్థులను చైనా విద్యా శాఖ విద్యార్థులను హెచ్చరించింది. ఇక గతేడాది అమెరికా చేరుకున్న అనేక మంది చైనా విద్యార్థులను అన్యాయంగా విచారించి విమానాశ్రయాల నుంచి వెనక్కి పంపింది. ఈ నేపథ్యంలో కోవిడ్ తరువాత చాలామంది చైనా విద్యార్థులు యూకే వైపు మొగ్గుచూపుతున్నారు. మరోవైపు హాంకాంగ్ సైతం చైనా విద్యార్థులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. హార్వర్డ్‌కు విదేశీ విద్యార్థులను చేర్చుకునే మోదాను రద్దు చేసిన తరువాత.. ఆ విద్యార్థులను ఆహ్వానిస్తూ పోస్ట్ చేసింది. అయితే.. వీసా రద్దులు అమెరికాకు మేలు చేయవని, ఇది చైనా అభివృద్ధికే సానుకూల మార్పు కావచ్చని బీజింగ్‌లో విద్యావేత్తలు అంటున్నారు. ప్రతిభావంతులైన వ్యక్తులు సింఘువా లేదా పెకింగ్ విశ్వవిద్యాలయంలో లేదా చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌తోపాటు చైనాలోని ఇతర అగ్రశ్రేణి సంస్థల్లో చేరతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇది దేశీయ శాస్త్ర, సాంకేతిక అభివృద్ధికి ప్రయోజనం చేకూరుస్తుందని చెబుతున్నారు.

కులగణన ఎంఆర్ఐ స్కానింగ్ లాంటిదే...

ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ వ్యాఖ్య

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా జన గణనతోపాటు కుల గణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడాన్ని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ స్వాగతించారు. కుల గణన అనేది సమాజానికి చేసే ఎంఆర్ఐ స్కానింగ్ లాంటిదేని చెప్పారు. ఇదొక విప్లవాత్మక చర్య అవుతుందన్నారు. సమాజంలో మార్పు తీసుకురావడానికి, ప్రజలకు సామాజిక న్యాయం చేకూర్చడానికి కుల గణన దోహదపడుతుందని తెలిపారు. కొందరు వాదిస్తున్నట్లు కుల గణనతో ఎలాంటి సమస్యలు రావని స్పష్టం చేశారు. ప్రజల నుంచి సమాచారం సేకరిస్తే కొత్త సమస్యలు ఎలా వస్తాయో చెప్పాలని ప్రశ్నించారు. గురువారం ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీసు(ఐఎస్ఎస్) కార్యక్రమంలో జగదీప్ ధన్‌ఖడ్ ప్రసంగించారు. సరైన గణాంకాలు అందుబాటులో లేకుండా విధానపరమైన ప్రణాళికలు రూపొందించడం చీకట్లో శస్త్రచికిత్స చేయడం లాంటిదేనని వ్యాఖ్యానించారు. కుల గణన మన దేశంలో గేమ్ చేంజర్ కానుందని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలను నెరవేస్తుందని చెప్పారు. ప్రభుత్వం చక్కటి నిర్ణయం తీసుకుందని ధన్‌ఖడ్ ప్రశంసించారు. దేశ ప్రగతికి అవసరమన విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాలంటే కచ్చితత్వంతో కూడిన గణాంకాలు అవసరమని సూచించారు.

రక్షణ ప్రాజెక్టుల్లో ఇంత ఆలస్యమా?

ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: రక్షణ రంగానికి సంబంధించి ఆయుధాల సేకరణ ప్రాజెక్టులపై ఒప్పందాలు, సంతకాలు జరుగుతున్నాయి తప్ప అవి సకాలంలో అమలు కావడం లేదని చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్ చీఫ్ ఎయిర్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ అసంతృప్తి వ్యక్తంచేశారు. ఆయుధాలు, యుద్ధ విమానాలు, రక్షణ పరికరాలు సైన్యంచేతికి అందడం చాలా ఆలస్యమవుతోందని అన్నారు. మనం చేయలేని పనికి వాగ్దానాలు చేయడం ఎందుకని ప్రశ్నించారు. గురువారం సీఐఐ బిజినెస్ సమ్మిట్–2025లో అమర్‌ప్రీత్ సింగ్ మాట్లాడారు. భారత్–పాకిస్తాన్‌ల మధ్య ఘర్షణల అనంతరం ఆయన బహిరంగంగా స్పందించడం మొదటిసారి. రక్షణ ప్రాజెక్టుల్లో టైమ్‌లైన్ అతిపెద్ద సమస్యగా మారిందని అమర్‌ప్రీత్ సింగ్ చెప్పారు. తనకు తెలిసినంత వరకు సకాలంలో పూర్తయిన ప్రాజెక్టు ఏదీ లేదన్నారు. అందుకే ఆచరణ సాధ్యం కాదని టైమ్‌లైన్లకు దూరంగా ఉండాలన్నారు. రక్షణ రంగంలో ఆయుధాల సేకరణ ప్రాజెక్టులను వేగవంతం చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సైనిక దళాలకు కాలానుగుణంగా నూతన టెక్నాలజీని ప్రవేశపెట్టాలన్నారు. సైన్యాన్ని అన్నివిధాలుగా బలోపేతం చేస్తేనే యుద్ధాల్లో గెలుస్తామని వ్యాఖ్యానించారు.



విమానం కూలిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సైనికాధికారులు

కుప్పకూలిన దక్షిణ కొరియా నేవీ విమానం

నలుగురు మృతి

సియోల్: దక్షిణ కొరియా నావికాదళ విమానం గురువారం కూలిపోయింది. ఈ ప్రమాదంలో నావికా దళానికి చెందిన నలుగురు మృతి చెందారు. నావికాదళానికి చెందిన పీ–3 గస్తీ విమానం మధ్యాహ్నం 1:43 గంటలకు పోహాంగ్‌లోని తన స్థావరం నుంచి బయలుదేరింది. ఆ తరువాత కొద్దిసేపటికే కుప్పకూలిపోయింది. గుర్తు తెలియని విమానం సమీపంలోని కొండలపై పడి మంటలు చెలరేగాయని స్థానికుల సమాచారంతో రెస్క్యూ వర్కర్లు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మొదట ఇద్దరి మృతదేహాలు లభించగా.. ఆ తరువాత మరో ఇద్దరి మృతదేహాలు లభించాయి. విమానం కూలిన స్థలంలో చెట్లు కూడా ఉండటంతో పూర్తిగా కాలిపోయి.. బూడిద రంగు పొగ ప్రాంతమంతా కమ్ముకుంది. ప్రమాదానికి గల కారణాన్ని పరిశోధించడానికి ఒక టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసి, పీ–3 విమానాలన్నింటినీ తాత్కాలికంగా నిలిపివేసినట్లు నావికాదళం ప్రకటించింది. విమానం గుట్టలను తాకడం వల్లే ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక విచారణలో తేలింది.

ఆ వీడియో చూసి సిగ్గనిపించడం లేదా?

బ్లూ ఫిల్మ్‌ను మించి పోయింది ● ప్రధాని మోదీపై మమత మండిపాటు

కోల్‌కతా: మధ్యప్రదేశ్ బీజేపీ నేత అశ్లీల వీడియో, ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి వ్యాఖ్యలను తప్పుబడుతూ ప్రధాని మోదీపై బెంగాల్ సీఎం మమతా బెనర్జీ నిప్పులు చెరిగారు. 'మధ్యప్రదేశ్‌లో జరిగిన ఘటనను చూసి మీకు సిగ్గనిపించడం లేదా? వీధిలోనే బ్లూ ఫిల్మ్ చూపినట్లుగా ఉంది'అని గురువారం ఆమె మీడియా ఎదుట విమర్శలు చేశారు. మందసౌర్‌కు చెందిన బీజేపీ నేత మనోహర్ లాల్ ధాకడ్ ఢిల్లీ–ముంబై ఎక్స్‌ప్రెస్‌వేపై నిలిపి ఉంచిన వాహనంలో మహిళతో అభ్యంతరకరంగా ఉన్న ఒక వీడియో బయటకు రావడంపై ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే, అతడు స్థానిక పంచాయతీ సమితి సభ్యురాలి భర్త అనీ, తమ పార్టీ సభ్యుడు కాదని బీజేపీ అంటోంది. అదేవిధంగా, ఆపరేషన్ సిందూర్ తరహాలో ఆపరేషన్ బెంగాల్ చేపడతామంటూ ప్రధాని మోదీ సభలో బీజేపీ నేతలు ప్రకటించడంపై మమత తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ వ్యాఖ్యలు విచారకరం, అవి విని షాకయ్యామని మమత పేర్కొన్నారు. 'ఈ వ్యాఖ్యలతో ప్రధాని మోదీ, ఆయన పార్టీ నేతలు బెంగాల్ మహిళలను అవమానించారు. మేం ప్రతి ఒక్కరినీ గౌరవిస్తాం. కానీ, ఆత్మాభిమానాన్ని తాకట్టుపెట్టలేం. ఆ మాట అనడానికి ఆ నేతలకు ఎంత ధైర్యం?'అంటూ మండిపడ్డారు. 'మహిళలంటే కనీస గౌరవం కూడా లేని నాయకుల పార్టీ బీజేపీ. ఆపరేషన్ సిందూర్‌పై నేనేమీ మాట్లాడలేను. మహిళలను గౌరవించాలనే విషయం గుర్తుంచుకోండి. మహిళలు తమ భర్తల నుండి సిందూరం తీసుకుంటారు. కానీ, ప్రధాని మోదీ ప్రతి స్త్రీకి భర్త కాదు. ప్రధాని మోదీ ఆయన శ్రీమతికి సిందూరం ఎందుకివ్వలేదు?'అని ఆమె నిలదీశారు. ఆపరేషన్ సిందూర్‌తో రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రధాని ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. పహల్గాం ఘటనకు కారకులైన ముష్కరులను ఇప్పటికీ ఎందుకు పట్టుకోలేదని ప్రధానిని ఆమె ప్రశ్నించారు. అంతకుముందు, ప్రధాని మోదీ పాల్గొన్న సభలో బీజేపీ బెంగాల్ చీఫ్, కేంద్ర మంత్రి సుకాంద మజుందార్, ప్రతిపక్ష నేత సువేందు అధికారి మాట్లాడుతూ..' ఆపరేషన్ సిందూర్ తరహాలో ఆపరేషన్ బెంగాల్ చేపట్టాలి. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీని బంగాళాఖాతంలో విసిరేయాలి' అంటూ పిలుపునివ్వడం గమనార్హం.

వెస్ట్‌బ్యాంక్‌లో 22 సెటిల్మెంట్లు

ఇజ్రాయెల్ భారీ ప్రణాళిక

జెరుసలేం: వెస్ట్‌బ్యాంక్, గాజా, తూర్పు జెరుసలేంలను కలిపి ప్రత్యేక దేశం చేయాలన్న పాలస్తీనా వాసుల డిమాండ్‌ను మరింత సంక్లిష్టం చేసే దిశగా ఇజ్రాయెల్ చర్యలను ముమ్మరం చేసింది. గాజాను మూడు నెలలుగా దిగ్బంధించిన ఇజ్రాయెల్ తాజాగా ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్ ప్రాంతంలో యూదుల కోసం 22 సెటిల్మెంట్లు నిర్మించనున్నట్లు గురువారం ప్రకటించింది. ప్రభుత్వపరంగా అనుమతులు లేకుండా ఇప్పటికే వెస్ట్‌బ్యాంక్‌లో నిర్మించిన ఔట్‌పోస్ట్‌లను చట్టబద్ధం చేసినట్లు తెలిపింది. ఇప్పటికే ఇక్కడ ఇజ్రాయెల్ ప్రభుత్వం నిర్మించిన సుమారు 100 సెటిల్మెంట్లలో 5 లక్షల మంది యూదులు నివాసం ఉంటున్నారు. ఈ సెటిల్మెంట్లలో అపార్టుమెంట్ బ్లాకులు, షాపింగ్ మాల్‌లు, ఫ్యాక్టరీలు, పబ్లిక్ పార్కులు ఉన్నాయి. సుమారు 30 లక్షల మంది పాలస్తీనియన్లున్న వెస్ట్‌బ్యాంక్‌లో ఇజ్రాయెల్ ఆర్మీ పాలన నడుస్తోంది. పరిపాలన వ్యవహారాలను పశ్చిమ దేశాల అండ కలిగిన పాలస్తీనా అథారిటీ చూసుకుంటోంది. ఈ ప్రాంతంలోని సెటిలర్లకు ఇజ్రాయెల్ పౌరసత్వమే ఉంటుంది. సెటిల్మెంట్లను ఏర్పాటు చేయాలన్న నిర్ణయంపై ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ స్పందిస్తూ.. ఈ భూమిపై మన చారిత్రక హక్కును చాటుకునేందుకు, పాలస్తీనా ఉగ్రవాదానికి ఇదే సరైన జవాబు'అని పేర్కొన్నారు. 1967లో జరిగిన యుద్ధంలో ఇజ్రాయెల్ ఆర్మీ వెస్ట్‌బ్యాంక్, గాజా, తూర్పు జెరుసలేంలను ఆక్రమించుకుంది. ఈ మూడింటిని కలిపి పాలస్తీనా ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఎప్పటినుంచో ఉంది. అయితే, ఇజ్రాయెల్ మాత్రం నివాసాలను నిర్మించి యూదులను తరలిస్తోంది. ఇది అక్రమమని, దశాబ్దాలుగా కొనసాగుతున్న సమస్య పరిష్కారంలో అడ్డంకిగా ఉంటుందని పాలస్తీనియన్లు అంటున్నారు. ఇజ్రాయెల్ ఆర్మీ 2005లో గాజా నుంచి ఉపసంహరించుకుంది. అయితే, ఈ ప్రాంతాన్ని తిరిగి ఆధీనంలోకి తెచ్చుకోవాలని, అక్కడున్న పాలస్తీనియన్లను మరోచోటుకు తరలించాలని ఇజ్రాయెల్ ప్రభుత్వంలోని కొందరు డిమాండ్ చేస్తున్నారు. ఇదే సమయంలో 2023 అక్టోబర్ 7న సాయుధులు సరిహద్దుల్లోని ఇజ్రాయెల్ భూభాగంపైకి మెరుపు దాడులు చేపట్టి 1,200 మందిని చంపడంతోపాటు మరో 251 మందిని బందీలుగా పట్టుకెళ్లడంతో ఇజ్రాయెల్ ఆర్మీ గాజాపై దాడులు మొదలుపెట్టింది. ఈ దాడుల్లో మహిళలు, చిన్నారులు సహా 54 వేల మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. వేలాదిగా నివాస భవనాలు ధ్వంసమయ్యాయి. అయినప్పటికీ హమాస్ 58 మంది బందీలను వదల్లేదు.

గాజాలో 35 మంది మృతి

బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు ఇజ్రాయెల్ చేపట్టిన దాడుల్లో కనీసం 35 మంది చనిపోయారని గాజా వర్గాలు తెలిపాయి. గాజా నగరంలో నలుగురు, జబాలియాలోని ఓ నివాసంపై జరిగిన దాడిలో ఇద్దరు మహిళలు, ముగ్గురు చిన్నారులు సహా 8 మంది, గాజాలోని శరణార్థుల టెంట్‌పై జరిగిన దాడిలో ఒకరు చనిపోగా 18 మంది గాయపడ్డారు. సెంట్రల్ గాజాలో జరిగిన మరో దాడిలో 9 మంది మహిళలు, చిన్నారులు సహా 22 మంది మృతి చెందారు. ఇలా ఉండగా, దక్షిణ గాజాలోని రఫాలో హమాస్ వాడే కొన్ని మీటర్ల పొడవైన సొరంగాన్ని ధ్వంసం చేశామని ఇజ్రాయెల్ తెలిపింది. హమాస్ తన వద్ద ఉన్న బందీలను ఇటువంటి భూగర్భ సొరంగాల్లోనే దాచి ఉంటుందని ఇజ్రాయెల్ అనుమానిస్తోంది.

కరెంటు కోత స్కూల్ ఫీజు మోత

ఇదే ఢిల్లీ బీజేపీ సర్కార్ రిపోర్ట్ కార్డ్: అతిశీ

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీని బీజేపీ ప్రభుత్వం అస్తవ్యస్త, అయోమయ పరిస్థితుల్లోకి నెట్టేసిందని ప్రతిపక్ష ఆప్ ఆరోపించింది. బీజేపీ ప్రభుత్వం వంద రోజుల పనితీరుపై ఆప్ గురువారం 15 అంశాలతో రిపోర్ట్ కార్డ్‌ను విడుదల చేసింది. 'మే 30వ తేదీతో బీజేపీ ప్రభుత్వానికి 100 రోజులు పూర్తవుతాయి. మార్పు కోరుకున్న ప్రజలు బీజేపీని నమ్మి ఓటేశారు. బీజేపీ ప్రభుత్వం మాత్రం అభివృద్ధిని వదిలేసి, ఈ మూడు నెలల్లో అస్తవ్యస్త పరిస్థితులను తీసుకొచ్చింది'అని మాజీ సీఎం, ప్రతిపక్ష నేత అతిశీ మీడియా సమావేశంలో పేర్కొన్నారు. కొత్త పథకాలను ప్రారంభించడం మాట అటుంచి ఇప్పటికే కొనసాగుతున్న మంచి పనులను సైతం నిలిపివేసిందని మండిపడ్డారు. ఇందుకు సంబంధించిన పలు వివరాలను అతిశీ వెల్లడించారు. తరచూ కరెంటు కోతలు అమలవుతుండటం ఇందులో ప్రధానమైంది. దేశ రాజధాని నగరంలో కరెంటు కోతలు సర్వసాధారణంగా మారాయని, కరెంటు చార్జీలను 7 నుంచి 15 శాతం మేర బీజేపీ ప్రభుత్వం పెంచిందన్నారు.

వాల్ స్ట్రీట్ వేదికగా బరాత్

న్యూయార్క్: భారతీయులు అడుగుపెడితే ఎలాంటి పాశ్చాత్య ప్రాంతమైనా ఒక్కసారిగా భారతీయతను సంతరించుకుంటుంది. ప్రఖ్యాత న్యూయార్క్ నగర వీధి హఠాత్తుగా పెళ్లి ఊరేగింపునకు వేదికగా మారి అక్కడి విదేశీయులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. ఏకంగా 400 మంది భారతీయులు సంప్రదాయ వస్త్రధారణలో పెళ్లి ఊరేగింపు(బరాత్) నిర్వహించారు. ఇందుకు వాల్‌స్ట్రీట్ వీధి వేదికైంది. సంబంధిత వీడియోలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఎరుపు రంగు లెహంగాలో వధువు, గులాబీ, తెలుపు షేర్వాణీలో వరుడు సైతం అతిథులతో కలిసి నృత్యంచేశారు. డ్యాన్సులకుతోడు అద్భుతమైన పాటలు, చక్కటి సంగీతం, నవ్వులు, కేరింతలు, బంధుమిత్రుల కేరింతలు, డీజే సౌండ్, పాప్ మ్యూజిక్‌తో ఆ వీధి మొత్తం ఒక్కసారిగా కోలాహలంగా మారింది. బాలీవుడ్ పాటలకు తగ్గట్లు 400 మంది ఒకేసారి స్టెప్పులేస్తుంటే, శాస్త్రీయసంగీతానికి అనుగుణంగా నృత్యంచేస్తుంటే లోయర్ మాన్‌హట్టన్ దారులు ఒక్కసారిగా పక్కా భారతీయ బజార్లుగా మారిపోయాయి. సూటు, బూటు వేసుకొని పాశ్చాత్య వస్త్రధారణలో వస్తూపోతూ ఉన్న విదేశీయులు ఈ వివాహవేడుకను చూస్తూ అలాగే ఉండిపోయారు. కొందరు సెల్ఫీలు తీసుకున్నారు. డిజిటల్ స్టాక్‌మార్కెట్ వీధిలో డీజే మోత మోగించారని కొందరు నెటిజన్లు కామెంట్లు చేశారు.

రిటైర్మెంట్ రోజున గౌరవ ర్యాంకు

సాయుధ బలగాలకు హోం శాఖ కానుక

న్యూఢిల్లీ: కేంద్ర సాయుధ బలగాలు(సీఏపీఎఫ్), అస్సాం రైఫిల్స్‌లోని ఆఫీసర్ స్థాయి దిగువ సిబ్బందికి కేంద్ర హోం శాఖ కానుక ప్రకటించింది. రిటైరయ్యే రోజున వారికి గౌరవ ర్యాంకు ప్రదానం చేయనుంది. కానిస్టేబుల్ నుంచి సబ్ ఇన్‌స్పెక్టర్ స్థాయి సిబ్బందికి ఇది వర్తిస్తుంది. సాయుధ బలగాల్లోని వారికి ఆత్మగౌరవం, నైతిక సామర్థ్యాలను పెంచడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఒక ప్రకటనలో తెలిపింది. దీని ప్రకారం.. కానిస్టేబుల్ ఇకపై హెడ్ కానిస్టేబుల్‌గా రిటైరవుతారు. అదేప్రకారం హెడ్ కానిస్టేబుల్ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా, ఒక అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా, ఒక సబ్ ఇన్‌స్పెక్టర్ ఇన్‌స్పెక్టర్‌గా పదవీ విరమణ చేస్తారు. ఆలాగే, రైఫిల్ మ్యాన్ హవల్దార్‌గా, హవల్దార్ వారెంట్ ఆఫీసర్‌గా రిటైరవనున్నారు. అయితే, ఆర్థిక, పింఛను సంబంధిత ప్రయోజనాల్లో ఎటువంటి మార్పులూ ఉండవని ఆ ప్రకటన స్పష్టం చేసింది. ఈ అదనపు ర్యాంకు పొందే వారు పదోన్నతి అర్హతలన్నిటినీ కలిగి ఉండటం తప్పనిసరి తెలిపింది.

మెడను చీల్చుకుంటూ మెదడులోకి మేకు..

10 గంటల సర్జరీతో తొలగించిన లక్నో వైద్యులు

లక్నో: ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ కిందపడిన బాలుడి మెడకు గుచ్చుకున్న మేకు మెదడులోకి దిగబడింది. అత్యంత సున్నితమైన మెదడు భాగంలోకి దిగబడిన మేకును వైద్యులు పది గంటలపాటు శ్రమించి, విజయవంతంగా వెలికితీశారు. ఈ ఘటన యూపీలో చోటుచేసుకుంది. బలరాంపూర్ జిల్లాకు చెందిన ఏడేళ్ల బాలుడు ఆడుకుంటూ ఇనుప మేకుపై పడిపోయాడు. సుమారు 8 సెంటీమీటర్ల పొడవైన ఆ మేకు అతడి మెడను చీల్చుకుంటూ, అత్యంత సున్నితమైన మెదడు భాగంలో దిగబడింది. బాలుడిని కుటుంబసభ్యులు లక్నోలోని కింగ్ జార్జి మెడికల్ యూనివర్సిటీ(కేజీఎంయూ)కు తీసుకువచ్చారు. చాలా ప్రమాదకరమైన కేసుగా నిర్ధారణకు వచ్చిన ఆస్పత్రి నిపుణుల బృందం మైక్రో సర్జికల్ సాంకేతికతను, న్యూరో నేవిగేషన్ వ్యవస్థను వాడుకుంటూ అత్యంత జాగ్రత్తగా రక్త నాళాలు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. దాదాపు 10 గంటలపాటు సాగిన అత్యంత సంక్లిష్టమైన ఈ సర్జరీ విజయవంతమైంది. బాలుడు దు నెమ్మదిగా కోలుకున్నాడని, ప్రమాదం నుంచి బయటపడ్డాడని వైద్యులు తెలిపారు. అరుదైన ఈ ఆపరేషన్ వివరాలు త్వరలో అంతర్జాతీయ మెడికల్ జర్నల్‌లో ప్రచురితం కానున్నాయని చెప్పారు.

అమర్‌నాథ్ యాత్రకు భారీ బందోబస్తు

న్యూఢిల్లీ: పహల్గాం దారుణం నేపథ్యంలో అమర్‌నాథ్ యాత్రకు కేంద్రం భారీగా భద్రతా ఏర్పాట్లను చేపట్టింది. జూలై 3న మొదలై ఆగస్టు 9వ తేదీతో ముగిసే యాత్రకు ఈసారి 42 వేల మందితో కూడిన 581 కంపెనీల కేంద్ర సాయుధ పోలీస్ బలగాల(సీఏపీఎఫ్)ను బందోబస్తుకు వినియోగించనున్నట్లు గురువారం ప్రకటించింది. ఇందులో భాగంగా ఆపరేషన్ సిందూర్ కోసం విధుల్లో ఇప్పటికే ఉన్న 80 కంపెనీల బలగాలను అమర్‌నాథ్ యాత్ర మార్గంలో బందోబస్తుకు మళ్లించనుంది. మిగతా 424 కంపెనీల జవాన్లను తక్షణమే అక్కడికి వెళ్లాలని ఆదేశించినట్లు హోం శాఖ అధికారి ఒకరు వివరించారు. జూన్ 2వ వారం కల్లా వీరు విధుల్లో చేరుతారని తెలిపారు. ఇందులో సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్‌బీ విభాగాల జవాన్లుంటారని చెప్పారు. ఒక్కో కంపెనీలో 70 నుంచి 75 మంది వరకు ఉంటారన్నారు.

పాక్ కాల్పుల బాధితులకు సాయం చేయండి

ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ లేఖ

న్యూఢిల్లీ: పాకిస్తాన్ సైన్యం ఇటీవల నియంత్రణ రేఖ వెంబడి(ఎల్‌వోసీ)వెంబడి సాగించిన తీవ్ర కాల్పుల్లో నష్టపోయిన పూంఛ్ తదితర ప్రాంతాల్లోని ప్రజలకు తక్షణమే సాయం అందించి, పునరావాసం కల్పించాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ప్రధాని మోదీకి లేఖ రాశారు. గత శనివారం రాహుల్ పూంచ్‌లో పర్యటించి, ఈ నెల 7–10వ తేదీల మధ్య పాక్ కాల్పులతో నష్టపోయిన వారిని పరామర్శించడం తెల్సిందే.

పాక్‌కు సున్నిత సమాచారం చేరవేత

మహారాష్ట్ర, రాజస్తాన్‌లలో ఇద్దరి అరెస్ట్

న్యూఢిల్లీ/ముంబై/జైపూర్: పాకిస్తాన్‌కు రక్షణ శాఖకు సంబంధించిన సున్నిత సమాచారాన్ని అందజేసిన ఆరోపణలతో అధికారులు రాజస్తాన్, మహారాష్ట్రకు చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఒకరు మహారాష్ట్రలోని రక్షణ రంగ సంస్థలో జూనియర్ ఇంజనీర్ కాగా, మరొకరు జైసల్మీర్‌లోని ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయం అధికారి. దక్షిణ ముంబైలోని నవాల్ డాక్‌యార్డ్‌లో పనిచేసే జూనియర్ రవీంద్ర మురళీధర్ వర్మ(27)కు విధుల రీత్యా కీలక సమాచారం అందుబాటులో ఉంటుంది. ఇతడికి ఫేస్‌బుక్‌లో ఒక మహిళ పరిచయమైంది. ఆమె వలలో చిక్కిన వర్మ కీలకమైన సమాచారాన్ని 2024 నవంబర్–2025 మార్చి మధ్యలో చేరవేశాడు. అది పాకిస్తానీ ఇంటెలిజెన్స్ ఆపరేటివ్(పీఐవో)కు చేరిందని అధికారులు రూఢి చేసుకున్నారు. బుధవారం అదుపులోకి తీసుకుని, విచారణ చేపట్టారు. అదేవిధంగా, రాజస్తాన్‌లో జైసల్మీర్‌లో జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఆఫీస్‌లో అసిస్టెంట్ అడ్మినిస్ట్రేషన్ అధికారిగా ఉన్న షకూర్ ఖాన్‌ను బుధవారం రాత్రి నిఘా అధికారులు అదుపులోకి తీసుకున్నారు. 2011 నుంచి ప్రభుత్వానికి ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే ఏడు పర్యాయాలు ఖాన్ పాకిస్తాన్‌కు వెళ్లి వచ్చినట్లు గుర్తించారు. సరిహద్దులకు సమీపంలోని జైసల్మీర్‌కు చెందిన భద్రతా పరమైన కీలక సమాచారాన్ని ఆ సమయంలో అతడు పాక్ నిఘా విభాగానికి అందించినట్లు అనుమానిస్తున్నారు.

నేనిప్పుడు ప్రపంచంలోనే ఫేమస్..!

'పహల్గాం' సూత్రధారి కసూరి వ్యాఖ్యలు

ఇస్లామాబాద్: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో 26 మంది ఉసురుతీసిన లష్కరే తొయిబా కమాండర్ సైఫుల్లా కసూరి తన ముసుగు తొలగించాడు. పాకిస్తాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లోని కసూర్‌లో జరిగిన ర్యాలీలో బుధవారం మాట్లాడాడు. 'పహల్గాం ఉగ్రవాద దాడికి నేనే ప్రధాన సూత్రధారి అంటూ నిందిస్తున్నారు. దీంతో, ఇప్పుడు నా పేరు ప్రపంచంలో అందరికీ తెలిసిపోయింది'అని కసూరి అలియాస్ ఖాలిద్ డాంబికాలు పలికాడు. అలహాబాద్‌లో ముదస్సిర్ షహీద్ పేరుతో ఒక ఆస్పత్రి, ఒక రోడ్డు, ఇంకో భవనాన్ని నిర్మించనున్నట్లు అతడు ప్రకటించాడు. భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో మరణించిన ఉగ్ర నేతల్లో ముదస్సిర్ షహీద్ సైతం ఉన్నట్లు నిఘా వర్గాలు చెబుతుండటం గమనార్హం. కాగా, భారత్ వాంటెడ్ జాబితాలో ఉన్న లష్కరే తొయిబా వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్ కుమారుడు తల్హా సయీద్ అనంతరం మాట్లాడాడు. ఇతడు 'నారా ఇ తక్‌బీర్'వంటి జిహాదీ నినాదాలతో మరింత రెచ్చగొట్టే ప్రసంగం చేశాడు. పాకిస్తాన్ మర్కాజీ ముస్లిం లీగ్(పీఎంఎంఎల్) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం ఆద్యంతం రెచ్చగొట్టే ప్రసంగాలు, భారత వ్యతిరేక నినాదాలతో సాగింది.

బుద్ధుడి బోధనలను చివరిసారిగా విన్నవారెవరు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

బౌద్ధమత ఆవిర్భావం

క్రీ.పూ. 6వ శతాబ్దంలో పలు మత ఉద్యమాలు చోటుచేసుకున్నాయి. వైదిక మతంపై తిరుగుబాటు ఉద్యమంగా బౌద్ధమతం ఆవిర్భవించింది. ఈ మత స్థాపకుడు సిద్ధార్థుడు లేదా గౌతముడు. సిద్ధార్థుడు క్రీ.పూ. 563లో ప్రస్తుత నేపాల్‌లోని లుంబినీ వనంలో జన్మించాడు. ఇతని తండ్రి కపిలవస్తును పాలించే శాక్య క్షత్రియ రాజు శుద్ధోధనుడు. ఈ వంశంలో జన్మించిన వాడు కాబట్టి బుద్ధుడిని శాక్యముని అని కూడా పిలుస్తారు. ఇతడి తల్లిపేరు మహామాయ. బుద్ధుడు జన్మించిన వెంటనే ఆమె మరణించడంతో సవతి తల్లి గౌతమి ప్రజాపతి ఆయనను పెంచింది. అందుకే సిద్ధార్థుడిని గౌతముడిగానూ పిలుస్తారు. అతడు చిన్న వయసులోనే యశోధరను వివాహం చేసుకొన్నాడు. వీరి కుమారుడు రాహులుడు. సిద్ధార్థుని సవతి తల్లి కుమారుడు దేవదత్తుడు. సిద్ధార్థుని జీవితంలో సంభవించిన నాలుగు సంఘటనలు అతనికి ప్రాపంచిక సుఖాల పట్ల విరక్తిని కలిగించాయి.

మొదటి సంఘటనలో ఒక ముసలి వాడిని, రెండో సంఘటనలో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఒక రోగిని, మూడో సంఘటనలో ఒక శవాన్ని, నాలుగో సంఘటనలో ఒక సర్వసంగ పరిత్యాగైన సన్యాసిని చూశాడు. అనంతరం ఈ బాధల నుంచి మానవులకు విముక్తిని ప్రసాదించే మార్గం అన్వేషించేందుకు తన 29వ ఏట 'చెన్న' అనే సేవకుడి సహాయంతో 'కంటక' అనే గుర్రంపై సిద్ధార్థుడు తన అంతఃపురాన్ని వదిలి సత్యాన్వేషణకు బయలుదేరాడు. ఈ సంఘటననే మహాభినిష్క్రమణం అంటారు.

ఆ తర్వాత దాదాపు ఏడేళ్లు బుద్ధుడు సన్యాసిగా జ్ఞానార్జనకు ప్రయత్నించాడు. ఈ సమయంలో అతడు మొదటగా వైశాలిలోని 'అలారకలామ' అనే గురువు వద్ద, తర్వాత రాజగృహంలోని ఉద్దకుడు లేదా రామపుత్రుడు అనే గురువు వద్ద శిష్యరికం చేశాడు. చివరికి 35 ఏళ్ల వయసులో బీహార్‌లోని గయ వద్ద నిరంజన్ నది ఒడ్డున, రావిచెట్టు కింద జ్ఞానోదయం పొందాడు. దీన్నే సంబోధి అంటారు. అప్పటి నుంచి సిద్ధార్థుడు బుద్ధుడిగా, గౌతమబుద్ధుడి గా, తథాగతుడిగా పేరొందాడు. జ్ఞానోదయం పొందిననాటి నుంచి మరణించే వరకు (45 ఏళ్ల పాటు) బుద్ధుడు తన సిద్ధాంతాలను ప్రచారం చేశాడు. అయితే తన ప్రవచనాలను తొలిసారి ఐదుగురు వ్యక్తులకు సార్‌నాథ్ వద్ద జింక వనంలో బోధించాడు. దీన్నే ధర్మచక్ర ప్రవర్తనం అం టారు. ఇక్కడి నుంచే బౌద్ధ మతం ప్రారంభమైంది. బుద్ధుడు క్రీ.పూ.483లో 80 ఏళ్ల వయసులో కుశినగరంలోని సాల చెట్టుకింద తనువు చాలించాడు. దీన్నే మహాపరినిర్యాణం అంటారు.

బౌద్ధమత సిద్ధాంతాలు

నాటి వైదిక మత సిద్ధాంతాలను బౌద్ధమతం తీవ్రంగా వ్యతిరేకించింది. కొన్ని వర్గాలకే పరిమితమైన మోక్షాన్ని లింగ, కుల, వర్గ విభేదాలకు అతీతంగా అందరికీ అందుబాటు లోకి తెచ్చింది. సర్వకాల సర్వావస్థల్లో ప్రతి ఒక్కరూ సులువుగా ఆచరించేలా బౌద్ధమత సిద్ధాంతాలు రూపొందాయి. బుద్ధుడు దేవుడి ఉనికిని గుర్తించలేదు. కులవ్యవస్థను, పురోహిత వర్గ (బ్రాహ్మణ) ఆధిపత్యాన్ని ప్రశ్నించాడు.

చత్వారి ఆర్య సత్యాలు

- ప్రపంచమంతా దుఃఖమయం
- దుఃఖానికి కారణం కోరికలు
- కోరికలను జయించడం ద్వారా దుఃఖాన్ని తొలగించొచ్చు.
- దీన్ని సాధించేందుకు ఏకైక మార్గమే అష్టాంగమార్గం.

అష్టాంగ మార్గం

- సరైన దృక్పథం/ దృష్టి
- సరైన లక్ష్యం
- సరైన వాక్కు
- సరైన క్రియ
- సరైన జీవనోపాధి
- సరైన కృషి/ప్రయత్నం
- సరైన చైతన్యం / అవగాహన
- సరైన ధ్యానం

అష్టాంగమార్గం ఒక హేతుబద్ధ సిద్ధాంతం. దీన్ని ఒక నైతిక ప్రవర్తనా నియమావళిగా భావించొచ్చు. ఇది అందరికీ అనుసరణీయం. దీని ద్వారా అతి సులువుగా మోక్షాన్ని పొందవచ్చు. బౌద్ధమతంలో మోక్షం అంటే జరామరణాల నుంచి విముక్తి. ఐతే బుద్ధుడు కర్మసిద్ధాంతాన్ని అంగీకరించాడు. కర్మ, పునర్జన్మకు సంబంధించిన బౌద్ధమత సిద్ధాంతాన్ని ప్రతిత్య సముప్పాద అని అంటారు. ఇందులో ప్రతిచర్యకు ఒక కారణముంటుందని చెప్పారు.



పంచ వ్రతాలు (పంచశీల)

జైనమతంలో ఉన్నట్లుగానే బౌద్ధంలోనూ పంచశీల సిద్ధాంతాలున్నాయి.

- అహింసను పాటించాలి.
- ఇతరుల ఆస్తిని ఆశించొద్దు.
- మత్తు పదార్థాలను సేవించొద్దు.
- అసత్యమాడరాదు.
- లంచగొండి పనులు చేయొద్దు.

బౌద్ధ సంఘం

బౌద్ధమతంలో భిక్షువులు, ఉపాసకులనే రెండు వర్గాల భక్తులున్నారు. భిక్షువులతో ఏర్ప డినవే బౌద్ధ సంఘాలు. ఇవి బుద్ధుని కాలంలోనే ప్రారంభమయ్యాయి. వీటిలో సభ్యత్వం కోసం బౌద్ధ త్రిరత్నాలపై ప్రమాణం చేయాలి. అవి బుద్ధం, ధమ్మం, సంఘం. బౌద్ధ సంఘంలో సభ్యత్వం పొందిన మొదటి స్త్రీ బుద్ధుడి సవతి తల్లి గౌతమి.

పదిహేనేళ్లు దాటని వారికి, నేరస్తులకు దివాలా తీసిన వారికి, అంటువ్యాధిగ్రస్తులకు ఈ సంఘాల్లో ప్రవేశం నిషిద్ధం.

బౌద్ధమత సంగీతులు: బౌద్ధమతంలో వివిధ కాలాల్లో నాలుగు సమావేశాలు (సంగీతులు) జరిగాయి.

మొదటి బౌద్ధ సంగీతి

బుద్ధుడు మరణించిన వెంటనే క్రీ.పూ. 483లో రాజగృహ సమీపంలోని సాతపన్ని గుహల్లో ఈ సమావేశం జరిగింది. బుద్ధుడి ప్రముఖ అనుచరుడైన మహాకశ్యపుడు దీనికి అధ్యక్షత వహించాడు. ఈ సంగీతి అజాతశత్రు పాలనా కాలంలో జరిగింది. దీని ప్రధాన ఉద్దేశం బుద్ధుని బోధనలను క్రోడీకరించడం. ఈ సమావేశం ఫలితంగా బుద్ధుడి శిష్యులైన ఆనందుని కృషితో సుత్తపీటకం, ఉపాలి కృషితో వినయ పీటకాలు క్రోడీకరించారు.

రెండో బౌద్ధ సంగీతి

బుద్ధుడు మరణించిన వందేళ్లకు అంటే క్రీ.పూ. 383లో కాలాశోకుని పాలనా కాలంలో వైశాలిలో ఈ బౌద్ధ సంగీతిని నిర్వహించారు. ప్రవర్తనా నియమావళికి సంబంధించి వజ్జీ సన్యాసులకు, ఇతర సన్యాసులకు మధ్య ఉత్పన్నమైన విభేదాలను పరిష్కరించడం దీని ప్రధాన ఉద్దేశం. ఈ సంగీతికి సబకామి అధ్యక్షత వహించాడు. ఈ సమావేశం ఫలితంగా స్థవిరవాదులు (థేరవాదులు), మహాసాంఘికులు అనే రెండు వర్గాలుగా బౌద్ధసంఘం చీలిపోయింది.

మూడో బౌద్ధ సంగీతి

అశోకుని పాలనా కాలంలో క్రీ.పూ. 250లో పాటలీపుత్రంలో ఈ సమావేశం జరిగింది. బౌద్ధ సన్యాసి మొగలిపుత్త తిస్స దీనికి అధ్యక్షత వహించారు. ఈ సమావేశపు ప్రధాన ఉద్దేశం రెండో సంగీతిలో ఏర్పడిన రెండు వర్గాల మధ్య సయోధ్యను సాధించడం. బౌద్ధమత సిద్ధాంత గ్రంథాలపై చర్చించడం. ఈ సమావేశ ఫలితంగా అభిదమ్మ పీటికను రూపొందించారు. దీంతో బుద్ధుని బోధనలున్న త్రిపీటకాలకు రూపకల్పన జరిగింది.

నాలుగో బౌద్ధ సంగీతి

ఇది క్రీ.శ 1వ శతాబ్దిలో కుషాణరాజు కనిష్కుని పాలనా కాలంలో కాశ్మీర్‌లోని కుందల వనంలో జరిగింది. దీనికి అధ్యక్షుడు వసుమిత్రుడు... ఉపాధ్యక్షుడు అశ్వఘోషుడు.

బౌద్ధమతంలోని 18 శాఖల మధ్య ఉన్న విబేధాలను పరిష్కరించడం ఈ సమావేశ ప్రధాన ఉద్దేశం. కానీ ఈ సంగీతిలోనే బౌద్ధమతం మహాయాన, హీనయాన శాఖలుగా విడిపోయింది

మాదిరి ప్రశ్నలు

1. బౌద్ధమతంలో తొలి చీలిక ఏ సమా వేశంలో సంభవించింది?
   ఎ) మొదటి బి) రెండవ
   సి) మూడవ డి) నాల్గవ
2. శ్రీలంకలో బౌద్ధమతాన్ని ప్రవేశపెట్టిన వారు?
   ఎ) మహేంద్ర, సంఘమిత్ర
   బి) చారుమతి, మహాదేవ
   సి) అతిష దీపాంకర, పద్మసంభవ
   డి) సంతరక్షిత, కమలశీల
3. బౌద్ధ తర్క సిద్ధాంత స్థాపకుడు?
   ఎ) అసంగుడు బి) వసుబంధుడు
   సి) దిగ్నాగుడు డి) బుద్ధఘోషుడు
4. భారతదేశంలో తొలిసారిగా విగ్రహారా ధనను ప్రారంభించినవారు?
   ఎ) హీనయానులు బి) మహాయానులు
   సి) వజ్రయానులు డి) హిందువులు
5. బార్హుత్ శిల్పాల్లో కిందివారిలో ఏ రాజు బుద్ధుడితో సమావేశమైన దృశ్యం కనిపిస్తుంది?
   ఎ) అజాతశత్రు బి) బింబిసార
   సి) బిందుసార డి) అశోకుడు
6. మత ప్రచారకులను పంపే సంప్రదాయం ఏ బౌద్ధమత సమావేశంతో మొదలైంది?
   ఎ) మొదటి బి) రెండవ
   సి) మూడవ డి) నాల్గవ
7. బుద్ధచరిత్రను రచించిన బౌద్ధమత సన్యాసి?
   ఎ) వసు మిత్రుడు బి) అశ్వఘోషుడు
   సి) నాగార్జునుడు డి) ధర్మకీర్తి
8. శ్రీలంకలో బౌద్ధసంగీతిని నిర్వహించిన ఆ దేశ రాజు?
   ఎ) తిస్స బి) వత్తగమని అభయ
   సి) దుత్తగమని డి) విజయబాహు
9. బుద్ధుని తల్లి ఏ మహాజనపదానికి చెందిన రాకుమార్తె?
   ఎ) కోసల బి) అవంతి
   సి) వజ్జీ డి) మగధ
10. బుద్ధుని బోధనలు తొలుత విన్న ఐదుగురు శిష్యుల్లో లేనివారు?
   ఎ) కొండన బి) వాప
   సి) అస్సాగి డి) కశ్యప
11. కింది వాటిలో బుద్ధుని జీవితంలోని ఐదు ప్రధాన సంఘటనలతో సరిపోని చిహ్నం ఏది?
   ఎ) జననం – వృషభం/ కమలం
   బి) మహాభినిష్క్రమణం – అశ్వం
   సి) నిర్వాణం – రావిచెట్టు
   డి) ధర్మచక్ర ప్రవర్తనం – ధర్మచక్రం
   ఇ) పరినిర్యాణం – చైత్యం
12. మధ్యేమార్గాన్ని బోధించిన వారు?
   ఎ) బుద్ధుడు బి) మహావీరుడు
   సి) భాగవత కృష్ణుడు డి) అజీవికుడు
13. ఏ బౌద్ధమత సమావేశంలో పాళి భాషకు బదులు సంస్కృతంలో చర్చలు జరిపారు?
   ఎ) మొదటి బి) రెండవ
   సి) మూడవ డి) నాల్గవ
14. బౌద్ధ సంఘంలో ఎవరికి సభ్యత్వం నిరాకరించారు?
   ఎ) శూద్రులు బి) అస్పృశ్యులు
   సి) స్త్రీలు డి) బానిసలు
15. బౌద్ధమత జన్మస్థలం ఏది?
   ఎ) లుంబిని బి) బుద్ధగయ
   సి) ఇసిపట్టణం (సార్‌నాథ్) డి) శ్రావస్తి
16. బుద్ధడి జీవితంలో వైశాఖ పూర్ణిమ రోజున సంభవించని సంఘటన ఏది?
   ఎ) జననం బి) సంబోధి
   సి) మహాపరినిర్యాణం
   డి) ధర్మచక్ర ప్రవర్తనం
17. కింది బౌద్ధమత శాఖల్లో ఆంధ్రకులుగా దేన్ని పిలుస్తారు?
   ఎ) థేరవాదులు బి) సర్వస్తివాదులు
   సి) మహాసాంఘికులు డి) లోకోత్తర వాదులు
18. ఉపనిషత్తుల్లోని సిద్ధాంతాలతో పోలిక కలిగి ఉన్న బౌద్ధమత శాఖ?
   ఎ) మహాయాన బి) హీనయాన
   సి) వజ్రయాన డి) ఏదీకాదు
19. బుద్ధుడి బోధనలను చివరిసారిగా విన్నవారు?
   ఎ) ఆనంద,ఉపాలి బి) ఉపాలి, కొండన
   సి) కొండన, భదీయ డి) ఆనంద, సుభద్ర
20. బుద్ధుడి ప్రవచనాలు ప్రముఖంగా దేనికి సంబంధించినవి?
   ఎ) భగవంతునిపై నమ్మకం
   బి) క్రతువులు చేయడం
   సి) ఆలోచన, ప్రవర్తనల్లో స్వచ్ఛత
   డి) విగ్రహారాధన
21. బుద్ధుని ప్రభావంతో బౌద్ధమతంలోకి మారిన వేశ్య?
   ఎ) సుజాత బి) విశాఖ
   సి) ఖేమ డి) ఆమ్రపాలి

సమాధానాలు

1) బి 2) ఎ 3) సి 4) బి 5) ఎ
6) సి 7) బి 8) బి 9) ఎ 10) డి
11) ఇ 12) ఎ 13) డి 14) డి 15) సి
16) డి 17) సి 18) ఎ 19) డి 20) సి
21) డి

విద్య పరమావధి.. సమాజాభివృద్ధి



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

ఎస్‌జీటీ - సైన్స్ మెథడ్స్

బోధన సామగ్రి, బోధనాభ్యసన సామగ్రి, సైన్స్‌లో వనరుల వినియోగం

- వ్యవహారిక సత్తావాది అయిన జాన్ డ్యూయీ విద్యను త్రిధ్రువ ప్రక్రియగా వర్ణించారు.
- ఉపాధ్యాయుడు, విద్యార్థి, సమాజం.. త్రిధ్రువాలు.
- విద్య పరమావధి.. సమాజాభివృద్ధి.

సామాజిక వనరుల నిర్వచనం – వినియోగ లక్ష్యాలు – వినియోగించే పద్ధతులు

- **భౌతిక వనరులు:** ప్రకృతిలోని సరస్సులు, చెరువులు, పరిశ్రమలు.
- **సహజ వనరులు:** జంతువులు, వృక్షాలు, జంతు ప్రదర్శనశాలలు.
- **భౌద్ధిక వనరులు:** సమాజంలో వివిధ రంగా ల్లో నిష్ణాతులు, నిపుణులు, ప్రొఫెసర్లు, ఇంజనీర్లు, డాక్టర్లు.

సామాజిక వనరులను ఎందుకు ఉపయోగించాలి?

- బోధనకు కావాల్సిన వస్తు సంపద లభిస్తుంది.
- ప్రత్యక్ష అనుభవాలుంటాయి.
- అమూర్త విషయాలను, మూర్త విషయాలు గా చేయొచ్చు.
- ప్రాతిపదిక అనుభవాల గురించి చక్కని అవగాహన ఏర్పడుతుంది.
- పాఠశాల – సమాజం మధ్య చక్కని సంబంధాలను ఏర్పర్చవచ్చు.

సామాజిక వనరుల వినియోగం- ప్రయోజనాలు

- నేర్చుకునే అంశంపై అవగాహన ఏర్పడుతుంది.
- పాఠశాల బోధనకు కావాల్సిన సామగ్రి, వనరులు సేకరించడం.
- పరిశీలన శక్తి, అన్వేషణ శక్తిని పెంపొందించే సన్నివేశాలు కల్పించడం.

సామాజిక వనరుల ఉపయోగంలో ఉపాధ్యాయుడి పాత్ర

- విద్యార్థులకు ప్రేరణ కలిగించాలి.
- మనిషికి–సమాజానికి–ప్రకృతికి గల సంబంధాన్ని వివరించాలి.
- సామాజిక కృత్యాలు – క్షేత్ర పర్యటనలు నిర్వహించాలి.
- పాఠశాలను సమాజంలోకి, సమాజాన్ని పాఠశాలలోనికి తీసుకురావాలి.

ఎడ్గార్ డేల్ అనుభవాల శంఖువు

- విద్యలో అనుభవాలను వాటి మూర్త, అమూర్త మితిని బట్టి డాక్టర్ ఎడ్గార్ డేల్ ఒక శంఖువు ఆకారక్రమాన్ని వివరించారు. అవి..
  - ప్రత్యక్ష ప్రాయోజిత అనుభవాలు
  - ప్రాతినిధ్య అనుభవాలు
  - నాటకీకరణ అనుభవాలు
  - ప్రత్యక్ష నిరూపణలు
  - అధ్యయన పర్యటనలు
  - ప్రదర్శన వస్తువులు
  - దూరదర్శన్ విద్యా కార్యక్రమాలు
  - రికార్డింగ్, రేడియో, చలన రహిత చిత్రాలు
  - దృశ్య సాంకేతికాలు
  - శాబ్దిక సాంకేతికాలు

బోధనోపకరణాలు–నిర్వచనాలు–బోధనాభ్యసన ప్రక్రియలో వాటి ప్రాముఖ్యత

- అభ్యసన క్రియలో ముఖ్యమైన ప్రేరణ, వర్గీకరణ, సన్నివేశ కల్పనలను పరిపూర్ణం చేసేవే బోధనోపకరణాలని కార్టర్ వి. గుడ్ అభిప్రాయం.
- దృష్టి, శ్రవణం అనే సంవేదనాత్మక మార్గాల ద్వారా అభ్యసనాన్ని ప్రోత్సహించే సాధ నాలే దృశ్యశ్రవ్య ఉపకరణాలు.

– విద్యా నిఘంటువు

బోధనోపకరణాలు – ప్రాముఖ్యత

- సంవేదనాత్మక శక్తుల సమగ్ర వినియోగం
- బోధన సిద్ధాంతాల ప్రాతిపదిక
- విద్యార్థుల అవధానాన్ని నిలిపి ఉంచడం
- ప్రత్యక్ష అనుభవాల ప్రత్యామ్నాయాలు
- వైవిధ్యత కలిగిన వివిధ అనుభవాల కూడళ్లు
- క్రమశిక్షణ సమస్యకు పరిష్కారాలు
- పునర్బలన కారకాలు

సమాచార, సాంకేతిక విజ్ఞానం

1. ఇంటర్‌నెట్ 2. రేడియో
3. టేప్ రికార్డర్ 4. టెలివిజన్

విజ్ఞానశాస్త్ర ప్రయోగశాల – ప్రయోజనాలు

- నిజ నిరూపణ జరుగుతుంది.
- ప్రక్రియా నైపుణ్యాల అభివృద్ధి
- శాస్త్రీయ నైపుణ్యాల అభివృద్ధి
- మానసిక సంతృప్తి కలుగుతుంది.
- విరామ సమయం సద్వినియోగం
- ఆర్థిక ప్రయోజనం
- జ్ఞానం ఒక సముద్రం వంటిది. దీన్ని పుస్తకాల ద్వారా మాత్రమే కాకుండా స్వీయ అనుభవాల ద్వారా కూడా సంపాదించొచ్చు.
  - వైజ్ఞానిక మ్యూజియాలు
  - వైజ్ఞానిక సంఘాలు
  - వైజ్ఞానిక కేంద్రాలు
  - వైజ్ఞానిక విద్యా అనుభవం
  - క్షేత్ర పర్యటనలు
  - విజ్ఞాన ప్రయోగశాల
  - హెర్బేరియం
  - వైవేరియం
  - అక్వేరియం
  - టెర్రేరియం
  - నక్షత్రశాల
- మ్యూజియం అనే పదం mouseion అనే గ్రీకు పదం నుంచి ఉద్భవించింది. mous eion అంటే విద్యార్థి దేవతల నిలయం.
- వైజ్ఞానిక ప్రదర్శనలను రాష్ట్రస్థాయిలో SCERT, జాతీయస్థాయిలో NCERT నిర్వహిస్తున్నాయి.

వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రధాన కమిటీలు

1. వనరుల కమిటీ 2. సావనీర్ కమిటీ
3. ఆతిథ్య కమిటీ 4. క్రమశిక్షణ కమిటీ
5. మేనేజింగ్ కమిటీ
6. ప్రచారం ప్రెస్ కమిటీ 7. ప్రదర్శన కమిటీ
8. వసతి కమిటీ 9. ఆహార కమిటీ
10. చర్చ, క్విజ్, సాంస్కృతిక కమిటీ
11. ప్రాజెక్టు పుస్తక కమిటీ
12. న్యాయనిర్ణేతల కమిటీ

ఉత్తమ ప్రదర్శనకు కావాల్సిన అంశాలు

1. శాస్త్రీయ దృక్పథం
2. సహజత్వం – పనితనం
3. మన్నిక 4. ఆర్థికపరమైన విలువ
5. వ్యక్తిగత ఇంటర్వ్యూ

- **క్షేత్ర పర్యటనలు:** విద్యార్థి క్షేత్ర పర్యటన ద్వారా మొక్కలు, పక్షులు, పంటచేలు, వాగులు, కొండలు మొదలైన వాటి గురించి ఆహ్లాదంగా, స్వేచ్ఛగా ప్రత్యక్షానుభూతి ద్వారా విషయాన్ని నేర్చుకోగలుగుతాడు.
- **హెర్బేరియం:** ఎండబెట్టి భద్రపరిచిన మొక్క ల ఆల్బంను హెర్బేరియం అనొచ్చు.
- **వైవేరియం:** దీని ఏర్పాటు వల్ల మొక్కల సహజ సిద్ధమైన వాతావరణాన్ని తెలుసుకోవడానికి అవకాశం కలుగుతుంది.
- **అక్వేరియం:** ఇది జలచర జీవులను తెలిపే ప్రదర్శనాంశం. ప్రపంచంలో జీవులు ఆహా రం కోసం ఒకదానిపై మరొకటి ఆధారపడి ఉన్నాయి.
- **టెర్రేరియం:** దీని ద్వారా సహజసిద్ధమైన వాతావరణంలో ఉభయచరాలు, భూచరా లైన జీవుల జీవన విధానాన్ని ప్రత్యక్ష అనుభవం ద్వారా పరిశీలించొచ్చు.
- **నక్షత్రశాల:** సామాన్య మానవుడికి ఖగోళం లోని నక్షత్ర మండలాలు, నక్షత్రరాశులు, నక్షత్రాలు, గ్రహాలు, ఉపగ్రహాలు. తోక చుక్కల ఉనికి, గమనాలు మొదలైన విషయాలను విశదపరిచి ప్రత్యక్ష అనుభూతిని కలిగించవచ్చు.
- ప్రాచీన నక్షత్రశాలను ఒర్రేరి (Orrery) అంటారు. దీని ద్వారా విద్యార్థుల్లో స్వయం పరిశీలనశక్తి, శాస్త్రీయ దృక్పథం పెంపొం దుతాయి.

క్షేత్ర పరిశీలనలకు ఉదాహరణ

1. పరిసరాలలోని మొక్కలు, జంతువులు
2. నేలలు – రకాలు
3. నీటివనరులు
4. పంట పొలాలు
5. చేపల పెంపకం
6. కోళ్ల పెంపకం
7. జంతుప్రదర్శనశాల
8. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
9. పురావస్తు ప్రదర్శనశాల
10. పరిశ్రమలు మొదలైనవి.

వైజ్ఞానిక ప్రదర్శనలు–నిర్వహణ: ప్రదర్శనకు అవసరమైన ప్రాంగణం – సదస్సు – వసతులు – బహుమతులు–సమయం. విద్యార్థుల్లోని వైజ్ఞానిక తృష్ణను,భావ వ్యక్తీకరణ విధానాన్ని,జాతీయ సమైక్యతా భావాన్ని పెంపొందించడానికి తోడ్పడతాయి.

మాదిరి ప్రశ్నలు

1. ఒర్రేరి అంటే?
   ఎ) నవీన నక్షత్రశాల
   బి) ప్రాచీన నక్షత్రశాల
   సి) చేపల పెంపకం డి) ఏదీకాదు
2. జాతీయ స్థాయిలో సైన్స్ ఫెయిర్‌ను తొలిసారి ఏర్పాటు చేసిన సంవత్సరం?
   ఎ) 1952 బి) 1954 సి) 1953 డి)1959
3. వైజ్ఞానిక సంఘానికి అధ్యక్షుడు?
   ఎ) సైన్స్ టీచర్ బి) ల్యాబ్ అసిస్టెంట్
   సి) ప్రధానోపాధ్యాయుడు డి) విద్యార్థి
4. టెర్రేరియంలో ఉండే జీవాలు?
   ఎ) ఉభయచరాలు బి) జలచరాలు
   సి) పక్షులు డి) మొక్కలు
5. నీటి మొక్కలను, జలచరాలను పెంచడానికి వాడే గాజుతొట్టి?
   ఎ) అక్వేరియం బి) హెర్బేరియం
   సి) వైవేరియం డి) టెర్రేరియం
6. ఎయిడ్స్ డే ఏ తేదీన నిర్వహిస్తారు?
   ఎ) అక్టోబర్ 26 బి) డిసెంబర్ 1
   సి) నవంబర్ 12 డి) సెప్టెంబర్ 8
7. మ్యూజియం అనే పదం ఏ భాష నుంచి ఉద్భవించింది?
   ఎ) గ్రీకు బి) అరబిక్
   సి) ఫ్రెంచ్ డి) లాటిన్
8. విద్యను త్రిధ్రువ ప్రక్రియగా వర్ణించినవారు?
   ఎ) ప్లేటో బి) అరిస్టాటిల్
   సి) డార్విన్ డి) డ్యూయీ
9. త్రిధ్రువ ప్రక్రియలో భాగం కానిది?
   ఎ) సమాజం బి) సంస్కృతి
   సి) విద్యార్థి డి) ఉపాధ్యాయుడు
10. స్థానిక వనరులు ఎన్ని?
   ఎ) 4 బి) 5 సి) 6 డి) 3
11. ఆంధ్రప్రదేశ్‌లో టెలీ స్కూల్ కార్యక్రమాలను ప్రసారం చేసేవారు?
   ఎ) NCERT బి) SCERT
   సి) APET డి) SIET
12. ప్రఖ్యాతిగాంచిన విశ్వేశ్వరయ్య టెక్నలాజికల్ మ్యూజియం ఎక్కడ ఉంది?
   ఎ) బెంగళూరు బి) మద్రాసు
   సి) ముంబై డి) ఢిల్లీ
13. ఎండబెట్టి భద్రపరిచిన మొక్కల ఆల్బం?
   ఎ) అక్వేరియం బి) హెర్బేరియం
   సి) ఒర్రేరి డి) వైవేరియం
14. ప్రైమరీ సైన్స్ కిట్‌లోని వస్తువుల రకాలు?
   ఎ) 4 బి) 5 సి) 3 డి) 6
15. శంఖువులో అగ్రభాగాన ఉన్న అనుభవాలు
   ఎ) కల్పిత అనుభవాలు
   బి) శాబ్దిక చిహ్నాలు
   సి) ప్రయోగాలు డి) చలనచిత్రాలు

సమాధానాలు

1) బి; 2) డి; 3) సి; 4) ఎ; 5) ఎ;
6) బి; 7) ఎ; 8) డి; 9) బి; 10) డి;
11) డి; 12) ఎ; 13) బి; 14) సి; 15) బి

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్ఐఈఎల్ఐటీ, తిరుపతిలో వివిధ ఉద్యోగాలు

తిరుపతిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఎన్ఐఈఎలీటీ).. ఒప్పంద ప్రాతిపదికన సీనియర్ ఫ్యాకల్టీ, ఫ్యాకల్టీ, జూనియర్ అకౌంటెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 06.
- **పోస్టుల వివరాలు:** సీనియర్ ఫ్యాకల్టీ–02, ఫ్యాకల్టీ–03, జూనియర్ అకౌంటెంట్–01.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ, బీఈ/బీటెక్(సీఎస్ఈ /ఐటీ/ఈసీఈ /ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్)లో ఉత్తీర్ణతతో పాటు కనీసం మూడేళ్ల పని అనుభవం ఉండాలి.
- **వయసు:** సీనియర్ ఫ్యాకల్టీ పోస్టుకు 40 ఏళ్లు, ఫ్యాకల్టీ పోస్టుకు 35 ఏళ్లు, జూనియర్ అకౌంటెంట్‌కు 40 ఏళ్లు ఉండాలి.
- **వేతనం:** నెలకు సీనియర్ ఫ్యాకల్టీ పోస్టుకు రూ.35,000 నుంచి రూ.40,000, ఫ్యాకల్టీ పోస్టుకు రూ.28,000 నుంచి రూ.35,000, జూనియర్ అకౌంటెంట్ పోస్టుకు రూ.20,000 నుంచి రూ.25,000.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఎన్ఐఈఎలీటీ తిరుపతి, రుసా భవన్, గ్రౌండ్ ఫ్లోర్, శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటీ, తిరుపతి–517502 చిరునామాకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 02.06.2025.
- **వెబ్‌సైట్:** https://nielit.gov.in

సెంట్రల్ బ్యాంక్‌లో ఉద్యోగాలు

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(సీబీఐ) గుంటూరు రీజనల్ ఆఫీస్‌లో బిజినెస్ కరస్పాండెంట్ సూపర్‌వైజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 01.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి ఎంఎస్సీ, ఎంబీఏ, పీజీడీఎం, ఎంసీఏలో ఉత్తీర్ణతతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి.
- **వయసు:** 21 ఏళ్ల నుంచి 45 ఏళ్లు ఉండాలి.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రీజనల్ ఆఫీస్–గుంటూరు, ఐదో ఫ్లోర్,స్టాండర్డ్ బిల్డింగ్,బొమ్మిడాలి కాంప్లెక్స్, కలెక్టర్ ఆఫీస్ రోడ్, నాగారం పాలెం, గుంటూరు–522004 చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 17.06.2025.
- **పనిచేయాల్సిన ప్రదేశం:** గుంటూరు.
- **వెబ్‌సైట్:** www.central-bank.net.in

వేర్వేరు అణువుల మధ్య ఉన్న ఆకర్షణ బలాలు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

భౌతిక శాస్త్రం

ద్రవ పదార్థాలు

ద్రవ అణువుల మధ్య బంధ దూరం ఎక్కువగా ఉండటం వల్ల వాటికి నిర్దిష్ట ఆకారం, ఘన పరిమాణం ఉండవు. కానీ ఒక పాత్రలో ద్రవాన్ని నింపితే ఆ పాత్ర ఆకారాన్ని, ఘన పరిమాణాన్ని పొందుతుంది.

- ప్రతి ద్రవ పదార్థం కింది ధర్మాలను ప్రదర్శిస్తుంది.
  1. తలతన్యత 2. కేశనాళికీయత
  3. స్నిగ్ధత 4. ద్రవ పీడనం

ద్రవాలను వాటి బలాలు, స్వభావాన్ని బట్టి రెండు రకాలుగా వర్గీకరించొచ్చు.

1. **సంసంజన బలాలు:** ఒకే రకమైన అణువుల మధ్య ఆకర్షణ బలాలను సంసంజన బలాలు అంటారు.

మనకు లభిస్తున్న ద్రవ పదార్థాలతో పోలిస్తే పాదరసంలో సంసంజన బలాలు చాలా ఎక్కువగా ఉంటాయి. కానీ నీరు, ఆల్కహాల్, కిరోసిన్ వంటి ద్రవ పదార్థాల్లో ఈ బలాలు చాలా తక్కువగా ఉంటాయి.

2. **అసంజన బలాలు:** వేర్వేరు అణువుల మధ్య ఉన్న ఆకర్షణ బలాలను అసంజన బలాలు అంటారు.

తలతన్యత:

ప్రతి ద్రవ పదార్థంలో అనేక కణాలుంటాయి. ప్రతి ద్రవకణం ఇతర ద్రవ అణువులను 10^{-8} మీ. పరిధిలో సంసంజన బలాల వల్ల తనవైపు ఆకర్షిస్తుంది.

ఈ పరిధిలో ఉన్న ద్రవ అణువులు పరస్పరం ఒకదానికొకటి దగ్గరగా వచ్చి తమని తాము చిన్న ద్రవ బిందువుల వలే అమర్చుకుంటాయి. ఈ ధర్మాన్ని తలతన్యత అని అంటారు. ఈ ధర్మం వల్ల ప్రతి ద్రవ పదార్థం నిర్దిష్ట ఉపరితలాన్ని కలిగి ఉండి అది సాగదీసిన పొరలా ప్రవర్తిస్తుంది.

తలతన్యత (T) = సంసంజన బలాలు (F) / ద్రవ బిందువు పొడవు (L).

$$T = \frac{F}{L}$$

ప్రమాణాలు: 1. డైన్/సెం.మీ
2. న్యూటన్/మీటర్

ఉదాహరణలు: వాన చినుకులు, పాదరస బిందువులు, సబ్బు బుడగ గోళాకారంలో ఉండటానికి కారణం తలతన్యత.


- తలవెంట్రుకలకు నూనెను అద్దినప్పుడు ఆ ద్రవ అణువుల మధ్య ఉన్న సంసంజన బలాల వల్ల వెంట్రుకలు పరస్పరం దగ్గరగా వస్తాయి.
- పెయింట్ వేయడానికి ఉపయోగించే బ్రష్‌ను పెయింట్‌లో నుంచి బయటకు తీసినప్పుడు ఆ పెయింట్ అణువుల మధ్య ఉన్న ఆకర్షణ బలాల వల్ల దాని కేశాలు దగ్గరగా వస్తాయి.
- తలతన్యత వల్ల నీటి ఉపరితలం సాగదీసిన పొరలా ప్రవర్తించడం వల్ల దాని ఉపరితలం పైన దోమలు, ఇతర క్రిమికీటకాలు స్వేచ్ఛగా సంచరిస్తాయి.
- ఒక గుండు పిన్నును క్షితిజ సమాంతరంగా నీటిపై ఉంచినప్పుడు కొంతసేపటి వరకు అది అలాగే ఉండి పిదప క్రమక్రమంగా లోపలికి వెళుతుంది.
- ఒక కాగితపు పడవను కర్పూరం బిళ్లకు కట్టి వాటిని నీటి ఉపరితలంపై అమర్చి కర్పూరం బిళ్లను మండించాలి. ఈ సందర్భంలో కర్పూరం బిళ్ల మండుతున్న చోట నీటి తలతన్యత తగ్గుతుంది. కాబట్టి మండుతున్న కర్పూరం బిళ్లతోపాటు కాగితం పడవ కూడా ఆ ఉపరితలంపైన క్రమరహితంగా తిరుగుతుంది.
- రెండు గాజు పలకలను ఒక దాంతో మరొకటి తాకుతున్నట్లుగా అమర్చి, తక్కువ బలాన్ని ఉపయోగించి వాటిని వేరు చేయొచ్చు. కానీ ఈ గాజు పలకల మధ్య కొన్ని నీటి బిందువులను వేసి లేదా ద్రవ బిందువులను వేసినప్పుడు తలతన్యత అనే ధర్మం ఏర్పడుతుంది. అందువల్ల ఈ సందర్భంలో గాజు పలకను వేరు చేసేందుకు ఎక్కువ బలం అవసరం.

తలతన్యత మార్పు చెందడానికి కారణాలు

- తలతన్యత ద్రవ పదార్థాల స్వభావం పైన అంటే వాటిలో ఉన్న సంసంజన బలాల పరిమాణంపైన ఆధారపడి ఉంటుంది.
- ద్రవ పదార్థంలో మాలిన్య కణాలను కలిపినప్పుడు సంసంజన బలాలు బలహీన పడటం వల్ల తలతన్యత తగ్గుతుంది.

ఉదా:


- నీటిలో డిటర్జెంట్ పౌడర్‌ను కలిపితే ఆ సబ్బు నీటి తలతన్యత తగ్గుతుంది.
- నిలకడగా ఉన్న నీటి ఉపరితలంపైన కిరోసిన్‌ను వెదజల్లినప్పుడు నీటి తలతన్యత తగ్గి దాని ఉపరితలం సాగి పొర స్వభావం



కోల్పోతుంది. ఆ నీటి ఉపరితలంపై ఉన్న దోమలు, ఇతర క్రిమి కీటకాలు ద్రవం లోపల మునిగి నశిస్తాయి.

- ద్రవ పదార్థాలను వేడి చేసినప్పుడు వాటిలో ఉన్న సంసంజన బలాలు తగ్గడం వల్ల ఆ ద్రవాల తలతన్యత కూడా తగ్గుతుంది.
- సందిగ్ధ ఉష్ణోగ్రత వద్ద ద్రవ పదార్థం ఆవిరిగా మారుతుంది. ఈ ఆవిరి (వాయువు)కి తలతన్యత అనే ధర్మం ఉండదు. అందువల్ల సందిగ్ధ ఉష్ణోగ్రత వద్ద ప్రతి ద్రవ పదార్థం తలతన్యత శూన్యం అవుతుంది.

స్పర్శ కోణాలు



- ఒక ఘనపదార్థం కృశిస్తున్నప్పుడు ఒక ద్రవ పదార్థంతో చేసే కోణాన్ని స్పర్శకోణం అంటారు
- ఒక ఘన పదార్థాన్ని ద్రవంలో ఉంచిన ప్పుడు ఆ ద్రవ పదార్థం ఘన పదార్థాన్ని కృశింపజేస్తూ ద్రవం లోపల చేసే కోణాలను స్పర్శ కోణం అంటారు.
- స్పర్శ కోణం ఆయా ఘన పదార్థాలు, ద్రవ పదార్థాలపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి వేర్వేరు ఘన పదార్థాలు/ద్రవ పదార్థాల స్పర్శకోణం వేర్వేరుగా ఉంటుంది.

ఉదా: గాజు అనే ఘన పదార్థంతో కొన్ని ద్రవ పదార్థాలు చేసే స్పర్శ కోణాలు

1. స్వచ్ఛమైన నీరు, గ్లిజరిన్ స్పర్శ కోణం 0°గా ఉంటుంది.
2. సాధారణ స్పర్శ కోణం 8° - 9° వరకు ఉంటుంది.
3. సంసంజన బలాలు ఎక్కువగా ఉన్న పాదరసం స్పర్శ కోణాలు 135° - 140°ల వరకు ఉంటాయి.
4. వెండితో నీటి స్పర్శ కోణం 90°గా ఉంటుంది.

ద్రవాల స్పర్శ కోణం 90° కంటే తక్కువగా ఉన్నట్లయితే అటువంటి ద్రవ పదార్థాల కణాలు పాత్ర గోడలపైన అంటుకొని ఉంటాయి. **ఉదా:** నీరు

1. పెయింట్స్, అద్దకాలు, కొన్ని రకాలైన లేపనాలు (ఆయింట్‌మెంట్స్) తయారు చేసేందుకు ఈ సూత్రం వాడతారు.
2. ద్రవాల స్పర్శ కోణం 90° కంటే ఎక్కువగా ఉన్నట్లయితే అలాంటి ద్రవ పదార్థం పాత్ర గోడలకు అంటుకుని ఉండదు.

ఉదా: పాదరసం.

అనువర్తనం: రెయిన్‌కోట్‌ను తయారు చేసేందుకు ఈ సూత్రాలను ఉపయోగిస్తారు. (రెయిన్‌కోట్‌ని 'రెగ్జిన్' అనే పదార్థంతో తయారు చేస్తారు).

- ద్రవాల స్పర్శ కోణం 90°లకు సమానంగా ఉన్నట్లయితే అటువంటి ద్రవ పదార్థాలు పాత్ర గోడలకు లంబంగా స్పర్శించుకుంటాయి.


ఉదా: వెండితో నీరు చేసే స్పర్శకోణం 90°లకు సమానంగా ఉంటుంది.

స్పర్శ కోణం మార్పు చెందడానికి కారణాలు

- స్వచ్ఛమైన ద్రవ పదార్థాల్లో మాలిన్య కణాలను కలిపినప్పుడు స్పర్శ కోణం మారుతుంది. **ఉదా:** నీటిలో డిటర్జంట్ పౌడర్‌ను కలిపినప్పుడు ఆ నీటి స్పర్శ కోణం పెరుగుతుంది. కాబట్టి బట్టలపైన ఉన్న మురికిని సులభంగా తొలిగిస్తుంది.
- ద్రవ పదార్థాలను వేడి చేసినప్పుడు వాటి స్పర్శ కోణం పెరుగుతుంది.


ఉదా: వేడి నీటి స్పర్శ కోణం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి వేడి నీటితో స్నానం చేసినప్పుడు శరీరంపై ఉన్న మురికి కణా లను సులభంగా తొలిగిస్తుంది.

కేశనాళికీయత




- సూక్ష్మ రంధ్రాన్ని కలిగి ఉన్న గాజు గొట్టాన్ని కేశనాళికా గొట్టం అని అంటారు. దీన్ని ఒక ద్రవంలో ఉంచినప్పుడు ఆ ద్రవం కేశనాళిక గొట్టంలో అసలు మట్టానికంటే పైకి ఎగబాకడం లేదా తక్కువ మట్టంలోకి చేరుతుంది. దీన్ని కేశనాళికీయత అంటారు.
- మనకు లభిస్తున్న ద్రవ పదార్థాలతో పోల్చినప్పుడు సంసంజన బలాలు ఎక్కువగా ఉన్న పాదరసం కేశనాళికా గొట్టంలో అసలు మట్టాని కంటే తక్కువ మట్టంలోకి లోకి చేరుతుంది. కానీ సంసంజన బలాలు బలహీనంగా ఉన్న నీరు, ఆల్కహాల్, కిరోసిన్ వంటి ద్రవ పదార్థాలు కేశనాళిక గొట్టంలో అసలు మట్టాని కంటే పైకి ఎగబాకుతాయి

ఉదా: అనువర్తనాలు



- కిరోసిన్ స్టవ్‌లో ఉన్న వత్తులలో సూక్ష్మ రంధ్రాలు కేశనాళిక గొట్టాల్లా పనిచేస్తాయి.
- దీపం ప్రమిదలో ఉన్న వత్తిలో ఉన్న సూక్ష్మ రంధ్రాలు కేశనాళిక గొట్టంలా పనిచేస్తాయి. కాబట్టి దీపం ప్రమిదలో ఉన్న నూనె తనంతట తానుగా ఈ వత్తి పైకి ఎగబాకుతుంది.
- కొవ్వొత్తి పనిచేయడంలో ఈ ధర్మం ఇమిడి ఉంటుంది.





- ఇంక్‌పెన్‌లో ఉన్న పాళీ సన్నటి గొట్టాన్ని కలిగి ఉండి కేశనాళిక గొట్టంలా పనిచేస్తుంది. కాబట్టి ఇంక్ అనే ద్రవ పదార్థం తానంతట తానుగా ఈ గొట్టం ద్వారా పైకి ఎగబాకుతుంది.
- మన దేహంలో రక్త సరఫరా జరగడంలో ఈ ధర్మం ఉంటుంది.
- ఇటుక, స్పాంజీ, చాక్‌పీస్, అద్దుడు కాగితం, కాటన్ వస్త్రాల్లో ఉన్న సూక్ష్మ రంధ్రాలు కేశనాళిక గొట్టాల్లా పనిచేస్తా యి. కాబట్టి ఈ పదార్థాలు ద్రవాలను సులువుగా పీల్చుకుంటాయి.
- ఎడారుల్లో ఒయాసిస్‌లు ఏర్పడడానికి కారణం కేశనాళికీయత.
- నల్లరేగడి మట్టి లోపల ఉన్న సూక్ష్మ రంధ్రాలు కేశనాళిక గొట్టాల్లా పనిచేసి చుట్టూ ఉన్న నీటిని పీల్చుకోవడం వల్ల నేలలు ఎల్లప్పుడూ తేమగా ఉంటాయి.
- నేలను చదునుగా దున్నడం వల్ల లోపల ఉన్న సూక్ష్మ రంధ్రాలు (కేశనాళిక గొట్టా లు) నశించి పోయి నీటి ఆవిరి వృథా కాదు.
- మొక్కలు, చెట్ల వేళ్లు పీల్చుకొన్న నీరు కేశనాళికీయత ధర్మం వల్ల పైకి ఎగబాకి చివరి కొమ్మలో ఉన్న ఆకును కూడా చేరుతుంది.
- కేశనాళిక గొట్టంలో అధిరోహణ/అవరో హణను సంసంజన, అసంజన బలాలను ఆధారంగా చేసుకొని వివరించవచ్చు.

వివరణ:

ఒక పాత్రలో ద్రవ అణువుల మధ్య ఆకర్షణ బలాలను సంసంజన బలాలు అని అంటారు. ఈ ద్రవంలో కేశనాళిక గొట్టాన్ని అమర్చినప్పుడు ద్రవ అణువులకు, కేశనాళిక గొట్టంలోని అణువులకు మధ్య ఆకర్షణ బలాలను అసంజన బలాలు అని అంటారు. సంసంజన బలాలు ఎక్కువగా, అసంజన బలాలు తక్కువగా ఉన్నట్లయితే అలాంటి ద్రవ పదార్థాలు కేశనాళికా గొట్టంలో అసలు మట్టం కంటే తక్కువ మట్టంలోకి చేరతాయి.

Water plants in the cool of the day..

BANK EXAMS

GENERAL ENGLISH



Directions (Q. 1-5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. The Hurriyat leader (1)/ has denied hoisting (2)/ any Pakistan flag himself (3)/ at the April 15 rally in Srinagar. (4)/ No error (5)
2. The world's capital markets are integrated (1)/ more closely than never before (2)/ and events in one part of the global village may be transmitted (3)/ to the rest of the village almost instantaneously. (4)/ No error (5)
3. Despite what was hoped, (1)/ the introduction of a sixty-five mile per hour speed limit (2)/ is reducing neither congestion on rural highways, (3)/ or it is not contributing to save gas for trucking companies. (4)/ No error (5)
4. ABC Corporation, (1)/which owns a number of retail chains, (2)/ announced that since sales of (3)/ up to one-third of its stores are poor, they will be closed. (4)/ No error (5)
5. Recent findings lend strong support (1)/ to the theory that a black hole lies at the center of the Milky Way (2)/ and of many of the 10 billion other galaxies (3)/ estimated to exist in the universe. (4)/ No error (5)

Directions (Q. 6-10): Which of the phrases (1), (2), (3), (4) and (5) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

6. World War II, which resulted in the death of over 70 million individuals, proved to be the deadliest conflict in human history, claiming nearly twice as many <u>lives than would be killed in World War I.</u>
   1) lives that would be killed in world war 1
   2) lives that were killed world war 1
   3) lives as world war 1
   4) lives than world war 1
   5) No correction required
7. According to a recent study, financial problems, together with their serious ramifications, <u>ranks as one of the high causes of marital stress.</u>
   1) ranks as one of the high causes of marital stress
   2) rank as one of the leading causes of marital stress
   3) rank as one of the most high causes of marital stress
   4) ranks as one of the leading causes of marital stress
   5) No correction required
8. The ancient people <u>was renowned warriors,</u> although they also crafted some of the best-preserved ancient art.
   1) were renowned warriors
   2) had been renowned warriors
   3) were been renowned warriors
   4) was being renowned warriors
   5) No correction required
9. One of the most important choices facing the new administration at this moment is <u>if they should continue</u> to advance new fiscal policy.
   1) if they should continues
   2) whether it should continuously
   3) whether it should continue
   4) whether they should continue
   5) No correction required
10. As the government's deficit grows, analysts project that <u>the extra cost to the Treasury Department in higher interest rates is well over 50 basis points per year.</u>
    1) the extra cost to the Treasury Department in higher interest rates is well over 50 basis points per year
    2) the extra cost to the Treasury Department, incurred in higher interest rates, is going to be well over an extra 50 basis points per year
    3) the Treasury Department will face higher interest rates, well over an extra 50 basis points per year
    4) higher interest rates will cost the Treasury Department well over an extra 50 basis points per year
    5) No correction required

Directions (Q. 11-15): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) The means and methods they employ to deal with public pressures are also different.
B) They will make no move unless the gallery is packed.
C) The poorest are over-hesitant, evasive and preoccupied with their relationships with others.
D) Enormous difference is generally observed in the ways in which various public officials respond to public pressures.
E) The best possess understanding of forces that must be taken in to account, determination not to be swerved from the path of public interest.
F) They confront all embarrassments with a state general formula.

11. What is the FIRST sentence after rearrangement?
    1) C 2) B
    3) D 4) E 5) F
12. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B
    3) D 4) E 5) C
13. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) C
    3) D 4) E 5) F
14. What is the FIFTH sentence after rearrangement?
    1) B 2) C
    3) D 4) E 5) F
15. What is the LAST sentence after rearrangement?
    1) A 2) B
    3) D 4) E 5) F

Directions (Q. 16 - 20): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word / set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

16. The thought of ____ his little and pet companion never perhaps ____ to him.
    1) Leaving, struck
    2) Abandoning, come
    3) Discarding, flashed
    4) Deserting, owned
    5) foregoing, happened
17. At midnight the storm ____, the rolling clouds parted, and the stars____ keenly in the sky.
    1) Ceased, twinkled
    2) Stopped, appeared
    3) Abated, glittered
    4) forced, shined
    5) Continued, shined
18. In the past, the feast was an ____ for informal trade.
    1) pleasure 2) Incident
    3) Occasion 4) Moment
    5) Impulse
19. Every human being is ____ to the Almighty for his actions on the earth.
    1) dutiful
    2) Faithful
    3) Eligible
    4) Approachable
    5) Accountable
20. The Prime Minister ____ the states that the revised policy was not meant to infringe upon their rights.
    1) appealed 2) Assured
    3) Guaranteed 4) declared
    5) attributed

Directions (Q. 21 - 30): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

We are having longer, drier, hotter summers. This means there will be less water to go around. It also means people will use more water to keep cool and keep their gardens growing. The number of ____ (21) in the cities is growing. ____ (22) means more people are going to ____ (23) water (i.e. higher demand). More demand and ____ (24) water could lead to water shortages. Don't leave the water running while you wash hands, dishes and vegetables. Only use the washing ____ (25) or dishwasher for full loads, never use -____ (26) for half loads. Turn the tap ____ (27) after you have wet your brush when cleaning your teeth. Take short showers rather than deep baths. Check ____ (28) leaks in water pipes around the home. Turn outside taps off properly ____ (29) check for leaks. Use a bucket of water to wash cars instead of leaving the hose on. Sweep the path with a broom, not a hose. Water plants in the cool of the day, once or twice a week in summer. Up to 80% of rain water used during the heat of the summer could evaporate. Mulch around plants to prevent evaporation, mulch ____ (30) prevent up to 70% of water loss from evaporation. Mulch can be made from used paper, old carpet or garden wastes.

21. 1) water 2) houses 3) source 4) bodies 5) seas
22. 1) thus 2) than 3) that 4) these 5) those
23. 1) sea 2) use 3) see 4) waste 5) throw
24. 1) rain 2) sea 3) less 4) tap 5) source
25. 1) hand 2) basin 3) water 4) machine 5) waste
26. 1) them 2) basin 3) this 4) that 5) tap
27. 1) on 2) in 3) off 4) of 5) around
28. 1) you 2) on 3) your 4) upon 5) from
29. 1) after 2) and 3) with 4) because 5) between
30. 1) can 2) plants 3) water 4) to 5) set

Key

1) 2 2) 2 3) 4 4) 4 5) 5
6) 3 7) 2 8) 1 9) 3 10) 4
11) 3 12) 5 13) 4 14) 1 15) 5
16) 1 17) 3 18) 3 19) 5 20) 2
21) 2 22) 3 23) 2 24) 3 25) 4
26) 1 27) 3 28) 3 29) 2 30) 1